ష స్నీనామము సార్థకంబుగద వర్షంబా ప్రమాదాబ్దమా.

స్టాలిన్ హిట్లరు లన్ ధరాధరములన్ సామాన్యరాజ్యాలపై
గూలన్ జేసియు, చిన్నరాజ్యముల సంక్షోభంబునన్ ముంచినా
వా లండన్ బెరిలిన్ ప్రభుత్వములకు న్నాలంబుఁ జేకూర్చి తీ
కాలంబందున మంచివార్త గలదే గాంచన్ ప్రమాదాబ్దమా.

ప్రత్యేకంబుగ నాంధ్రదేశమునకున్ రాష్ట్రంబు సిద్ధింప మే
మత్యుత్సాహముతోడఁ బోరఁగ వృథా యౌనట్లు గావించి మా
కత్యంతంబు నిరాశఁ గూర్చితివి నీదౌ దుష్టచేష్టంబులన్
ప్రత్యక్షం బొనరించినావుగద నీరాజాంగముల్ వద్దికన్.

విక్రమవత్సరంబ కడు వేగమె వచ్చి ప్రమాదివోలె నీ
వక్రమరాజ్యపాలనమునం దినముల్ సరిపుచ్చబోకఁ మా
వక్రము లెల్లఁ దీర్చి పరిపాలన సేయుము కీర్తిగల్గెడున్
విక్రమనామసార్థకము విక్రమ మొప్పఁగఁ జేసికొమ్మికన్.

మునుజన్నట్టి ప్రమాదివత్సరమునుంబోలెన్ ప్రమాదంబుల
న్ననయంబున్ గలిగింపఁబోక సతము న్నత్యంతస్నేహంబు మా
కును ముస్లింలకుఁ గల్గఁజేసి భరతక్షోణీమతల్లిన్ దయన్
గనఁగాఁజేయుము దాస్యముక్తి నిఁక విక్రమాబ్దమా వేగమే.



● శ్రీ అయితం కాళీవర ప్రసాదరాయకవి ●

సరగ నేకాదశాబ్దముల్ సాగెఁ గాని
నిన్న మొన్నటివలెఁ దోఁచి నేఁడు నిలుచు
సరళమై విశ్వదాతవిశాలగుణము
ప్రస్ఫుటంబుగ నాభావఫలకమందు.

షష్టిలోఁ బడినట్టి విశ్వంపుదాత
సద్గుణాకరుఁ డా॥ వి. యల్. శాస్త్రిగారు
అపుడె యిరువది దాఁటినయట్టి నేను
షష్ఠిఁ గూడితి యొక శరణాలయమున.

దశదిశాపాళినిఁ దన తేజు వెలిఁగించి యస్తమింపఁగ నుండె నబ్జసఖుఁడు;
డెంద మానందింప మందమందంబుగా సారెకు వీచె సమీరణుండు
కనులపండువుగాఁగ ఘ్రాణతర్పణముగాఁ దనరె మేమున్న సౌధంపుఁదోఁట
సహజసుధావచస్సరణితో నామెతఁ బ్రేమఁ జేయుచునుండె విశ్వదాత;

యప్పు డాసంస్థవారితో నైదుగురము
చేరి కూర్చుంటి మైదుకుర్చీలయందు
చిత్రపటమును దీసెడు చిత్రకారుఁ
డెదుట నిలిచె చిత్రముఁ దీయ నెదఁ దలంచి.

పటుతరమగు నుత్సుకమతి
నటు నిటు నడయాడి, మమ్ము నారసి, యంత్రం
బిటునటుఁ గదలిచి యర్థం
బెటులగు నటు నిలిపి, యంత నిట్లనె నతఁడున్.

"నలువురు గూర్చుండినచో
నలువగుఁ జిత్రంబుఁ దీయ, నైదుగురైనన్
పొలుపుగఁ దీయ నశక్యము
కలదా పెక్కేఁగించితి" నన గ్రక్కున నేనున్.

“వల దటులైన నే నిలుతుఁ బ్రాజ్ఞులు మీరలు మీరివెళ్ళఁ ; నీ
వలసినభంగిఁ జిత్రమును బాగుగఁ దీయు” మటంచె, నింతలో
లలిత గభీర మేఘరవ లక్షణ లక్షిత వాక్యతోడుతన్
వల దటు లంచుఁ దా నుడివె వైళము పండ్యుఁడు విశ్వదాతయున్.



దేశోద్ధారకనామధామసితదిగ్దేశుండు నాగేశుఁ డా
వేశం బొప్పఁగ లేచి తత్క్షణమునన్ “ఏ లేమి లేకున్న చో
నాశల్ పీఠకు నిల్తు మందరము కామ్యం బెట్టు లాభంగి నీ
దీశక్తిన్ పటమున్ రచింపు” మనిమెన్ ధీరోక్తిజన్మేఘుఁడై.

దలవనితలఁపుగఁ దతవృద్ధసింహాంబు నిలుచుటఁజేసి నే నులికిపడితి;
మిగిలినముప్వురు మిక్కిలి దోఁపక తమలోన తాము నిస్తబ్ధు లైరి;
యితరజనంబు లీగతి నంతయును గాంచి స్థావరరూపచిత్రంబు లైరి;

గనుల నేఁటికిఁ గట్టినగతినిఁ దోఁచు
నాఁటి దృశ్యంబు నా కిట నేఁటివరకు;
భావనాబలాతీతంబు, వర్ణనావి
ధాన దుర్గమంబగు, దృశ్యమానవిధము.

బాలుఁ డప్రాజ్ఞుఁ డేలీల భావించునో యిటు నిల్చుచో నని యెంచికొనెనో?
నలుగురుఁగూర్చుండఁ దొలఁగి యొక్కఁడు నిల్వఁదగదని మదిలోనఁ దలఁచికొనెనో?
బాలుఁ డయ్యును గవిపండితుం డీతండు తగ దిది యన్న యౌదార్యమునో?
మాదృశుల్ నేఁటికి మహితసద్గుణములు దలఁచు ధన్యత నీయఁ దలఁపుగొనెనో?

తెలియఁగ రా దా విశాలాత్మదే తెలుంగు
నాఁటి తనచర్య కర్థంబు దేటపఱుప;
నట్టియాతఁడు గాకున్న నతనిపేరు
సకలభారతభూమిలో ప్రకటమగునె?

"కూర్చుండుఁడు, కూర్చుండుఁడు
కూర్చుండుం డైదుగురును కొదవ లేకుండన్
నేర్చెదఁ దీయంగ" ననుచు
నార్చెను చిత్రంబుఁ దీయునాతం డపుడే.

అనునంతన్ దరహాసభాసురముఖుండై రాజశీవిన్ మహా
స్థను గూర్చుండెను నాసనంబునను, సంస్థ గల్గువా రెల్ల భ
క్తిని హర్షంబును జూపు కన్నవలతోఁ దెల్లంబుగాఁ జూడ, మే
మును గూర్చుంటిమి చెంతఁ, దీసెను పటంబున్ చిత్రకారుం డొగిన్.

స్థాలీపులాకభంగిని
గీలించితి నాఁటిచర్యఁ; గీర్తికరోద్య
చ్ఛీలిని దేశోద్ధారకుఁ
దేలే, మైనఁ దలఁతుము, సుధీనుతు నతనిన్.

ఆతని యున్నతహృదయం
బాతని నిర్దంభగుణము, నాతని విలువన్
చేతోవీథిని నిలుపఁగ
నేతాదృశఘటన మొకటియే చాలుఁ గదా.

ఎవ్వాని తతకీర్తి మవ్వంపువెన్నెల దశదిశాంతరవీథిఁ దాండవించు ?
నెవ్వాని దానంబు, లెన లేని శిబికర్ణ కరదానధారలఁ బరిహసించు ?
నెవ్వాని కరుణ మహేంద్రజటాజూట నిష్యంద మందాకినిం జయించు ?
నెవ్వాని భావంబు లిద్ధంబులై యఖిలార్యహృదబ్జముల నధివసించు ?
నెవఁడు మఱచినఁ గూడ తా నెదను నిలుచు
నట్టి కీర్త్యవశేషితు, నఖిలసుగుణ
భూషితుఁ బుధభాషితుఁ బుణ్యచరితు
సద్గుణేశుని నాగేశు సంస్మరింతు.

తాతగారూ ! మీరు దాఁటిపోతిరి కాని దాఁటిపోదయ్యె మీ ధవళకీర్తి ;
కమనీయగుణ! నీవు కానంబడవుగాని కనఁబడు నీపత్రికాచయంబు ;
వ్యాపారవీర! నీ వస్తమించితి గాని యస్తమింపని దమృతాంజనంబు ;
దానరాధేయ! నీదాన మాఁగెనుగాని యాఁగ దర్థిహృదంతరాత్మభక్తి ;
చిత్ర మియ్యది నాగేశ! శ్రీనివాస!
దానరాధేయ! పండిత తండ గేయ!
దేశకల్యాణహితకార్య! ధీరవర్య!
సకలసద్గుణగణగణ్య! సాధుమాన్య!

ఆంధ్రప్రబోధము

శ్రీ అవధానము చంద్రశేఖరశర్మ

అన్యద్వేషము గాదు, కాదు విమతప్రాణాపహారంబు, దా
ర్జన్యప్రేరణ లేదు, మోడువడు నాంధ్రప్రాభవం బాత్మపై
దైన్యం బంది పునస్సమేధిత నిజోదారప్రతిష్ఠాక మై
ధన్యం బౌట కొనర్చు నిర్మలినయత్నం, బేల సందేహముల్ ?

సంకుచితాభిమాన మని చాటెదరంట స్వరాష్ట్రవాంఛకున్
వంకల నెన్ని కొంద!! అటువంటివి గావొకొ దేశభక్తర
క్తాంకితముల్ స్వరాజ్యపుఁబ్రయత్నము? లాంధ్రుల నోర్వలేని దు
శ్శంకల కేమిలే ప్రతివచస్తతి నేల కలంతఁ జెందఁగన్?

కలవు గంగా సింధుగర్వాపహములు గోదావరీతుంగాదిజీవనదులు
కలవు కమ్మపసిండికణికల పంట ముక్కారునుం బండు కేదారతతులు
కల వేడుకోట్లసంఖ్యకు మించు రాఁబడి నవరించు నార్థికసౌష్ఠవంబు
కలవు మద్రాసు విక్రమపురీ రాజ్మహేంద్రము లాది నగరరాజముల గములు
కలరు కోటిద్వయంబు నెక్కాలుఁ జాలు
నేకభాషానిబద్ధ ధరాకజనము
లేది కొదువయ్యె నాంధ్రరాష్ట్రోదయమున,
కాత్మ ధృతిఁ బూను మింక సోదరాంధ్రవీర!

పాతికవత్సరమ్ములకుఁ బైఁ బడియెన్ నిజరాష్ట్రవాంఛకున్
జేతము నొగ్గి; నేఁటికిని నీ! ఫలియింపదు నీదుకోర్కె; క
ట్టా! తమ మక్కునిం బాదివెనా? కకుబంతవిశాలవిశ్వవి
ఖ్యాతమహాంధ్రరాజ్యరమకా తుది రాష్ట్రములేని దుర్గతుల్ !!

నీదు కత్తిపోటు, నీ స్వర్ణయుగమును,
నీదు పౌరుషంబు, నీ ప్రతిష్ఠ
తల్లికోటతోడ కొల్లవోయెనె? గ్రహ
ణంబు తుదియె భానుబింబమునకు ?

ఐదవవేద మాంధ్రావని నున్మిషత్తేజ మెల్లెడల సంధించుచుండ
కంచుఢక్కగ బగిలించిన సార్వభౌముని జయధ్వని చెవల్ మ్రోయుచుండ
ఆముక్తమాల్యద నాంధ్రవిష్ణుని వక్ష మమృతాంశువుల నోలలాడుచుండ
బాలచంద్రుని యశశ్శ్రీలఁ బల్నాటిశౌర్యామరప్రభలు నిండారుచుండ

దశదిశాభాగనిబిడ నిత్యప్రపూర్ణ
నిరుపమాంధ్రోజ్జ్వలయశోఘృణిప్రకాశ
మారిపోవునె? దావాగ్ని కకట చెదలు
వాఱునే? తేరు మాంధ్రకిశోరవీర!

మన్నఁగ మిన్నును మాఱుమ్రోఁగినది నీ మధ్యాహ్న సూర్యప్రభా
స్వన్నిత్యాసదృశ ప్రతాపవిజయ ధ్వానంబు నాఁ; డాకథల్
విన్నఁగ గుండెలు జల్దరించు నసుహృద్వీరాళికిన్ నేఁటి; కో
యన్నా! కేసరిబిడ్డ నీ; వెఱుఁగ వాత్మానూన తేజోద్యుతుల్.

చెదరిపోలేదు తీర్చిన జీవకళ లజంతాగహ్వ ములఁ జిత్తరువుమురువు
గోరీలఁ బండ చెల్లోరాగుహాంగణ ప్రథితకైలాస శిల్పప్రశస్తి
ఉరిఁదగుల్కొన వోడల్ గరుపార్చు వీరబొబ్బిలిఁ బాడు జంగమయ్యలకు మెడలు
బూదిగాలేదు సంపూర్ణత్రయీభాష్యఫణితి విద్యారణ్యపాదరచన

తుడువ రాంధ్రనృపాల నిస్తులయశంబు
పసిఁడి వ్రాఁతలఁ జరితప్రబంధకర్త
లేల జీవన్మృతుఁడువోలె నింట నిదుర
నంచి, చలియింప వెద సోదరాంధ్రవీర?

నిన్నఁగ మొన్న మహాప్రయత్నమున నున్నిద్రాత్ములై రాష్ట్రముం
గన్నా రోంధ్రులు స్వప్రతిష్ఠ మిను వ్రాఁకన్; రాష్ట్రసంసిద్ధికిన్
కన్నుల్ విప్పవు; దుర్భరావమతి శగ్గంబయ్యె నాంధ్రత్వ; మిం
కెన్నాళుల్ సయిరింతు వన్యహృత మోయీ! యాత్మసౌభాగ్యముల్?

తెలుఁగుపల్కులకమ్మఁ దేనెసోనలు విషప్రాయంబులై చేఁదువాఱునాఁడు
తెలుఁగుకబ్బములఁ జిందిన సుధావాహిని నిప్పుటేటై చేరఁ దప్పునాఁడు
తెలుఁగుపండితుల నిర్మలినగౌరవము చెల్లనిగవ్వయై లెక్కఁగననినాఁడు
తెలుఁగునాటికి యశస్తిలకంబు మసనంపుబూదియై సుడిసిపొంపేదునాఁడు

పనికిరానట్టి యాంధ్రుల పౌరుషంబు
కలుగనేమి? విలీనమై కాడువాఱి
కాలిపోనేమి? లెమ్ము సింగమ్మువోలె
రాష్ట్ర సంసిద్ధికై సోదరా! కడంగి.

సర్వప్రాభవపూర్ణమై ద్విపదధ్వస్యప్రక్రమం బౌ భవ
త్పూర్వోన్నత్యము నెంచి, కాలగతి సొంపుల్ బెంపుల్ మాసి ని
ర్వీర్యంబై కొఱమాలు నేఁటిదశను వీక్షింపు; మెట్టుల్ మన
స్థైర్యం బంచెదవో తిరోహితనిజౌజస్తృష్ణ నిర్భాగ్యుఁడా !

కాడువాఱియు జీవకళలీను విద్యానగరజీర్ణదృశ్యముల్ కనులఁగాంచి
బండబండల నాంధ్రఃటిమఁ జాటెడు నోరుగలుకోటశిథిల భాగాల వరసి
చెదలుపుర్వులు మేసి చెడిన తంజాపురీభాండారమునఁ దెల్గుప్రతిభ నెంచి
వీరరక్తప్లవోదార ఘోరంబుగాఁ గూలు బొబ్బిలిమట్టికోటఁ జూచి

యూరకుందువె ? చచ్చెనే పౌరుషంబు ?
వేఁడిరక్తంబు తనువున మ్రోడువాఱి
చల్లనయ్యెనె ? నైజతేజఃప్రభావ
మరయలేని యభాగ్యత నెఱుఁగు మాంధ్ర !

త్రిజగత్పూజ్యము ప్రాక్చరిత్రము, రస శ్రీపెన్నిధానం బమ
ర్త్యజనప్రార్థ్యము వాఙ్మయం, బసుపణప్రఖ్యాతమై జాతి క
గ్రజమా త్యాగముఁ గల్గినన్ దుట కనైక్యం, బాత్మమాంద్యంబు, ది
గ్విజయస్ఫూర్తికి రాష్ట్రసిద్ధికిని బాపెన్ నేటి కాంధ్రావళిన్.

వెలినుంతురే యాంధ్ర విశ్వవిద్యాలయమునకు సాటితెనుంగుముత్తియముల ?
దూరీకరింతురే తుంగభద్రకుఁగట్టు సనకట్ట నొకటఁ గల్పాంతమునకు?
చేరనీయరె తోడిసీమనాయకుల నొక్కరినైన మంత్రివర్గప్రశస్తి?
కడకుఁద్రోతురె పత్రికా ప్రకటనములందును సరివారి కుందనపు వ్రాఁత?

ఆంధ్రు లాంధ్రులనే యిట్టు లవమతింప
నొరులు గౌరవ ముంతురే ? యుత్తమైక
మత్య మెడలిన జాతి కాత్మప్రవృద్ధి
క్రుంగదే ? యింకనైన నెఱుంగు మాంధ్ర !

రాయలసీమపై నొక నిరాదరణంబు ఘటించె నంచుఁ గ్రో
ధాయతి నైకమత్యమున కందక నైజయశఃఖలీకృతిన్
జేయిడి యాంధ్రమాతహృదిఁ జీలుపఁ బూనుదురయ్య ? యాత్మ హ
త్యాయుతి మెత్తురే ? కలియ నాడరె రాయలసీమసజ్జనుల్ ?

కారో నందను లాంధ్రమాతయొడికిన్, గారో స్వరాష్ట్రప్రియుల్,
గారో జాతివికాసవైభవము లాకాంక్షించువా, రింతకున్
దా రేలా తమలో విభేదములఁ దర్దన్ బెద్దఁ గావించి చే
యూరన్ రాయలసీమసజ్జనులు గోయం జూతు రాంధ్రోన్నతిన్.

ఇరువదినాల్గు మండలుల నెంతయు రాయలసీమ పోరుచే
యురవా? స్వజాతిసోదరుల నొప్ప చతుర్దశమండలిన్ స్వస
త్వర పరివృద్ధికై పెనఁగుదారియె మేలొ? తలంచిచూడుఁ డె
వ్వరి కయినన్ స్వరాష్ట్రము స్వవైభవమున్ విసమే వసుంధరన్ ?

తలఁపంబూనకుఁ డింకనైనను గతాంతర్ద్వేష ; మనోవ్యస్య ని
శ్చల సౌభ్రాత్రము నూనుఁ ; డావల మహారాజపూర్ణమహా నాంధ్రపు
త్త్రుల యేకోన్ముఖరాష్ట్రవాంఛ నెటు సంరోధించి పోద్రోయఁగాఁ
గలదో భారతకార్యదర్శికి ? నెఱుంగన్ వచ్చు దుస్తంత్రముల్.

రాజసూయమహాధ్వరమున ధర్మజసభ రతనాలకాన్క గారవము నెఱపి
మహార్యరాజన్యసంభ్రాంత సెల్యూకసుమకుటాగ్రమణుల నిచ్చకములాడి
సార్వభౌమాశోకసత్వసమ్మిళిత రాజస తేజమునఁ బ్రేమసార మెఱిఁగి
గౌతమీపుత్త్రవిఖ్యాత ప్రతాపశంఖానఁ గర్ణాట నిస్వాన మూఁది


విశ్వమయమూర్తి-నై తాండవించె నేది
యార్యరాని పరంజ్యోతి యాంధ్ర తేజ
మదియె ప్రతిఘటన ప్రచండానిలమున
రేగె విలయోగ్రమై యెదిరించు నెవఁడు ?

దేశప్రాభవమూర్తులై తనరు జాతీయోద్యమాధార సం
దేశప్రాజ్ఞులు నాయకుల్ జయము సంధింపన్ "చిరం జీవ" యం
చాశీర్వాద మొసర్చ రాంధ్రకృతి; సిద్ధార్థంబు రాష్ట్రోద్యమం
బాశాసీమల నింపుఁ డాంధ్రులు జయోద్యత్సింహనాదంబులన్.


జాతీయోద్యమదేవదత్తవిజయస్వానావళుల్ రాష్ట్రసం
ప్రీతాంధ్రోజ్జ్వలపాంచజన్యనినదస్ఫీతిన్ స్వరాజ్యోదయ
శ్రీతేజంబు దిగంతవీథికలఁ బర్వించున్ సమస్తాహిత
వ్రాతంబుల్ బెగడంద భారతజయస్వాతంత్ర్య మొప్పంగఁగన్.

ఆంధ్రతేజంబు రోదోంతరాళమునఁ బ్రగుంకనిభాస్కరుం డయి క్రాలుఁగాక
ఆంధ్రవాఙ్మయవినిర్యద్రసాప్లుతి సుధీభూతమై విశ్వంబు పోలుచుఁగాక
ఆంధ్రయశంబు దిగంతసీమముల నిండిన వెలపంటఁ బండించుఁగాక
ఆంధ్రపతాక మనంతపథంబున ధ్రువతారమై తేజ మివులుఁగాక


కూడనిజనంబుకేనుదోయి గోరగింప
రాష్ట్రఫలసిద్ధ మాంధ్రసామ్రాజ్య మాది
వాకరసుధాకరంబుగా నలరుఁగాక
యాంధ్రమాత సుఖాబ్ధి నోలాడుఁగాక.



కాంగ్రెసు అధ్యక్షుడు : మౌలానా అబుల్‌కలాం ఆజద్



రామఘురులో వర్కింగుకమిటీ సమావేశమైన పర్ణకుటి



సాహిత్యమును వెనుకకునెట్టి
నూతనసృష్టి చేసిన
త్యాగయ్య గానప్రతిభ

★

త్యాగరాజయ్య సాహిత్యము

★

అనితరసాధారణ
మైన కావ్యకళను
త్యాగయ్య అబ్బు
రముగాఅల్పించు
కొన్నాడు.

★

శ్రీ
రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

త్యాగయ్యగారిసాహిత్యము ఆయనసంగీతమువలె విశాలము, వివిధము, ఉన్నతము[...] అపూర్వము నైన కళ. సరస్వతితల్లి యిరుప్రక్కల చనుబాలను ఇంతసమా[...]ముగా కడుపునిండ త్రాగి పెరిగిన బిడ్డఁడు—తెలుఁగువారిలోనే కాదు—నే నెఱిఁగినంతవఱకు [...] ఎక్కడను ఇంకొక్కఁడు లేఁడు. ఇతని సమకాలికులై కర్ణాటకసంగీతరత్నము లనఁదగిన ముత్తు[...]స్వామిదీక్షితులు, శ్యామాశాస్త్రిలు, కులశేఖరమహారాజు—వీరిలో నే యెవరికిని కావ్యకళ ఇం[...] చక్కనిది, ఇంత తేజోవంతమైనది అబ్బలేదు. దీక్షితుల భావ మంత్రతంత్రపరిభాషలతో [...] సంగీతపునాలుకకు సామాన్యముగా మెదగని సమాసములతో, శబ్దములతో ముక్తాయమయినది[...] శ్యామాశాస్త్రిల భావప్రవాహము కామాక్షమ్మను తలఁచుకొని 'అమ్మా! ననుఁ బ్రోవవే' యని వాయివిడిచి వేఁడుటతో పరవశమై స్తంభించుచున్నది. కులశేఖరుల సంస్కృతరచ[...] ముద్దులమూటలైనను పట్టి[...]దలై 'మాం పాహి'తో [...]ముల లోఁతుకు దిగలేదు. ముగ్గురిది హృదయమందు లేని యుపాసన. ముగ్గురును [...]ము కలవారే. కాని తాము మూర్తివర్ణనముతో మె[...] ముగియునేకాని తీవ్రభా[...] ఇట్లగుటకు కారణము [...] వేదనగాని, ఆందోళనగా[...] పరమభక్తులే; కావ్యావే[...] భజించు దేవత తమ్ముతప్ప[...] కాపాడి మోక్ష మిచ్చునను గట్టినమ్మికతో సంప్రదాయముప్రకారము ఉపాసన చేసినవారు కనుక వారికి ముక్తి లభించియుండవచ్చును గాని మనకు వారివలన కావ్యకళ లభింపలేదు.

త్యాగయ్యభక్తిజీవిత మట్టిది కాదు. చిన్నతనమున నుండియు నానాదేవతోపాసన[...] వాడుకపడియున్నను, వేదశాస్త్రపురాణములందు విధింపఁబడిన నిత్యనైమిత్తిక కర్మములు చేయ[...] సంప్రదాయమునకు లోఁగియున్నను, అవన్నియు 'కల్ల' లని వదలి శ్రీరామమూర్తిని 'వాఁడే[...]

దైవమని నమ్మి 'నీవేరా కులధనము సంతతము నీవేరా జీవనము' అని శరణుచొచ్చినవాఁడు. అతని ఆశ అపారమైనది. నిరాశ యగునేమో యను ఆందోళన అంతులేనిది. శ్రీరాముని ఈ జన్మమందే, ఈ తోలుకన్నులతోనే దర్శించితీరవలయు నని పట్టుపట్టిన వాఁడు. అందుకని జపములుచేసి, ప్రార్థించి, పూజించి, నిందించి, తన్ను నిందించుకొని, వేసట పడి, విసుగుకొని, ఏడ్చి, తప్పాయె నని క్షమాపణ వేఁడుకొని, ఎన్నో తంటాలు పడినాఁడు. తన కోర్కె ఫలింపకపోయినప్పుడు తన కీమార్గ ముపదేశించిన 'పెద్దలమాటలు నేఁ డబద్ధ మాయెనో!' యని భయపడినాఁడు. వైదికమార్గనిష్ఠులగు స్మార్తబ్రాహ్మణుల కులమందు పుట్టి ఆసంఘమందే పెరిఁగియున్నను 'వేదశాస్త్రపురాణవిద్యలచే భేదవాదములు తీరక' వా రందఱును 'భ్రమ సేవా'రనియు, 'యజ్ఞాదులు సుఖమనువారు' 'అజ్ఞాను'లనియు, 'అసురచిత్తు'లనియు ఎదురుతిరిగి తిరస్కరించి తిట్టినవాఁడు. మనము కల్ల అనుకొన్నను, కలవరింపు అనుకొన్నను, భ్రాంతి అనుకొన్నను సరే, అతఁడు శ్రీరామచంద్రమూర్తిని పలుమాఱు ఈజన్మమందే తాను దర్శించినట్లు అనుభవించి, అతనితో సాక్షాత్తుగా ఆడి పాడి వేఁడి ఆనందలీనుఁ డైనవాఁడు. ఇతరులు భుక్తి, ముక్తి రెండును గావలెనని కోరఁగా, అతఁడు 'రామా! నీభక్తి నాకు భోగానుభవంబులందు బాగుగ బుద్ధి నీయకు' అని విరక్తికి పరవశుఁ డైనవాఁడు. కావుననే దొరలను, వా రిచ్చు గౌరవములను మన్నింపక తిరస్కరించి తిరిగిన పరమస్వతంత్రుఁడు. కాఁబట్టి త్యాగయ్యభక్తి నట్టి దృఢమైన మూఁగనమ్మిక, జడశ్రద్ధ కాదు; నిమిషమైనను ఊరకుండనీయక దేహమనస్సుల ప్రతినాడిని కదలించి విఱాఁటి ఊఁగించి ఆడించునట్టి అమేయమైన విద్యుచ్ఛక్తి. అది ఆడించిన ఆటలలో మన పాలికి ముఖ్యమైనవి అతనిపాటలు.

కాఁబట్టి త్యాగయ్యకృతులలో ఒకదానివలె మఱొక్కటి యుండదు. క్రొత్తభావమో, క్రొత్తనుడికారమో తప్పక యుండును. మనఃపూర్వకముగా తీవ్రముగా వెడలని భావ మేదియు కానరాదు. మఱియు మనస్సులో పుట్టిన భావము కావ్యరూపముగా వెలువడు వేగమునకు అడ్డపడున దేదియు నుండదు.

కాని ఒకటి తప్ప: ఏదనఁగా అతని గేయరచన. మాటలలో ఎంత ఎంత క్రొత్తదనము, వేగము, అందము కలదో అంతకన్న ఎక్కువగ వానిని పాటలందు చూపఁగల అపూర్వ గేయకల్పనాశక్తి అతనిది. ఒక శంకరాభరణరాగమందు ముప్పదివర్ణమెట్టుల నెత్తి, అన్నిటిని అన్నిముఖములుగా అత్యంతము నిర్వహింపఁగల అసాధారణప్రతిభ అతనిసొమ్ము. ఇతరు లెత్తిన మెట్లకు తన మాటలను జోడించు దేబతనము నతఁ డెప్పుడును చేసినట్లే కానరాదు. కాఁబట్టి మనసులో మాట తోఁచినవెంటనే దానికైన క్రొత్త నడక గల పాటగానే కూర్పవలయు నను ఉత్సాహము అతనికి ఉగ్గుపాలతో వచ్చినది. ఇట్లే మాట పాటకు లోఁగినిలుచును. ఎన్నియో పాటలలో అతని మాటలు స్వేచ్ఛాప్రచారములు లేక మంత్రమునకు కట్టుపడిన నాగుఁబామువలె ఎగరోఁజుచు అణఁగియుండును.

ఇట్లగుటకు కారణము త్యాగయ్యకుఁ గల అపారమైన గానవిద్యాపాండిత్యమే. నాకుఁ జూడఁగా పాటను నేర్చినంత శ్రద్ధతో అతఁడు మాటను నేర్వలేదు. మాటయం దతనిది ఇంచుమించు పోతన్నవంటి సహజపాండిత్యము. పాటలో నట్లు గాదు. సుప్రసిద్ధులగు సొంటి వారి యింటి శిష్యుఁడు. మీఁదుమిక్కిలి నారదమహర్షి యనుగ్రహమునకు పాత్రుఁడు. 'రజతగిరీశుఁడు నగజకుఁ దెల్పు స్వరార్ణవ మర్మములు విజయముగల త్యాగరాజు కెఱుకే'

★

శాస్త్రోదిత
ముపైన నిత్య
నైమిత్తిక కర్మ
ములు 'కల్ల' అని
వానిని వదలివేసిన
పరమ భాగవ
తోత్తముఁడు.

★

★

...యకల్పనలో
...పూర్వశక్తి,
...సాధారణ ప్రతి
...లు గల ధీశాలి.

★

అను గొప్ప ఆత్మప్రత్యయము గల ప్రౌవ్వీన పండితుఁడు. కనుకనే అతని సాహిత్యవ
మూఁడుపాళ్లు సంగీతము నాశ్రయించి ఆకుమఱుఁగుపిందెవలె నున్నది. సంగీతభావముముంద
సాహిత్యభావము గౌణముగానే నడచును. ఉదాహరణముగా అతని పంచరత్నములలో ఒ
రత్నమగు 'సాధించెనే ఓ మనసా' అను ఆరభి పాటను గ్రహింపవచ్చును. 'శ్రీరాముఁ
తుట్టతుదకు తన్ను మోసగించెనే!' అని ఇందులో త్యాగయ్య అంగలార్చుచున్నాఁడ
శ్రీరాముఁడు 'సమయానికి తగుమాట లాడెనే; నే నిచ్చిన పూజ లన్ని కైకొనెనే; అలుగ
ద్దనెనే; విముఖులతో చేరఁబో కనెనే; వెత కల్గిన తాళుకొమ్మనెనే; ఇట్లాడినమాట లని
బొంకుచేసి తుదకు చెంత రాకనే తాఁ బట్టినపట్టు సాధించెనే!' యని—యిం కెవరితో చెప
కొనఁగలఁడు?—తన మనస్సుతో త్యాగయ్య మొఱపెట్టుచున్న పాట యిది. ఈ భావము
భాషను అడఁచిపట్టుకొన్న రాగము ఆరభి. అది ఉత్సాహప్రధానమగు ఘనరాగము. స్వ
ములనడక జంటలుజంటలుగా పందెపుగుఱ్ఱపునడకవలె, నాభినాదముతో గంభీరముగా, స్థిర
ముగా, నిర్లక్ష్యముగా జరుగవలసియుండును. కాఁబట్టి విలంబకాలముకంటె మధ్యమ ద్రుత కా
ములు ఈరాగస్వరూపమున కెక్కువ చేరికగలవి. ఈరాగమం దీపాటను పాడుచు నై నిరా
భావమును, దైన్యమును స్ఫురించునట్లు చేయుట నాకుఁ జూడఁగా అసాధ్యము. ఆరభిరాగము
లయమును బిగువుచెడును. కీర్తిశేషులగు వీణధనము దీనిని మార్దవప్రధానముగా పా
నప్పుడు విన్నవారి కిదే భావము కలిగినది.

★

అతఁడు పాటను నేర్చునంత శ్రద్ధతో మాటను నేర్వ లేదు. సంగీత భావము నుండఁ సాహిత్య భావము గౌణముగానే నడచును.

★

త్యాగయ్యగారి గానప్రతిభ మఱియొక నూతనసృష్టి చేసి సాహిత్యమును వెనుక
త్రోసినది. పల్లవి విస్తరింపులను శిష్యులు చిన్ననాఁటినుండి నేర్వవలయునను ఉద్దేశముతోఁ గా
బోలును, త్యాగయ్య తనపాటలకు వీలున్నచోట్లనెల్ల కొన్నిసంగతుల నేర్పఱచి అవి తప్పక పా
వలయునని కట్టుపాటు చేసినాఁడు. ఈపద్ధతి అదివఱకు లేనిది. ఆసంగతులన్నియు రాగతాళభా
ములఁ జూపుట కెంతో అనుకూలముగా నున్నను సాహిత్యభావములతో ఏకీభవించుట కష్టము
తన ప్రియదైవము శ్రీరామునిని అపూర్వమధురముగా

'నా జీవాధారా, నా నోముఫలమా
రాజీవలోచనా, రాజరాజశిరోమణీ
నాచూపుప్రకాశమా, నానాసికాపరిమళమా
నాజపవర్ణరూపమా, నాదుపూజాసుమమా త్యాగరాజనుతా'

అని మహాప్రేమతో సంబోధించుకృతికి త్యాగయ్య బిలహరిరాగములో ఏర్పఱచి
పెట్టిన సంగతులన్నియు వేసి సంప్రదాయముగా పాడఁబోయినప్పుడు అక్షరములన్నియు తను
లాడి ఎక్కడనో ఆవిరియై అంతర్ధానమగును! సంగీతమం దున్నంత పాండిత్యము లేకున్నను ఇ
చిత్తవృత్తి అతని కొన్ని సాహిత్యకల్పనలందును చూడవచ్చును. అష్టప్రాసములను నిర్వహి
చుచు అతఁడు రచించిన కొన్ని కీర్తనముల భావ భావశూన్యమై రాగలయములనుగూడ త్రో
నడచును. 'తరాన దొరకని పరాకు నా యెడను రామ చేసితే సురాసురులు మె, త్రా
యిపుడు ఈ హరామితన మేలరా భక్తత్యాగరాజనుత' ఇత్యాదు లుదాహరింపవచ్చును
సాహిత్యపాండిత్యము దుర్బలము కావుననే ఇట్టిచిత్రరచనల కతఁ డెక్కువగా చేయి వేయలేద

★

సాహిత్యమును వెనుకఁబడ నెట్టి నూతనసృష్టిచేసిన త్యాగయ్య గాన ప్రతిభ.

★

అనఁగా త్యాగయ్యకృతు లన్నియు నిట్లున్నవని కాదు. ఆయనసృష్టిలో అట్లు జరుగు
అసాధ్యము. అతనిది చాల సుకుమారచిత్తము. నిర్మాణశక్తి మెఱుపువలె మెఱయునట్టిది. భా

ములు తేజోమయములై అడఁచినను అడఁగనివి. కాఁబట్టి అతఁడు వట్టి పాండిత్యపుపొగరుతో తృప్తిపడఁజాలఁడు. చాలలోఁతుకు దిగిచూచు ఆధ్యాత్మికదృష్టి గలవాఁడు కావున పైడంభము లతనికి చాలవు. మఱియు సంగీత సాహిత్యములు రెంటిని అనుభవించి ఆనందించుశక్తియు, నిర్మించు శక్తియు కలవాఁడు కావున, అతని రచనలలో కొన్నిటియందు ఒకదాని కొకటి అడఁగియున్నను, అనేకకృతులలో రెండును చేయిచేయి పట్టుకొని అపూర్వసౌహార్దముతో ఏకాగ్రముగా రూపు గొన్న అద్భుతదృశ్యమును మనకు త్యాగయ్య ఎత్తి చూపఁగలిగినాఁడు. 'పలుకుపలుకులకు తేన లొలుకు' కృతులు అతని వెన్నో కలవు. ఆ తేనెలు మాటలవో, పాటలవో చెప్పలేము. ఎందుకనఁగా అవి రెండును మేళగించి దింపిన రసాయనములు. 'దొరకునా ఇటువంటి సేవ', 'పక్కల నిలఁబడి', 'నీదయచే రామ' మొదలగు ఎన్నో కృతుల ధాతుమాతుమాధుర్యమును, భావగాంభీర్యమును ఎవరు వర్ణింపఁగలరు ?

కాని మొత్తముమీఁద త్యాగయ్య 'నాదవిద్యామర్మములను' గమనించినంత మెలఁకువతో శబ్దరచనారహస్యములను గమనింపలేదనుట మనము కనుఁగొనఁగలము. భావముల గొప్పతనమునకు సరిరాలేక ఎన్నోచోట్ల అతనిభాష తంటాలు పడుచున్నది. వ్యావహారిక రూపములను ఉదాసీనముతో దూర్చినాఁడేకాని అందుఁగూడ క్షేత్రయ్యవలె నయము నాజూకును తలపెట్టలేదు. సంగీతసాహిత్యములు రెంటికిని సమానగౌరవముగల రచన నైపశక్తితో రావలసి నదేకాని దానికై ప్రయాసపడి ఫలములేదని త్యాగయ్యకుఁగూడ అర్థమాయెనేమో! భావము తోఁచి, మెట్టు స్ఫురించినప్పుడు దానికి తగిన భాష ధారాకారముగా రాదేని అది దాని తప్పేకాని నాదికాదను ఉదాసీనము అతని కుండెనని అనేకకృతులు చాటుచున్నవి. పాటలు రచించువారి కందఱికిని ఇది తెగని చిక్కు. తెలుఁగుపదకవులలో ఈచిక్కును కొన్నిచోట్లనైన తెంచుకొనఁ గల్గిన మహానుభావుఁడు ఒక్క త్యాగరాజే.

ఇట్లు సాహిత్యమును అరగంటితో చూచు చిత్తవృత్తి త్యాగయ్యగారియందే బీజరూప ముగా నుండి, గురుభక్తికి పేరుపోయిన అతని శిష్య ప్రశిష్యపరంపరలో మొలచి పెరిఁగి పెద్దదైనది. ఆయనసంగీతమును పదిలపఱచుటకు భగీరథప్రయత్నము చేసినవారు, చేయుచున్నవారు ఎందఱో కలరు. కాని ఆసాహిత్యము స్ఫురించునట్లు పాడఁగలవారుకాని, దానిని భాషాదృష్టితో కాపా డినవారుగాని అరుదు. ఒకటికన్న ఎక్కువచరణములుగల అతనికృతి యేది పాడినను, ఎవరు పాడినను, రెండవచరణమైనను తాఁకఁగోరు పుణ్యాత్ములు నేటిగాయకులలో అపురూప మైనారు. చాలమందికి వేఱుచరణములు కల వనికూడ తెలియదు. డబ్బదియేండ్ల గొప్ప విద్వాంసుఁ డొకఁడు, సంస్కృత సాహిత్యమును చక్కఁగా చదివినవాఁడు 'సాధించెనే' అను కీర్తనము 'సమయానికి తగుమాటలాడెనే' అనుపాదముతోనే ముగిసినదని, మొన్న నేను చెప్పువఱకును భావించియుండెను! నిజముగా ఆపాటలోని జీవమంతయు తరువాతిపంక్తులలోనే యున్నది. కాని ఆరభిరాగము నేర్చుటకై పడిన శ్రమమంతయు సార్థకపఱచి, పల్లవి ప్రస్తారము చేసి, స్వరరచనలతో పందిలిగట్టుటకు 'సమయానికి' అను ఆవర్తము మిక్కిలి తగియున్నది. ఆపని చేయుటతో పాటకునికిని, వినువారికిని తృప్తియగును. ఇఁక తక్కిన సాహిత్యభాగ మెవరికిఁ గావలయును? మఱియు పాడినంతలోనైనను శబ్దార్థములను గమనించు గాయకుఁడు దొరకుట నేటి మన గొప్ప భాగ్యఫలము. ఇది ఒకత్యాగయ్యతెలుఁగుకీర్తనలకే కాక సామాన్యముగా

అన్ని భాషల పాటలకును అంటిన చీడ. శ్రుతి తాళ లయములను చక్కఁగా నిర్వహించు
ప్రయత్నములో నమలి మ్రింగవలసినది పశబ్దమైన నేమి, పయర్థమైన నేమి?

> త్యాగయ్య తెలుఁగు సాహిత్యమునకు పట్టిన దురవస్థ.

సామాన్యముగ సంగీతవిద్వాంసులు నేఁడు సాహిత్యపరిశ్రమగాని, సంస్కారముగాని
లేనివారగుటచేత, సంగీతవిద్య ఇన్నాళ్లవలెఁగాక ఇప్పుడు సాహిత్యపుసంకెళ్లకు లోఁబడక
స్వతంత్రముగా నిలుచుటకు ప్రయత్నించుచుండుటచేత, త్యాగయ్య తెలుఁగుదేశములో పుట్టి
పెరుఁగకపోవుటచేత, అతనిశిష్యు లందఱును అఱవవారే యగుటచేత, తెలుఁగుదేశమునందు
కర్ణాటకసంగీతమునకు వ్యాప్తి రానురాను క్షీణించుచుండుటచేత, ఉన్న కొందఱు తెలుఁగు
గానవిద్వాంసులు తెలుఁగుపాటలు పాడినను అఱవవారిపద్ధతులే వారికి చాలవఱకు ఆదర్శముగా
నుండుటచేత—త్యాగయ్యతెలుఁగుసాహిత్యము ఈయవస్థకు వచ్చినది.

ఇది అఱవవారి దూషణ కాదు. త్యాగయ్యపై నిజమైన భక్తిగల వెవరైనను అఱవ
దేశపు గాయకులను, రసికులను కృతజ్ఞతతో నమస్కరింపకతీరదు. నాఁటికిని నేఁటికిని
త్యాగరాజకీర్తనలు వారు పెట్టవలసిన బిచ్చమే. త్యాగయ్య, క్షేత్రయ్య మొదలగువారి రచనల
ననుభవించుకొఱకు ఎందఱో ద్రావిడులు తెలుఁగుభాష నలక్షణముగా నేర్చుకొన్నారు.
వారి రచనలను వేదములవలె భక్తితో కాపాడినారు. అవేమాదిరిగా తెలుఁగులో
ఎందఱో కృతులు రచింపఁ బ్రయత్నించినారు. వానిని అర్థతాత్పర్యములతో తెలుఁగులోను
అఱవములోను ప్రకటించినారు; ప్రకటించుచున్నారు. కాని యెంత భక్తిశ్రద్ధలతో నేర్చినను
తెలుఁగు వారికి స్వభాష కాదు కావున వారికి పొరఁబాట్లు తప్పవు. తక్కినవారిమాట అట్లుండ
నిండు: మహాప్రతిభగల పండితుఁడు కీర్తిశేషుఁడగు సి. ఆర్. శ్రీనివాసయ్యంగార్లవంటివాఁడ
ప్రచురించిన త్యాగయ్యకీర్తనములందు, తెలుఁగురచనయందలి జీవగఱ్ఱలవంటి యతిప్రాసములన
గమనింపక వర్ణమెట్లలో పదవిన్యాసము చేసెను. సాహిత్యపునడక స్పష్టముగా చతురశ్రగతిలో
నుండఁగా 'సిగ్గుమాలి నావలె ధర నెవరు తిరుగఁజాలరయ్య' అను కీర్తనను మిశ్రచాపుతాళము
కమర్చి అవకతవకగా ప్రచురించిరి. ఇఁక కే. వి. శ్రీనివాసయ్యంగార్యులు తెలుఁగు వ్యాకరణ
మందలి జడశ్రద్ధచే త్యాగయ్యరచనలను నానాముఖముగా తిద్దిపెట్టిన త్రిప్పటలకు తుది మొదల
లేదు. ఇది సహజము. తెలుఁగువారు అఱవసాహిత్యమునకు చేయివేసినచో ఇంతకంటె మేలుగా
పనిచేయఁగలరని నమ్ముట కవకాశము లేదు. మనము బుద్ధిమంతులమై ఊరకున్నాము గను
బ్రతికినాము!

> తెలుఁగు వారికి మిగిలిన కర్తవ్యము.

కాఁబట్టి ఇదివఱకును తమిళులు చేసిన ఉపకారమునకు వారికి కృతజ్ఞులై, ఇప్పటికైన
తెలుఁగువారు తెలుఁగుదృష్టితో త్యాగయ్యసాహిత్యమును సమకూర్చి శోధించిపెట్టుకొ
దేశములో వ్యాప్తికి తేవలసియున్నారు. ఇప్పుడు స్వభాషాభిమానము అనుపేరితో పరభాషాతి
స్కారము చీడపురుగువలె అన్ని దేశములందును వ్యాపించుచు భారతీయవిజ్ఞానమును తునకల
తునకలుగా చేయుచున్నది. తెలుఁగుకీర్తనలు పాడఁగూడ దనుభావము అఱవదేశములో అ
దందు తలచూపుచున్నది. అది ముదురుటకుముందే ఆంధ్రులు మేలుకొనుట మేలు.

[మద్రాసు రేడియోప్రసంగము నాశ్రయించి పెంచి వ్రాసిన వ్రాఁత]



అనదయగు పథికస్త్రీ

చిత్రకారుడు:
శ్రీ కోడూరు రామమూ

శ్రీ వంగోలు వెంకటరంగయ్య

మచిలీ (మఛిలీ) మత్స్యశబ్దభవముగ నున్నది. బందరు (బందర్) రేవు అను వర్థముగల పార్శీపదముగ నున్నది. ఈ సాంస్కృతిక, అన్యదేశీయశబ్దసంయోగ మెట్లు కలిగినదియో, యేకాలమున కలిగినదియో నిర్ణయింప వలనుగాకున్నది. దేశచరిత్రము నవలంబించి యిచట నోడరేవు అరబ్బీలచేత క్రీ. శ. పదునైదవ శతాబ్దమున స్థాపింపబడిన దనియు, ఎవరో కర్నాటకరాజులు ఇచట నొక మసీదుకట్టుకొనుటకు మహమ్మదీయులకు క్రీ. శ. 1425 ప్రాంతముల నుత్తరు విచ్చినట్లును తెలియుచున్నది (కృష్ణాడిస్ట్రిక్టుమాన్యుయలును, డాక్టరు మెక్కెంజిగారి మద్రాసు అడ్మినిస్ట్రేషన్ మాన్యుయలును చూడుడు). ఇటుల తురకల సంబంధ మేర్పడిన పిదపనే దీనికి "బందరు" అను పేరు వచ్చియుండవచ్చునుగాని "మచిలీ" యను నామ చరిత్రమున కేయాధారము చాలదు. ప్రాయికముగ "మచిలీ" శబ్దము మత్స్యశబ్ది కారణముగానే యుండ వచ్చును. "మత్స్యము" నకు "మచ్ఛ" అను వికృతి యున్నట్లు వామన శివరామ ఆప్టేగారి సంస్కృత డిక్షనరీలో నున్నది. [illegible] మత్స్యముతో దీనికి సాజాత్య మంగీకరించినమాత్రన ఈ గొప్పపట్టణమున కాచేపేరు వచ్చు టెట్లు? బందరుకోటకు "చేపకన్ను" వంటి దర్వాజా యొకటియుండినదనియు, దానిచే "మచిలీబందరు" అను పేరు వచ్చిన దనియు వయోవృద్ధులు కొందరు చెప్పెదరు. ప్రాచీనకాలమునదో యొక పెద్దచేప (తిమింగిలము) సముద్రమున ఆరేవునకు కొట్టుకొని వచ్చిన[...] కొందరు చెప్పెదరుగాని ఈ నిష్పత్తులవలన ఈ నగర ప్రాచీ[...] త్వమున కొక హాని కలుగును. అరబ్బీలు, లేక ఇతర తురుష్క[...] జాతులవలన నీపేరు కలిగినదని యొప్పుకొనవలసియుండును. ఈ[...] శకజాతు లీభరతఖండమున ప్రవేశించుటకు ముందు ఈయూరే యు[...] లేదని దీనికి ప్రాగ్భావస్థితి నంగీకరింపవలయునా? నా కీయూ[...] నివేశనమునకు వచ్చి గ్రామము చేర్పరచిరా? ఇట్టిస్థితి యురూపా[...] పీల నవగా, మార్కోపోలో, పాశ్చిమా లోకను వకోపియయా[...] కుల కాలమునకే ఈయూరు రుండినటుల తెలియుచున్నది. [...] యుద్ధరి దేశయాత్రాకాలము అనుక్రమముగ క్రీ. శ. 13, [...] శతాబ్దమధ్యమముగ నున్నది. ఉదాహృతి మసీదునిర్మాణము ఇ[...] కర్యోచిన మయియు[...] ది. అందియగాక [...] ష్పిన మెక్కెంజిగారి మా[...] యలులో దీనికి "మా[...] లీ-కా" యని గ్రీకు[...] రములలో పేరు ప్ర[...] బడియున్నది. ఇంతే[...] ఇది సముద్రతీరమున [...] గొప్పరేవుగా నుం[...] ప్రసిద్ధము.

మత్స్యసంబంధ [...] దుటంబట్టి మహో[...] ప్రాక్దికల మత్స్య[...] లోనిపట్టణమా యని[...] హించిన వదియు ప[...] పముగనో పలెదు. భా[...] గత మత్స్యదేశము ఇ[...] రాజపుత్రస్థాన(Rajp[...] ana) గల జయపుర[...] రములలో నుండి న[...] యొక అభిప్రాయ [...] ది. మన మచిలీ ప్ర[...] యం దున్నది. రాజ[...] స్థానములు భరతఖండ[...] యపశ్చిమభాగమున నున్న[...]

ఉగాదిపండుగ సంబరము: 1. గృహాలంకరణము

పండుగనాటికోసం ఈరీతిగా ఇంటికి వెల్ల వేసి, ఎఱ్ఱమంటి పట్టెలు తీర్చడం ఆంధ్రగృహాలలో అలవాటు.



ఇక, ఎవరో మత్స్యభక్షకులు ప్రబలి, చేపల ఎగుమతి గుటకు ఒప్పియున్నదని మచిలీ, లేక మచ్చిలీ యని పేరు పెట్టి, ఆ సరకువ్యాపారము జరుగు రేవు అయినందున "మచిలీబందర్" అని నామకరణము చేసియుండుటకును ఏకాలమునందైన చేపలయెగుమతికి ప్రసిద్ధమైన రేవయినటుల చరిత్రమున వ్యక్తముగ నున్నది. ఇచట నుండి ఎగుమతియగుచుండినవి ఎక్కువగా పరిశ్రమలవస్తువులు కాయధాన్యములు, వంగకల తోహములు, బందరుచీట్లుగుడ్డలు (chintz) మొదలగువాని విచటి నుండి యోడల కెక్కించుచుండినట్లు తెలియుచున్నది. కాబట్టి చేపల రేవుసిద్ధాంత మాదరణీయముగా కనబడదు.

"బందర్" అను పేరును పుచ్చుకొని మనపండితులు దీనిని "బృందారక"పురి జేసిరి. ఇది విచిత్రకల్పనయని సంతోషింపవచ్చును. అంతమాత్రమే. ఇది మాక్సుముల్లరును మోక్షమూలరు అనియు, గ్రిఫిత్ (Griffith) ను గిరిఫితి అనియు అనిన ట్లుండును. చెన్నపట్టణ సమీపమునందుండు ఫరంగికొండ (St. Thomas Mount) భృంగి శైలమట. ఇట్టికల్పనలకు మితిమేర లుండవు.

తెలుగుభారతమునందలి ద్రోణపర్వములోని మొదటియాశ్వా సపు కడభాగమున రెండుచోట్ల మచ్చిల్లి, లేక మచ్చిల్లి యనుపద మున్నది. సందర్భమునుబట్టి ఇది యొక దేశనామముగ నున్నది. (1) నుండ కేరళ మాళవ కళింగ్ర మగధ మచ్చిల్లికాది దేశాధీశులును ఇత్యాది (ద్రోణ. 1-220 వచనము). (2) నుండి మగధ కేరళ మచ్చిల్లికాదులు ఇత్యాది (ద్రోణ. 1-254 వచనము). ఈ రెండు సందర్భములలో "మచ్చిల్లిక"ను ఆధారపరచుకొని క్రీ. శ. 1855 ప్రాంతముల రాక్షసనామసంవత్సరమున తెలుగక్షరముల నచ్చుపడిన మహాశ్రీ పురాణం హయగ్రీవ శాస్త్రిగారి ప్రతియందును, కలకత్తాలో నాగరాక్షరముల నచ్చుపడిన ప్రతాపచంద్రరాయిగారి ప్రతియందును, టి. ఆర్. కృష్ణాచార్యులవారి కుంభకోణప్రతియం దును, ఈవల ఆంధ్రగీర్వాణ గ్రంథముద్రణాదీక్షితులగు శ్రీవావిళ్లవారి ప్రతియందును ఉదాహృత తిక్కనవాక్యములకు సరియగు ఘట్టముల న్వేషింపగా నా వాలెంట నెందును మచ్ఛలి(మచ్చిల్లి) కానరాదు. ... పట్టున ఈ శ్లోకము లున్నవి:

"మాళవ స్తుండికేరశ్చ రథానా మయుతైస్త్రిభిః"

ఇత్యాది (అధ్యాయము 17.)

తిక్కయజ్వ క్రీ. శ. పదుమూడవ శతాబ్దమున వర్ధిల్లినటుల కీర్తిశేషులు రావుబహద్దూరు వీరేశలింగముపంతులుగారు తమ "కవి జీవితములు"లో నిర్ణయించియున్నారు. పదమూడవ శతాబ్దమునాటికే గురుష్కులిచట చేరి "మఛిలీబందర్" అను చేపలరేవును ఏర్పరచి యుండురా యనుట కాధారము దుర్లభము. సోమయాజిచేత నందిన భారతప్రతియందు "మచ్చిల్లి" పాఠముగల శ్లోక ముండియుండు నను నూహ పాపానము కాజాలదు. "తుండికేర"మని యరవదేశము పలుక బడినది. ఇదియే తొండమండలము (చెంగల్పట్టు మొదలు నెల్లూరు జిల్లా సూళూరుపేట ప్రాంతములవరకు నుండవచ్చును). కేరమని మలయాళదేశము ముచ్చటింపబడినది (ఇదియే కేరళము). ఆంధ్రదేశ మున కీప్రణాళికయందు స్థానము లేకపోవలయునా? ఆంధ్రు లును మహాభారతయుద్ధమున పాల్గొనినటుల మహాభారతమున అగపడుచున్నవి. (కర్ణపర్వ. అధ్యా 2, 817 వచనము)*

ఇత్యాది హేతు సముదాయముచే స్థాపింపదగిన నిగమన మేమనగా, మచిలీపట్టణమునకు విదేశీయ మ్లేచ్ఛభాషాజన్యభ్రాంతి నిర సింపబడి నైయాయిక ప్రామాణ్యమును, పరిపాలకప్రభయు అంగీ కరింపదగియున్నది. కాలగతిచేతను, ఉచ్చారణసౌలభ్యముకొర కును "మచ్చిల్లి" "మసూలా" కావచ్చును. "బందర్" అనునది నౌకావ్యాపారమును తెలియజేయు పదమే. ఇది మన మచిలీపట్టణ మున కంటింపబడినట్లు మరియు నచేక ఓడరేవుపట్టణములకును చేర్పబడియున్నది. బొంబాయిలో అపోలోబందర్, కరాచీ బందర్ ఇత్యాదు లెన్నియో కలవు.† "బందర్" పద సంయోగమాత్ర మున ఆర్య హైందవ జాతి నశింపజాలదు. కాబట్టి పూర్వము మహా భారత కాలమునను "మచ్చిల్లి" యను నొక రాజ్య మాంధ్రదేశమున వెలసియుండిన దనియు, దాని ముఖ్యపట్టణముకూడ "మచ్చిల్లి"గా నుండి ఈనాటి గాలివానల (హరికేన్) పాలైన "మసూలీ పటాం"గా మారియుండవచ్చు ననియు మనవి. బందరువా రిందు కేమందురో ?

---

* సంస్కృతభారతమున "పుళింద కళబాహ్లీకాశ్చ నిషాదాంధకకుంకణాః" అని యున్న మూలమునకు (కలకత్తాప్రతి, కర్ణ. [illegible]0 అధ్యా) తిక్కనసోమయాజి "పుళిందబాహ్లీక కొంకణాంధ్ర"అని పరివర్తనము చేసియున్నాడు.

† బకింగాం కాలవలోను, కృష్ణకాలవలలోను రాకపోకలు నడచుచోట్లను "బందర్" అనుట వాడుకలో నున్నది.

నవ్యాంధ్ర కవితారీతులు

> కాలానుగతిగా నవకవులు నవ్యాంధ్ర వాఙ్మయంలో చొప్పించిన గుణవిశేషాలు



కవికి, ప్రకృతికి ఉన్న చుట్టరికము అపూర్వమైనది. ప్రకృతిలోని రహస్యాలను తెలిసికోవడానికి కవి సమర్థుడు; రసికుడైన కవిని అలరించడానికి ప్రకృతికన్నా సమర్థమైనది వేరొకటి లేదు. పురాణయుగంలోను, ప్రబంధయుగంలోను, నవయుగంలోను కవులు ప్రకృతిని గురించి గానం చేసినారు, చేస్తున్నారు, చేయనున్నారు. కాని ఎత్తుగడలోను, విషయాన్ని నిర్ణయించుకోవడంలోను, ఆ నిర్ణయించుకొన్న విషయాన్ని ప్రదర్శించడానికి ఉపయోగించే భాషలోను భావంలోను నేడు క్రొత్తదనం గోచరిస్తూ ఉన్నది. అందులకే దీనిని నవయుగ మన్నారు. ఆంగ్ల వాఙ్మయ ప్రాదుర్భావంవల్ల నేమి, ప్రజల అభిరుచిలో మార్పువల్ల నేమి, కాల మాహాత్మ్యంవల్ల ప్రతివిషయంలోను కలుగుతున్న మార్పువల్ల నేమి మన భాషలో, మన భావాలలో, మార్పుచేర్పులలో, పద సామగ్రిలో మార్పులు వచ్చిచేరినవి.

"భావనాబల మున్నది, ప్రకృతి యున్న;
దిష్ట ముండిన బదముల కేమి కొఱత ?
వారిద విహార నగశృంగ పదము లరసి
స్వాదు జలపూర్ణ నదనదీ పదము లరసి
సార్థకంబుగ భావించి సరస కావ్య
మొకటి వ్రాయుము, వ్రాయుము సుకవిచంద్ర !"

అని ఉత్సాహాన్ని గూర్చే గీతాలు నేడు తెనుగుసరస్వతీదేవాలయంలో మారుమ్రోగుతున్నవి. భావనాబలమున్న కవి కథావస్తువు కొరకు మానవలోకాన్ని వెదకవలసిన పనిలేదు; రాజులను, మహారాజులను ప్రశంసించి పుటలు నింపవలసిన అవసరము కనుపించదు. మానవజాతి నేర్చుకోదగిన విషయా లెన్నో ప్రకృతి మాతగర్భంలో దాగియున్నవి. వానిని సేకరించి, కేవలము ధన కాంక్షతో, స్వార్థంకొరకు, ఎన్నోవిధాల క్రిందుమీదవుతున్న లోకాన్ని సంస్కరించవలసిన బాధ్యత తన కున్నట్లు కవి తెలిసికో గలిగినవాడు. తన ఆనందంకొరకు, తన హృదయంలో నూతన భావకుసుమాలు వికసించేటందుకు ప్రకృతిని పడిగాపుగా తన కంటియెదుట పడియుండమని కవి కోరటంలేదు. లతలను, మొక్కలను తీసుకొనివచ్చి తన పెరటిలో వేసుకుని ఆనందించి, తృప్తిపడవలెనన్న భ్రాంతి అతనికి లేదు. అది కృత్రిమసౌందర్యమని అతడు గ్రహించక పోలేదు. సహజమైన చక్కదనాన్ని తాను నిర్మించుకొన్న వనంలో కాకుండా, సహజంగా పెరిగిన అరణ్యాలలో అతడు కనుగొన గల్గుతున్నాడు. అందులకే

"ఆకులో నాకునై, పూవులో బూవునై,
కొమ్మలో గొమ్మనై, నునులేత రెమ్మనై
ఈయడవి దాగిపోనా
ఎట్లైన
నిచటనే యాగిపోనా ?

గలగలని వీచు చిరుగాలికెరటమై,
జలజలని పారు సెలయేటిలో దేటనై
ఈయడవి దాగిపోనా
ఎట్లైన
నిచటనే యాగిపోనా ?

ఆకలా దాహమా, చింతలా వంతలా
ఈకరణి వెఱ్ఱినై యేకతమ తిరుగాడ

శ్రీ చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు

ఈయడవి దాగిపోనా
ఎక్కెన
నిచటనే యాగిపోనా ? "

అని ప్రశ్నించుకుంటున్నాడు. వస్తుసందర్శనంవలన కలిగిన ఆవేశాన్ని వెలువరించడంలో ఆవస్తువుయొక్క చక్కదనాన్ని గూర్చి, పుట్టుపునుగూర్చి ఉపమానాలతో, ఉత్ప్రేక్షాలంకారాలతో వర్ణించటం ఈనవయుగంలో విశేషంగా కానరాదు. కలిగిన ఆవేశం లోని అవ్యయానందాన్ని తృప్తిదీర అనుభవించడానికి ఆవస్తువు నందు కలిసిపోయి, తన్నుదా మరచి, కణకాలం ఈదుఃఖమయ ప్రపంచాన్ని మరచిపోవలెననే కాంక్ష నేటి కవుల రచనయందు వ్యక్తమౌతున్నది. ముఖ్యంగా ప్రకృతిని వర్ణించేపట్ల ఈకాంక్ష మిక్కుటంగా చేసు గోచరిస్తూఉన్నదనటానికి పైగేయమే ఒక ఉదాహరణము. అవును, ప్రకృతి శోభావిలాసజాలకులుగదా కవులు. అందులకే

"వేగుజామున వికసించు
విరులయందు
తేకు లెడలించు సంజపూ
రెమ్మలందు
గావ్యమునబో లెజరించుంతు
గౌతుకమున
ప్రకృతిసామ్రాజ్యపాలనా
పద్ధతులను."

అని నేడు కవి సగర్వంగా పలుకు తున్నాడు.

కవికిని, ప్రకృతికిని ఎంత దగ్గర బంధుత్వ మున్నదో, కవికిని, దాక్షిణ్యానికిని అంతే సంబంధమున్నది. ఈసంబంధము నవయుగంలోకూడా విడిపోలేదు. రాజాదరణ లేకపోయి నప్పటికిని "నిరుపహతి స్థలమ్ము, రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు కప్పురవిడెము, ఆత్మ కింపయిన భోజనము" సమకూరనప్పటికిని అప్పుడప్పుడప్పుడు "తెలుంగువారికిక్ జాకిరి చేయసాగి కడచన్నవి పాతిక వత్సరాలు, వాయాకటిపాట మాన్పిన మహాత్ములు లేరు, రసజ్ఞ శేఖరా!" అని కవులు నేడు కంట తడిపెట్టినప్పటికిని, ఈయుగంలోకూడా రసో

దంచితములైన కావ్యాలు సృష్టింపబడకపోలేదు. తనగురువుగా, మిత్రుడుగా కవి ప్రకృతినే ఆరాధించినాడు; కష్టసమయంలో ప్రకృతియొడిలోనే తలవాల్చినాడు. అదృష్టవంతులైన ఏకొలది మందికో తప్ప, నిజంగా విచారిస్తే ఈ నవయుగంలో తెలుగు మాగాణమున రాజాదరణపొందిన కవులకు అకాళంగనే ఎక్కువ మందికి కలిగినది. రాజాదరణతోపాటు కవికి ధనాపేక్షకూడ సన్నగిల్లినది. అందువలననే కవితాశిల్పాన్ని ప్రదర్శించడంకొరకు, జనహృదయాన్ని అలరించడంకొరకు కావ్యాలు సృష్టింపబడినవి. వీనియందు స్వాతంత్ర్యేచ్ఛ, నిజమైన తెనుగుదనం, కల్తీలేని కవితాశిల్పము, కట్టుదుంటుకట్టని భావశక్తి, ప్రకృతిసౌందర్యము ప్రస్ఫుటమౌతున్నవి. ఏ ఒకరినో, లేదా ఏ ఒక రాజుసభలో నున్న పండితబృందాన్నో సంతోషింపచేయవలె, వారికి నచ్చే ఆశయాలనే రచనలో చొప్పించవలె అనే అనర్థకమైన, అస్వాభావికమైన నియమములు లేకపోవడం వలన నిరంకుశులైన కవి స్వేచ్ఛగా క్రొత్తరీతులను రచనలో ప్రవేశపెట్టినాడు.



ప్రబంధరచనకు చెందిన నిబంధనాలను అనుసరించి, తప్పని సరిగా కథావస్తువును నిలిపియుంచి, వసంతఋతువర్ణనలు, సంధ్యారాగవర్ణనలు మొదలైనవాటిని పూర్వకవులు తమ గ్రంథాలలో ప్రవేశపెట్టినారు. హృదయ ముప్పొంగేవిధంగా నాట్లుపంక్తులు ఒక ప్రకృతివిలాసాన్ని ఆధారపరచుకొని విడిగా వ్రాయతగిన అవకాశం వారికి లభించనే లేదు. అప్పటికిని కట్టుబాట్లను కాదనలేక ఆకొలది అవకాశంలోనే నిర్మలమైన హృదయాలతో, క్రొత్తభావాలతో ప్రకృతిని ఆరాధించి ధన్యులయినవారున్నారు. అయితే వారి సంఖ్య చాలా స్వల్పము.

"తారకాధీశు కిరణాక
దంబకంబు
చిలికె బలుచని వలిపంపు
జిలుగుమంచు,
నైరవ శ్రీవధూకర
గ్రహణవేళ
వెలికె గ్రమ్మిన సాత్త్విక
స్వేద మనగ."

చంద్రోదయవర్ణన గావించేటప్పుడు ముక్కు తిమ్మనార్య కెంతటి లలితమైన భావాన్ని పైపద్యంలో వివరించినాడో చూడండి! అప్పుడే తూర్పుకొండపై కెక్కి తొంగిచూస్తూ ఉన్న పూర్ణిమనాటి చంద్రబింబాన్ని చూచి "పాకశాసన పుర ప్రాసాద శిఖరాగ్ర సురుచిర సౌవర్ణ కుంభ మనగ" అని వేరొక కవి గాన మొనరించినాడు. ప్రకృతిని వర్ణించవలసివచ్చినప్పుడు పూర్వ కవుల రచనలలో ఎక్కువచోట్ల అర్థాలంకారాలు విరివిగా కనుపించుతున్నవి. ముఖ్యంగా ఉత్ప్రేక్షను ఆధారపరచుకొని వారు ప్రకృతివర్ణనలు సాగించటం ఆచారమైనది. మానవాతీతములైన విషయాలతో ప్రకృతిశోభను పోల్చిచూపించడం నేడు కానరాదు. పాకశాసనుని పురప్రాసాద శిఖరాన్ని చూచినవా రెవ రున్నారు? 'సురుచిర సౌవర్ణకుంభాన్ని' ఊహించటం మొదటిపని; తరువాత పాకశాసనుని పురాన్ని, దాని శిఖరాగ్రమం దున్న సురుచిర సౌవర్ణ కుంభాన్ని ఊహించడం వేరొక పని. నిత్యమూ చూచే విషయాలను ఉపమానంగా తీసుకొనడం నేటి కవుల రచనలయందు కనుపించు తున్నది. మానవుని జీవితాన్ని రసమయంగా చేయటానికి ప్రకృతి ఏవిధంగా సాయపడుచున్నది, ప్రకృతిసౌందర్యాన్ని చూచి సంతోషింపగల మానవునకు కష్టము లేవిధంగా మరపునకు రాగలవు, ప్రకృతిరహస్యాలను గుర్తించి తన తప్పులను తాను దిద్దుకొనడానికి మానవున కేవిధంగా అవకాశ మున్నది, మొదలగు విషయాలు నేటి కావ్యాలలో విశదీకరింపబడినవి. అంతేగాని ప్రకృతిని దూరంగా ఉంచి కేవలము చూచి సంతోషింపతగినట్టి, ఆరాధింపతగినట్టి విషయంగా నేటికవులు తలచియుండలేదు. జైలునందు బంధింపబడి, నాళ్ళొక యుగముగా గడుపుతున్న ఒక ఆధునికకవి ఇనుపకటకటాలు దాటి తన గదిలోనికి వచ్చిన వెన్నెలను, సమ్రము వెలుపల నుండి తొంగిచూస్తూఉన్న చందమామను గాంచి తన్మయత్వంతో ఏమనుచున్నాడు ?—

"ముకుళితములైన కలువపూవుల దళాలు
సీకరస్పర్శ పుల్కరించినవిధాన
ఎన్నడో మూగవడిన నాహృదయవీణ
తీగ లొకసారి కదలి నదింపదొడగె."

అని తనలో కలిగిన మార్పును విశదపరచుచున్నాడు; కాని తన హృదయంలో నిండియున్న స్వాతంత్ర్యేచ్ఛను, చంద్రదర్శనంవలన తనకు కలిగిన అమితానందాన్ని అతడు నిలుపుకొనలేకపోయి నాడు. అందులకే

"నవ్యతారాపథమ్ముల నడచు నిన్ను
నే కిరీటాధిపతులు బంధింపగలరు ?
కష్టతరదీర్ఘ యామినుల్ గడచి వేగ
బంధనవిముక్తులను జేయవలయు మమ్ము."

అని ప్రార్థిస్తున్నాడు. ఊహాకందని వర్ణనలు జరపకుండా, నేటి కవులు ఈ విధంగా కష్టకాలంలో సహితం ప్రకృతిమాత-పాదాంకముల చెంత ప్రణమిల్లి, హృదయశాంతిని పొందుతున్నారు.

ఒక పద్యం వ్రాయడానికి నిర్ణయించుకునే విషయము ఉత్కృష్టమైనదిగా ఉండవలెననియు, కనుపించిన ప్రతివిషయాన్ని గూర్చి పద్యాలు వ్రాయకూడదనియు, ప్రతి అల్పమైన విషయాన్ని గూర్చి కవిత్వం వ్రాసేటట్లయితే కవిత్వగౌరవం పోతుందనియు ఒక చిత్రమైన అభిప్రాయం మొన్న మొన్నటివరకు తెలుగుదేశంలో కవుల కున్నమాట వాస్తవము. అందుచేతనే పురాణకథలు, రాజుల చరిత్రలు, స్థలమాహాత్మ్యములు మన వాఙ్మయంలో మొదటినుంచి వెలసినవి గాని భగవంతుని సృష్టివైభవాన్ని వెలువరించే పెక్కువిషయాలను కవులు గౌరవించనేలేదు. శకటరేఫమును, రేఫమును ప్రాసలో భేదం చూపించలేదనే దోషమే కాకుండా మహాకవిపోతన్న తన భాగవతంలో స్వతంత్రించి, ఒక అడివిని వర్ణించే సందర్భంలో ఝిల్లిని (ఈలపురుగు) గూర్చి ఒక కందపద్యం వ్రాశాడనే హేతువుచేత పోతన్నగారి కవిత్వాన్ని గూర్చి పెదవివిరచినవా రున్నారు. వస్తు సందర్శనంవలన కలిగిన ఆవేశాన్ని ఆధారపరచుకొని వాళ్లు పద్యాలు వ్రాయగల స్వాతంత్ర్యం నేడు కలిగినందువలననే

"కలుకుపసిండినిగ్గుల దు
కూలములన్ ధరియించి, ముద్దుబి
డ్డలును, బడంతి నీపొదిగి
టన్నిదురింపగ, గన్నుగాడ్పు లూ
యెలసదనంబు నూచ, భయ
మింత యెరుంగక కన్నుమూయు నీ
యలఘుసుఖంబు మాకు గల
దా! గిజిగా! యొకతేని కున్నదా? "

అని సృష్టిలోని ఒక దర్శనీయమైన విషయాన్ని గూర్చి నేటి కవి గానం చేయగలిగినాడు. గిజిగానిపిట్టయొక్క చక్కదనం అసమానమైనది. ఆపిట్టయొక్క గూటి నిర్మాణవిధానం ప్రతివానిని చకితులను చేస్తుంది; అందులకే అది కవిహృదయాన్ని పైవిధంగా కదిలించినది. గడ్డిపోచ మొదలుకొని హిమాలయపర్వతంవరకు ప్రతివస్తువులోను సృష్టికర్త తన నిర్మాణకౌశలాన్ని, ప్రజ్ఞావిశేషాన్ని ప్రదర్శించే ఉన్నాడని తెలిసికొనడానికిని, లోకానికి తెలియచేయడానికిని అవకాశం నేడు కవికి లభించినది. రత్నా

లోను, బంగారపు మేడలలోను మాత్రమే అందాలు చందాలు కలవని తలచటం పొరపాటు. సీతాకోకచిలుకలలోను, గడ్డిలోనుండి తొంగి చూచే నీలిపూవులోనుకూడా తన పనివానితనాన్ని సృష్టికర్త పొందు పరచినాడని లోకం గ్రహించేవిధంగా కవి చేసినాడు. కేవలము గ్రంథాలనుండే కాకుండా తేనెటీగనుండి, గువ్వలజంటనుండి ఎన్నో గుణపాఠాలను మనము నేర్చుకోవలసిఉంటుందని కవి తెలియచేశాడు. మానవుడు ప్రకృతిని ఆరాధించి, తనలో దాగియున్న స్వార్థాన్ని, ఇంకా ఇతరములైన దుర్గుణాలను మరచిపోవలసి ఉంటుందని కవి నిరూపించాడు. ఈయుగంలో తెనుగువాఙ్మయంలో ప్రకృతి కివ్వబడిన పవిత్రస్థానం పురాణయుగంలోను, ప్రబంధయుగంలోను కూడా ఇవ్వబడియుండలేదు.

✓ నేటిరచనలయందు జాతీయభావాలు ఎక్కువగా గోచరించడం సంతోషింపతగినవిషయం. "రాయరాహుత్తుగండరాచయేమగు వచ్చు ఆరట్లకోట గోరాదు" దినములు మన మెరుగము. అట్టి దృశ్యాలు ప్రస్తుతం మనము చూచే అవకాశంలేదు. ఆవిషయాలన్నీ మన కిపుడు కథలుగా మారిపోయినవి. మన వ్యక్తిత్వాన్ని, మన వైభవాన్ని మనము మరచిపోయినాము. ఇంగ్లీషుమాట లేనిదే మన భావాలను వెలువరించలేనిస్థితి వచ్చినది. మనవాఙ్మయం క్రమేణ అనుకరణలతో, అనువాదాలతో నిండిపోవలసివచ్చినది. ఒకసారి వ్రాయబడిన గ్రంథాలే తిరిగి వ్రాయబడటం జరుగుతూవచ్చినది. చివరకు పంచమ జార్జిచక్రవర్తి పట్టాభిషేకచరిత్రనే కథావస్తువుగా నిర్ణయించుకొని కావ్యాలు వ్రాయటంలోనికి వచ్చినది. ఇంతలో తిలకమహాశయుని స్వాతంత్ర్య శంఖారావం, గాంధీమహాత్ముని అహింసాతత్వం దేశాన్ని ఆవరించినై. అవిదితమూ, అనల్పమూ అయిన ఉత్సాహం దేశమంతటా కలిగినది. తెనుగుజాతిలోకూడా చైతన్యం కలిగింది. తెలుగుగుండెలో కలవరం ప్రారంభమైనది. తెనుగురక్తంలో వేడి కలిగినది:

"తనగీతి యఖిలజాతిని పాటకులనుగా
దిద్ది వర్ధిల్లిన తెనుగువాణి,
తనపోటులు విరోధితండంబులకు సహిం
పనివిగా మెరసిన తెనుగుకత్తి,
తనయందములు ప్రాంతజనుల కభిరుచివా
సన నేర్ప నలరిన తెనుగురేఖ,
తన వేణికలు వసుంధరను సస్యశ్యామ
లను జేయ జెలగిన తెనుగుభూమి,
అస్మదార్ద్రమనోవీథి నావహింప
జ్ఞప్తి కెలయించుచున్నాడ! చావలేదు,

చావలేదు, ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర
హృదయములు చీల్చి చదువు డోసదయులార !"

అని తెనుగుకవి సగర్వంగా గానంచేయటం ప్రారంభించినాడు. ఇప్పటినుండి దేశభక్తి నవ్యాంధ్రకవిహృదయంలో ముఖ్యస్థానాన్ని ఆక్రమించినది.

"నీచపు దాస్యవృత్తి మన
నేరని శూరత మాతృదేశసే
వాచరణమ్మునం దసువు
లర్పణసేసినవారి పార్థివ
శ్రీ చెలువారుచోట తద
సృగ్రుచులన్ వికసించి వాసనల్
వీచుచు రాలిపోవగవ
లెం దదుదాత్త సమాధి మృత్తికన్."

అని కవి తన ఆశయాలను అన్యాపదేశంగా వ్రాసే పద్యాలలో కూడా వెలువరించడం ప్రారంభించినాడు.

"ఏదేశ మేగినా ఎందు కాలిడిన
ఏపీఠ మెక్కినా యెవ రెదు రయిన
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలుపరా నీజాతినిండుగర్వమ్ము
లేదురా యిటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి ధీరు లింకెందు!

*　　*　　*

అవమాన మేలరా అనుమాన మేల
భరతపుత్త్రుడ నంచు భక్తితో బలుక !"

సన్నగిలిన దేశభక్తిని పునరుద్ధరింపదలచి, ఉత్తేజకరములైన రచనలతో తెలుగువాని మాంద్యాన్ని పారదోలడానికి కవులు పూనుకున్నారు.

పూర్వపు ఔన్నత్యాన్ని, నాగరికతా వైభవాన్ని, చిత్రకళా వైదగ్ధ్యాన్ని చూడవలయు ననే కాంక్ష కవికి కల్గినది. స్వయ ప్రయాణలకు జరుగకుండా వరంగలు, హంపి, కొండపల్లి వంటి ప్రాచీన శిల్పాన్ని ప్రకటించే ప్రసిద్ధ స్థలాలకు వెళ్లి

"తెలుగుగుంబౌసకు వన్నె దెచ్చిన జగ
ద్వీరుండు మా కృష్ణరా

యలు గట్టించిన వజ్రదుర్గముల, శు
ద్ధాంతప్రదేశంబులన్
దలక్రింపై తప మాచరించెడిని, సం
తానార్థమై, గబ్బి గ
బ్బిలపుంగుబ్బెత లక్కటా! మొయిలు గ
ప్పెం బూర్వమర్యాదలన్."

అని కంట తడిపెట్టుకొన్నారు.

"తెలిరాత్రుల్ తెలవార వచ్చరపడం
తిన్ దిద్ది, తీయా సోగక
న్నుల వజ్జన్ నిను నీవు దిద్దుకొని, సం
తోషించుచున్నాడవా?
భళిరే! శిల్పి! జగంబులోన విరజీ
వత్వంబు సృష్టించుకో
గల నీ కెవ్వడు సాటివచ్చును, నమ
స్కారంబు నీప్రజ్ఞకున్."

అని ప్రాచీన ఔన్నత్యాన్ని గాంచి దిగ్భ్రమ చెందినాడు.

"ఆ చాళుక్యనృపాల రత్నములు వి
ద్యున్మంది, శ్రీకాకతి
తిమ్మాచక్రేశుల లాలనల్ వడసి, కృ
ష్ణప్రాజ్య సామ్రాజ్య శ్రీ
శీచంద్రజయకన్యతో సరసగో
ష్ఠిన్ ప్రొద్దుపోబుచ్చు నీ
ప్రాచీనాభ్యుదయమ్ము నెన్నెదరు గ
ర్వస్ఫూర్తి తల్లీ! సుతుల్."

అని ప్రశంసజరుపుతూ, తెనుగువాని ప్రాచీన రాజకీయ వ్యవహారాలను తెలిసికొనవలెననే ఉత్కంఠను పాఠకవర్గంలో కలిగించి, తెనుగుజాతికి నేటికవి మహోపకారం గావించినాడు. ఎంత మాత్రం ఉత్ప్రేక్షించకుండా, స్వభావసిద్ధంగాను, ఉత్తేజకరంగాను, కరతలామలకంగాను ఏ యుగంలోను దేశసౌభాగ్యాన్ని, శిల్పసంపదను ఈరీతిగా తెలుగుకవులు వర్ణించియుండలేరు.

ప్రేమతత్త్వాన్ని ఈనవయుగంలో కవులు క్రొత్తవిధంగా వర్ణించినారు. ప్రేయసిని ఒక పవిత్రప్రణయమూర్తిగా నిర్ణయించుకొని, లలితములైన భావాలతో వ్రాసిన చక్కని పద్యాలు నవ్యాంధ్ర వాఙ్మయంలో వెలసినవి. భగవంతుని సృష్టిలో ప్రతివిషయంలోను ప్రేమ నిలిచియున్నదనియు, సృష్టి అంతా ప్రేమమయ మనియు, విశాల హృదయంతో మానవుడు లోకాన్ని ప్రేమించవలె ననియు, ప్రేమకంటె అమూల్యమైనది లోకంలో వేరే లే దనియు కవులు నిదర్శనపూర్వకంగా ఈ యుగంలో ఎలుగెత్తి చెప్పినారు.

"చెట్టునకు మొగ్గదొడిగెడు చేష్ట గలదు,
కోరకమునకు వికసించుగుణము గలదు,
విరికి వలపుల వెదజల్లు విద్య కలదు,
దేనికొఱ కివి యంతయు దేనికొరకు?
ప్రేమకొరకు, ప్రేమకొరకు, ప్రేమకొరకు."

ప్రకృతిలోగూడా ప్రేమ సాకారపరచుకొని ప్రతివిషయం జరుగుతున్నదనియు, ఏదో ఒక అవిదితము, అసమానము నయిన సంబంధముండటంచేతనే ప్రకృతిలోకూడా ఒక వస్తువుపై వేరొకటి ఆధారపడియుండటం జరుగుతున్నదనియు కవి నిశ్చయించగలిగినాడు.

ప్రేమలేని జీవితము వ్యర్థము. ప్రేమరుచి ఎరుగని మానవుడు ధనవంతుడైనా లాభంలేదు. అందులకే

"ప్రేమకంటె ఎక్కు-
వేముందిరా, ఎల్ల
కామ్యపదవుల కన్న
ప్రేమ యెక్కు-వరా!
ప్రేమించు సుఖముకై!
ప్రేమించు ముక్తికై!
ప్రేమించు ప్రేమకై!
ఏమింక వలెనురా?
ఎద మెత్తనౌటకై
సాద గుందరా, అంత
మదిగల అహా మెల్ల
వదలిపోవునురా!"

అని కవి ప్రశంసించి, ప్రేమవలన మానవజీవితం పవిత్రమైన దౌతుం దని తెలుపుతున్నాడు. మోడైపోయిన ప్రతిజీవితానికి ప్రేమ వసంతోదయమువంటి దనియు, కేవలము బాహ్యవస్తువులను, బాహ్యసౌందర్యాన్ని అసభ్యంగా వర్ణించినంతమాత్రంలో ప్రేమతత్వం వెల్లడి అవుతుందని తలచడం పొరపాటనియు, పవిత్రాశయాలను ఉచితమైన భాషతో, భావాలతో వెలువరించవలసియుంటుందనియు నేటికవులు నిర్ణయించుకున్నారు.

"ప్రేమమధుపూర్ణమైన నాహృదయపాత్ర
నీ దినము నీపెదవుల కందింతు ననెడు
నాసలో గన్నువిచ్చితి నమృతసరసి

ప్రాతరున్మిషిత మైన్న పద్మమట్లు
ఆ త్రిలోకైకజనని పాదాబ్జ సవిధ
భూమి నిమీలిత నేత్రవై మోకరిల్లి
నీవు పూజాసుమమ్మవైనావు, హృదయ
కర్ణికామూలమున భక్తి కందళించి
అడరు పారవశ్యమ్మున తోడిమయూడి
నేను పూవునై పడితిని నీదుచెంత
జంటపూవుల యమృత నిశ్వాస సౌర
భముల రోదసి శుక్రవారము ధ్వనించె!"

ఈ పైగీతంలో ఎంతటి ఉన్నతాశయాలు మృదువైన భావాలతో అన్యోన్య ప్రేమను విశదపరుస్తూ ప్రదర్శింపబడినవో, చూడండి.

"……………………………తా నొక్క చే
తనకంఠంబును గౌగలించి, యొకచే
తన్ గడ్డమున్ బట్టి, చె
క్కున జెక్కానుచు నొక్క చన్నొన యుర
కోణంబుతో రాయగన్."

మొదలగు వర్ణనల మూలంగా నాయికానాయకుల సాంద్రానురాగం విశద మౌతుందని పూర్వకవులవలె నేటివారు తలచియుండలేరు. ఇట్టి వర్ణనలు నేటిరచనలలో కానరావు. ఆరాధింప యోగ్యమైన పవిత్ర ప్రణయమూర్తిగానే పెక్కుచోట్ల ప్రేయసిని నవ్యాంధ్రసాహిత్య నిర్మాతలు నిర్ణయించినారు. విరహాన్ని కూడా నవయుగంలో కవులు క్రొత్తరీతిని వర్ణించినారు. చంద్రదూషణ, తామరాకు వీవనలు, పన్నీట జలకమాడుట మొదలైనవి లేవు. మన ప్రస్తుత మర్యాదలకు విరుద్ధంగాకాకుండా ప్రతివారి మనస్సును ఆకట్టేవిధంగా ఈలాంటి ఘట్టాలను రసవంతంగా నిర్వహించినారు. —సమయమునకు ఇంటికి తిరిగిరాని మగనిని తలచి జకచిరంటి ఏవిధంగా తనవిరహాన్ని వెల్లడించుతున్నదో, ఎంత స్వభావయుక్తంగా కవి ఈక్రింది గేయంలో చిత్రించినాడో, తిలకించండి:

"దూరాన నారాజు కే రాయి జైనో,
ఈరోజు నారాత లే రాలపాలో?
సీమ సిటు కనగానె
సెదిరిపోతది మనసు
కాకమ్మ సేతైన
కబు రంప డారాజు!
దూరాన నారాజు కేరాయి జైనో,
ఈరోజు నారాత లేరాలపాలో?

కళ్ల కేటో మబ్బు
గమ్మిన ట్టుంటాది
నిదరల్లె నావొల్లు
నీరసిస్తున్నాది
దూరాన నారాజు కేరాయి జైనో,
ఈరోజు నారాత లేరాలపాలో?

ఆవు లంబా యంట
అడలిపోతుండాయి
గుండెల్లో వుండుండి
గుబులు బిగు లొత్తాది!
దూరాన నారాజు కేరాయి జైనో,
ఈరోజు నారాత లేరాలపాలో?

తులిసెమ్మ వోరిగింది
తొలిపూస పెరిగింది
మనసులో నాబొమ్మ
మసకమసకేసింది
దూరాన నారాజు కేరాయి జైనో,
ఈరోజు నారాత లేరాలపాలో?"

ప్రతివారూ ఆ పల్లెటూరి పడుచుయొక్క నిర్మలమైన ప్రేమను సత్కరించి సంతోషింపకపోతారా? ఇంకొకొంచెం సంపన్నమైన కుటుంబములో పుట్టిన శ్రీరాక విదువరాలియొక్క విరహధరాన్ని నేటికవి ఎంతసహజంగా ప్రదర్శించుతున్నాడో, చిత్తగించండి:

"హేమపాత్రల జందన మెండిపోయె
ద్వారములు వాయుచున్నవి హారములను
సానలం దింకె స్నానకషాయగంధ
మబల, యెవనికోసము సగ మయి కృశింతు
చెక్కు చెదరని పాపట చిక్కుపడియె
వేణిబంధము శిథిలమై పిరుదులందె
కరగి చెరగిన తిలకరేఖలను దుడువ
పతివ, యెవ డాహరించె నీ యార్ద్రహృదిని.
పాలుపొంగినగతి పొంగు ప్రణయరక్తి
నాపుకొనలేని పడుచుప్రాయంబుతోడ
నమ్మి యెవనికి నీ మన మమ్మికొంటి
పువిద, యీమేఘమూనసవోదయముల."

అపహాస్యమైన ఆరాటం, ఆ ఆరాటాన్ని అణచివేయడానికి సైతోపచారాలు నేటి విరహవర్ణనలో కానరావడం లేదు.

"అనుపమ ప్రణయాతిథేయమ్ముతోడ
పారదేరచితి హృదయకవాట మిపుడె,
నీ గృహమె నీవకై సేయ నేగుదెమ్ము
మొయిలు చీకట్లుక్రమ్మకమున్నె నాథ!"

అని నేటివిరహిణి ప్రార్థేయపడుతున్నది కాని దేహసంబంధమైన బాధలను వ్యక్తీకరించడం లేదు.

"కాలసర్పము వేరు! పూమాల వేరు!
మృత్యువక్త్రము వేరు! యామినులు వేరు!
జ్వలితదావాగ్ని వేరు! భాస్కరుడు వేరు!
మలినకామమ్ము వేరు! ప్రేమమ్ము వేరు!"

అని ప్రేమతత్త్వాన్ని గ్రహించి, ప్రస్తుతసంప్రదాయాలకు అనుగుణంగా నేటికవి తన కలాన్ని నడిపినాడు.

వ్రాయబడే గ్రంథాలలో కవియొక్క ఆశయాలు కొంతవరకైనా ప్రతిబింబించడం చాలా అవసరము. ఆత్మస్వాతంత్ర్యాన్ని చంపుకుని, తనకు ఇష్టము కాకపోయినా ఏ కృతిభర్తనో సంతోషింపజేయటానికి వ్రాసిన పద్యాలు తాత్కాలికంగా చెవికి ఇంపుగా, సొంపుగా ఉన్నప్పటికిని వానిలో కవిహృదయం లేనందున త్వరలో విస్మృతి వారాశిలో కలసిపోవటం జరుగుతున్నది. తాత్కాలికంగా ఒకరిని అలరించడానికి వ్రాసిన గ్రంథాన్ని 'Book of the hour' (తాత్కాలిక గ్రంథము) అనియు, కవి అనుభవించి హృదయపూర్వకంగా వ్రాసిన గ్రంథాన్ని 'Book of all times' (సార్వకాలిక గ్రంథము) అనియు రస్కిన్ కవి విభాగించినాడు. తానే ఒక విషయాన్ని నిర్ణయించి, తన ఆశయాలకు అనుకూలంగా ఒక కావ్యం వ్రాసి తీసుకొని రమ్మని చందనతాంబూలాలిచ్చే రాజు లేనందున, తన పద్యాలమూలంగా సంఘంలోను, మతంలోను నిలిచియున్న లోపాలను నిర్భయంగా కవి వెలువరించడానికి నేడు అవకాశం లభించినది. ఈ యుగంలో వెలుగుచూచిన చాలా గ్రంథాలలో కవిహృదయం యొక్క ప్రతిబింబము కనబడుతూ ఉన్నది.

"అనుగుందమ్ములు దిక్కుమాలి పురబా
హ్యక్షోణి గారాడ, హె
చ్చిన సౌభాగ్య సువర్ణ మందిర సమా
సీనుండవై హాయిగా
కనుమూయుందగునా పరాకుపడి, యిం
క న్మేలుకొమ్మా! ధరా
జనయిత్రీమణి తమ్ముగుజ్జులకు న్వే
ధ్యాభిక్ష లర్థించెడిన్."

అని అస్పృశ్యతాజాడ్యాన్ని దేశంనుండి పారదోలవలె నని కోరుతున్నాడు. తన ఆశయాలను ఆమోదింపక, తన్ను నిరసించి తన్ను ఆదరింపని లోకాన్ని కవి లక్ష్యపెట్టలేదు.

"నన్ను నిరసించువారి యానందమందు
నాకు భాగమ్ము వల దొక్కనాటికైన,
చీకటులు జీల్చికొని వచ్చు నీ కరాళ
గానరవములనే నా సుఖమ్ము కలదు!

*　　*　　*

మ్రొక్కినకొలంది గాలితో ద్రొక్కుచున్న
యీ కఠినలోక మెల్ల బహిష్కృతమ్ము,
రండు, చిమ్మటలార! ఈ రాత్రివేళ
నావలెనె పాడుకొను మీరె నాకు సఖులు!"

అని నిర్భయంగా లోకముపైపు పెడమొగము త్రిప్పినాడు.

"ఏ కడల మిన్నుమను చుక్కయేని లేని
యీ నభము క్రుంగి కూలిపోవుడివిధాన
కారుమబ్బులె కాదు, చీకటులె గాదు
క్రమ్ముకొననిమ్ము, కరడులు గట్టనిమ్ము,
వలపుతీపి యెరుంగని పట్టెరాతి
గుండెలోకమ్ము నిప్పులు గురియనిమ్ము,
హృదయ మున్నంతవరకు, నా ప్రేమకాంత
బ్రతికియున్నంతవర కేడ్చి బ్రదుకుచుందు!
ఏ వెలుగు నన్ను తనదరి కీడ్చుకొనునో!
ఏ తలపు దారి సూపునో!"

అని తనహృదయంలోని అశాంతిని వెలువరించినాడు. ఈ కావ్యంలో కవిహృదయం నిర్మలంగా, నిశ్చలంగా ప్రతిబింబించినందువలననే అంత రసవంతంగా ఉన్నది. ఈ విధంగా హృదయాన్ని ప్రస్ఫురించి, సంఘాన్ని పరమ్మతుచేయడానికిని, సోదరమానవులయందు కారుణ్యశక్తిని, అకుంఠితమైన దేశభక్తిని కలిగించడానికి ఎన్నో ఏకాంకనాటకములు, ప్రహసనాలు ఈనవయుగంలో వెలుగుచూచినవి. తాను చెప్పదలచిన విషయాలను సూటిగా నిర్మొగమాటంగా కవి చెప్పివేసినాడు. అద్దములో నీడవలె తన రచనలో తాను ప్రతిబింబించి, ఒక నూతనశకాన్ని తెలుగు వాఙ్మయచరిత్రలో పాదుకొల్పినాడు.

"ఆకలిబాధచే జెమట
లారని గాసికి నోర్చి, ప్రాణముల్
పోకడపెట్టువారి శ్రమ
మున్ రుధిరమ్ము గడించి యీయగా
జేకురిపట్టి యర్థము లి
నీ యని రోయ కెటుల్ భుజింతు వ
న్నా, కృపమాలి, ఘోరకలు
షాక్తత దుష్టములైన భోగముల్?"

అని సిరిగర్వమున కాలముబుచ్చువారిని మందలిస్తూ ఉన్నాడు.
...త్తముమీద అనువాదాల మోజు అంతరించినది; అనుకరణాల ...గం అడుగంటినది; స్వాతంత్ర్యరచన సాగించడానికిని, తనఆశయా ...వెల్లడించి లోకాన్ని దిద్దడానికిని కవికి అవకాశం లభించినది.

ఒకవిషయాన్ని గూర్చి క్లుప్తంగా, దాదాపు నూరుపద్యాలకు ...చకుండా ఒక రసవంతమైన కావ్యాన్ని సృష్టించే పద్ధతి ఈ ...గంలోనే తలచూపినది. ఇష్టదేవతాప్రార్థనలు, కృతిపతివంశా ... కథోపసంహారం, కావ్యోపసంహారం, ఆశ్వాసాంతపద్యాలు ...దలైన పూర్వమర్యాదలు మరుగునచేరినవి. కథావస్తువుకు చెందిన ...యాన్ని ప్రస్తరించే పద్యంతోనే సరాసరి ప్రారంభించడం జరుగు...న్నది. మానవాతీతవిషయాలనుగూర్చి వర్ణనలు కానుపించడం ... మానవుని నిత్యజీవితంలో జరిగేవిషయాలనే తీసుకుని, ఏవిధంగా ...నవుడొక్కొక్కసారి తప్పటడుగులు వేస్తున్నాడో, దానికి నచ్చే ...ంగా, వాని హృదయాన్ని కదిలించే విధంగా, వానిలో పరివర్తన ...గేవిధంగా నేడు కవులు ప్రయత్నిస్తున్నారు.

"భరతజనయిత్రి సుకృతతపఃఫలమ్ము
లన నుదయమైన యువజను లక్కటకట
అధమపౌరుష మనక కన్యల వరింప
శుల్కముల కానజేసెదు శూరు లయిరె!

* * *

పశుసహజమైన పురుషస్వభావ మిటుల
పావనస్త్రీ కళాభాగపదవి నింత
నిరసనోన్మాదదృష్టి గణింపకున్న?
ఋషిమహాదర్శముల నవ్వయింత్రె యిట్లు?

* * *

కన్నియను పెండ్లియాడునో? కన్నెతండ్రి
యర్పణముజేయు శుల్కదివ్యాప్సరసను
పెండ్లియాడునో యకట యీ పెండ్లికొడుకు!
అడుగరే యొక్కరయిన నీయార్యసుతులు!"

అని కట్నములపై కాంక్షగల యువకులను కవి ప్రశ్నిస్తున్నాడు. హృదయంగల ప్రతియువకుడును తన వివాహకాలంలో ఈ సందేశాన్ని మరచిపోగలుగునా? నేటి వాఙ్మయసందేశము అనితరతుల్యమైనదని నిరూపించడానికి ఈ ఒక్కవిషయం చాలదా?

ప్రార్థనపద్యాలలో ఈ నవయుగంలో చాలా మార్పు కనుపించుతున్నది. దశావతారప్రశంస, శతకములు పెందలైనవి మూల చేరినవి. ఏదో ఒక అవతారాన్ని నిర్ణయించుకొని, ఆ అవతారకాలంలో జరుపబడిన పేరుమిగిలిన విషయాలనుగూర్చి పద్యాలు వ్రాస్తూ, ప్రతిపద్యంచివరా ఆ అవతారాన్నిగూర్చి ప్రార్థనజరుపుతూఉన్న పద్ధతి నేడు కానరాదు. ప్రకృతికిని భగవంతునకును గల సన్నిహితసంబంధాన్ని, భగవంతుని లీలావికాసాలు ప్రకృతిలో ప్రతిఫలించే విషయాన్ని నేటి కవులు పూర్తిగా గ్రహించినారు. అందులకే

"ఘనఘనాఘనము చీకటిమేడ వెలిగించు
మెఱపుదివ్వెల నూనె తరుగలేదు,
పవలు రాతిరి తీరుబడి లేక ఘోషించు
తోయధీశుని గొంతు రాయలేదు,
ఇనబాలకుని దినమ్మును గర్భమున బూను
పొడుపుదిక్కనతి కాన్పు లుడుగలేదు,
ఋతురాజు ధారుణీసతికి సొమ్ములు పెట్టి
కులికించుపని మానుకొనగలేదు,
విశ్వవిశ్రాంత చల్లని వీక్షణమున
నేటికిని గెంపుచార గన్పింపలేదు,
మూర్ఖలోకము! దినమెల్ల ముగియలేదు,
దీప మున్నది. హృదయంబు దిద్దుకొనుము"

అని మానవలోకాన్ని కవి హెచ్చరిస్తూ ఉన్నాడు. ఒక విగ్రహాన్ని ఎదురుగా పెట్టుకుని, కండ్లుమూసుకొన్నంతమాత్రంలో భగవంతుడు సంతోషించడు. మానవుని విధ్యుక్తధర్మం వేరే ఉన్నది అని తెలుపుతూ ఈక్రింది గేయ మెంత రసవంతంగాను, ఆలోచన రేపునదిగాను ఉన్నదో, చూడండి:

"ప్రతిమ నొక్కటి మలచినా నది
ప్రతిఫలించిన చంద మంతా
తనివి తీరగ విగ్రహంబు న
లంకరించితిని;

మంచినగలూ, మంచిగంధము,
మంచి మంచి రకాల పూలూ
ప్రతిమ కుంచితి, హృదిని నిల్పితి,
తపము చేసితిని;
ప్రక్కనే పోంచున్న లోకపు
మానిసొక్కడు పెదవి విరిచెను
'ఎందుకో ఈ వ్యర్థ యత్నము
లెందుకో?' అనియెన్.

* * *

శిరము వంచితి, కనులు మూసితి
మౌనము ప్రవహించియుంటిని
ప్రక్క మానిసి పలికె మళ్లీ
ప్రస్ఫుటముగాగన్:
'ఎందుకో ఈ మౌన మూనుట?
ఎందుకో ఈ మాంద్య మంతా?
పోయి సాంఘిక సేవ చేస్తే
పుణ్య ముండునుగా.'"

భగవంతుని పూజ్చి చేసే ప్రతి ఆలోచనా, ఖర్చు పెట్టే ధనం ఎన్నికను రాకుండాపోతే భగవంతుడు సంతోషించడు. దీనులను రక్షించడం, పరులకు సేవచేయటం భగవంతుని అలరించటానికి ముఖ్యమార్గా లని నేడు కవులు వివరించారు.

"కొడుకులు లేనివారలకు
గూరిమిబిడ్డవు, మాతృహీనులౌ
బుడుతల కెల్ల దల్లి వయి
పోషణ సేయుము, 'నా' యనంగ లే
కడలెడు దీనులన్ మనుపు,
మార్తుల కాదరువై భజింపు, మీ
పుడమి దివమ్ము సల్పు మిదె
పో పరమార్థము బొద్ధజాలికిన్."

అని ప్రబోధించివారు. అనుసరింపతగిన నవ్యాంధ్ర వాఙ్మయ సంకేత మిది.

కవులయొక్క దృక్పథంలోను, కూర్పునేర్పులోను ఈవిధంగా మార్పులు వచ్చినవి. తెనుగువారి ఆర్తి చచ్చిపోలేదు, తెనుగుభాషా వాహిని ఇంకా కాలంతోపాటు ప్రవహిస్తూనే ఉన్నది అని సగర్వంగా చెప్పుకొనడానికి ఈమార్పులు, ఈకూర్పులు తోరణగినవిగా ఉన్నవి.

"కృష్ణాతరంగపంక్తిన్ త్రొక్కి త్రుళ్లింత
నాంధ్రనౌకలు నాట్యమాడునాడు,
ఇంటింట దేశిసాహిత్యదీపములతో
నాంధ్రతేజస్సు రాపాడునాడు,
సుకుమారశిల్పవస్తుప్రపంచమునందు
నాంధ్రనైపుణి పంతమాడునాడు,
సమదసేనావ్యూహ జయపతాకలక్రింద
నాంధ్రపౌరుషము చెండాడునాడు
చూచి, సంతోషమున తల లూచి, గర్వ
మూచి ఆంధ్రపుత్రీపుత్రు లందగలరు
శాంతి, నందాక లేదు విశ్రాంతి మనకు
కంకణవిసర్జనల కిది కాల మగునె?"

అను కవిపలుకులకు చెవియొగ్గి, ఆంధ్రభాషోద్ధరణమునకును, ఆంధ్రరాష్ట్రోద్యమానికిని తెలుగువారు నడుములు బిగించి ముందడుగు వేయుదురుగాక.



చంద్రవదన-మొహియార్*

ఒక చారిత్రక చిత్రణ :::

::: శ్రీ ఆదిభట్ల రామమూర్తి

అవియ మొహరము పండుగయందు ద్విజాలు - పీర్ల పంజాల భక్తి నిల్పెడు దినాలు:
అవియ లాడీల ధరియించి హైందవాళి - ఏకమత్యమ్ము తెలుపు దివ్యక్షణాలు.

*   *   *   *   *

వాడు నృసింహదేవుతిరునాళ్లట, సందడిగా జనమ్ము చే
రాడను జూచినం గదిరిపట్టణవీథులు నిండినారు; మా
ర్వాడి తురుష్కవర్తకులు వందలు వేలును నుప్పతెప్ప లా
యేడు బజారు చెట్టికి సమృద్ధముగా నవరత్నరాసులన్.

కేలను రాగిరింగులు, విశీర్ణములై జడగట్టు కేశముల్,
వ్రాలిన ప్రాయముల్, ముదురు బారిన దీర్ఘపు వింతవింత దా
డీలును, క్రొత్తక్రొత్త పగిడీలును, జానువులంటు గావి పొ
ల్లాలును గల్గి జోహుకుములం బచరించి 'సలాము' సేయు లుం
గీల మహమ్మదీయుల భక్తుల మక్కాము లొనర్చి రాయెడన్.

అల్లదె, దగ్గరగా నదె - పల్లెంగల రాజవీథిభవనములందున్
చెల్లంబయి, సుందరమయి - కళ్లంబడు భూరిమహాలు గంటే! అచటన్.—

సన్నని పాలపొంగులై బసందుగ దోచెడు క్షీరఫేనపుం
జిన్నెలు దోగు క్రొందళుకు జీవము దాల్చెనొ, తేనెలూరికే
క న్నవనీతకోమల వికాసతనుద్యుతి రూపు పెంచెనో,
వెన్నెలవాకలం దొరలు ప్రేమతరంగము గడ్డకట్టెనో.

నా యలరున్ సొబంగులలనామణి, జవ్వని, షేకశాద్దపుం
ప్రాయపుటుక్కు మొగ్గ పురపాలకు దేవిడిముందు గాపలా
గాయుచునున్న సైనికుల కొజ్జ అదే, యొనరించె: "ప్రాణసఖం
బో యెద నిప్పుడే సకలముం జరిగూర్చెడి సత్వరంబునన్"

*   *   *   *   *

---

* ఈపేరుగల గోరీనిగూర్చిన ఐతిహ్యానికి ఇది పద్యరూపం. అనంతపురమండలంలోని 'కదిరి' పట్టణపరిసరాల్లో ఈగోరీ నేటికిని కనబడుతుంది. పదిహేనవ శతాబ్దంలో, దేవరాయలకాలంనుండీ హిందూమహమ్మదీయ సామరస్యప్రయత్నాలు ప్రాచుర్యం వహించాయనుటకు ఇదే ప్రబలనిదర్శనం. ప్రచారంలో ఉండే ముఖ్యమైన ఐతిహ్యవస్తువుకు ప్రమాదం లేకుండా, మధ్యను కనబడే చిన్న కథాకల్పనమాత్రము కేవలం ఐచ్ఛికము.

ప్రక్క పేజీ చూడుడు

వాలుంజూపు మెఱుంగుటన్నె సెగ గోవాశైల్ల నీరార్గఁగ, బు
హ్వాలంభూషితమైన వాలుజడ సర్వప్రాంతి దీపింప, అం
దాలందోగడు క్రొమ్మెఱుంగుపస విన్యాణంబు లేజవ్వన
శ్రీలం దొండొంటుకొన మన్మథజయశ్రీ చావుటా యొత్తఁగన్.

పడువార్యన్నెపసిండిఛాయ మసలావణ్యంబు మిట్టాడ, నె
న్నడుటం దిద్దిన చాదుబొట్టు బలువిందు జ్యోయఁగాఁ, జాఁపుటు
మ్మెదబారుల్ కుచపుష్పగుచ్ఛములకై మేలంబులాడన్ శుభా
స్పదమా నగ్గజయాన కంకణకణక్వాణానువాదంబులన్.

పూతపసిండిపళ్లెయరముంగొని, పువ్వుఁ, లకోకల్, సుహ్వా
ద్యాభతములైన తీయఫలముల్, బసుపున్, విడియమ్ము వెట్టి, హ్వా
జ్ఞాలుని దంతిపోలెఁ, బరిచారికలెల్లను వెంట రా, జగ
న్మాత భవానిఁ గొల్వఁ బయనంబయె మంగళవాద్యఘోషలన్.

* * * * *

ఈమె ఎవరోయి...సరిసరి-సత్కృతికివచ్చె: - ప్రాంతకేసపల్లెపట్టణప్రాంతమందు
ఘనత గాంచిన రంగనాయనికుమార్తె: - చంద్రవదనాఖ్య, విశ్రుతసార్థకాఖ్య.

౨

వేలఁ బసిండిసొల్లునగిషీలజరీల్ మిఱుమిట్లు గొల్పఁ, గెం
గేలున వజ్రపుంగ్రము జిగేలునఁ గాంతుల నీన, నాలుబ
స్తాలను రత్నరాసు లమితంబుగఁ బోసి, నృసింహసాలయ
శ్రీలను వన్నెకెక్కు నగరీకులదేవత ఆలయంపు వెం
పాలఁ దురమ్ముఁ ద్రొక్కుచు బజారున నెట్టెను, దేశ మెద్దియో?

పచ్చని మైచాయయు, గో - ర్వెచ్చని మీఁగడల ఠీవిఁ జెక్కెడు వదన
మ్మచ్చున లాగు శలాకల - మచ్చుం జిగి పారశీక మనఁదగియుండెన్.

అదిగో! చూడు మదేలకో అచటి శేహారిం బ్రకాశించుచు
న్నది, రంగాధిపుపుత్రిదాసి వినతాంబై యుండవచ్చున్, సరే,
మృదులంబైన సుసంసుపల్ వినఁగనయ్యెన్, గొంచెమాలింపు, మె
య్యదియో మంత్రరహస్య మయ్యదియ కాన్నై యుండనోపుం జుమీ.

"మొహియార్! వచ్చుచునుండె నీ వలచు సమ్మోహస్వరూపమ్ము; ప్ర
త్యహము న్నాచెలి నీదు రూప గుణవర్ణాలిన్ బ్రకాశించి, తం
ద్రిహయూనుం దలపోసి చెగ్గడిలుచుండెన్ సాహసింపంగఁ దా,
నహహా! ఎట్టి యుపాయముం గలిసిరా దాయె న్నిమున్ గూర్పఁగన్.

కలనైనన్ విడు మా మెకేర్లానెడు కాంక్షాకారణోద్యోగ; మెం
దుల కీ ఆశలు? అందరాని ఫలముల్ గోయంగఁ గార్యంబె అ

ప్రక్క పేజీ చూడుడు

ష్ఠులు పోఁదగ ? మతకర్ములట దినదిన క్రోధంబులం బెంచు హిం
దుల ఇస్లాముల సామరస్యము లభించుం బందు గద్దో కదా !
వెలుఁగుం జీకటి వియ్యమందును వణిక్స్వరా, మెహిూయార్వరా !

మది మానంగదరన్న ! సాహసమున నా్క సెక్కెలిం బట్టినన్
బ్రతుకే మోసము వచ్చు ! ఆపయిని జీవాల్ వాయు వాతన్వి, దుః
ఖితమంతా కడగండ్లఁ బోవిడిచి 'నిక్కా' చేసుకోరాద మీ
మరపుంగొంటెనురాకబోఁడి జోకలెక్ ? మల్లింపు మీ మోహముల్,
బ్రతికన్నన్ బలుపాప; పాపలుకులం బాటింపవే మెహిూయార్ !"

*   *   *   *   *

వినతాంబపలుకులకు మన - మున సైరొమ్ము బలికెప్రక్ వలపుమ క్రొ
న్నవలను విరియఁజు సాహస - మునఁబండిన హృత్ప్రికోపమున మెహిూయ రనెన్:

"ప్రణయకీలల ఉడికిపోయిన హృదంత - రాళమున శాంతినిల్చునె ? రత్నమాల,
ఇదిగొ, నీ కంఠసీమ భూషించువాఁడ - శ్రేయసిం జూపు మరి పరిమేలు నాకు.

చిసవుంగొఁగెటఁ జేర్చి, ఆమెవలపుంచీయావమునుం గ్రోలి, నె
మ్మొగపుంజందురుజేఁతబన్నెలల దోయీచు ల్గరంగించి, శ్రే
మగతిం జిల్లులుపడ్డ నాహృదయపద్మమ్ముల్ పవాళమ్ముగాఁ
దొఁగోతుర్; బ్రణయార్ద్రగీతికల వాటింపన్ వలన్గాక జీ
ర్ణగళాపస్రుకులీను మావలపుచిణాతంత్రులన్ భగ్నమం
దఁగఁజేతుర్; వినతాంబ ! చంద్రవదనన్ గన్పింపఁజేయంగదే !"

సాహసంబును వారింప శక్తిలేక - నీర్లు నములుచు వినతాంబ నిల్చె; చూడు,
మదిగో! తుద కేదియో రహస్యమును దెల్పి - ఆమె అంతర్హితంబయ్యె, నంతలోన . . . .

రాగికమండలమ్మును, కిరంబునకుం బలితోలు, చెక్రముల్,
పీఁగిరచుంగవాల, నిడు పొగపుంబట్టెలు, భూతిపుండ్రముల్
రోగపుదండముల్, జపపరోల్లసనంబును గల్గి, అమ్మినా
ల్గోగిలిలోని మంటపుటరుంగునఁ బీఠముపైచె, క్రొత్తసై
రాగి యొకండు వింతరుదురాక్షమాలలఁ జేతఁ ద్రిప్పుచున్.

3

అదిగో ! పూజ సమాప్తమయ్యె నను ఘంటారావముల్ ; జాడు, మ
ల్లదె ! రంగాధిపపుత్రి ; మేలిముసు గల్లాడంగ ఆవచ్చు చు
న్నది దాసీ వినతాంబ ; ఇర్వురకు నెక్కాన్ బారులై తీర్చునై
న్యదళంబుల్, అదె ! వచ్చినా రచటె సింహద్వారమధ్యంబునన్.

ఎంకులకో జపధారియు - సందడిగాఁ జంద్రవదనపరసఁ జనె; సుం
డెం దీసిన సాహస ! మా - సుందరిఁ గౌఁగింట మాయజోగి గరంచెన్ !!

ప్రక్క పేజీ చూడుడు

వెఱఁబట్టు సాహసమువలన - వెలుఁగంది, యొకింత దేరి, ప్రియుఁడని యెద న
క్కఱలిక్కలై నతిమణి - కరిగెన్ మొహియారుని విసవుఁ గౌఁగిలిలోనన్.

*　　*　　*　　*　　*

జాతిమతభేద కులపిశాచమ్ములార! - ప్రేమహృదయాలఁ గబళింప రేగినార!
వలపుఁదీపిరొమ్ముంగని వట్టిజాతి - గుండెలో కమ్ము! నిప్పులు గురియుచుండె!!!

*　　*　　*　　*　　*

అదిగో! ఆ బాకు మొన మొహియారునిపక్ష - ముం జీకల్చుచు హృద్భాండమ్ముం బగిల్చి,
త్రావుచున్నది వెచ్చని రక్తధార; - అరరె, మరియొక బల్లె! మహ్హా!! విశీర్ణ
భగ్నహృదయం బదో తొట్రుపాటుతోడ - ఎలుగు రాపడ నిట్లు పలవించుచుండె:

"ప్రేయసీ! చంద్రవదన! సత్ప్రేమవహ్ని - కరిగిపోయిన హృచ్ఛిలాకలు ద్రవించి,
శాంతి శీతల వాయు సంస్పర్శ గడ్డ- కట్టకమ్మ పుటడియాస కాలిపోవ,
రాగ మెలుఁగని వికృతస్వరమ్ముతోడ - భావిప్రేమైకజీవుల ప్రణయగీతి
కమ్మ మృతరోదనమ్మున శ్రుతిలయించి - పాడుకొందుము నావల్ల కాదుమందు;

అమలప్రేమార్ద్ర శ్రేష్ఠ సింహాసనమ్ము - అధివసించి వియోగరాజ్యమ్ము నేల,
గాఢకుటిలనైరాశ్యాంధకారమందు - మృత్యుదేవతకోరల మెఱుగుదీప్తి
దారిఁ జూప, శ్మశానసౌధమ్ముఁ జేర - నరుగుచుంటిని బాష్పకణాళితోడ;

నీపవిత్ర పదాబ్జాల నిలుచు నిండు - చవవు నోసగితి వంతియేచాలు; ఈ వి
షాదయాత్రా విరాగమ్ము సమసిపోవ - ప్రేమనిండిన ఈశ్వర్యరీగభీర
గర్భకుహరాల నే నిల్లు కట్టుకొందు;

నమ్ము ప్రేయసి నా శ్మశానమ్ము కడకు; - ప్రణయనిశ్వాసభర మంటేవలకు బోసి
ప్రేమసమ్యాసిపై నే నిరీక్షసేతు - నీకొఱకు; నీవు నాదుసన్నిధికి రాఁగ
భౌతికశ్రసపువాల నిప్పులను ద్రేల్చి - బ్రతుకఁగంచాన వలపునివాళి యిత్తు;

శిశిలపై మాంసఖండాలు చివికిపోవ - కొయ్యబారిన ఎముకలగూడుఁ జేరి
కొలుకు నుంకించు చెదపురుగులకుఁ దేను - నీయఁ గన్నీళ్లఁ జాగ్రత చేయుచుంటి;
గుండె చమురున భగభగమండిపోవు - ప్రేమదీపికరుచు లంతరించి, అరి
అంతులేనట్టి భయదశూన్యాలయంపు - గహ్వరమ్మునఁ గారుచీఁకట్లఁ గలియ,
వలపుటంధుండనై ప్రేమభరముతోడ - క్రుంగి, గిజగిజ కొట్టుకొనుచుమంటి;

అదె! శ్మశాన ప్రశస్తివాక్యమ్ము; అదె, అ - కాలమృత్యువు దంష్ట్రికరాళగర్త,
అదిగో! నాహృత్తశిథిలాధ్యాయమందు - అంతిమాక్షరవికట విన్యాసదీప్తి;
ఏది . . కడసారి . . . . కౌఁ . . గి . . లి . . . ."

౪

వాకిలి కడ్డముగా భయ - దాకృతిని బరున్న శవము నవలకుఁ ద్రోయం
గా కల సైనికవీరులు - చే కదపిరి! కదల, దేమి చిత్రంబో కదా!

(ప్రక్క పేజీ చూడుడు)


తలవంచ్రుకొనియుండఁగ - దలని శవమ్ముఁ గవల్చి దశహాకుల ని
ష్ఫలయత్నమ్మఁ గని, కనుపా - పల వీక్షిమ్ముంగఁ జంద్రవదన పఠించెన్.

"ప్రేమజీవులఁ బొట్టను బెట్టుకొన్న - పాడులోకమ్మ! నాదు నిర్భాగ్యజీవము
నెలిగాయరునిజీవముఁ గట్టి పోనుకొమ్మ - తృప్తియగు" నంచు వాడికత్తిక హృదయ
మున బలిమి గ్రుచ్చుకొని, జీవములను బాసి - ధరణిఁ ద్రాలెను చంద్రవదన విరాన!!!

కొండఘోరంపుజీవములు తెంచుకొచు - తేలుదింకను హృత్పీఠమలో లయించి
హైందవ మహమ్మదీయసఖ్యంబు నిగ్ర - హమ్ముఁ బొల్చిన ప్రేమజీవాళిఁ తేరు
లార, సంఘమ్మ, క్షత్రభేదాగ్రవులను - మట్టిగల్పు పవిత్రసమాధి అదిగొ!

అదె, అవగ్రహిత హిందూ మహమ్మదీయ - జన సుహృద్భక్తి కరుకుఁగట్టిన మహిమ!
అదియ 'కాఫరు' 'శురక' దహ్యులహోరు - బొందలై సఖ్య మేర్పడ్డ పుణ్యభూమి!

అకట ధూళిరేణువుల సైకత్వము కొంచును ప్రేమగీతికా
నీకసుహృత్కుటాలి ; కయునించె పవిత్రహృదంతరాళ హిం
దూకలహావిధూతికలతో గ్రుతిఁ గల్పు మహమ్మదీయ కొ
ల్లాకృతి ; నియ్యమంచు పరస్పర ఘూర్ణ పవిత్రభరోసయల్.



ధార్మికతవల్ల మనదేశానికి వచ్చిన హాని

> నానావిధ వాఙ్మయాలయొక్క అనువాదాలు మనకు అమితంగా, అత్యవసరంగా కావలసి ఉన్నాయి

> అట్లని తెలుగులో ఇప్పుడు జరుగుతున్నరీతి అత్యాచారం చేయడంమాత్రం సహింపరానిది

హిందూస్థానం ధర్మప్రధానదేశ మంటారు. ఇదే మన కొంపదీసింది. అతిగా బెల్లం తింటే ఏమవుతుంది? మధుమేహ మేగా! అలాగే మితిమించిన ధార్మికతవల్ల మన దేశానికి గొప్ప హాని కలిగింది. ఆర్యులు మధ్యఏషియానుంచి వచ్చినప్పుడు అనార్యులతో సంఘర్షణ జరిగినప్పటికీ భారత ప్రాకృతికసమృద్ధి ఇహాన్ని మరిపించింది. మనగడ్డ ప్రాకృతంగా పాడిపంటలకు, ప్రకృతిసౌందర్యానికి 'కన్నగర్భ' అయినందువల్ల కడుపులో ఎలుకలు పరుగెత్తేవి కావు, చూడ్డానికి కన్నులపండువగా వుండేవి. అందుచే మన పూర్వులు నిశ్చింతగా 'పరం' ను గురించి ఆలోచిస్తుండే వారు. ప్రకృతి తెరవును గురించి ఆలోచించే అవసరమే వారికి కలుగలేదు. కాని ఇదే రాను రాను రూఢిలోకి దిగింది. 'పరం' అనే మరీచిక వేపుకు పరుగెత్తడం మొదలెట్టారు. రూఢిబలిసింది. విచిత్రమయిన సాంఘికవర్గాలు, నియమాలు ఏర్పడ్డాయి. జ్ఞానసంపత్తి (విద్య) ఒకేవర్గవిశేషానికి వంశానుక్రమపితృసంపత్తిగా మారింది. అందువల్ల సంఘంలో యీ వర్గానికి ప్రథమగౌరవస్థానం లభించింది. బుద్ధిజీవులకు గౌరవం లభించడం స్వాభావికమేగా! కాని యీ వర్గవిశేషంలో అకర్మణ్యత హెచ్చింది. 'పరం' మనే ఎండమావుల్ని చూస్తుండడంవల్ల కళ్లుంటూకూడా గుడ్డివాళ్లయ్యారు. మూఢత్వం పెరిగింది. ఇటు చూడండి: దేశం ఇంగ్లీషువాళ్ల అధీనమయిపోయింది (పోగొందినాము). పరతంత్రశృంఖలాలు తయారవుతూ ఒక్కొక్క భారతీయుడికీ తగిలించబడుతున్నాయి. కాని మన శిక్షిత



'విషనాగు'

సమాజం కళ్లు తెరవనేలేదు! వాళ్ళింకా తమ పవిత్రప్రపంచంలోనే వున్నారు. సర్ విలియమ్ జోన్స్(Sir William Jones) సంస్కృతం చదువుకొందామంటే పాపం పేగులు తెగినయ్యి. సంస్కృతం నేర్పే పండితుడే దొరకలేదు. పండితులందరూ 'బాయికాటు' చేశారట![1] ఎంత [illegible]! దేశం పరాధీనమవనీకాని జనోచ్యుతమయిన మృతభాష పరదేశీయులు నేర్చుకొంటే మయిలపడి పోతుందట! చూచారా, మన శిక్షితసమాజంమూఢత! నేటి మన పరాధీనతకు కారణం సంఘానికి ఆయువుపట్టుఅయిన వర్గవిశేషం శిక్షితసమాజమే కాని వేరులేని కర్షకకార్మికసమాజం కాజాలదు. అస్తు.

ఇతిహాసకాలం మన అనుభవప్రపంచానికి దూరమై, కేవల శబ్దప్రపంచంలోనే విరాజిల్లుతూ వున్నందువల్ల గొప్పగా కనిపించవచ్చు. అసలు 'శబ్దం'లో అతులితసౌందర్యం వుంది. అందుచే మనపూర్వులచరిత్ర మనకు గొప్పగానూ, సౌందర్యంగానూ కనిపిస్తుంది. పూర్వులసౌన్నత్యంమీద, చరిత్రమీద గర్వపడడం ప్రతిజాతికీ సహజమే! కాని మనం కేవలం పూర్వుల యితిహాసంమీద గర్వపడక అనుభవ దృక్కులతో ప్రాచీన యితిహాసాన్ని పరిశీలిస్తే మనపతనం ([illegible]కంగా కాదు) క్రమక్రమాగతంగా ఎలా అవుతూ వచ్చిందీ కనిపించగలదు. దీనివల్ల మనవున్నతికి గూడ ముందుదోవ కనిపించుతుంది. మన పూర్వుల యితిహాస గౌరవ ప్రతిష్ఠలమీద నాకూ గర్వమే! ప్రపంచానికి సభ్యతను ప్రదానంచేసింది మనపూర్వులేగదా అని నా ఒళ్లు కూడ ఒక్కొక్కప్పుడు పులకరిస్తూంటుంది. కాని మన కీ శనిగ్రహం

---

1. ఆఖరుకి ఒక పండితవరుడు దొరికాడట—ఎన్నో షరతులమీద: అధ్యాపనమందిరం (రూము) వేరుగా వుండాలి; గురువుగారు వచ్చేటప్పటికి రూము నీళ్లతో కడిగి శుచిచేయాలి; శిష్యుడు (విలియమ్) చదువుకోను వచ్చేప్పుడు కట్టుపంచె-కచ్చెవాటు వేసుకరావాలి; ఆది నిబంధనలు. పాపం, పూజ్య విలియమ్‌కు చెప్పరానికష్టాలు పడవలసివచ్చింది సంస్కృతం చదవడానికి! ఆఖరికి ఎలాగైతేనేం, కర్మణ్యబుద్ధివల్ల సంస్కృతాన్ని సాధించారు. వీరి ప్రయత్నంవల్లనే 'బెంగాల్ ఏషియాటిక్ సొసయిటీ' (కలకత్తాలో), స్థాపించబడింది. అప్పటినుంచే మన ప్రాచీనసాహిత్యం — ఇతిహాసం వెలుగులోకి వచ్చాయి.

...స్వతంపడితే నేటి కిట్టిదశకు వచ్చావెూ తెలుసుకోవద్దూ? ఇంగ్లీషు
...ళ్లు పాదం పెట్టడంతోనే మన కీగతి కలుగలేదుగదా? అదివర
...కన్నో బలహీనతలు మనజాతిలో వుండబట్టే అది యింతత్వరగా
...తికిపోయింది!

ప్రథమం ప్రాచీనార్యులు అకర్మణ్యులు గారు. జీవితసమస్యను
...రు మరిచిపోలేదు. వైదికవాఙ్మయంలో అణువు అణువునందును
...తి కర్మణ్యత, సూక్ష్మబుద్ధి కనిపిస్తోంది. ఇతిహాసాన్ని తిరగెయ్యండి:
...ముద్రంమీద విదేశయాత్రలు — వర్తకవ్యాపారం — వలసరాజ్య
...స్థాపనలు ఇత్యాదులు మనపూర్వుల కర్మణ్యతను, శ్రమశీలత్వాన్ని
...శోధిస్తున్నాయి. వైదికదర్శనవాఙ్మయాన్ని మించింది యింతవరకు
ప్రపంచంలో మరొకటి లేదు. నేటి వైజ్ఞానికయుగంలోకూడ పాణి
...య వ్యాకరణాన్ని భాషావైజ్ఞానికులు(**Philologists**) ప్రబల ప్రమా
...ంగా తీసుకొంటున్నారు. పక్కా సనాతనుల్ని 'బ్రహ్మ' ప్రసా
...ంచా అని చెప్పనీయండికాని వైదిక ఆయుర్వేదవాఙ్మయం మన
పూర్వుల అన్వేషణశక్తిని వేనోళ్ల చాటుతోంది. ఎంత పరిశ్రమ—
...ంత ఎక్స్పెరిమెంటు (**Experiment**) చేస్తే నేడు వైజ్ఞానిక
యుగంలో తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోగలిగిందో ఆలోచించండి!

అయితే రెండున్నరవేల ఏండ్లకిందటే నేటి వైజ్ఞానికగ్రం
...థాల్ని...ఎంతో వున్నతిపొందిన నేటి భాషావిజ్ఞానశాస్త్రాన్ని
...తలదన్నగలిగినటువంటి 'అష్టాధ్యాయి'ని వ్రాయగలిగిన మెదడు
...ఇప్పుడు లేదే? మరెప్పుడు మన కీ పతనం ప్రారంభించింది?

ఆర్యసంస్కృతిలో వర్ణభేదం ఏర్పడి, జ్ఞానసంపత్తి (విద్య)
వర్గవిశేషానికి చెందిన రోజునే మనజాతిపతనం[2] బీజారోపణ చేయ
బడింది. జాతిబుద్ధివికాసమార్గం సంకీర్ణ మయింది. జ్ఞానసంపత్తిని
మానవ వికాసానికి వ్యక్తిగతంగా వుంచక ఒకేజాతికి అంటగట్టేప్ప
టికి అకర్మణ్యతకు తావుగలిగింది. రానురాను జాతిలో దౌర్బల్యం
ఏర్పడింది. కాని బౌద్ధధర్మానికి పూర్వం ఆర్యుల్లో (మనజాతిలో)
అలసత్వం రాలేదు. ఆర్యులదృష్టి 'పరం' వైపుకు (ఉపనిషత్తుల్ని
చూడండి) వున్నప్పటికీ వారు జీవితరహస్యాన్ని మరచిపోలేదు.
ప్రపంచాన్ని మరిచిపోకుండ కర్మజగత్తుమీదనే ఆధారపడి
బదుకుతెరువుమీదకూడ ఒకకన్ను వేసి వుండేవారు. అంటే భౌతిక
జీవితాన్ని మరిచిపోలేదు. వారి ధార్మికత చాలా ఉదారంగా వుండేది.
కాని బౌద్ధధర్మప్రవృత్తితో భారతీయ భౌతికజీవితంలో క్షతి ఏర్ప
డింది. అసలు మనపతనారంభం ఇప్పటినుంచే! లోకజీవనంమీద
గొప్ప నిరాశాభావం జనించింది. ఇదివరకు ఆర్యుల ఉదారధార్మి
కత— ఆచారవిచారాల్లో నిబిడమైవున్న దౌర్బల్యపతన బీజాన్ని
నీళ్లు పోసి పెంచి పెద్దదాన్ని చేసింది బుద్ధధర్మమే! బౌద్ధదర్శన
వాఙ్మయం గొప్పది కావచ్చును. దీన్ని కాదని నేను వాదించను.
అయినా ఈ 'దర్శనం' లోకజీవనాన్ని వృద్ధిచేసేది కాదు.
సంఘం (మనజాతి) లోకజీవనాన్ని విస్మరించింది. బుద్ధుని
విచారాలు అప్పటి సంఘంలో విప్లవకరంగా వున్నప్పటికీ—
అవి వ్యావహారికరూపం ధరించేప్పటికి మన పతనానికి కారణ
మయినాయి. బౌద్ధకాలీన విచారభావాల్ని తెలుసుకోవ
డానికి యీ వుదాహరణ చూడండి: 'రాజగృహం'లో 'ఉపాలి'
తల్లిదండ్రులు ఆలోచించారు—పిల్లాడికి ఏం నేర్పించాలా అని. ఆఖ
రికి వారు నిశ్చయించుకొన్నారు—లేఖ, గణన, రూపం నేర్పించి
నందువల్ల భవిష్యత్తులో వాడికి చాలా లాభమే కాని యీ మూటివల్ల
క్రమంగా వేలికీ, హృదయానికీ, కళ్లకు క్లేశం కలుగుతుంది. కాబట్టి
బౌద్ధ భిక్షువు (శ్రమణుడు)గా చేయడమే మంచిది. ఎందుకంటే
శ్రమణులు చాలా సదాచారంగా వుంటారు. తినడానికి చాలా
బాగా జరుగుతుంది. ఇంకా పండుకోవడానికి మంచి పాన్పులు
కూడ దొరుకుతాయి.[3] అప్పటి విచార వాతావరణాన్ని తెలుసు
కోవడానికి జాతకకథల్లోని యీ ఒక్క వుదాహరణ చాలదా? తరు
వాత బౌద్ధధర్మం యిక్కణ్ణుంచి లేచిపోయినప్పటికీ నవీన హిం
దూధర్మం దీనికన్నా ముందుకు మూడడుగులు ఎక్కువగానే నడి
చింది—శిక్షితసమాజం లౌకికజీవనాన్ని పూర్తిగా త్యజించి ఆధ్యా
త్మికం వేపుకు పరుగెత్తింది. మళ్లీ లోకజీవనంవేపుకు కన్నెత్తి
చూడలేదు.

ప్రకృతిసౌందర్యసమృద్ధిలో ఏర్పడిన ఉదారధార్మికత బౌద్ధ
ధర్మప్రవృత్తితో లోకజీవనాన్ని మరిపించి కట్టరధార్మికతగా ఏర్ప
డింది. లోకజీవనానికివేరే తన లోకాన్ని నిర్మించుకొంది. సంఘానికి
హృదయమయిన శిక్షితసమాజం ధార్మికలోకానికి దాసురాలైంది.

ఈ మితిమీరిన ధార్మికత భౌతికవిషయాల్ని విస్మరింప
జేసింది. ఒకవిధంగా 'జీవనం' ధర్మంకొరకేనేమో ననిపించింది!

బౌద్ధకాలంనుంచీ మన సాహిత్యాన్ని పరిశీలిస్తే ఇదంతా
స్పష్టంగా కనిపించడంలేదూ?

పురాతత్వదృష్టితో చూస్తే మన (భారతీయ) ప్రాచీన
సాహిత్యం గొప్ప విలువగలదే! అసలు పురాతత్వానికి చిన్న
యిటుకముక్కకూడ రత్నంలాంటిది. కాని వర్తమానం మన జీవితోప
యోగంతో తూచి చూస్తే ప్రాచీనసాహిత్యం చాలా నిస్సారంగా—
పిప్పిలాగా కనిపించగలదు. అందులోంచి చాలా తక్కువ రత్నాలే
తేలుతాయి. బౌద్ధకాలంనుంచీ ఏర్పడ్డ సాహిత్యంలో మరీని!

2. ఈ వ్యాసంలో 'పతనం'ను అంతటా 'భౌతికపతనం' అనేఅర్థంలోనే వుపయోగించాను. 3. మహావగ్గ ౧, ౪౯; భిక్షుపాచిత్తియ ౬౫, ౧.

భౌతికవిషయాలమీద విచారించడమే లేకపోయినప్పుడు వాటిమీద గ్రంథాలు ఎక్కడినుంచి తయారవుతాయి? పిండి లేకుండా రొట్టె తయారవుతుందీ?

నేడు మనం ఎంత పతనావస్థలో వున్నామో కొంచెం తల పైకెత్తి చూస్తున్నారా పాఠకులు?

ముందుగానే ఏనుగులాగ 'భారతజాతి' గోతిలో పడివుండ బట్టే ఇంగ్లీషువాళ్లు త్వరగా చేజిక్కించుకొన్నారు.

ప్రథమం మునల్మానులుగూడ భారతజాతి ధార్మికపతనం[4]లో వుండబట్టే యిక్కడికి రాగలిగారు. ప్రత్యక్షంగా కార్యరూపేణ కనిపించే 'సోమనాథమందిరకాండం' ఉదాహరణకు చాలదూ?

ప్రాచీనార్యుల్లో వున్న దేశప్రేమ — జాతిభక్తి తరువాతి ఆర్యుల్లో, లేక భారతజాతిలో లేదనడం అతిశయోక్తి గాదు. ధర్మ మాధ్యత అన్నిటినీ మరిపించింది.

నేడు — యీ రాష్ట్రజాగృతికాలంలోగూడ మనల్ని యీ ధర్మమాధ్యతే వెనక్కి లాక్కుపోతూంది!

* * * *

నేడు మన మెడకే రాజకీయదాస్యమే కాదు అనుభవించేది! అన్నివిధాలా మనం బందీలమే. ఎటు కదలబోయినా కాళ్లకు బంధాలు పడుతున్నాయి! ఒక రాజకీయదాస్యమే అయితే యింత అధఃగతిపాలయ్యేవాళ్లం గాదు!

మనల్ని పీడించేది భాషాదాస్యం!

భాషకూ, మానవుని ఆత్మకూ అవినాభావసంబంధం వుంది. మానవునిలో సోదరభావమున్న — నికటసంబంధాన్ని కలిగించేవి భాష, భోజనం.

అటువంటప్పుడు మన (భారతీయ) భాషాదాస్యాన్ని ఆత్మిక దాస్యం, లేక భావదాస్యం అనొచ్చుగాదూ!

ఈ భావదాస్యానికి చాలావరకు మనపూర్వులే కారణ మని వ్రాసుకొచ్చాను. బుద్ధుని తరువాతనుంచీ వచ్చిన మాధ్యధార్మికత మాత్రమే దీనికి ప్రబలకారణమని మళ్లా రాయినద్ది చెప్పగలను.

అయితే మరేమిటి చేసేది?

భారతీయభాషల్లో చదివేది ఏమిటి? నఖశిఖవర్ణన - నాయికా భేదం! 'నఖశిఖవర్ణన'ను తలుచుకొంటే తలవంచుకోవలసివస్తోంది. ఇంతకన్నా ఏముంది?

పోనీ, ఉత్తమసాహిత్యమే వుందనుకోండి. దానివల్ల మనజీవితం గడవదుగదా! ప్లేటో (Plato) చెప్పినట్టుగా కల్పనాసంభూత మయిన - సాహిత్యభావపుంజంలో పడి రాజకీయదాస్యంతోపాటు జీవితం మరీ అధోగతి పొందగలదు. అకర్మణ్యత ఎచ్చుతుంది. నేడు కోరాసాహిత్యం చదివే విద్యార్థుల్లో దీన్ని స్పష్టంగా చూస్తున్నాం. సాహిత్యం మనోరంజనతోపాటు మానవీయ భావధారలో విప్లవం తీసుకరాగలశక్తి కలిగివున్నప్పటికీ మన లోకజీవనానికి పనికిరాదు. ఎన్ని పరిణామాలు (మార్పులు)పొంది రొట్టె మనముందుకు తినడానికి వచ్చిందో సాహిత్యం చెప్పలేదు.

నేడు మనభాషల్లో 'విజ్ఞానం'కు సంబంధించిన ఉత్తమ మౌలికగ్రంథాలు లేవనే చెప్పొచ్చు. అసలు మనతెలుగులో లేవనే చెప్పాలి. ప్రాచీన భారతదేశంలో విజ్ఞానోన్నతి చిహ్నాలు కనిపిస్తున్నప్పటికిని మాధ్యధర్మప్రధానతవల్ల రానురాను వున్నతి పొందజాలక పోయింది.

భారతీయ దర్శనవాఙ్మయం గొప్పదైనప్పటికీ వర్తమాన దేశ భాషల్లో — విస్తృతవిమర్శలతో — స్వతంత్రవ్యాఖ్యలతో — తెలియబరిచే పుస్తకాలు లేనేలేవు. హిందీమొదలగు వున్నత భాషల్ని వదిలేసెయ్యండి. మనతెలుగులో భారతీయదర్శనవాఙ్మయానికి సంబంధించిన గ్రంథా లెన్ని వున్నాయి?

వినయాశ్రమంవారు నాలుగువేదాల్ని తెలుగులో అనువదించి ప్రకటిస్తున్నందుకు అభివందనాలు!

ఈ విధంగా వైదికవాఙ్మయం యావత్తూ వరుసగా — గ్రంథమాలగా ప్రకటించబడటం అతి ఆవశ్యకం.

వైదికవాఙ్మయాన్నిగురించిన్నీ, మన పురాతత్వాది ఇతిహాస విషయాల్నిగురించిన్నీ ఇంగ్లీషు మొదలగు పాశ్చాత్యభాషల్లో వున్నన్ని పుస్తకాలు సంపూర్ణభారతీయభాషల్లో లేనేలేవు. ఎంత లజ్జాకరవిషయం! మన ఇంట్లో సొత్తు పొరుగింటివాళ్లు సర్దడమా? ఇంగ్లీషువాళ్లు తమ స్వార్థానికి మనల్ని రాజకీయదాస్యంలో చేజిక్కించుకొన్నప్పటికీ పాశ్చాత్యవిద్వాంసులకు భారతదేశం సదా ఋణపడివుండగలదు. పాశ్చాత్యవిద్వాంసుల పరిశ్రమవల్లనే మనదేశ ఇతిహాసం వెలుగులోకి వచ్చింది.

వీరు పరిశ్రమచేయకపోతే మన వైదికవాఙ్మయం ఎప్పుడో చదలునాకిపోయేది! మనం (భారతీయులం) గూడ ఆఫ్రికా నివాసుల్లాగ అసభ్యు లనిపించుకొనేవాళ్లం.

అదివరకు పాశ్చాత్యవిద్వాంసుల్లో ఇండియనులు అసభ్యు లని ఒకభావన ఏర్పడివుండేది. కాని మహాకవికాళిదాసుశాకుంతల నాటకం ఇంగ్లీషులోకి అనువాదం కావడంతోనే అందరూ కళ్లు తెరిచారు. "అరే, ఇంత ఉత్తమసాహిత్యం కలిగివున్న జాతి అసభ్య మెలాగవుతుందా" అని ఆశ్చర్యపడ్డారు!

---

4. మాధ్యధర్మంతోనే అని నా అభిప్రాయం.

ప్రభుత్వం నడుపుతున్న శిక్షణపద్ధతి నపుంసకమయినా మన మూడోనేత్రం ఇక్కణ్ణుంచే తెరువబడింది. అదివరకు మనచదువు రూఢిబద్ధధర్మమూఢతవల్ల అంధకారంలో......కూపస్థమండూకం లాగా వుండేది. ఇప్పుడు మనచదువు పొట్టకూటికి అంధకారంగా వున్నప్పటికీ వెలుగులోకి వచ్చాము. అన్నిదిశలూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. మన పూర్వయితిహాసం స్పష్టంఅయినందువల్ల మనం వెలుగులోకి వచ్చినట్టుంది.

అమరావతి, నాగార్జునకొండశిల్పాలు బయటపడి ఆంధ్రుల్ని ఎంత వెలుగులోకి తీసుకొచ్చాయో పాఠకులు ఎరుగరూ?

కాని యింత వెలుగుండీ ఏం లాభం?

'దియేతలే అంధేరా ౧'

పాశ్చాత్యవిద్వాంసుల జ్ఞానపిపాస, సాటిలేని పరిశ్రమలవల్ల భారతీయుల్లోకూడ ధురంధరవిద్వాంసులు పుదయించారు. నేడు భారతీయ విద్వాంసులు (పురాతత్వ, ఇతిహాసవేత్తలు) పాశ్చాత్య విద్వాంసులు చేసిన పరిశ్రమకు మెరుగుపెట్టుకొస్తున్నారు. అంటే పాశ్చాత్యవిద్వాంసులు ఎంత గొప్పపాండిత్యం కలవారయినప్పటికీ ఇచ్చటి సభ్యత-వాతావరణంతో అపరిచితులయినందున వారు చేసిన పరిశ్రమలో (అన్వేషణలో) అనేక తప్పొప్పులు—భ్రమలు—వుండొచ్చును. వాటిని దిద్దగల శక్తిగలవారే మన యితిహాసవేత్తలు!

అయితే ఏం?

దేశీయభాషలు ఒక్క కలంపోటుకుకూడ నోచుకోలేదు!

నేడు దేశీయభాషల్లో ఉచ్చశిక్ష పొందుదామంటే ఏముంది? తెలుగులో 'విద్వాన్' ప్యాసుగావడమే ఉచ్చశిక్ష కాదుగదా! మనజాతిని గురించిన పుస్తకాలే లేనప్పుడు ఉచ్చశిక్ష (Higher education) దాకా పోవడం ఎందుకు?

జవాహరుపండితుడు ఒకప్పుడు ప్యారిసునగరంలో ఏనో లైబ్రరీలో కూర్చొని 'ఇక్కడ ఒకవిషయంమీద వున్నన్ని గ్రంథాలు మనభాషలో (హిందీలో) మొత్తంమీద లేవుగదా' అని కన్నీరు విడిచాడట!

ఈ భాషాదాస్యానికి ప్రథమం మనపూర్వులే కారణమయినప్పటికీ నేడు వెలుగులోకి వచ్చినతరువాత మన ప్రభుత్వం ప్రబల కారణంగా వుంది. మనల్ని ఇప్పుడీ భాషాదాస్యంలో వుంచేది మన ప్రభుత్వమే. మన భాషలకు ప్రభుత్వపోషణగాని, ప్రోత్సాహం గాని లేదు. ఒక జాతిని తనవలలో ఎక్కువరోజులు వుంచుకోవాలంటే ముందు దాజాతిభాషను-సాహిత్యాన్ని నాశనంచెయ్యాలి. ఈ నీతి ప్రపంచంలో చాలారోజులనుంచీ నడుస్తోంది! నేడది మనపాల కూడా పడింది. అందుచే భారతీయవిద్వాంసులుకూడ ఇంగ్లీషు శరణు పొందాలిసి వస్తోంది!

ప్రతిభాషకూ ప్రభుత్వపోషణ వుండాలి. కాని ఈ ఇంగ్లీషు ప్రభుత్వ ముండగా మన కోరిక పట్టలేదు! అయితే అందాకా ఏంచేద్దాం? కాళ్లుముడుచుకు కూర్చోవడం భావ్యమా?

ఇంగ్లీషువాళ్ల ప్రవేశంనుంచీ మనం పరతంత్రులంగా వున్నప్పటికీ ఈయుగాన్ని 'వెలుగుయుగం' అనాలి. ఈ 'వెలుగుయుగం'ను మనం చక్కగా వుపయోగించుకోవాలి. ఇదే మన ప్రస్తుతకర్తవ్యం.

ఇంతకూ నేను రాసుకొచ్చినదాని సారాంశం ఏమిటి? ... మనకు అనువాదాలు కావాలి.

మనతెలుగులో మనకు సంబంధించిన ఎన్ని యితిహాస గ్రంథాలు వున్నవో వ్రేలుపెట్టి చూపించండి. స్వర్గీయ చిలుకూరి వీరభద్రరావుగారు చేసిన పరిశ్రమ శ్లాఘనీయం. కాని వారి 'ఆంధ్రుల చరిత్ర'లో చాలా భ్రామికవిషయా లున్నాయి.

ఐతిహాసికసాహిత్యంలేని జాతి త్వరగా ఉన్నతిపొందజాలదు. ఇతిహాసమే జాతిఉన్నతికి ముందుదారి చూపిస్తుంది. కావున ఈ 'ఐతిహాసిక సాహిత్యం' పండితుల పొత్తాల్లో వున్నందువల్ల లాభం లేదు. జాతిలో అంతటా—ఇంటింటా వ్యాపించాలి. ఇందుకుగాను దేశీయభాషలే శరణ్యం.

ఇప్పుడు మన చారిత్రకసాహిత్యం కోలెడంత ఇంగ్లీషులో పడివుంది. కాని దానివల్ల ఏంలాభం? అందని ద్రాక్షపళ్లు పుల్లగా వుంటాయిగాదూ!

దేశభాషలకు రాజాదరణగాని, ప్రజాపోషణగాని ప్రస్తుతం లేనిమాట నిజమే! కాని ప్రజాపోషణ ముందు వుండదనడం పొరపాటు. ప్రయత్నించే స్తేగదా పని కావసాగేది? ముందుగానే, కాదని అకర్మణ్యతను చూపిస్తే ఎలా?

మనప్రజలో గంభీరవిషయాల్ని చదివేరుచి లేనిమాట నిజమే. కాని రుచిపుట్టించే కర్తవ్యం మనది. 'ఆంధ్రులచరిత్ర'ను ఎంతో వుత్సాహంతో ఆంధ్రులు ఆహ్వానించలా?

పాశ్చాత్యదేశాల్లోలాగ యీ దరిద్రభారతదేశంలో పుస్తక ప్రకటనవల్ల విశేషలాభం లేనిమాట నిజమే! కాని లాభం చూచుకొంటే ఎలా? ఇంతమాత్రం త్యాగం వుండొద్దూ! దీనికిగాను ధనవంతుల సహాయం కావాలి.

---

౧. దీపం ఎంత ప్రకాశిస్తున్నప్పటికీ దానికింద చీకటిగానే వుంటుంది!

మాతృభాష — మాతృభూమి, మానవునకు కన్నతల్లికన్నా అత్యంత ప్రియమయినవి. దీన్ని జీవంగల ప్రతిమానవుడూ ఒప్పుకొంటాడు.

మన ధనికులు, శ్రీమంతులు మహారాజులు తిన్నగా మాతృభూమిసేవ చేయలేకపోయినప్పటికీ మాతృభాషాసేవ చేయకూడదూ? ధనికులపోషణ వున్నందున ఇటువంటి గంభీర విషయాల గ్రంథ ప్రకాశనవల్ల ప్రథమంలో లాభం లేకపోయినప్పటికీ నష్టంమాత్రం వుండదు. రుచిపడ్డమీదట ప్రజే పోషించుకోగలదు.

శ్రీమంతులగు పిఠాపురం మహారాజాగారు భాషావివాదాన్ని తీసుకొని ఆంధ్రసేవ చేసేకన్నా ఏదైనా 'ఐతిహాసికగ్రంథమాల' (Historical Series) ద్వారా తెలుగుతల్లిని అలంకరిస్తే బాగుండును.



ఉగాదిపండుగ సంబరము
3. క్రొత్తవస్త్రముల కొనుగోలు
బీదసాదలుకూడా తమ యోగ్యతకు తగ్గట్టుగా నూతనవస్త్రాలను కొనితెచ్చుకొని పండుగనాడు విధిగా ధరిస్తూవుంటారు.

భాషరూపును సంరక్షించడమే 'భాషాసేవ' అని ఒకపెద్ద భ్రామిక భావన ఆంధ్రుల్లో వ్యాపించివుంది. భాషరూపు మట్టిబొమ్మ ఆకారం లాంటిది. దానిలో జీవశక్తి పొయ్యాలి. అప్పుడే అది నిజమైన భాషాసేవ కాగలదు.

నవ్యసాహిత్యపరిషత్తు, ఆంధ్రసాహిత్యపరిషత్తులు చేసినసేవ ప్రశంసనీయమే! కాని యీవిధంగా 'భాషారూపు' వివాదాన్ని తీసుకొని వేరువేరుగా స్థాపించబడడం తెలుగుకు చాలా అనర్థదాయకమే. ఈరెండూ తమవివాదాన్ని మరిచిపోయి నిజమయిన తెలుగుసేవకు పూనుకోవాలి. లేదా రెండూ ఏకమై, 'తెలుగుసాహిత్యసమితి'గా ఏర్పడి, విషయాన్ని దృష్టిలోవుంచుకొని, జీవితభావము పోషిస్తూ ఏ భాషనైనా (గ్రాంథికంగాని, గ్రామ్యంగాని) స్వీకరించి తెలుగుసేవ చేస్తే బాగుండును.

గంభీర విషయక పుస్తకాల్ని యిటువంటి సంఘటిత సంస్థలే ప్రకటించగలవు. లాభాన్ని చూచుకొనే ప్రకటనకర్తలవల్ల యీపని కాజాలదు.

ఆంధ్రయూనివర్సిటీకూడ యీవైపున కొంచెం దయయుంచాలి.

మన తెలుగుసంస్థలు యింతవరకు లలితసాహిత్యోన్నతికే ఎక్కువగా పాటుపడుచున్నట్లు కనిపిస్తోంది! దినదినం వృద్ధిపొందుచున్న లలితసాహిత్యోన్నతికి సంతోషించవలసిందే! కాని లలితసాహిత్యం(కావ్యం, కథ, నవల మొదలగు మనోరంజన ప్రధానమయినవి) వల్ల జాతిలో జీవచలనంమాత్రమే కనిపిస్తుంది. జాతిభావనలో పాలపొంగులాంటి వాతావరణ మాత్రం ఏర్పడుతుంది. విచారాత్మక గంభీరసాహిత్యంవల్ల జీవశక్తి వస్తుంది. నలువైపులా గంభీరత వ్యాపించినట్లుగా కనిపించగలదు. గంభీరసాహిత్యంగల జాతి ఉత్తుంగ హిమాలయశిఖరాల్లాగ ప్రపంచం ఎదుట గర్వంతో తలయెత్తి తిరుగగలదు. కావున విచారాత్మక గంభీరసాహిత్యం ఎంత ఆవశ్యకమో వేరే చెప్పాలా?

* * *

తెలుగు 'లిటరేచరు' ఎంత క్షీణంగా వుందో చెప్పాలా? నలువైపులా లేరిహార జాతి తెలుగువంక చూస్తే అది పగటిచుక్కలాగ కనిపించీ కనిపించకుండా వుంటోంది! ఇది వాఖావదాస్యం అంటారేమో తెలుగుహిమాయితీలు! కొంతవరకు నిజమే కావచ్చును. కాని వారిలంపు మాత్రం అసత్యం కాదు. ప్రపంచంలోవున్న ఉన్నతసాహిత్యాల్నేగాదు, హిందీ, బెంగాలీ, మరాఠీ మొదలగు అన్యభారతీయసాహిత్యాల్ని చూచి 'తెలుగుసాహితి'ని చూస్తే కూడా సూర్యుని ముందు దీపం వుంచినట్లుగా వుంటోంది! అన్యసాహిత్యాలముందు తెలుగును బలామూరు తీసేస్తున్నానని అనుకోకండి. జిలిబిలిపలుకుల ముద్దుతల్లి నా కెంత ప్రాణమో నా హృదయానికే తెలుసు! తల్లి తన బిడ్డను పాలులేని ఎండురొమ్ములతో అదుముకొన్నా పిల్లాడికి ఆకలితీరి ఆనందం కలుగుతుందిగదా!...తెలుగుసాహిత్యం అన్య భారతీయ సాహిత్యాలకన్నా తీసిపోదు. తనస్థానంలో చాలా గొప్పదే. కాని 'లిటరేచరు' అర్థంలో తెలుగుసాహిత్యం — పాశ్చాత్య సాహిత్యాల్ని వదిలెయ్యండి—హిందీ, బెంగాలీ, మరాఠీ సాహిత్యాలకన్నా తక్కువేనని కళ్లు మూసుకొని ఒప్పుకోవచ్చును.

తెలుగులో ఇతిహాసం, విజ్ఞానం, రాజకీయశాస్త్రం, మానవచరిత్ర ఆది విషయాలమీద ఉత్తమసాహిత్యం—మౌలికంగాని, అనువాదంగాని—ఇంతవరకు ఏర్పడిందా?

ప్రతిదీ వేలుపెట్టి చూపించాలా? ఏటుచూచినా అభావమే!

పురాతత్వ విషయకసాహిత్యం—భారతిలో వెలువడుతూ వచ్చిన రచనల్ని వదిలి పెడితే—లేదనే చెప్పాలి. 6 ఆంధ్రభాషా చరిత్రాన్ని వదిలిపెట్టి మరోగ్రంథం భాషావిజ్ఞానం (Philology) మీద వుందా? లేదు ప్రపంచంలో దినదినం వృద్ధిపొందుతున్న 'భాషావిజ్ఞానం'మీద తెలుగులో ఇంతవరకూ ఏగ్రంథం లేకపోవడం ఎంత విచారకరవిషయమో ఆలోచించండి.

తెలుగుభాషమీద, తెలుగుసాహిత్యంమీద గొప్ప పాండిత్యం సంపాయించవచ్చునుగాని, ప్రస్తుతస్థితిలో తెలుగుద్వారా సార్వభౌమికపాండిత్యం సంపాయించడం కలలోనిమాట. ఇట్టిస్థితిలో అన్యభాషల శరణు పొందాలిసిందేకదా! ముఖ్యంగా ఇంగ్లీషును ఆశ్రయించాలిసివస్తోంది.

విశ్వజ్ఞానంకొరకు అన్యభాషల్ని నేర్చుకోవడం మంచిదే. కాని తనభాషలో గతిలేక ఇంకోభాషను ఆశ్రయించడం లజ్జాకర విషయం. ఇంతకన్నా మరొక పరాధీనత వుండదు. ఈ పరాధీనతను త్వరగా రూపుమాపాలి. ఇందుకుగాను ప్రథమం అనువాదసాహిత్యమే లాభిస్తుంది. అనువాదాలవల్ల భాషలో-సాహిత్యంలో మౌలికత పోతుందంటారు మౌలికవాదులు. కాని ఇది వట్టిభ్రమ. భాషే మనసాహిత్యం: భాషలోనే మనసంస్కృతి వుంది. సంస్కృతి రక్షణకు సాహిత్యంకన్నా భాషనే ముందుగారక్షించాలి. మౌలిక వాదుల తర్కం (వాదన) లలితసాహిత్యానువాదాలకే అనువర్తించి వుంటుంది.

భావాన్ని ఏ అచ్చులోనైనా పోస్తుండవచ్చును. కావున ఏ విదేశీయభావాన్నయినా అనువాదంద్వారా మనభాషలో-మన సంస్కృతిలో మార్చుకోవచ్చును. దీనివల్ల భాషకుగాని, సంస్కృతికిగాని ఏ మాత్రం హాని కలుగదు. అసలు విదేశీయరచనను మన భాషలో అనువదించేప్పటికి అది మన సంస్కృతికి అనుకూలంగా మారిపోతుంది!

ఎంత గొప్పసాహిత్యం అయినా అనువాదాలు లేకపోయేప్పటికి అపూర్ణం అనిపించుకొంటుంది. స్వతంత్రరచనలకన్నా అనువాదితరచనలవిలువ తక్కువ గాదు. ఎంత ఉన్నతి పొందిన సాహిత్యం (లిటరేచరు) అయినా అనువాదాలు లేకపోయేప్పటికి కూపస్థమండూకంలాగా వుంటుంది. అటువంటప్పుడు బలహీన సాహిత్యం గల భాషకు అనువాదాలు ఎంత ఆవశ్యకమో చెప్పడమెందుకు?

అనువాదసాహిత్యంవల్ల నలువైపులనుంచీ 'వెలుగు' అల్లుకు పోతుంది. ఈ 'వెలుగు'లో కొత్త రత్నాలు కనిపిస్తాయి. అంటే కొత్త విచారాలు, కొత్తభావాలు పుడతాయి. మౌలికరచనలకు తావు కలుగుతుంది. విచారసంఘర్షణవల్ల కొత్త విచారం (భావం) పుడుతుంది. కావున అనువాదాలవల్ల మౌలికరచనలు పుట్టగలవు. అందుకనేగా భావి వున్నతికి యితిహాసం చదవడం ఆవశ్యకమని పెద్ద లంటారు.

కావున ప్రస్తుతం తెలుగులో వున్న కొరతను తీర్చడానికి అనువాదసాహిత్యం కావాలి. దీనివల్ల ప్రజలో రుచిపుడుతుంది. ఈ రుచి ముందు మౌలికగంభీరసాహిత్యాన్ని కూడ పుట్టించగలదు. తెలుగువిద్యార్థు లింకా Richards మొదలగు పాశ్చాత్య విమర్శకుల రచనల్ని చదివినట్టు కనిపించదు. అందుకనే తెలుగు విమర్శనాసాహిత్యం ఇంకా వెలుగులోకి రాలేదు. కావున పాశ్చాత్య విమర్శనాప్రణాళికూడ తెలుసుకోవాలి. అప్పుడు మన విమర్శనా పద్ధతి కొంతవరకు పరిష్కృతం కాగలదు. అస్తు.

ఈ ఉత్తమగ్రంథానువాదాలవల్ల తెలుగులో నవజాగృతి కలుగ గలదు. నవరక్తసంచారం కలుగుతుంది.

ముందు వైదికసాహిత్యాన్ని చక్కని అర్థసహితంగా ప్రకటించాలి. తరువాయి వైదికసాహిత్యానికి సంబంధించిన, ఇంగ్లీషులో పాశ్చాత్యవిద్వాంసులు కష్టించి వ్రాసిన సాహిత్యంలోని ప్రముఖ అంగాల్ని అనువదించాలి. ఇంకా మనజాతికి, దేశానికి సంబంధించిన యితిహాసాన్ని ఇంగ్లీషునుంచీ, ఇంకా యితర భాషలనుంచి అను వాదం చేయాలి. ఇటుతరువాత పాశ్చాత్యభాషల్లోని ఉత్తమోత్తమ గ్రంథాల్ని—

ఏమేమి అనువదించాలో 'సూచి' యివ్వాలా?

ఈ యోజనను కార్యాన్వితం చేయడానికి కొన్ని సంస్థలుకూడ తోడ్పడాలి. తెలుగుద్వారా ఉచ్చవిద్య నేర్పే సంస్థ లున్నప్పుడే జాతిలో ఎక్కువగా రుచి పుట్టగలదు. ఈసంస్థల్లో రెండేళ్లు పుస్తకాలు ఖర్చయినప్పటికి పాఠ్యగ్రంథాలుగా స్వీకరించేప్పటికి కొటిగౌరవం హెచ్చుతుంది.

తెలుగువిద్వాంసులు తెలుగునుడికారాన్నే చూడక విస్తృత పాశ్చాత్య సాహిత్యాల్ని — మనకు సంబంధించిన యితిహాసపురాతత్వాది విషయకరచనల్ని — అధ్యయనం చేస్తూ నూతనయుగారంభం చేస్తారనే ఆశిస్తున్నాను.

తెలుగులో అత్యాచారం

ఇంతవరకూ అనువాదాలు మన కెంత అవసరమో చూచు కొంటూ వచ్చాం. ఇక తెలుగులో నిత్యం వస్తున్న అనువాదసాహిత్యాన్నికూడ చూడండి. ప్రతిదినం అనువాదమగుచున్న కథానికల్ని చూచి సంతోషించవలసిందే. కాని జరుగుచున్న అత్యాచారాన్ని చూచి నెత్తికొట్టుకోవాలిసివస్తోంది! ఎంత లజ్జాకరవిషయం?

6. ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారి 18 వ ప్రచురణ.

సాహిత్యం మహోజ్వలదర్పణంలాంటిది. అటువంటిదాన్ని మన అనువాదకులు కలుషితం చేస్తున్నారు! నలుగురిలో తలెత్తుకు తిరిగేది ఎలా?

చోరీలమాట అటుంచండి — ఈ విస్తృత కథాసాహిత్యంలో ఏమూల చోరీ జరిగిందో కనుక్కోవడం కష్టము; అసంభవంకూడా— మూలరచయితల పేరుగూడ యివ్వరు.

"ఇప్పుడే కొద్దిరోజులక్రితం ప్రేమచందుకథ 'సౌత్'(=సవతి) ను ఎవరో 'ప్రేమబలి' అని పేరిడి ఏదో పేపర్లో అనువదించారు. కథ చదివినమీదట సహసా నా నోటినుంచి వెలువడింది— 'ఇది ప్రేమచందు బలిగాని ప్రేమబలికాదు.' ఈ విధంగా ప్రేమచందు, సుదర్శన మొదలగువారి బలి అవుతోవుంది." 7

ఈవాక్యాలు యింతవరకూ నాగుండెల్లో కలకవేస్తున్నాయి! ఉత్తరహిందూస్థానంలో తిరుగుతున్నందువల్ల మరీని!! ఎవరన్నా అడిగితే ఏం సమాధానం చెప్పేది?

'హిందీమండీ' రోగం దినదినం హెచ్చుతున్నట్టు కనిపిస్తోంది. ఈ'మండీ' రోగం పెద్దపెద్ద పత్రికలవరకూ వ్యాపించింది. ఈ మాయరోగం అంతటా వుందనే చెప్పాలి.

నవంబరు '39 భారతిలోని 'విముక్తజీవనాన్వేషణము', డిశంబరు '39 భారతిలోని 'మార్గంలో' అనే రచనలు ఈ 'మండీ' రోగంనుంచి పుట్టినవే.

పేరుగల రచయితలకుగూడ యీ'మండీ' రోగం సోకింది!

మార్చి '38 కథాంజలిలో జ. క. ఆచార్యగారు 'అభిసేత్రి'ని 'హిందీనుండి' అన్నారు. దానిపక్కనే 'మగమహారాజు' అన్న కథని పేరులేకుండా యిచ్చారు. మరి దానికి ఎవరు రచయితలు? స్వతంత్రమూలికరచన అనుకోవేది ఎలా? అదీ ఏ'మండీ' రోగాన్నుంచి పుట్టిందో!

మే'39 మహతిలో 'కథావిధి' అని ఒక రచన వెలువడింది. రచయితలు వేమూరి ఆంజనేయశర్మగారు. రచన అంతా చదువు కొల్లెప్పటికి ఆఖరికి కిందవుంది 'ప్రేమ చందు కథకు' అని. ఇదేమిటి? ముందుగానే అస్వర్గీయులైన 'ప్రేమచందు' పేరిస్తే అనువాదకులకు నామోషీ కలుగుతుందా? అసలీ 'రచన' ను స్వర్గీయప్రేమచందు తన కథాసంపుటి 'మానసరోవర్' ప్రథమభాగంలో 'భూమిక'గా యిచ్చారు.

ఈ విధంగా 'మండీ' రోగపు మరణసంఖ్యల్నియిస్తే గ్రంథం వృథాగా పెరిగిపోతుంది.

ఈ 'మండీ' రోగవృద్ధికి మన పత్రికాసంపాదకులే చాలా వరకు కారణమని చెప్పొచ్చును. సంపాదకులు 'మండీ' రోగంతో వచ్చిన రచనల్ని వేరుగా వుంచి, అనువాదక మహోదయులకు ఒక కొద్దిముక్క రాసి మూలరచయిత లెవరో కనుక్కుంటే అంతగా వ్యాపించేదికాదు. అసలు వ్యాపించేదేకాదు.

నేడు తెలుగులో నలువైపులనుంచి అనువాదసాహిత్యం విజృంభిస్తోంది. ఒక్క కథానికలేగాదు, విచారాత్మక సాహిత్యంగూడ చరచర అనువాద మగుతోంది. కాని ఈ రోగంనుంచి ముక్తం కాలేదు! సాహిత్యంమీద బాధ్యతగల రచయితలు గూడ భ్రమలోనే వున్నారు! రచన అనువాద మని ఒప్పుకోంటూ గూడ అనువాదకులు తమను 'గ్రంథకర్త'లుగా ఘోషిస్తున్నారు. ఇంకా తెలుగుసాహిత్యం 17, 18 శతాబ్దాల్లోనే వుందా? 'గ్రంథకర్త' అంటే తెలుగులో ఏ అర్థాన్ని గ్రహిస్తున్నారు? నాకు తెలిసినంత వరకు 'రచయిత' అర్థంలోనే! అయితే అనువాదకులు 'గ్రంథకర్త'లుగా ఎలా అవుతారు? జకర్క—క, బ్రిటిషురాజ్యస్థాపన మొదలగు గ్రంథా లెన్నో అనువాదాలు. కాని అనువాదకులు వాటిని అనువాదాలని ఒప్పుకోంటూకూడ తమను గ్రంథకర్తలుగా రాసుకొన్నారు! ఈ ప్రవృత్తి చాలా ప్రాచీనకాలం నాటిది. ఈ 'వెలుగు' యుగంలో వుండతగింది కాదు.

'బ్రిటిషుమహోదయాన్ని' అనువదించినందుకు మానికొండ సత్యనారాయణశాస్త్రిగారికి, ఇటువంటి ఉత్తమ బృహత్ గ్రంథాన్ని తొకలో అందజేసినందుకు నేవాశ్రమంవారికీ కోటి అభివందనాలు. ఆంధ్రులు వీరిసేవకు తగుమూల్య మిచ్చి ప్రోత్సహిస్తారనే ఆశయం. అయితే సత్యనారాయణగారు అనువాదకులా, గ్రంథకర్తలా? మొదటిపేజీ (టైటిల్ పేజీ) మీద 'మేజర్ బి. డి. బాసు, ఐ. ఎమ్. ఎస్. గారి **Rise of the Christian Power in India** అను గ్రంథము ననుసరించి' అన్నారు. ఆ తరువాత మా. సత్యనారాయణగారి సంతకం గ్రంథకర్తపేరుతో వుంది. గ్రంథకర్తృనివేదనంలో సత్యనారాయణగారే 'ఈ గ్రంథమూలమును ఆంగ్లమున రచించినవారు శ్రీ. శ్రీ. మేజర్ బి. డి. బాసుగారు.' అని ఒప్పుకొన్నారు. బాసుగారి చిత్రంక్రింద 'ఆంగ్లమున ఈ యుద్గ్రంథమును రచించిన వంగశేఖరుడు' అనివుంది. మళ్లీ సత్యనారాయణగారి ఫోటో క్రింద 'గ్రంథకర్త'అని. ఇంకా గ్రంథకర్తృనివేదనంలో 'నే నీగ్రంథము రచించి' అని వుంది. దానిక్రిందనే 'దానిని తెలుగులోకి అనువదించు భాగ్యము నాకు కలిగినందుకు ఉప్పొంగుచు' అన్నారు. రెండోసంపుటం పీఠికలో "ఈ 'బ్రిటిషుమహోదయము' మేజరు బాసు అను బంగాళీప్రముఖుడు ఇంగ్లీషులో వ్రాసిన గ్రంథమునకు అనువాద మైయున్నది. దీని ననువదించుటలో శాస్త్రిగారు ప్రాచీన ఆంధ్రకవుల సంప్రదాయము ననుసరించిరి..." అని మామిడిపూడి వెంకటరంగయ్యగారు వ్రాశారు. అయితే శాస్త్రిగారు ఎంతవరకు

7. వ్రజనందనశర్మగారు, 'మాధురి' మార్చి '37.

స్వతంత్రించారు? ఈ గ్రంథాన్ని రచించడంలో వీరి స్వతంత్రపరిశ్రమ ఎంతవరకు వుంది? తమ వక్తవ్యంలో ఎచ్చటా సూచించలేదే? తెలుగులో 'రచించుట', 'అనువదించుట' అనుపదాలకు ఒకే అర్థమా, లేక 'రచించుట' అంటే కలంపుచ్చుక రాసే క్రియకే చెల్లుతుందా? అయితే యింతవిపరీతార్థంలో ఎలా వుపయోగిస్తున్నారు? వెంకటరంగయ్యగారుకూడ పీఠికలో 'రచించిరి — తెలిగించియున్నారు.' అని రెండుశబ్దాల్నీ వాడారు. 'రచించుట'కు 'అనువదించుట'కు మధ్య కొంచెంత భేదంవుంది. భావంగూడ మౌలికమయినప్పుడే 'రచించు' శబ్దాన్ని వుపయోగించాలి. అసలెందుకీ గందరగోళం? 'అనువాదకులం' అని రాస్తే పోయేదికదా!

అనువాదకు లని రాసుకొంటే తెలుగురచయితలకు చిన్నతనమా? దినదినాభివృద్ధి గాంచుతున్న యీ ప్రవృత్తిని చూస్తే 'అనువాద'శబ్దాన్ని ఆంధ్రులు నీచంగా చూస్తున్నట్టే కనిపిస్తోంది. ఇది పట్టిభ్రమ. అనువాదాలుగూడ సాహిత్యానికి చాలా అవసరమే. మూలరచయితల కున్నంత గౌరవం అనువాదకర్తలకుగూడ నుంచు సాహిత్య ఇతిహాసం యివ్వగలదు.

ఆంధ్ర విద్వాంసులు యీవైపు తమశ్రద్ధ తీసుకొంటారనే నా ప్రార్థన. ఈప్రాచీనప్రవృత్తిని త్వరగా తొలగించాలి. విషయం చిన్నదే. కాని పరిణామం భయంకరమయింది! వాఙ్మయచరిత్రలో యీప్రవృత్తి చిరకాలంవరకు మచ్చగా ఏర్పడి వుండగలదు.

'సండే' రోగాన్ని తొలగించడానికి పత్రికా సంపాదకులు తమశ్రద్ధ తీసుకొంటారనే ఆశయంతో ముగిస్తున్నాను.

ఈరచయిత పక్కా ఆంధ్రుడు. 'విషనాగు' అనేది వీరు పెట్టుకొన్న ఉపనామం. భారతి పత్రికాపాఠకులకు వీరి రచనలలోని విశిష్టత బాగా పరిచితమైయే ఉంటుంది. వీరు ఉత్తర హిందూస్థానంలో వుంటున్నందువల్ల రచనమీద హిందీ భాషాప్రభావం ఎక్కువగా ద్యోతకమవుతూవుంటుంది. అది ఒకరీతిగా సహజమేననికూడ అనిపిస్తుంది. కాబట్టి వీరిరచనలో తెలుగు నుడికారానికి భంగంకలిగినా భావప్రాబల్యాన్నిబట్టి అది క్షమార్హమే అవుతుంది.

రక్తస్పర్శ

[కథానిక]

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

1

శివానికి చాలా చాతనవు — బడి ఎగగొట్టటమూ, బలవంతాన పంపించిన రోజున మేస్టరుకళ్లల్లో కారంకొట్టి తప్పించుకు పారిపోవటమూ, మేస్టరు వెయ్యికళ్లతో కనిపెట్టిఉండి, కడంపిల్లల జోక్యం మానేసి, వాడిచేత గంటసేపు ఒకేపాఠం చదివించినా ఒక్క ముక్క రాకుండా పరధ్యానంగా చదవటమూ, తన ఈడు పిల్లవా డెవడైనా ఒంటరిగా దొరికితే వాడితో ముందు పరిచయం చేసుకుని తరవాత పోట్లాడి అఖరుకు వాణ్ణి మెత్తగా తన్నటమూ, అది సాధ్యపడనప్పుడు చచ్చేట్టు తన్నులుతిని ఎవరితోనూ చెప్పకుండా ఉండటమూ, వారాని కొకసారి ఏదోఒకవిధంగా ప్రాణంమీదికి తెచ్చుకోవటమూ, సినిమాలకూ, నాటకాలకూ, సర్కసులకూ టిక్కెట్టు లేకుండా వెళ్లటమూ, బొగ్గుతో ఊళ్లో గోడలమీద తన నోటికివచ్చిన దౌర్భాగ్యపు కూతలు రాయటమూ, సిగిరెట్లు (కానీకి అయిదురకం) కాల్చటమూ: ఇంకా ఎన్నో! కాని వాడికి ఆడపిల్లల దగ్గిర ఎట్లా ప్రవర్తించాలో చాతకాదు. వాడి కసలు ఆడపిల్ల లంటే భయం. ఆభయం జాస్తిగా కలిగినప్పుడు వాళ్లకు వైదొలిగి, తను పాతికేళ్ల మగవా డయినట్టూ, వాళ్లు కాపరంచేసేవాళ్లయినట్టూ ప్రవర్తించేవాడు. కాస్త ఉత్సాహం ఉండి, భయాన్ని కొంతవరకు జయించినప్పుడు తనూ, వాళ్లూ చంటిపిల్లలయినట్టు ప్రవర్తించేవాడు. వాడి ఈప్రవర్తనే ఆడపిల్లలకు రోతగా ఉండేది.

ఇవాళ వాడు ఉత్సాహంతో ఉన్నాడు. మొదటి సంగతి: బడి ఎగగొట్టేశాడు. ఆ తరవాత: వాళ్లమ్మ గూట్లోపెట్టి మరిచిపోయిన అణాకాసొకటి కొట్టేశాడు. ఇంతేకాక వాడు ఎన్నడూ ఎరగని కిళ్లీకొట్టుమీదికి వెళ్లి "ఏమయ్యోయ్, ఒకబీడీ ఇవ్వు!" అని దబాయించి అడిగి ఆబీడీ సంపాదించాడు! ఈ ఉత్సాహంలో వాడు ఇంటికి వచ్చేటప్పటికి లక్ష్మి, పక్కింటివాళ్ల బాలాంబ కలిసి సారెబొమ్మలకు గుడ్డపీలికలతో దుస్తులు కుట్టుకుంటున్నారు.

శివం కాసేపు కాళ్లెడంగాపెట్టి వాళ్ల కార్యక్రమం నిష్పక్షపాతబుద్ధితో గమనించి, అఖరుకు వొంగి ఒక చిన్న గుడ్డపీలిక తీసి లక్ష్మినెత్తిన వేసి, "ఒకమ్మాయిగారి నెత్తిన గోరంకి!" అని పాడాడు. బాలాంబ ఒకసారి వాడి వంక తీవ్రంగాచూసి వా డక్కడ లేనట్టే నటించింది.

లక్ష్మిమాత్రం వాడివంక రౌద్రంగా చూసి, "నీ కాడపిల్లలతో ఏమాటలురా? అసలు నువ్వు బళ్లోకి వెళ్లక ఇక్కడున్నావేం? అమ్మతో చెప్పనా?" అని అంతకంతకూ గొంతు హెచ్చించసాగింది. వంటఇంటో ఉన్న తల్లికి వినపడాలని ఆపిల్ల తాత్పర్యం.

శివం తన నిర్లక్ష్యం ప్రకటించటానికి అసహ్యంగా నవ్వుతూ, మళ్లీ వొంగి లక్ష్మి చేతిలో ఉన్న బొమ్మ లాక్కున్నాడు.

ఈసారి లక్ష్మి గట్టిగా అరుస్తూ "ఆబొమ్మ ఇచ్చెయ్యరా! నీకేం తెగులుట్రా?... అమ్మా, ఈ శివాయ్ చూడవే! మమ్మల్ని ఏడిపిస్తున్నాడూ! ... వెధవా!" అన్నది.

"నువ్వే వెధవముండవు!" అంటూ శివం లక్ష్మి నెత్తిన ఆ బొమ్మతో ఒకటి పెట్టి, తృప్తిపడక మళ్లీ ఇంకోటిపెట్టి, ఆబొమ్మ ఎత్తి నాపరాళ్లమీద పడేసి ఎటో అయిపులేకుండా వెళ్లిపోయినాడు.

రేపో ఎల్లుండో పెళ్లికాబోతున్న లక్ష్మి, పైగా స్నేహితురాలిముందు: అసహాయత్వం ప్రకటించ నికిగాని, ఏడవటానికిగాని చాలా బిడియపడ్డది. బయ కక్కిన కోపంకంటె దిగమింగిన కోపం రెట్టింపు! ష్ఠ పెదిమలుమాత్రం కదిలిస్తూ శివాన్ని లోలోపలే ధవ, వెధవ, వెధవ!" అని లెక్కపెట్టకుండా మూడుసార్లు తిట్టుకున్నది.

ఈసంఘటన లక్ష్మికీ, బాలాంబకూ ఎంతఅసహ్య ంగా కనిపించిందో శివానికీ అంత అసహ్యకరంగానే చింది. కాని ఏంచేస్తాడూ? తను ఎంతో సదుద్దేశం ఏంచెయ్యబోయినా ఆఖరుకు అట్లా పరిణమిస్తుంది. పంచం అంతటా లక్ష్మివంటి దుర్మార్గు లుండటంవల్ల చేత లన్నీ ఇట్లా పరిణమిస్తున్నై. తనలోపం న్నదూ ఉండదని శివం ఎప్పుడూ ఎరుగును! వాడి లు అక్కమీద ఎంతో ఆపేక్షా, అభిమానమూ న్న (లక్ష్మిమీద చెయ్యిచేసుకున్న మరుక్షణం ంగటి వాడికి ఎంత నమ్మకంగానో తెలిసేది). కాని లాభం? ఆ ఆపేక్ష చూపించేటందుకు తనకు అవ శమే దొరకదుగా! తన ప్రారబ్ధం!

పశ్చాత్తాపం అందరికీ ఒకవిధంగా రాదు. ఇది ం యొక్క పేకెంటువిధం. వాడు తనదృష్టిలో ను హీనుడల్లే కనపడేకంటె తనవల్ల అపకారం ందినవాళ్లని తన దృష్టిలో అధికం కానిచ్చేవాడు. వంటి సంఘటన—లక్ష్మిమీద చెయ్యిచేసుకోవలి అత్యావశ్యకత—కనీసం రోజు కొకసారి అయినా గుతూ ఉండేది కనక ఈపాటికి లక్ష్మి శివందృష్టిలో దాపూ ఒక దేవతంతగా అయిపోయింది. అయితే ఈ యం నిరూపించటానికి శివాని కింకా అవకాశం లేదు. ఈపరమరహస్యం ఇంకా శివం హృదయం నే బంధించిఉంది.

2

లక్ష్మి తమ్ముడికంటె సరిగ్గా ఒకసంవత్సరం పెద్ద. కి పదోఏడు వచ్చింది—ఇంకా ఏ బీ సీ డీ లు రాక యినా. లక్ష్మికి పదకొండు వచ్చినయి. తమతండ్రిని ఇద్దరూ ఎరగరు. వాళ్లు బుద్ధి తెలిసినప్పటినించీ తల్లి శిక్షణకిందనే పెరిగారు.

ఆవిడకు పిల్లల్ని పెంచటం ఏమీ చాతకాదు. చాతకాదని ఆవిడకుగాని, ఆవిడని మెచ్చుకున్నవాళ్లకు గాని తెలీదుకూడాను. ఆవిడ తన ఇద్దరు పిల్లల్నీ ఒకరి మీద ఒకర్ని కాపలాపెట్టింది. వాళ్లిద్దరికీ సహజమైన వైరం ఉంటుందని ఆవిడవిశ్వాసం. (ఆవిశ్వాసానికి ఆధా రాలేమిటో నాకయితే తెలీదు!) కాని వాళ్ల ప్రవర్తనను బట్టి ఆవిడవిశ్వాసం సరిఅయినదేనని ఎవరైనా భావించ వచ్చును. యథార్థ మేమిటంటె, వాళ్ల ఈ ప్రవర్తనకు ఆవిడవిశ్వాసమే కారణం. ఆ ఇల్లాలు తనపిల్లలిద్దర్నీ ఒకరిమీద ఒకరిని కాపలాపెట్టటమే కాక ఒకరినించి ఒకరిని సంరక్షించటంలో చాలా ప్రయాసలకు లో నయ్యేది. ఆ ఇద్దరిలోనూ ఏ ఒకరుగాని రెండోవారిమీద ఏనేరం మోపినా సరే, ముందూ వెనకా ఆలోచించ కుండా శిక్షించేది. ఎవరివిషయంలో వారు నిజం చెప్ప రని ఆవిడ కెంత విశ్వాసమో, రెండోవాళ్ల విషయం అబద్ధం చెప్పరనికూడా ఆవిడ కంతే విశ్వాసం.

ఎప్పటికన్నా ఈ ఇద్దరూ ఒక టవుతారని కాని, కావచ్చునని కాని ఆవిడకు తట్టలేదు. తమ్ముడికి అండగా నిలవాలనే భావం మొదట లక్ష్మికే కలిగింది. ఆపిల్ల తమ్ముడి దుష్ప్రవర్తన జాస్తి అవుతున్న కొద్దీ వాటిని తల్లిదగ్గిర బయటపెట్టటం తగ్గించింది—బయట పెడతానని తమ్ముణ్ణి బెదిరించటం జాస్తిచేసినా. శివం తనవిషయంలో అటువంటి ఔదార్యం ఇంకా పూనలేదనేవిషయంకూడా లక్ష్మిని బాధించలేదు.

లక్ష్మియొక్క ఈ మనస్తత్వానికి కారణాలు నిశ్చయించటం సులభంకాదు. దానికి కారణం స్త్రీలకు అధికంగా ఉండే సహనశక్తి కావచ్చు; లక్ష్మిలో త్వరగా వికసించిన మాతృత్వం కావచ్చు; ప్రతిఫలంకోరని సోదరీ ప్రేమ కావచ్చు; తల్లివల్ల తమ్ముడికి కలిగే శిక్షలో ఉండే న్యాయంలో అవిశ్వాసం కావచ్చు! ఇవేవీ కాకపోతే, ఇందుమూలంగా తమ్ముడిమీద తనకు దినదినమూ జాస్తి అవుతున్న అధికారంమీది ఈపి కావచ్చు.

కాని క్రియకు జరిగిం దేమంటే, లక్ష్మికి తమ్ముడిమీద ప్రేమ రహస్యంగా వృద్ధికా సాగింది — ఆ ప్రేమకు శివం అసహ్యుడవుతున్న కొద్దీ! మనం క్షమించ గలిగిన మనిషిని ఎప్పటికైనా ప్రేమించగలుగుతాం; శిక్షించే మనిషిని ఎప్పటికీ ప్రేమించలేం సరేకదా, మన శిక్ష ఎంత న్యాయమైనదైతే మనకు ప్రేమ అంత అసాధ్యమవుతుంది! ఈ రహస్యం తెలియక ఆ పిల్లలతల్లి తనసంతానాన్ని ఎప్పుడూ న్యాయంగానే శిక్షించేది! ఆవిడ తన పిల్లల్ని అన్యాయంగా శిక్షించినా పశ్చాత్తాపంద్వారా ప్రేమ సాధ్యమై ఉండును — వానికి రహస్యంగా అక్కమీద ప్రేమ ఉండినట్టు.



ఉగాదిపండుగ సంబరము

4. ఇంటిముంగిట ముగ్గుల అలంకరణము

పండుగనాటికి ముందురోజు సాయంత్రమైనా, లేదా పండుగనాటి తెల్లవారయినా ఇంటా, బయటా పిండిముగ్గులు పెట్టి గృహాలంకరణం చేయడం పరిపాటి.

“నీకు రావణాసురుడంటి మొగుడు రావల్లే! అప్పుడు గాని నువ్వు చచ్చినట్టు పడి ఉండవు!” అనేవాడు శివం ఇంచుమించు ప్రతిరోజూ. పైకి అట్లా అంటూనే వాడు లోలోపల ఆశ్చర్యపొయ్యేవాడు తననోటికీ, తన హృదయానికీ ఉన్న వైరం చూసి. తనమనస్సును నోటితో దాస్తున్న సంగతి వాడెరగడు. వాడికంత ఆత్మజ్ఞానం లేదు.

లక్ష్మికి సంబంధం విచారిస్తున్నది వాని పినతండ్రి. ఆయనగారిని చూస్తే శివానికి మొదటినించీ పైకి భయమూ, లోపల కోపమూనూ. (వాడి చదువు విషయమూ, వాణ్ణి హద్దులో ఉంచాలనే విషయమూ మొదటినించీ ప్రచారంచేస్తూ వచ్చింది ఆ పెద్దమనిషే!)

ఆయన లక్ష్మిపెళ్లిబరువంతా తనమెడమీదనే ఉన్న సంగతి ఏమాత్రమూ దాచకపోగా అప్పుడప్పుడూ “అబ్బబ్బ! సొంతపిల్లలకు సంబంధం వెతకటమే కష్టం! మరొకరి పిల్లలకు వెతకటంకంటె బాధుఖోపని ఇంకోటి ఉండబోదు!” అని అపసోపాలు పడేవాడు.

ఆయన ఆమాట అన్నప్పుడల్లా శివానికి శివమెత్తేది. తనఅక్కపెళ్లిభారాన్ని తన పినతండ్రి సంతోషంతో భరించాలని వాడి అభిప్రాయం కావచ్చును! అంత అయిష్టంతో చేసే సహాయం స్వీకరించటానికి తనతల్లి కెట్లా సిగ్గులేదా అని వాడికి అనిపించేది. అది అట్లా ఉండగా ఆ పినతండ్రి సొంత అల్లుణ్ణి వెతకటానికయితే ఎంత శ్రమపడునో అందులో కొంతమాత్రమే

3

లక్ష్మికి సంబంధం విచారిస్తున్నారు. అది ఏక్షణాన పెద్దమనిషి అవుతుందో నని ఒకరికొకరు అవకాశం దొరికినప్పుడల్లా చెప్పుకోవటం ఫాషనుగా ఉంది వాళ్ల బంధువర్గంలో. నిజానికి లక్ష్మిలో అటువంటి లక్షణాలింకా ఏమీ లేవు. అది పదకొండేళ్ల పిల్ల అంటే ఎరగని వాళ్లు నమ్మటంకూడా కష్టమే. శివం అక్కకన్నా కనీసం రెండేళ్లు పెద్దవాడనిపిస్తాడు. కనక ఆభయం నిజంగా ఎక్కువమందికి లేదు. పైగా అటువంటి అపూర్వమైన సంఘటన జరిగితే ఏమవుతుందో తెలుసుకుందా మని లోపల చాలామందికి ఉందికూడానూ.

పడి లక్ష్మికి మొగుణ్ణి తీసుకురాబోతున్నా డని అస్పష్టంగా అర్థంచేసుకుని శివంమనస్సు అదోకవిధమైన ఆరాటంలో పడసాగింది. ఆ ఆరాటానికి తగినట్టే లక్ష్మిని చూడటానికివచ్చే ఒక్కొక్క వ్యక్తిని కళ్లారా చూస్తున్న కొద్దీ దానిపెళ్లి జరగవలిసినట్టు జరగదనే భయం శివానికి జాస్తి కాసాగింది.

ఇప్పటి మనస్థితిలో లక్ష్మిని పెళ్లాడటానికి సాక్షాత్తూ ఆ నిషధేశ్వరుడే వచ్చినప్పటికీ అతను శివంయొక్క తీవ్రవిమర్శకు గురికాకుండా తప్పేటట్టు లేదు — వాడి పినతండ్రి ఆటే కట్నం ఖర్చులేకుండా చూసి తెచ్చిన చవుకబారు సంబంధా లొకలెక్కా?

ఆఖరుకు లక్ష్మివివాహం స్థిరమయింది. పిల్లను చూడటానికి వరుడు స్వయంగా రాలేదు; తనతల్లినీ, అక్కగారినీ తోడిచ్చి తండ్రిని పంపాడు. ఆ వచ్చిన వారి అందచందాలనుబట్టి వరుడిమీద శివానికి మంచి అభిప్రాయం కలగలేదు. (ఆ విషయం విచారించినవారు లేక పోవటం శోచనీయాంశం!) వచ్చినవారు పిల్లను చూసి, నిరభ్యంతరంగా మెచ్చుకున్నారు. ("మీ వెధవమెప్పె వరికి కావాలి? మా అక్కయ్య మీ ప్రాణాలకి భూలోకరంభే!" అనుకున్నాడు శివం నిర్లక్ష్యంగా!)

వరుడు స్కూలుఫైనలుదాకా చదివి మానేశాడని విని లాగుముడి నమ్మకంగా విప్పుకోలేని శివం— స్కూలుఫైనలుదాకా చదువుదామనే ఆశగాని, ధైర్యంగాని లేని శివం— పెదిమ విరిచాడు.

వరుడికి బోలెడంత ఆస్తి ఉందని తెలిసి శివానికి మండిపోయింది. ఆ ఆస్తికి లక్ష్మిని బంధువు లంతా కలిసి విక్రయిస్తున్నారని శివం తన అంతరాత్మలో రూఢిచేసుకున్నాడు.

బంధువు లంతా కలిసి ఈ సంబంధం చాలా బాగుం దని ఒకరితో ఒకరు అనుకుంటున్నకొద్దీ శివానికి ఒంటరితనం దుర్భర మైపోయింది. తనపక్షం పలికేవాడు ఒక్కడన్నా లేడా? ఇంతమందీ కట్టుకట్టి తననూ, లక్ష్మినీ ముంచాలని చూస్తున్నారా? తన కింకా నాలుగేళ్లు — కనీసం మరో రెండేళ్లు — ఉన్నట్టయితే వీళ్ల ఆటలు సాగునా?

తనబాధ కంతా కారణం అసూయ అని శివం ఎరగడు. వాడి కెవరు చెబుతారు? అసలు వాడు బాధపడుతున్న సంగతి ఎవ రెరుగుదురు— వాడిస్నేహితుడు హనుమంతాయితప్ప!

హనుమంతాయీ, తనూ చెరువుగట్టున కూర్చుని లక్ష్మిపెళ్లివిషయం చాలాసేపు చెప్పుకున్నారు — బీడీలు కాలుస్తూ! కనీసం తను చెబుతుంటే హనుమంతాయి సహృదయంతో విన్నాడు.

"వాడు పట్టి పల్లెటూరిగబ్బిలాయిరా!" అన్నాడు శివం— బీడీపొగ వదులుతూ, మొహంలో ఒకవిధమైన విచారమూ, బీడీఘాటూ కనబరుస్తూ. "డబ్బుంది వెధవకు! అయితే చదువులేదు వెధవకు! వెధవ కోతిమాదిరిగా ఉంటాడు!" (తను వరుణ్ణి చూడలే దన్న సంగతి హనుమంతాయితో చెప్పకపోతేనేం? రేపు రుజువయ్యే విషయమేగా!)

హనుమంతాయి కొత్తబీడీ పాతబీడీతో అంటిస్తూ, "ఈపెళ్లిళ్లు —!" అన్నాడు గంభీరంగా.

4

శివంబావమరిది కనకయ్య తనబావమరిది అంటే మొదటినించీ ఒకవిధమైన వాత్సల్యం కనబరుస్తూ వచ్చాడు. ఈ వాత్సల్యం శివంహృదయంలో ఎటువంటిమంట పుట్టించిందీ కనకయ్య ఎరగడు.

కనకయ్యను శివం ఏవిధంగానూ క్షమించలేకపోయినాడు. కనకయ్య అసలు ఎవడూ? తన్ను "ఒరేయ్" అని పిలవటానికీ, ఏమైనా పనులు చెప్పటానికీ వాడికి ఏమధికారం ఉందీ? లక్ష్మిమొగుడై కూర్చోవటానికే మధికారం ఉందీ? వాడు (తనలో తను తన బావమరిదిని వా డనుకోవటానికికూడా శివానికి చాలా సాహసం కావలసివచ్చిందని పాఠకు లూహించాలి!) వాడు తను అనుకున్నంత కోతిగా ఉండకపోవటమేం? బావమరిది అయినందుకే తన కింతగా పనులు చెప్పి తనమీద అధికారం చలాయిస్తున్నవాడు రేపు లక్ష్మిమీద ఎంత అధికారం చలాయించడూ?

పెళ్లివైభవమూ, ఉత్సాహమూ తనని అంటకుండా ఉండేటందుకు శివం తనయీడుకు మించిన

అమానుషమైన ప్రయత్నం చేసి గెలిచాడు. ఆ అయిదు రోజులూ పిచపిచగా తిరిగాడు; వెలుతురుకూడా రాని మూలల నక్కాడు; ఎవరికీ కనిపించలేదు; భోజనం కూడా సరిగా చెయ్యలేదు; కొత్తబట్టలైనా కట్టుకోలేదు. అయితే ప్రత్యేకించి శివంవిషయం గమనించిన వారు లేకపోయినారు.

పెళ్ళికూతుర్ని చేసిన లక్ష్మి అందరికీ నేత్రపర్వంగా ఉంటే శివంకళ్లకి ఎవరోఅల్లే కనిపించింది. దానివంక చూసి వాడు, "ఇది నా అక్క!" అని అనుకోలేకపోయినాడు; చూడలేకపోయినాడు కూడానూ! పెళ్లయిన నెల దాకా లక్ష్మి వాడిదృష్టిలో మామూలుమనిషి కాలేదు.

పెళ్లి అయిన రోజునించీ అక్కాతమ్ముళ్లకు కొత్త సంబంధం ఏర్పడ్డట్టయింది. ఇద్దరూ పరస్పరానురాగం వెనకటికన్నా స్వేచ్ఛగా చూపించసాగారు. ఈ విషయంలో శివానిది పరిపూర్ణమైన పరివర్తన. వాడు లక్ష్మివివాహం గురించి తన అభిప్రాయం స్పష్టంగా లక్ష్మికి తెలియచేశాడు. లక్ష్మి తమ్ముడి ఉద్దేశం అర్థం చేసుకోలేదుగాని వాణ్ణి మార్చటానికి ఏ ప్రయత్నమూ చెయ్యలేదు. శివం తనని గుచ్చిఅడిగినప్పుడుమాత్రం తన కేసంబంధమైనా ఒకటే నని తమ్ముణ్ణి నమ్మించింది. ఆ నమ్మకం శివంఆరాటాన్ని కొంతవరకు తగ్గించింది కాని సంతృప్తిమాత్రం కలిగించలేదు. తనకు సరిఅయిన భర్త రాలేదని లక్ష్మి ఎప్పటికైనా తెలుసుకుంటుం దని శివం లోలోపల భయపడుతూనే ఉన్నాడు.

శివానికి తన బావమరిదితో ప్రవర్తన ఎంత కాలానికీ గాడిలో పడలేదు—కుదరలేదు. దారుణమైన దురభిప్రాయంతోనూ, ఏవగింపుతోనూ ప్రారంభించి శివం తన్ను తను సంస్కరించుకునేప్రయత్నంలో కనకయ్యకు అతిమంచిగా పరిణమించాడు. మళ్లీ దాన్ని సంస్కరించుకునేప్రయత్నంలో అతిద్వేషం ప్రకటించాడు. శివంప్రకృతి కనకయ్యమీదిగా అటునించి ఇటూ, ఇటునించి అటూ ఉయ్యాల లూగసాగింది.

"మా బావమరిదితో ఎటు పోయినా చిక్కే. మరోనిమిషానికి వాడిబుద్ధి ఎట్లా ఉండేదీ తెలీదు. వాడికి మొత్తానికి చపలచిత్తమే." అని కనకయ్య నిర్ధారణ చేశాడు—శివంతో తగుమాత్రం అనుభవం అయిన మీదట.

ఒళ్లు పై తెలియకుండా తిరిగేవాడు ఒకదెబ్బ తిన్నమీదట కొంత నిషా దిగి, ఇంకా దెబ్బలు తగిలిన కొద్దీ మామూలుమనిషికింద మారి బాధ్యతగుర్తించటం నేర్చుకుంటాడు. లక్ష్మిపెళ్లి శివానికి దెబ్బగా పరిణమించింది. వాడిపొగరు కనీసం సగమైనా చచ్చింది. చదువుమీద వాడికి కొంతధ్యానం పుట్టింది. ప్రశ్నలకు మరీ కొక్కిరాయిసమాధానా లివ్వటం చాలావరకు తగ్గించాడు.

5

లక్ష్మిపెళ్లికి ఇరవైఅయిదువందలు అప్పయింది. ఖర్చు అమితంగా అయిం దని విమర్శించినవాళ్లతో శివంపినతండ్రి తగూ పెట్టుకోలేదు. ఆయన ఏమాత్రమూ చలించకుండా "ఇదే నాకూతురిపెళ్లి అయితే పదిహేనువందలపైన ఒక్కకానీ అయిఉండదు!" అనేశాడు. పరోపకారం చెయ్యటంలో ఉన్న కష్టసుఖాలు ఆ ఒక్కముక్కలోనే విదితమయినై — అర్థంచేసుకోగలవాళ్లకి.

ఈ పెళ్లిలో ఆపెద్దమనిషి కనీసం నాలుగైదువందలు కొట్టేశాడని వదంతి ఒకటి పడింది. కాని ఈ మాట ఆయనతో ఎవరూ అనలేదు. అంటే తప్పక చక్కని భావగర్భితమైన సమాధానం ఇచ్చిఉండేవాడే.

జరిగిందేమో జరిగిపోయింది. ఈ బాకీతీరేమార్గం కనిపించలేదు—ఉన్న ఏడెనిమి దెకరాలభూమిలో కొంత అమ్మటంతప్ప. అనాదిగా (అంటే పదిహేను సంవత్సరాలనించీ) వస్తున్న పొలంలో ఏడోవంతో ఎనిమిదోవంతో అమ్మటం అందరికీ కష్టంగానే ఉంది. కాని అమ్మకతప్పదని అంతా గ్రహించారు. అయితే ఇక్కడ మళ్లీ శివంపినతండ్రిగారి లౌక్యజ్ఞానం చాలా ఉపయోగపడింది.

"ఆబాకీ దానంతట అదే చెల్లుబడిపోతుంది. శివం చదువుపూర్తిచేసి నాలుగు రాళ్లు సంపాదించి వాడిపొట్ట వాడు పోసుకోవటం మొదలుపెట్టగానే పొలంలోవచ్చేదీ

యట్టుకో నవసరం ఉండదు. దానితో అప్పుకాస్తా తీర్చ
చ్చు. ఈలోపల ఉండే ఏసాలు కాసాలు ధాన్యం
మ్మేసి బాకీలో చెల్లువేసేదీ, ఏ నెల కావలసింది ఆ నెల
ప్పుచేస్తూ ఉండేదీ! బంగారంవంటి పొలం ఎందుకు
డుచేస్తారు? మళ్లీ మనశివం సంపాయించబోయి
డా, పెట్టబోయినాడా?" అన్నా డా పెద్దమనిషి.

"నేను సంపాదించటమూ పెట్టటమూ లేకపోతే
బాకీ తీరనేతీరదుగా! నేను సంపాయిస్తే ఈమాత్రం
లం అప్పుడే కొనుక్కోవచ్చుగా!" అన్నాడు శివం
లివిగా. ఆ ముక్కతో పినతండ్రిపడిన కంగారు వాడికి
నలో మూడోవంతు వయసులేని సత్యం, పెద్దల్లుకూడా
మాట్లాడలేని తనతో ఇట్లా మాట్లాడటం సహించలేక
డిపినతండ్రి వెర్రివాడల్లే పేలాడు. ఆ పేలాపనయొక్క
రాంశం ఏమంటే: "శివం సంపాయించడని తన అను
మానమేకాని, సంపాయించకుండా ఉండాలని తన అభి
ప్రాయం కాదు; ఇప్పుడు రెండెకరాలు పోగొట్టుకుంటే
ఈ రెండెకరాలే రమ్మంటే ఎప్పుడూ రావు!"

చిన్నపిల్లలుకూడా అర్థంఉన్న తెలివిని విమర్శించ
లరు. కాని ఇటువంటి అర్థమూ, సందర్భమూ లేని
అతితెలివిని విమర్శించలేరు. శివం మళ్లీ నోరెత్తలేదు.

శివంగారి కుటుంబానికి సంవత్సరానికి సుమారు
అయిదువందల రాబడి. లక్ష్మిపెళ్లి కయిన అప్పుమీద
వడ్డీ మూడువందలు. కనక రాబడి అప్పులో చెల్లు
య్యటంవల్ల అసలులో రెండువందలుమాత్రమే చెల్లు
డేది. పైగా ఈ కుటుంబానికి నెలకు ముప్పైఅయినా
కుండా జరగదు. ఈ నాలుగువందలూ చిల్లర చిల్ల
గా అప్పుతీసుకురావటంవల్ల వడ్డీద్వారా కలిసివచ్చేది
జ్ఞాయింపున సంవత్సరానికి పాతికరూపాయ
లంటుంది. ఈ పాతికరూపాయల కోసం ఒక అప్పుల
డికి మరో ఏడెనిమిదిమంది చిల్లరబాకీదార్లు జత
యినారు. కాస్త ఆలస్యమై డబ్బు అనుకున్న నాటికి
ందకపోతే ఇంటో బియ్యానికీ, ఉప్పుకీ, పప్పుకీ కూడా
జగిజలాడుకోవలసివచ్చేది. చివరకు ఏవిధంగా పరిణ
మించిందంటే, పొలంమీదవచ్చేది సంవత్సరమల్లా చేసిన
కీలు తీర్చటానికిమాత్రమే సరిపొయ్యేది. హాయిగా
బ్బు దగ్గిరపెట్టుకుని జీవించే కుటుంబం చేబదుళ్లమీద
బతకవలిసివచ్చింది. పెద్దబాకీలో మొదటిసారి వేసిన
అయిదువందల చెల్లు తప్ప మరో కానీ చెల్లుకూడా పడ్డ
పాపాన పోలేదు! శివం పినతండ్రిగారి లౌక్యానికి ఫలితం
ఇదీ.

పొదుపుగా జీవించటమంటే డబ్బుకోసం ఇబ్బంది
పడుతూఉండటమే నని విశ్వసించే శివంతల్లి కీఏర్పాటు
సమ్మతమయింది. శివానికిది ఏమాత్రమూ రుచించ
లేదు. వాడు ఒక కానీపెట్టి కొనుక్కుతినాలన్నా, ఒక
అణాపెట్టి సినిమాచూడాలన్నా "అదుగో నువ్వు సంసారం
దివాలాతీస్తున్నావు!" అనేది తల్లి. "వెనక జరిగినట్టు
కాదోయ్! ఇప్పుడు కాస్త ఒళ్లుదగ్గిరపెట్టుకుని ఉండాలి!"
అనేవాడు పినతండ్రి—లక్ష్మిపెళ్లినాటినించీ ప్రపంచాని
కొక కొత్తశకం ప్రారంభమైనట్టుగా.

"ఉన్న బాకీ లన్నీ నేను ఖర్చుచేసే కాన్లతోనూ,
అణాలతోనూ తీర్చేటట్టున్నారు!" అని శివం అంటే,
పినతండ్రి "నాలుగుకాన్లు అణా! పదహారణాలు ఒక
రూపాయి!" అని జ్ఞాపకంచేసేవాడు శివానికి. ఆయన
ఆటే మాటలమనిషి కాదు!

6

1930 నడిమధ్యను ప్రపంచ ఆర్థికపరిస్థితులు
తల్లకిందులైనప్పుడు ధనాభావంవల్ల శివం తన ఇంటరు
చదువు కట్టిపెట్టి కొంప చేరవలసివచ్చింది. అప్పటికి వాడి
బాకీలు దాదాపు అయిదువేలకు చేరబడినయి. కుంగి
పోయిన ధరలవల్ల ఆస్తివిలవకూడా అంతే అయింది.
బాకీదార్లంతా తొందరపడుతున్నారు.

ఈ సమయంలో కనకయ్య శివానికి దేవుడల్లే
అడ్డపడ్డాడు — కనీసం అంతా ఆమాట అన్నారు.

"నీ బాకీ లన్నీ నేను తీరుస్తాను. ఏమైనా వ్యాపారం
చేసుకునేటందుకు కొక అయిదువంద లిస్తాను. నీ పొలం
యావత్తూ నాకు రాసివ్వు!" అన్నాడు కనకయ్య బావ
మరిదితో.

"ఏ ధరప్రకారం?" అన్నాడు శివం.

"అందరూ తీసుకునే ధరే!" అన్నాడు కన
కయ్య.

భాస్కరరామాయణ సమస్య

కర్తృత్వ విభేదపరిశీలన

డా. నేలటూరి
వెంకట
రమణయ్య



తెనుగు రామాయణములన్నింటను భాస్కర రామాయణము ప్రాచీనతమము. ఆంధ్రమహాభారతమువలె నదియు బహుకర్తృకము. ఈ గ్రంథోత్పత్తిని దెలుపు నైతిహ్య మొకటి గలదు. దాని నిచ్చట సంగ్రహముగ వివరించెదను.

పూర్వ మొకరాజు కలడు. ఒకప్పు డతడు నిజబంధు డగు రంగనాథు డను కవిని రప్పించి రామాయణమును ద్విపదకావ్యముగా రచింపుమని యాజ్ఞాపించెను. దీని నెరిగి మత్సరగ్రస్తుడగు తదాస్థాన కవియగు భాస్కరుడు రాజుకడకు జని తా నొక రామాయణమును పద్యకావ్యముగా ఏలినవారి కంకితమొసగు తలపుతో విరచించు చుంటిననియు, దానిని బరిగ్రహింపవలె ననియు వేడుకొనెను. రాజందుల కంగీకరించి, తాను రంగనాథున కొసగిన యాజ్ఞను జ్ఞప్తి పరచి, రంగనాథభాస్కరులలో నెవరు గ్రంథమును ముందు రచించి తెచ్చిన వారిగ్రంథమును గొనెదనని చెప్పెను. రంగనాథునికంటె పూర్వమే గ్రంథమును వ్రాసి ముగించి రాజున కంకిత మొసగవలయు నని తలచి భాస్కరుడు తనపుత్రు డగు మల్లికార్జునభట్టును, శిష్యు డగు కుమారరుద్రదేవుని, మిత్రుడగు నయ్యలార్యుని సహాయులనుగా చేర్చుకొని గ్రంథము నచిరకాలముననే సంపూర్తి యొనరించి రాజసభకు గొనిపోయెను. కానియప్పటికే రంగనాథుడును స్వవిరచితద్విపద రామాయణమును రాజునకర్పింప గొనివచ్చెను. రాజు కవులిద్దరును నేక కాలమున వారిగ్రంథములను స్వసన్నిధానమునకు గొనివచ్చుట నెరింగి, రంగనాథునియెడ నించుక పక్షపాతము జూపి, యాతనిగ్రంథమును గొన కుడిచేతిని, భాస్కరునిగ్రంథమును గొన నెడమచేతిని జాచెను. ఆసత్కృత్యమును తెలుసుకొని భాస్కరుడు కోపించి స్వవిరచితగ్రంథమును రాజున కియ్య నంగీకరింపక, రాజసేవయందున్న గుజ్జువాడను మారున కంకిత మొనర్చెను. తత్కారణముననే సాహిణిమారుడు కృత్యాద్యంతములయందు సంబోధింపబడెను.

ఈకథయం దెంతసత్య మున్నదో తెలియదు. తెనుగున రంగనాథరామాయణ మను నొక ద్విపదరామాయణము కలదు; దాని రచయిత రంగనాథుడుకాడు. కోన బుద్ధరాజను క్షత్రియుడా గ్రంథమును రచియించినట్లు అందు చెప్పబడియున్నది. మరియు నా కవిత్వరీతిని, గ్రంథాంతర్గతశబ్దజాలమును బట్టిచూడ రంగనాథరామాయణము భాస్కరరామాయణమునకంటె అర్వాచీనమైన గ్రంథ మని తోచుచున్నది. పైకథయందలి ఇతరవిషయముల నిజానిజముల నరయవలసిన పని యెద్దియును గానరాదు.

ఇక భాస్కరరామాయణసాక్ష్యమువల్ల తద్గ్రంథోత్పత్తి తెరగెరుంగ వీలగునేమో చూతము. ముద్రితప్రతియందు గ్రంథకర్తలను గూర్చి ఈ క్రింది విషయములు తెలియుచున్నవి.

ఆరంభకాండ యగు బాలకాండయందు కృత్యాద్యవతారిక లేదు. సామాన్యముగ నన్ని యాంధ్రగ్రంథములవలె గ్రంథారంభమున నుండు మంగళశ్లోకమేనియు లేదు. ఈ కొరత మాన్పుటకు, పాపము, వావిళ్లవా రెచ్చటనుండియో యొక పద్యమును దెచ్చి యతికిపెట్టినారు. అది కాండాంతపద్యముల బోలి శివుని సంబోధించక వాల్మీకిని స్తోత్రముచేయుచున్నది. మల్లి కార్జునని గ్రంథమును వ్రాతప్రతులబడి ముద్రించక ఈయసంగతపు టతుకు నేల పెట్టిరో తెలియదు.* 'రాముని శుభచరితంబును' అను కందపద్యముతోడనే గ్రంథమారంభమగుచున్నది. తెనుగున భాస్కరరామాయణ మొకటి దప్ప కృత్యాదిని మంగళశ్లోకాదులు లేని కావ్య మెచ్చటను గానరాదు. ఇది విచారణీయము. కాండాంతపద్యములను బట్టిచూడ బాలకాండ శివునికంకితము సేయబడినట్లు తెలియుచున్నది. గద్యయందు అష్టభాషాకవిమిత్రుడును, భాస్కరసత్కవి పుత్రుడును నగు మల్లికార్జునభట్టు విరచించినట్లు చెప్పియున్నది. ఇట్లే కిష్కింధకాండ శివాంకితముగ పైమల్లికార్జునభట్టుచేతనే వ్రాయబడినది. కాని కాండాంతపద్యములయం దొకటి సాహిణిమారుని, మరియొకటి పరమేశ్వరుడగు శివుని సంబోధించుచున్నవి. సుందరకాండయు పైరెండు కాండలవలె మల్లికార్జునభట్టుచేతనే రచింపబడినను కాండారంభమున సాహిణిమారుడును, కాండాంతమున ఈశ్వరుడును సంబోధింపబడియున్నారు. అయోధ్యకాండను రచించిన కవి శారదాముఖముకుర రాయమాణుడును, సారస్వత భట్టబాణుడును, వీరమారయ కుమారుడును నగు కుమారరుద్రదేవుడని కాండాంతగద్యము తెలుపుచున్నది. కాండాద్యంతపద్యములు బుద్ధయకును, కావమాంబకును పుత్రుడగు సాహిణిమారుని సంబోధించుచున్నవి. ఇతరకాండలవలె గా

---

* మరియు 1930-వ సంవత్సరమున ముద్రించిన ప్రతియందు సంగ్రహరామాయణ మను నొక చిన్నగ్రంథమును జేర్చియున్నారు. ఇది యెవ్వరికృతియో తెలియదు. భాస్కరరామాయణమును యథామాతృకముగా ముద్రించక నూతనగ్రంథముల నం దేల చొప్పించిరో?

అరణ్యకాండ రెండాశ్వాసములుగ విభజింపబడియున్నది. ప్రథమాశ్వాసమునందలి మొదటిపద్యము సాహిణిమారుని సంబోధించుచున్నది; ఆశ్వాసాంతపద్యములు తక్కిన కాండలయందలి పద్యములవలె కృతిపతిని సంబోధింపక ప్రథమావిభక్త్యంతములగు వాక్యములచే వరని గుణములను వర్ణించుచున్నవి. కవి భాస్కరుడని ఆశ్వాసాంతమునందలి గద్య తెలుపుచున్నది. ద్వితీయాశ్వాసారంభపద్యము కృతిపతిని సంబోధించక హరిభక్తుడును, సాహిణీతిలకమును నగు మారయధరణీరమణుని ప్రథమాంత వాక్యములచేత ప్రశంసించుచున్నది. ఆశ్వాసాంత పద్యములు మూడును ద్వితీయావిభక్త్యంతములు. రెండాశ్వాసములయందును ఆశ్వాసారంభపద్యములు కృతిపతిని జేర్కొనుచున్నను ఆశ్వాసాంతములవల్ల నతడెవ్వడో కనుగొనుటకు సాధ్యము గాదు. రెండవయాశ్వాసమును రచించిన కవియు భాస్కరుడే. యుద్ధకాండయందలి మొదటి పద్యమున సాహిణిమారుడు సంబోధింపబడియున్నాడు. ఆశ్వాసాంత పద్యములయందు శివుడు సంబోధింపబడియున్నాడు. ఇతర కాండల వలెగాక యుద్ధకాండను రచియించిన కవు లిరువురు. మొదట కొంత భాగమును హుళక్కి భాస్కరమహాకవి రచించెనట. తరువాతి భాగమును నయ్యలార్యుడు సంపూర్తి యొనర్చెనట. ఇట్లు భాస్కర రామాయణమును అయిదుగురు వ్రాసినట్లు తెలియుచున్నది.

మల్లికార్జునభట్టు బాలకిష్కింధసుందరకాండలను, కుమారరుద్రదేవుడు అయోధ్యకాండమును, భాస్కరుడు అరణ్యకాండమును, హుళక్కి భాస్కర అయ్యలార్యులు యుద్ధకాండము వ్రాసిరని ముద్రిత భాస్కరరామాయణ ప్రతివలన తెలియుచున్నది. ఇది పైనుదాహృతమైన భాస్కరరామాయణ రచనావిధానమును చెల్లు నైతిహ్యమునకు గొంచె మించుమించుగా సరిపోవుచున్నను ఈకవు లందరును సమకాలికులో కారో, మరియు వారియం దొండొరుల కెట్టి యేనియు సంబంధముకలదో లేదో విచారించవలసియున్నది. భాస్కర రామాయణమును రచించిన కవు లందరియందును నయ్యలార్యు డొక్కడే స్వవిషయమును కొంత తెలిపియున్నాడు. తాను శాకల్య మల్లకవిపౌత్రుడ ననియు, వీర(లేక, రామ) నరసింహుని తమ్ముడను అప్పలార్యుని పుత్రుడ ననియు యుద్ధకాండాంతగద్యయందు తన తాతతండ్రులను జేర్కొనియున్నాడు. శాకల్యమల్లకవి కాకతీయ ప్రతాపరుద్రుని యాస్థానమున నుండెనని సోమదేవరాజీయమునందును, నవ్యకవీయమునందును వ్రాయబడియున్నది. ఈశాకల్యమల్లుడు గొప్పకవి; సంస్కృతమునం దుదారరాఘవాదికావ్యములను పెక్కింటిని రచించెను. ఇతడు విజయనగర చక్రవర్తియగు హరిహరరాయల కాలమున నుండెనని ప్రసంగరత్నావళియం దుదాహృతమైన యొకశ్లోకమువలన దెలియుచున్నది.

విజయనగర చక్రవర్తులయందు హరిహరనామాంకితు లిరువురు కలరు. అం దొక్కడు సంగమరాయలపుత్రుడు. ఇతని కాలముననే విద్యారణ్యయతీంద్రుడు విద్యానగరమును నిర్మించెను. ఇతడు క్రీ. శ. 1336 మొదలు 1355 వరకును రాజ్యపరిపాలనము నొనర్చెను. రెండవ హరిహరరాయలు క్రీ. శ. 1378 మొదలు 1404 వరకును ప్రభుత్వము సల్పెను. శాకల్యమల్లుడు ఓరుగంటిప్రతాపరుద్రుని యాస్థానమున నుండెననుట నిక్కమేని యాతడు మొదటి హరిహరరాయల కాలమువాడే కావలయును. ఈ యూహ సరియైనదనుట కొక నిదర్శనము గలదు. యుద్ధకాండప్రతులలో కొన్నిటియందు "ఉ. ఇంక బలీముఖుల్ బలిసి రక్కసిరావణు జేటిలంక" యనుపద్యమునకు దరువాత ఈ క్రింది వాక్యములు గనుపించుచున్నవి: "ఇందాకా భాస్కరుడు చెప్పిన రామాయణం. యిటుమీద వేదగిరి నాయనింగారు అయ్యలుభట్లచేత చెప్పించిన రామాయణము యుద్ధకాండ శేషము."[1] మరి కొన్నిటియందు "యింతపర్యంతం భాస్కరుని సన్నాహఘటన. ఇకమీందికథ వేదగిరినాయనింగారు శాకల్యమల్లనార్యుని మనుమడు అయ్యలుభట్లచే రచనచేయించిన యుద్ధకాండ శేషము."[2] ఒకానొక ప్రతియందు మాత్రము "యిందాకా భాస్కరుడు చెప్పిన కవిత్వం. యిటమీద శాకల్యమల్లుభట్లు చెప్పిన కవిత్వం" అని యున్నది.[3] ఈ వాక్యములయందు జేర్కొన్న వేదగిరి నాయనింగారు దేవరకొండ నేలిన వెలమప్రభువు. రసార్ణవ సుధాకరగ్రంథకర్త యగు రావు సింగమనేనికి పినతండ్రియగు మాదానేనిపుత్రుడు. ఇతడు తండ్రియనంతరము సింహాసనము నధిష్ఠించి క్రీ. శ. 15వ శతాబ్దారంభమున దేవరకొండయందు రాజ్యమొనర్చెను. ఇతనియనుచరులశాసనములు క్రీ.శ. 1405, 1407 సంవత్సరములనాటివి సింహాచలమునందును, శ్రీకూర్మమునందును గాన్పించుచున్నవి.[4] కావున వేదగిరినాయడు క్రీ.శ. 1400, 1410ల మధ్య రాజ్యము సల్పుచుండెనని నిశ్చయమగుచున్నది. ఈ రాజాజ్ఞచే యుద్ధకాండను సంపూర్తి యొనర్చిన అయ్యలార్యుడును నప్పటివాడే కావలయును. అయ్యలార్యుని తాతయగు శాకల్యమల్లభట్లు క్రీ. శ. 1404 లో మృతినందిన రెండవ హరిహరరాయల కాలమువా డనుటకన్న క్రీ. శ. 1336, 1355ల మధ్య రాజ్యమొనర్చిన మొదటి హరిహరరాయలకు సమకాలీను డనుట సమంజసము. ఇతని మనుమడగు అయ్యలార్యుడు క్రీ.శ. 15వ శతాబ్దారంభమున నుండె ననుట యథార్థమునకు విరోధము కాజాలదు.[5]

---

1. Madras Govt. Ori. Mss. Library 10-1-12 leaf 229 b. 2. Madras University Mss. Collection T/416 leaf 119 a. 3. Madras Govt. Ori. Mss. Library 10-18-2 (D 138) leaf 199. a. 4. S. I. I. V 1242, VI 1100
5. కందుకూరి వీరేశలింగంపంతులుగారు అయ్యలార్యుడును, హుళక్కి భాస్కరుడును నేకకాలమువా రను తమవాదమును నిర్వ

ఇందువల్ల హుళక్కిభాస్కరుడు అయ్యలార్యుని సమకాలీనుడు కాడనియు, పూర్వీకుడనియు తేలుచున్నది. ఇక నీభాస్కరు

హించుకొనుటకై వేదగిరి నాయనిగారు అయ్యలార్యునికి గల సంబంధము కల్పితమని నిరసించిరి. ఈ విషయమై వీరు కవులచరిత్రమున పంతులుగారు ఇట్లు వ్రాసియున్నారు: "అయ్యలార్య డిట్లయినను భాస్కరకవికి సమకాలీనుడే. ప్రతాపరుద్రుని యాస్థానములో శాకల్యమల్లుభట్టు పండితుడుగాను, భాస్కరుడు కవిగాను ఉండినందున శాకల్యమల్లుకవి తమ్మునికొడుకైన యయ్యలార్యుడు మల్లికార్జునకుమార రుద్రదేవులతో డియాడువాడై యుండును. కవి చెప్పినదానికి ప్రత్యక్షవిరోధముగా నెవ్వడో లేఖకు డెవ్వడో వేదగిరి నాయనింగారు చెప్పించిరని వ్రాసినమాట పాటింపదగినదిగాదు." (కవులచరిత్రము, ప్రథమభాగము, పుట 319) పంతులుగారివాదములో రెండువిషయములు పరామర్శింపదగియున్నవి. మొదటిది: అయ్యలార్యుడు శాకల్యమల్లునిపుత్రు డనుట. ఇది తప్పు. వ్రాతప్రతు లన్నిటియందును "శాకల్యమల్లకవివర రామ (వీర)నరసింహావరజాప్పలార్యనందన....అయ్యలార్యవిరచితంబైన" అనియే యున్నది. దీనికి పంతులుగారు శాకల్యమల్లునియొక్కయు, రామనృసింహునియొక్కయు తమ్ముడైన యప్పలార్యునిపుత్రు డని వివరణము వ్రాసిరి. కాని "శాకల్య మల్లకవివర రామ (వీర)నరసింహా" యను వాక్యమునకు శాకల్యమల్లుని పుత్రుడైన రామ(వీర)నరసింహు డని యర్థము చేసుకొనుట సమంజసము. కొమ్మయతిక్కడు, ప్రోలయ వేముడు, సుడయనారసింహుడు,నరసింహాకృష్ణ రాయడు ఇందుకు తార్కాణ. కావున అయ్యలార్యుని వంశవృక్షము ఈక్రిందిరీతిగ నుండవలయును.

శాకల్యమల్లుభట్టు (?1315–1350?)

రామ(వీర)నరసింహుడు. | అప్పలార్యుడు

అప్పలార్యుడు → అయ్యలార్యుడు (1400–1410)

రెండవది: అయ్యలార్యుడు హుళక్కిభాస్కరునికి సమకాలీనుడు కాడు. అట్లని యాతడు చెప్పుటను జెప్పియుండలేదు. వేదగిరి నాయనింగారు చెప్పించి రని లేఖకుడు వ్రాసినది "కవిచెప్పినదానికి ప్రత్యక్షవిరోధము" కాదు. "చ. అమరహుళక్కి భాస్కర మహాకవిచెప్పగనున్న యుద్ధకాండము తరువాయి" అను పద్యపాదము పంతులుగా రభిప్రాయపడినట్లు అయ్యలార్య హుళక్కిభాస్కరుల సమకాలీనతను నిరూపింపజాలదు. హుళక్కిభాస్కరుడు యుద్ధకాండము కొంతవరకు జెప్పెను. అసమగ్రముగా నిలిచియున్న భాగమును అయ్యలార్యుడు రచించె ననిమాత్రము తెలియుచున్నది. భాస్కరుడే అప్పటికి సజీవుడై యుండిన అయ్యలార్యుడు దానిని సంపూర్తిచేయవలసిన యవసర ముండదు. కావున హుళక్కిభాస్కరు డేకారణముచేతనో యుద్ధకాండను అసంపూర్తిగా విడిచియుండగా తరువాత దానిని అయ్యలార్యుడు సంపూర్తియొనర్చెననుట యొప్పును.

డెప్పటివాడో తెలిసికొందము. సోమదేవరాజీయమున గాకతీయ ప్రతాపరుద్రదేవుని యాస్థానమున నితడున్నట్లు చెప్పియున్నది. కాని ఇది యెంత నిశ్చయమో తెలియదు. అయ్యలార్య డితడు యుద్ధకాండయందు మొదటినుండి కొంత గ్రంథమును రచించె నని చెప్పియున్నాడుగదా. ఆ యుద్ధకాండ సాహిణిమారున కంకిత మిచ్చినట్లు అందలి మొదటిపద్యమువల్ల దెలియుచున్నది. సాహిణిమారుని కాలమును గమనింపగల్గితిమేని భాస్కరుని కాలమును దెలియవచ్చును. సాహిణిమారునిగూర్చి కవులచరిత్రయందు వీరేశలింగంపంతులుగా రిట్లు వ్రాసియున్నారు: "సాహిణి మారన్న ద్వితీయ ప్రతాపరుద్రునికాలములో నాతని యశ్వసేనాధ్యక్షుడుగా నుండి,తద్రాజ్యము తురుష్కాక్రాంతమైనయనంతరమున స్వతంత్రుడై యొక దేశపాలకు డయ్యెను. భాస్కర రామాయణ మా కాలమునందే రచియింపబడి 1330వ సంవత్సరప్రాంతమునం దీ సాహిణిమారుని కంకిత మొనర్పబడియుండును." (కవులచరిత్ర, ప్రథమభాగము, పుట 304) ప్రతాపరుద్రుని కాలమున నాతని కొలువునం దొకమారయ సాహిణి యుండెనని శాసనములవల్ల దెలియుచున్నది. అతడశ్వసేనాధ్యక్షుడుగా నుండె ననుట సంశయాస్పదము. అతడశ్వసాహిణినో, గజసాహిణియో, లేక రాయపట్టసాహిణియో నిర్ధారించి చెప్పుటకు దగిన సాక్ష్యమేమియు గానరాదు. మఱియు నాతడు ప్రతాపరుద్రుని రాజ్యము తురుష్కాక్రాంతమైన పిమ్మట స్వతంత్రుడై, యొక దేశపాలకుడై, హుళక్కి భాస్కరునిచేత రామాయణము కృతిగొనెననుట నిరాధారమైన వ్రాత; పంతులుగారిచే కల్పితము. హుళక్కి భాస్కరునిచే సాహిణిమారుడు కృతిని గొన్నది వాస్తవమగునేని యది ప్రతాపరుద్రుని కాలముననే, అనగా క్రీ. శ. 1323 నకు పూర్వమే జరిగియుండవలయును. కాని హుళక్కి భాస్కరునికిని అరణ్యకాండను రచియించిన భాస్కరునికిని గల పరస్పర సంబంధ మెట్టిదో తెలిసికొనినగాని ఈ విషయమును నిర్ధారించి చెప్పుటకు సాధ్యముగాదు.

హుళక్కిభాస్కరుడే యరణ్యకాండరచయిత యని వాఙ్మయ చరిత్రకారు లందరును అభిప్రాయపడుచున్నారు. వీరి ననుసరించి చరిత్రజ్ఞానములేని యాంధ్రపండితులు వారికంటె దృఢముగా అరణ్య యుద్ధకాండలను రచించిన భాస్కరు డొక్కడే యని వాదించుచున్నారు. కాని వాస్తవమును విచారించగా నిది సంశయగ్రస్తముగ గన్పట్టుచున్నది.

కృత్యాద్యంతములు ఆంధ్రకావ్యములయందు రెండుతెరగులు గానవచ్చుచున్నవి: (1) కృత్యాద్యంతములందు కృతిపతిని సంబోధించు పద్యములు గలవి, (2) అట్లు సంబోధనలు గాక ప్రథమద్వితీ

...విభక్త్యంతములను పదములచేగాని, వాక్యములచేగాని కృతిపతిని గీర్తించుపద్యములు గలవు. భాస్కరరామాయణము ముద్రిత ప్రతియందు అరణ్యకాండము దప్ప తక్కిన కాండ లన్నియు మొదటి తరగతికి జేరినవి. వీనికి లింగముగా నున్నట్లు అరణ్యకాండమునందలి ప్రథమ ద్వితీయాశ్వాసాంతపద్యములు కృతిపతినిగూర్చి సంబోధనలు గాక వరుసగా ప్రథమ ద్వితీయాంతములుగా నున్నను నవి పైజెప్పిన రెండు తెగల కావ్యములలో దేనియందును జేరవు. ఏలనగా, విభక్త్యంతములచే గృతిపతులను గీర్తించిన కవులు పాటించిన నియమము నందు పాటించలేదు.

ఆంధ్రగ్రంథములలో విభక్త్యంతముల నాశ్వాసాద్యంతములు బ్రయోగించినకవులు ముగ్గురు: నన్నెచోడుడు, తిక్కన, కేతన. వీరు పాటించిన నియమములను శ్రీ శ్రీపాదలక్ష్మీపతిశాస్త్రిగారిట్లు వివరించి యున్నారు: "మంగళశ్లోకములతోగూడిన కృత్యాదిని విడిచి ద్వితీయాది ప్రత్యాశ్వాసాదియందును మొట్టమొదటి పద మేవిభక్తితో నుండునో యా విభక్తి జేర్చిన పదములతో దదాశ్వాసాదియందును, దత్పూర్వాశ్వాసాంతమునను గల కృతిపతిస్తుతిపద్యములను రచించిరి. కొన్ని యెడల నాశ్వాసాంతపద్యము ననుసరించి తదాశ్వాసాంతమునందును, తరువాతియాశ్వాసారంభమునను గల కృతిపతిస్తుతి పద్యములను వ్రాసిరి. మఱియు నాశ్వాసాది పదము ననుసరించక యాశ్వాసాదిపద్యమునగాని, గద్యమునగాని గల యీశ్వరవాచకము ననుసరించి కృతిపతిస్తుతిని రచించుటయు గలదు. కొన్నిపట్ల వాక్యమధ్యమున నాశ్వాసము ముగిసినపుడు తరువాతి యాశ్వాసారంభమునందలి మొదటిపదము ననుసరించుటయు గలదు."[1]

ఉగాదిపండుగ సంబరము

౬. తలంటు స్నానము

ఉగాదిపండుగనాడు తప్పనిసరిగా ఆచరించవలసిన విధులలో ఈ తలంటు స్నానమొకటి. చిన్నా, పెద్దా తారతమ్యాలులేక ఇంటిల్లిపాదీ ఆరోజు తలంటుస్నానం పోసుకొని తీరవలసిందే. అది మంగళస్నానం.



అరణ్య కాండాదియందలి సాహిణీమారుని సంబోధించు కృతిపతిస్తుతి పైనియమములకు వ్యతిరేకముగ గానవచ్చుచున్నది. మఱియు నీ పద్యమునకు పాఠాంతరము కొన్ని వ్రాతప్రతులయందు గానవచ్చుచున్నది.[2] ఇంకను ద్వితీయాశ్వాసారంభమునందలి కృతిపతిస్తుతి యచ్చుప్రతియందు ప్రథమాంతముగ నున్నను కొన్ని వ్రాతప్రతులలో కందచ్ఛందముతో సంబోధనతో గూడియున్నది.

అచ్చు:

"క. శ్రీరామాకుచయుగళీ
హారిద్రోల్లసితవక్ష హరిచరణపరా
ధారాధ్యుడు మారయధర
ణీరమణ త్రయుడు సాహిణీతిలకమిలక"

వ్రాత:

"క. శ్రీరామా కుచయుగళీ
హారిద్రోల్లసితవక్ష హరిచరణపరా
ధారాధ్యబుద్ధివిభునుతి
సారకపీశ తేజ ధీర సాహిణీమారా."

ఈపద్యమును వావిళ్లవారు బాలకాండమున రామాయణకథానుక్రమణికకును నయోధ్యాపురవర్ణనకును మధ్య జొప్పించిరి. గ్రంథమధ్యమున గృతిపతిని సంబోధించుపద్య మేల నిరికించిరో తెలియదు. వీరిపరిష్కారపద్ధతి కొన్ని యెడల దుర్గ్రాహ్యముగ నున్నది.[3]

మరియు కొన్ని వ్రాతప్రతులయందు అరణ్యకాండమునకు రెండారంభములు గలవు.[4] ఇంతేకాదు; రెండరణ్యకాండములు గలవు. వావిళ్లవారు తమ ముద్రితప్రతియం దంగీకరించినపాఠ మొకటి. ఈ పాఠముగల ప్రతులు అరుదు. నాచే బరిశోధితమైన 86 తాళపత్ర ప్రతులలోను ఈపాఠ మెందును గానరాలేదు. అధోజ్ఞాపికగ వా రంగీకరించిన పాఠము రెండవది. ఈ యధోజ్ఞాపిక పెక్కు ప్రతులయందు గల యధికపాఠముల సంకలనమని పాఠకులు భ్రమపడవచ్చును. పరిష్కర్త లట్టిసలవున కెడ మిచ్చియున్నారు. ఏకాండముగ తాళపత్ర ప్రతులయందు పెక్కింట సామాన్యముగ గానవచ్చెడి పాఠము. వీరే వ్రాతప్రతులనుండి యేయేభాగమును గొనిరో శాస్త్రీయపరిష్కారపద్ధతి ననుసరించి సూచించియుండిరేని పాఠకులకేగాక వాఙ్మయపరిశోధకులకు సైతము వీరిప్రతి యుపకరించి యుండెడిది. ఈ విషయముల నన్నిటిని ఆలోచనచేయగా భాస్కరుడు రచియించిన అరణ్యకాండము ప్రాచీను లెవ్వరో

1. కుమారసంభవవిమర్శనము, పుటలు 186-7. 2. Madras University Mss. Collection, T 40. 3. వావిళ్ల ముద్రిత భాస్కరరామాయణము, 1930 సం. ప్రతి, పుట 4. 4. Madras University Mss. Collection. T 119.

తారుమారుచేసినట్లు తోచుచున్నది. అట్లు మార్చి తిరుగ వ్రాసినవా రెవ్వ రని పరిశోధింపగా వారిలో కుమారరుద్రదేవు డొక్కడని తెలియుచున్నది.

ముద్రితప్రతియందును, కొన్ని వ్రాతప్రతులందును అయోధ్యాకాండమును కుమారరుద్రదేవుడు రచియించినట్లు చెప్పియున్నది. కాని పెక్కు తాళపత్రప్రతులవల్ల భాస్కరుడే తద్రచయిత యని తెలియుచున్నది. ఈ ప్రతులయం దయోధ్యాకాండమును భాస్కరునిగద్య యుండుటయేగాక అరణ్యకాండమునందువలె విభక్త్యంత ములతో గూడిన యాశ్వాసాంతపద్యములు గలవు. ఆ పద్యము లపరిచితము లగుటచే వాని నిచ్చట నుదాహరించుచున్నాను.

శా. మందారద్రుమసామ్యదానఘ(ఖ?)నియుక్తాదాంధవిద్వేషిరాట్
సందోహప్రకటోగ్రశౌర్యహరణోత్సాహస్ఫురద్బాహు డా
నందామోదిత భూసురప్రకరనా(నా?)స్తోత్రపాత్రుండు కుం
దేందుప్రఖ్యముఖారవిందుడు గుణాతీతుండు ధీరుం డిలన్.

క. బాలాబాలికనవహం
చాలుడు సుకవిజననికరసంస్తుతిపృథువా
చాలుడు సుఖ భరితయ
కోలలితుడు వైరిహృదయశూలుడు పేర్మిన్.

మాలిని:
భువనభరితకీర్తిస్ఫూర్తిధారోరు (శో?)త్రుం
డవిహితసుమశౌర్యాదస్ఫురచ్ఛత్రుమిత్రుం
డు వితరణరణోగ్రాటోపసప్తాశ్వపుత్రుం
డు విబుధజనరక్షాధుర్యుండు పన్నిత్రుడుర్విన్.

ఇంకొక కారణముగూడ గలదు. భాస్కరుడు రచించిన రామాయణమున ప్రతికాండాంతమునను ఫలశ్రుతిని దెల్పు సీసపద్య మొండు గానవచ్చెడిని. అరణ్యకాండాంతమందలి పద్యము వావిళ్ల వారు 1930 వ సంవత్సరమున ముద్రించిన ప్రతియందు 226 వ పుటక్రింది యధోజ్ఞాపికయందు ముద్రించి యున్నారు. ఈ పద్య మనేకతాళ పత్రప్రతులయందు గానవచ్చుచున్నది. ఇట్టిపద్యమే యయోధ్యా కాండమునను గలదు. చూడుడు:

*సీ. అంత నక్కడ రాము డచటికి భరతుండు
ప్రమ్మర వచ్చి సామ్రాజ్యమునకు
దన్ను రమ్మనుచు బ్రార్థనసేయునో యని
చింతించి యప్పుడు చిత్రకూట
మున గల్గు మునిజనంబుల వీడుకొని మార్గ
తరుదీర్ఘనంబుల గరము చేడ్క
మిగులగా సీతాసుమిత్రాత్మజయుతుడై
యతి దండకావనస్థలికి నరిగె
ననగ మహి నయోధ్యాకాండ మఖిలకతము(?)
వినిన జదివిన వ్రాసిన విస్తరించి
చెప్పినను వారలకు సుఖసిద్ధి రూపగు
సంపదాయురారోగ్యముల్ సంభవించు.

ఆశ్వాసాంతములవల్లను, ఫలశ్రుతి సీసములవల్లను అయోధ్యా రణ్యకాండలు భాస్కరుడు రచియించినట్లు తెలియవచ్చుచున్నది. ఫలశ్రుతిని తెల్పు పద్యములు బాలకిష్కింధాకాండల యంతమం దొండురెండు తాళపత్రప్రతులయందు గానవచ్చెడిని. వీనినిబట్టి చూడగా భాస్కరుడు రచించిన రామాయణమున జాలభాగము ఖిలమైపోగా ఖిలమైనభాగములను కుమారరుద్రదేవాదులు పూర్తి చేసి, యట్లు తాము పూర్తిచేసిన కాండలను దమపేర్ల బ్రకటించు కొనిరని తోచుచున్నది. అచ్చుప్రతియందలి యయోధ్యాకాండాంత గద్యమునుబట్టి కుమారరుద్రదేవుని తండ్రి మారయ యని తెలియుచు న్నది. ఈ మారయయే భాస్కరరామాయణమును గృతిగొన్న సాహి ణిమారు డని వీరేశలింగముగారు వ్రాసియున్నారు. కావచ్చును. అగుచో సాహిణిమారుని కాలమునకే భాస్కరుని రామాయణము శిథిలమైనట్లు చెప్పవలసివచ్చును. ఇదియే నిశ్చయమగుచో అరణ్యాయోధ్యా కాండలను రచించిన భాస్కరుడు సాహిణిమారుని సమకాలీనుడు గాజాలడు; పూర్వుడు గావలయును. అతడు సాహిణిమారుని కెంత పూర్వుడుండెనో కనుగొనుటకు సాధనము లెవ్వియు గానరావు.

ఇక హుళక్కి భాస్కరుడే యయోధ్యారణ్యకాండల రచ యిత యగునేమో విచారింతము. అతడు శాకల్యమల్లునితోపాటు కాకతిప్రతాపరుద్రుని యాస్థానమున నుండెనని సోమదేవరాజీయము వల్ల తెలియుచున్నది. మారయసాహిణి యను నొకవీర ప్రతాప రుద్రుని కొలువున నుండె నని శాసనములవల్ల దెలియుచున్నది. కావున హుళక్కి భాస్కరుడు ప్రతాపరుద్రునియాస్థానకవి యగుట నిక్కమైనచో నాతడు మారయసాహిణికి సమకాలీను డగుట నిస్సంశయము. ఈ సిద్ధాంతము నంగీకృతమేని హుళక్కి భాస్కరుడు అయోధ్యారణ్యకాండల రచయిత యగు భాస్కరుడు కాజాలడు; అన్యు డగును. పైచర్చవలన దేలిన సారాంశమేమనగా, రామాయణ రచయితలగు భాస్కరు లిరువు రని. ఒకడు అయోధ్యారణ్యకాండ లను రచియించిన భాస్కరుడు; రెండవవాడు యుద్ధకాండమున కొంతభాగమును వ్రాసిన హుళక్కి భాస్కరుడు.

ఈ సిద్ధాంతమునకు బ్రతికూలముగ గన్పట్టువిషయము నొక దాని నిచ్చట పేర్కొనవలసియున్నది. అరణ్యకాండము సాహిణి మారుని కంకిత మొనర్చినట్లు అందలి యాశ్వాసాంతపద్యములు

* Madras University Mss. Collection T 519, Madras Govt. Ori. Mss. Library 10-18-3 (D 139)

చెప్పుచున్నవి. కృతిపతియగు భాస్కరుడు సాహిణిమారుని సమకాలీనుడు గానిచో వానికి అంకిత మిచ్చుట యెట్లు పొసగును? ఈ యాక్షేపము పై సిద్ధాంతమునకు ప్రతిబంధము కాదు. ఆశ్వాసాంతపద్యములయందు సాహిణిమారుని పేర్కొనున వేవియు గానరావు. మొత్తము తొమ్మిదిపద్యములుగలవు. అయోధ్యాకాండయందు మూడు; అరణ్యకాండయం దారు. వీనియం దెచ్చటను కృతిపతి పేరునుగాని, జననీజనకులనుగాని, యతనివంశమునుగాని తెలిపియుండలేదు. అత డెవరో శత్రుమర్దను డను రాజని మాత్రము సూచింపబడియున్నది. ఆశ్వాసాది పద్యములు భాస్కరునిచే రచింపబడినవి గావు. మొదటియాశ్వాసారంభ పద్యమునకు పాఠాంతరములు మూడు గానవచ్చుచున్నవి.

అచ్చుప్రతియందు —

క. శ్రీహిత నయవిలసిత హా
రీహార మృదువచన ధారుణీహిత సం
దోహా త్రివిక్రమ విక్రమ
సాహస నగధైర్యసార సాహిణిమారా.

ఇది గాక వ్రాతప్రతులయందు ఇక రెం డగపడుచున్నవి.

క. శ్రీరమణీరమణ కృపా
ధార సముద్యత్కటాక్ష వరహాస ముఖాం
భోరుహ వితరణకర్ణ వి
శారద బుద్ధియుతకుమార సాహిణిమారా.

క. శ్రీరమ్యస్థితివదన స
రోరుహాంసాల గండ యుగళిత విగళ
ద్ధారాళ దానధారా
సారప్లుత భువనహార సాహిణిమారా.

ఈమూటియం దద్దియు భాస్కరకృతము కాదు. ఏలన, విభక్త్యంతములతో ఆశ్వాసాద్యంతములను రచించిన భాస్కరుడు తన్నియమము ననుసరించి అరణ్యకాండారంభమునందలి కృతిపతి స్తుతిపద్యమును ప్రథమాంతములతో రచింపవలసియుండెను. ఆ నియమమును దిగవిడిచి సాహిణిమారుని సంబోధించు నీ పద్యములను రచించి యుండడు. ఇతరు లెవ్వరో భాస్కరుని పద్యమును మార్చియో, లేక ప్రతిపద్యమునల్లియో యిందు కూర్చి రని తోచుచున్నది. ద్వితీయాశ్వాసారంభ పద్యమునకును పాఠాంతరము గలదు. ఇది యీవ్యాసమున నింతకుపూర్వ ముదాహరింపబడినది. ఇం దచ్చుప్రతియందలి పద్యము విభక్త్యంతములతో కూర్పబడినది. దీనిపాఠాంతరము సంబోధనలతో గానవచ్చుచున్నది. కావున నీ యాశ్వాసాది పద్యములు పెక్కుమార్పుల నందినవనుట తెల్లము. ఇవి భాస్కరవిరచితములు గావు. కుమారరుద్రదేవుడుగాని, లేక హుళక్కి భాస్కరుడు గాని రచించి భాస్కరుని పద్యములకు మారు వీనిని చొప్పించిరని తలచెదను. మల్లికార్జునభట్టకృతమగు మూడు కాండలును వీరె యరణ్యాదికాండాది పద్యముల రచయిత లని సూచించుచున్నవి.

మల్లికార్జునభట్టు స్వవిరచిత రామాయణ త్రికాండలను శివుని కంకిత మొనర్చినట్లు తత్కాండాద్యంత పద్యములు ఘంటారవముగ చాటుచున్నను తద్విరోధముగ సాహిణిమారుని ప్రస్తావన యందు చేయబడియున్నది. కిష్కింధాకాండాంతమున 'లాటీచందన' యను శార్దూలవిక్రీడితమును, సుందరకాండప్రారంభమున 'శ్రీరమణీహృదయేశ్వర' యను కందపద్యమును సాహిణిమారుని సంబోధించుచున్నవి. ఈపద్యములు రెండును మల్లికార్జునభట్టువి గావు. ఏలన, బాలకిష్కింధా సుందరకాండలు మూడును శివాంకితములు. మరియు 'లాటీచందన' యన్న పద్యము ఎచ్చటనో ఒకటి రెంటియందే తప్ప వ్రాతప్రతులయందు సామాన్యముగా గాన్పించదు. ఇంతే కాదు. మల్లికార్జునభట్టు నడచిన యాశ్వాసాంత పద్యరచనా విధానమున కది ప్రతిఘటించుచున్నది. ఇతరకాండలందువలెగాక పైకాండలయందు మూటియందును నాశ్వాసాంతమున రెండుపద్యములే గానవచ్చుచున్నవి. బాలకాండాంతమున నొక కందమును, నొక మాలినియు గలవు. అట్లే సుందర కాండాంతమునను కందమును,మాలినియు గానవచ్చుచున్నవి.కిష్కింధాకాండాంతమున మాత్రము యథావిధి మాలినియున్నను కందపద్యమునకు బదులు 'లాటీచందన'యను సాహిణిమారుని సంబోధించు శార్దూలవిక్రీడితము గానవచ్చుచున్నది. దీని తరువాతి మాలిని శివుని సంబోధించుచున్నది. అట్లే కాండాదియందును శివసంబోధన కలదు. కాబట్టి మల్లికార్జునభట్టు తా ననుసరించిన మార్గముచొప్పున నిచ్చటను శివుని నొక కందపద్యమునచే సంబోధించియుండె ననుట నిశ్చయము. మరి 'లాటీచందన'ను కిష్కింధాకాండాంతమున మల్లికార్జున భట్టవిరచిత కందమును దొలగించి తత్స్థానమున గూర్చినవా రెవ్వరు? సాహిణిమారుని కుమారుడగు కుమార రుద్రదేవుడైనను గావలయును; కాదేని తదాశ్రితుడగు హుళక్కి భాస్కరుడేనియు గావలయును; లేక సాహిణిమారునికి భాస్కరుడు స్వవిరచితరామాయణము నంకిత మిచ్చె నన్నగాథ యుత్పత్తియైనపిమ్మట తదనుసారము బుద్ధిమంతులగు వ్రాయసకాండ్రేనియు వ్రాసి చేర్చియుండవలయును. ఇట్లు వ్రాయసకాండ్రచే చేర్చబడిన యన్యకవికృతములగు పద్యము శ్రీభాస్కర రామాయణమున నెన్నియో గలవు. వ్రాతప్రతుల నన్నిటిని ముందువైచుకొని వాని నన్నిటిని బరిశోధించి సంస్కరించ నోపికగల పండితప్రకాండులును, వారికి గ్రాసవాసంబులపై చింత కలుగనీయక తదేకదృష్టితో బరిష్కరింపించు వాఙ్మయాభిమానులగు లక్ష్మీపుత్రులును గలిగితేని యవి యన్నియు వ్యక్తములు కాగలవు. కిష్కింధాకాండాద్యంతములను మార్చినవారే తక్కిన యయోధ్యాది కాండాద్యంతములను మార్చియుందురు.

ఈ చర్చవలన తేలిన విషయము లేవి యనగా—

1. వ్యాసారంభమున నుదాహృతమైన రామాయణ రచనా విధానమును దెల్పుకథయందు జెప్పినట్లు కృతిరచయితలంద రేకకాలము వారుగారు.


2. అయ్యలార్యుడు దేవరకొండప్రభు వను పెదవేదగిరి నాయనిగారి యాస్థానకవి. ఇతడు క్రీ. శ. 15వ శతాబ్దారంభమున నుండెను.

3. హుళక్కి భాస్కరుడు అయ్యలార్యుని సమకాలీనుడు గాడు. అతి డయ్యలార్యుని తాతయగు గాకల్యమల్లునికిని, భాస్కర రామాయణమున గొన్ని కాండలకు కృతిపతియు గాకతిప్రతాప రుద్రుని సేనాధ్యక్షులయం దొక్కరుడునగు మారయసాహిణికిని సమకాలీనుడు గావచ్చును.

4. అరణ్యకాండము రచించిన భాస్కరుడు హుళక్కి భాస్కరుడు గాడు. అతడు ప్రాచీనుడు. అతడే యుద్ధకాండను రచించెను. అతడే బాల కిష్కింధాకాండలనుగూడ రచియించె నన తలంపున కెడము గలదు. అతడు రచించిన రామాయణము శిథిలమగుటచే, అందలి నష్టభాగములను సంపూర్తి యొనర్చి కుమారరుద్రదేవాదులు ఆయా కాండలను దమ నామముల బ్రకటించుకొనిరి.

5. పిదప కాండాద్యంతములను మార్చి సాహిణిమారునికంకితముగ జేసిరి.

దక్షిణాదిలోగల వార్కళా అను క్షేత్రమునందలి జనార్దనస్వామి దేవాలయము



నిరుక్తము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ



అనుకొనకే, మనోభవుని యాయుధవాహనసంచయంబు వ్రా
సిన శకటంబువోలెఁ గడుఁ జేరువగాఁ జనుచుండి, కోనదే
లిన తుదకంటికెల్లువిదళింపులు నన్నును దాఁకనీయ కుం
డిన దయలేని నీనడక నిన్నును నీవుగ మెచ్చుకోవలెన్.

తమదగు పందమెల్ల వనితాజనతాస్పృహణీయమంచు గ
ర్వముగల యౌవనోదయ ధురావరిన త్రితభావు లున్న మా
ర్గమునను కన్నుఁ ద్రావ్ఛకయ గర్వపురేఖను మొక్కవోని మేల్
గమనము వోవు నీవు ననుగాని యపాంగములందుఁ బట్టవున్.

వాలును లేకయే స్పృహయుఁబట్టకకారణమౌచు నెవ్వఁడో
యేలనొ తోఁచనట్టు లుదయించిన మన్మథుఁడైన కాంత లే
సోలనికన్నులన్ మరలఁగిచూడరు చూచినవెంటనే కనుల్
వ్రాలుతు రట్టి నాయెడ నిరాదృతి నీయది విడ్డూరంబటే.

ముక్కిడిదైన కోఁతియును మోమును నద్దమునందుఁ గాంచి బల్
చక్కనిదాన నంచుఁ దలఁచంగల యాత్మగతాభిమానమే
గ్రుక్కిలి నాదునందమును గూర్చి వచింపఁ దలంపఁజాలనే
మిక్కిలి నీవు నాయెడ రమించుటకై యెదురైనఁ జూడనే.

నినుఁ గనుఁగోవటం చనను నిద్దురవోవలదా! పగంటఁ జూ
చినఁ గలలోనవత్తును నిసీ, గనుఁగో వనుచున్ జివుక్కు మం
చనినది గుండె, దాని ననుమంటిన! నా కటువంటియూహ కీ
జనువునఁ బొత్తులేదను నిజమ్ము నెఱుంగనో నన్నెఱుంగనో.

ఇన్నియుఁ జెప్పి నీ కనుల నెత్తి ననుం గనుఁగోవటంచు నే
నన్నది యేమిన్యాయ మని యాడెదవో నిను నాదు మంటినో
యెన్నితలంపులైన నుదయించు లయించు దరిద్రునందు, నా
యెన్నియు నేని పుట్టుట లయించుటయే పరమార్థమౌఁగదా!

నావలపోఁత నీదు శ్రవణంబుల చేరద, యంత యేటికో
నావలపోఁత యేరి శ్రవణంబుల చేరద, యంత యేటికో
నావలపోఁత వాస్తవికలనంబును పొందద, భావరూపమై
భావముకూడ లోయెదకుఁ బట్టిన జబ్బుగనై గళించెదున్.

చేయక చేసినట్లు శ్రుతిచేసిన యూహలు మేనుగల్గు దీ
ర్ఘాయు లదృష్టజన్ము లగునట్టిరు నాదగు మూర్తి చూచియే
పాయుదు రింక నాదయిన భావ మెఱింగిరయేని నన్నుఁ గో
మాయువు స్వర్గబుద్ధి యగుమాదిరి పెట్టరె వెక్కిరింపులన్ ?

లేని మనోంతరాంతరవిలీనవిగాఢవిషాదగీతికా
నూననిరుక్తభావ మిది, నొవ్వినవొవ్వఁగంగరాని ప్రా
ణానికి లోతులోని చలనంబును, సర్వజగచ్ఛ్రివో మనః
ప్రాణసుదూరవర్తియగు భావము కానుకగాని కాన్కయా.

ఈ జగతీపరిభ్రమణహేలకు వేలకు వేలు లక్షకో
ట్లై జరుగున్ మహాణువులయందున నేయణుగర్భమందునో
రాఁజినకోర్కిమంటలభరం బితరాణు లెఱుంగకుండ లో
రాఁజి తనంతటన్ పొనుగురాయఁగరా దటవే! ననుంబలెన్.



స్వర్గీయ రామమూర్తి పంతులుగారు

జీవితచరిత్రలోని చిత్రవిచిత్ర ఘట్టాలు

వ్యావహారిక భాషాప్రచారంకోసం గిడుగు రామమూర్తి పంతులు గారు గావించిన అఖండమైన సేవ అందరూ ఎరిగిందే. కాని కొండ జాతుల్లో ఒకటైన, అనాగరకతకు ఆలవాలమైన సవరజాతికి చదువు సంధ్యలు నేర్పడానికిని, వారినికూడ ఒక 'మనుష్యులు'గా తయారు చేయడానికిని పాటుపడ్డ మహాప్రయత్నంలో పంతులుగారు సవర నిఘంటువు, సవరభాషావ్యాకరణము రచించి ఇతరులకు స్వప్నేపి అలవికాని పనిని నిర్వహించి అజరామరమైన కీర్తి నార్జించారు.

శ్రీ గిడుగు సీతాపతి



మా తండ్రిగారి జీవితచరిత్ర నాకంటె తక్కువవారెవరైనా వ్రాయడం మంచిదేమో అని నా అభిప్రాయము. నేనే వ్రాయడం మంచిదని కొందరున్నూ, నేనుకూడా వ్రాయడం అవసరమని కొందరున్నూ కోరినందున నేను కూడా వ్రాయడానికి పూనుకొన్నాను. ఇందుకు నాకుగల అర్హత ఏమిటంటే: మా తండ్రిగారికిన్నీ నాకున్నూ గల సంబంధం కేవలము తండ్రీకొడుకుల సంబంధమే కాదు. 28- జనవరి 1885 లో నేను పుట్టినది మొదలు 22- జనవరి 1940 లో వీరు స్వర్గస్థులయినవరకున్నూ వీరికీ నాకూ గల గురుశిష్యుల సంబంధము తండ్రీకొడుకుల సంబంధంకంటె ఎక్కువగా పరిణమించినది. వీరి నలుగురు కొడుకులలోను మొదటివాడనయినందుకు నేనే వీరి శిక్షకు పూర్తిగా లోబడి ఎక్కువగా దెబ్బలు తిన్నవాడను; వీరి వాత్సల్యము సైతము ఎక్కువగా అనుభవించినవాడనూ నేనే; వీరు పూనుకొన్న ఉద్యమము లన్నిటిలోను వీరి వెంట నుండి వీరికి తోడుగా పనిచేసినవాడనూ నేనే; వీరి కడపటిదినములలో వీరి ఆర్థికదుస్స్థితికి కూడా నేనే — నేదా, నా దౌర్భాగ్యమే కారణము; తుదకు 22-జనవరి '40 సోమవారం ఉదయం నేను వీరిప్రక్కను కూర్చుండి ఉపచారం చేస్తూఉండగా వీరు తమ భౌతికదేహము విడిచిపెట్టడం సంభవించినది.

మా తండ్రిగారి దైనికవృత్త పుస్తకములూ, వీరికి బంధుమిత్రులు వ్రాసిన ఉత్తరములూ మొదలయిన పరికరములు పర్లాకిమిడిలో ఉండిపోయినవి. వీరి బాల్యమిత్రులు, సమకాలీనులు అయినవారు కొందరు సజీవులయి ఉన్నారు. వీరి జీవిత విషయములు కొన్ని వారి నడిగి తెలుసుకోవలసి యున్నది. గనుక వీరి జీవితచరిత్ర పూర్తిగా నే నిప్పుడు వ్రాయలేను. నా అనుభవములో ఉన్న విషయములున్నూ, నే నిదివరకు తెలుసుకొన్న విషయములున్నూ సంగ్రహించి తెలియజేస్తున్నాను.

మా తాత ముత్తాతల వృత్తాంతము

మా పూర్వులు ఏడుతరములనుండి గోదావరి జిల్లా, అమలాపురంతాలూకా, ఇందుపల్లిలో ఉండినవారు. అంతకుపూర్వము ఎక్కడ ఉండేవారో తెలియదు. మా కింకా ఇందుపల్లిలో కొద్దిగా కొబ్బరితోట ఉన్నది. మా గిడుగువారు గోదావరీకృష్ణాజిల్లాలలో చెదరి ఉన్నారు. గోదావరి కాలువలు పడకముందు పంటలభాగ్యము లేని కరవుకాలములో మా తాతగారు గిడుగు వీరరాజుగారు విశాఖపట్టణంజిల్లాకువచ్చి విజయనగర సంస్థానములో సముద్దారుగా పనిచేసినారు. ముఖలింగమునకు నైరృతి దిక్కున సుమారు రెండు మైళ్లదూరమందు గల పర్వతాలపేట అనే గ్రామము విజయనగర సంస్థానంవారి ఉత్తర మండలపు సముద్దారు ఉండవలసిన తానా గనుక, ఆ గ్రామమందు మా తాతగారు పండ్రెండుసంవత్సరము లుండిరి. ఆ కాలంలో— 1863-వ సంవత్సరంలో మా తండ్రిగారు ఆ గ్రామమందు జన్మించినారు. 1906 లో నేను బి. ఏ. పరీక్షలో ఉత్తీర్ణుడనై ఉపాధ్యాయవృత్తిలో ప్రవేశించిన కొద్ది కాలములోనే వారు నన్ను ముఖలింగమునకు తీసుకొనిపోయి, అక్కడి దేవాలయమందలి చిత్రములు, శాసనములు చూపించి, పిమ్మట పర్వతాలపేటకు తీసుకొనిపోయి, తమ తండ్రిగారుండిన గృహమున్నూ, తాము పుట్టిన గదిన్నీ చూపించి, తాము పుట్టిన స్థలమునకు సాష్టాంగనమస్కారములు చేసినారు.

మా తాతగారు పర్వతాలపేటలో ఉన్న కాలములోనే ప్రస్తుతం జయపుర సంస్థానాధిపతులయిఉన్న శ్రీ విక్రమదేవవర్మ మహారాజుగారి తండ్రిగారు నగరికటకమనే గ్రామంలో ఉండేవారు. ఈ రెండు గ్రామములున్నూ వంశధారానదికి చెరియొక ఒడ్డున నుండేవి. వారి తండ్రిగారున్నూ, వీరితండ్రిగారున్నూ మిత్రులు. అందుచేత వీరిరువు

రున్నూ కలిసిమెలసి ఆడుకొంటూ ఉండే వారు. బాల్యమం దంకురించిన మైత్రి అంతకంతకు ఎక్కువయినది. గ్రాంథిక వ్యావహారిక భాషావాదములో ఇద్దరును ఏకీభవించకపోయినా వీరి పరస్పరమైత్రి అణుమాత్రమైనా చెడలేదు సరికదా, మహారాజావారికి మా తండ్రిగారి యెడల ఆదరమూ, వీరినిబట్టి నాయెడల వాత్సల్యమూ ఎక్కువయినవి. వారి యనుగ్రహమే మా కుటుంబమునకు బహుధా శరణమైనది.

మా తండ్రిగారి విద్యాభ్యాసం

పర్వతాలపేటలోనే మా తండ్రిగారికి అక్షరాభ్యాసము, ప్రారంభవిద్య సాగినవి. ఆకాలములో అక్కడ బడిలేదు. కీ. శే. వారణాసి సుబ్బయ్య శాస్త్రిగారు వీరికి వ్రాయడం, చదవడం నేర్పినారు. తీరుబడి ఉన్నప్పుడు మా తాతగారే వీరిని తమ దగ్గర కూర్చుండబెట్టుకొని భారతం, భాగవతం లోనివి కొన్ని పద్యాలు, బాలరామాయణం లోనివి కొన్ని శ్లోకాలు చదివిస్తూ ఉండే వారట. మా తండ్రిగారి ఉపనయనం వీరి 8 వ యేటను విజయనగరములో జరిగినది. అప్పుడు వీరిచేతను మా తాతగారు యథావిధిగా "మాధుకర" భిక్ష దీక్షాదినములలో ఎత్తించినారట. ఒకనాడు మా తండ్రిగారు వేళకు సరిగా సంధ్యావందనము చేయలేదని వీరిని మా తాతగారు కఠినంగా దండించినారట.



స్వర్గీయ
రావుసాహెబ్, కళాప్రపూర్ణ, మహామహోపాధ్యాయ
గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారు

మా తాతగారి మరణము మా నాయనమ్మ పాట్లు

పాపం, మా తండ్రిగారు పండ్రెండేండ్ల బాలుడుగా ఉన్నప్పుడే మా తాతగారు చని పోయినారు. 17-1-1940 నాడు మా తండ్రిగారు వ్యాధిగ్రస్తులై యుండిన్నీ తమతండ్రిగారి ఆబ్దికం జరపవలసివచ్చినది. అప్పుడు వీరు నన్ను పిలిచి, నన్నుకూడా స్నానంచేసి తమచెంత నుండవలసినదని చెప్పగా నేనట్లే చేసినాను. "66 వ సారి మా తండ్రిగారి తద్దినం పెడుతున్నాను. ఇదే కడపటిసారి కాబోలును!" అని వీరు నాతో అన్నప్పుడు నేను దుఃఖ మాపుకోలేక ఏదో నెపమున పైకొకసారి వచ్చి కండ్లు తుడుచుకొని మరల పోయి కూర్చున్నాను. ఇక నీపని నాకు ప్రారంభముకాబోలు నన్న సూచన పొడ గట్టినది.

మా తండ్రిగారికి ఇద్దరు చెల్లెండ్లు తప్ప అన్నదమ్ములు లేరు. ఈ ముగ్గురుబిడ్డలను పోషించడము మా నాయనమ్మకు చాలా కష్టంగా ఉండేది. ఇందుపల్లితోటలనుండి రావలసిన ఆయ మత్యల్పము; అదైనా సరిగా వచ్చేదికాదు. మా తాతగారు పర్వతాలపేటలో పనిచేస్తూ ఉండిన కాలంలో వారు సంస్థానంవారికిలాభంచూపిస్తూ రయితులకు, భూస్వాములకు ఉపయోగకరములైన పనులుచేయించుటచేత, ఆప్రాంతమందు గల సిద్ధాంతందొరలు వారికి అక్కడకు చేరువగా ఉన్న మతలబుపేట ఇనాముభూమి ఒకటి సంస్థానంవారిఅనుమతి పొంది దానంచేసినారు; కాని అదిఅప్పటికిసాగులోనికిరాలేదు. అంతేకాక ఆ దానంసంగతి మా నాయన

వస్తువు తెలియునే తెలియదు. అందుచేత ఆమె విజయనగరంలో తన యొడలిపైనున్న ఆభరణము లమ్ముతూ పొందికగా కాల క్షేపము చేసినది. ఇప్పుడు పచ్చయ్యప్ప కాలేజీలో ఇంగ్లీషు ప్రొఫెసరుగా ఉన్న శ్రీ కూరి నారాయణగారి తండ్రిగారైన విశ్వనాథముగారు బంధువులున్నూ, మిత్రులున్నూ అయి పొరుగున ఉండడంచేత వారి సాయమున మా తండ్రిగారు ఇంగ్లీషు అభ్యసించినారు. మహారాజావారి కళాశాలలో వీరు ప్రవేశించి చదువుకొన్న దంతా హైస్కూలు చదువుమాత్రమే—లోవర్ ఫోర్తు, అప్పర్ ఫోర్తు, ఫిఫ్తు, మెట్రిక్యులేషను. వీరి చదివినదంతా ఇంతే. అప్పుడు కాలేజీప్రిన్సిపలుగారు చంద్రశేఖరశాస్త్రి గారు. వారికి వీరు ప్రియశిష్యగణములో చేరినవారు. వీరి సహాధ్యాయులలో వీరికి పరమమిత్రులుగా ఉండి, వీరితో కలిసి మెలిసి ఆడుకొంటూ ఉన్నవారు గురుజాడ అప్పారావుపంతులుగారు. వీరికంటె కొంచెము చిన్నవారున్నూ, క్రిందితరగతులలో ఉన్నవారున్నూ అయినా వీరితో ఆడు కొంటూఉండేవారు శ్రీయుత కేసరి కామేశ్వరరావుగారు. వీరు పటిష్ఠులై ఉన్నారు. మరియొకరు బుర్రా పార్వతీశం పంతులుగారు — కేసరికామేశ్వరరావుగారి పిన తండ్రిగారు. ఆకాలపు చదువులు, ఉపాధ్యాయుల పాండిత్యము, విద్యార్థుల నడవడి మొదలయిన విషయములనుసరించి మాతండ్రి గారు పెక్కుసార్లు నాతో ముచ్చటించినారు. ఈనాటి చదువులలో కొన్ని లోపము లున్నూ, ఆనాటిచదువులలో కొన్ని సుగుణ ములున్నూ ఉన్నా, మొత్తముమీద ఆనాటి విద్యావిధానముకంటె ఈనాటి విద్యావిధా నము ఎక్కువ మేలయినదనిన్నీ, పరీక్షల కోసం చదివేశ్రద్ధ నాటి విద్యార్థులకంటె నేటి విద్యార్థులకు సాధారణంగా తగ్గిపోయినా, నేటివిద్యార్థులకు సామాన్యంగా ఉండే విశాల దృష్టి, ఆవేశము, ప్రపంచజ్ఞానము నాటి విద్యార్థులకే కాదు ఉపాధ్యాయులకైనా లేదనీ వీరున్నూ, గురుజాడ అప్పారావుగారున్నూ ముచ్చటించుకొంటూ ఉండేవారు.

చదువు చాలింపు, ఉద్యోగప్రయత్నాలు

మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణు లయిన తర్వాత గురుజాడ అప్పారావు పంతులుగారు కాలేజీలో ఉన్నతవిద్య సాగించ గలిగినారు; కాని మా తండ్రి గారు సాగించ లేకపోయినారు. "ఏదైనా ఒక ఉద్యోగం చూచుకోవలసినదే కాని మరి నేను నీకు చదువు చెప్పించలే"నని మా నాయనమ్మ చెప్పడంచేత మా తండ్రిగారు విశాఖపట్టణం కలెక్టరుకచేరీలో ఆరుమాస ములు సుమస్తాపనికోసం వాలంటరీ చేశారు. ఈలోగా వీరికి వివాహమైనది. మా తల్లి తండ్రిగారు కంచికొండ రామదాసుపంతులు గారు; భీమునిపట్టణంలో ఒక చిన్న పాటూ దారుగా ఓడవర్తకం సాగిస్తూ ఉండేవారు.

ఇట్లుండగా 1880 లో మా తండ్రిగారికి రెండు ఉద్యోగములలో ఏది కావలెనని మూర్కిన్ ఇన్స్పెక్టరుగారు అడిగినారు— విజయనగరమునకు సమీపముగా ఉన్న కోరాడగ్రామములో 25 రూపాయల ఉపా ధ్యాయపదవి కావలెనా? లేక పర్లాకిమిడి రాజాగారి పాఠశాలలో 30 రూపాయల పని కావలెనా? అని అడిగినప్పుడు స్వగ్రామ మునకు దూరముగా మన్యప్రదేశములో ఉన్నా పర్లాకిమిడిలో అయిదురూపాయ లెక్కువ దొరుకునన్న ఉద్దేశంతో ఆ పనే కావలె నన్నారు. అది మొదలు 1936వ సం॥ వరకు వీరు 56 సంవత్సరములు పర్లాకిమిడి లోనే నివాస మేర్పరచుకొని ఉండిరి.

ఉద్యోగంచేస్తూనే ఉన్నత పరీక్షలు ప్యాసయ్యారు

ఉన్నతవిద్య వీరు కాలేజీలో అభ్యసించ డానికి అవకాశము లేకపోయినా, ఉద్యో గంచేస్తూ చదువుకొని ఎఫ్. ఏ. పరీక్షలోను, బి. ఏ. ఇంగ్లీషు, సంస్కృతం భాగముల పరీక్షలోను క్రమంగా వెంట వెంటనే నెగ్గి నారు. ఇంతలో వీరిబుద్ధిని రెండు విషయము లాకర్షించినవి. పర్లాకిమిడిచుట్టును కొండ లలో నివసించే సవరలు విద్యావాసన లేక పశుప్రాయులై ఉన్నారు గనుక, వాండ్ల కోసము వాండ్లకొండలలోనే బడులు పెట్టించి, వాండ్లకు చదువు చెప్పించవలె నన్న కోరికపుట్టి వీరు తమ ఆశయం నెర వేర్చుకొనుటకు ఉపక్రమసాధనంగా 1892 లో సవరభాష నేర్చుకొనుటకు ప్రారం భించారు. తమ జన్మస్థానమునకు ఈశాన్య దిక్కున రెండుమైళ్లు దూరంగాను, పర్లా కిమిడికి దక్షిణాన సుమారు 20 మైళ్లు దూరంగాను ఉన్న ముఖలింగం ఆల యమూ, ఆలయములో గోడలపై నున్న శాసనములూ చూస్తూ ఉండడంచేత ఆశాస నముల లిపి నేర్చుకొని శాసనములు చదివి పురాతన చరిత్రవిషయములు పరిశీలించవలె నన్న కోరిక పుట్టినది. ఈ రెండు పను లున్నూ వీరు స్వయముగా స్వశక్తి, స్వబుద్ధి వినియోగించి చేయవలసినదే కాని ఆకాలం లో ఆ మారుమూలప్రదేశంలో వీరికి తోడు పడి మార్గము చూపించగల గ్రంథములూ లేవు, విద్వాంసులూ లేరు; మరి యే సాధన ములూ లేవు. అందుచేత వీరు స్వశక్తిమీద నే ఆధారపడి, కొంచెంకొంచెంగా అయి నా రెండు పనులున్నూ పట్టుదలతో సాగిస్తు వచ్చారు.

తలవనితలంపుగా తప్పిపోయిన ప్లీడరీచదువుప్రయత్నాలు

ఇంతలో వీరిజీవితచరిత్ర పూర్తిగా మార్చి వేయగల సందర్భావస్థ వచ్చినది. 1884 లో మా తల్లి కాపురానికి వచ్చినది. 1887లో వీరు ఎఫ్. ఏ. పరీక్షలో ఉత్తీర్ణులయి పట్ కెటి ప్లీడరుపనికి దరఖాస్తు పంపించారు. ఆపని అయినట్లు ఉత్తరువు వచ్చింది; గాని, అది మా నాయనమ్మ కిష్టము కాకపోవుటచేత విడిచిపెట్టుకొన్నారు. మరి కొద్దికాలము నకు మా నాయనమ్మ చనిపోయినది. 1892లో వీరిని స్కూలునుండి రాజావారి తమ్మునికి

(ఇప్పటి మహారాజావారి పినతండ్రికి) ట్యూటరుగా బదలాయించారు. అప్పటికి వీరు బి.ఏ. ఇంగ్లీషు, సంస్కృతం భాగముల పరీక్షలో ఉత్తీర్ణులయినారు. వీరిస్థానే ఆ కళాశాల ప్రధానోపాధ్యాయుల తమ్ముడు గారిని నియమించారు. ఆ సంవత్సరమే శ్యామసుందర రాజగురువు అనే శిష్యులు బి. ఏ. పరీక్షలో ఉత్తీర్ణులయి వచ్చుటచేత వారిని ట్యూటరుగా నియమించి మా తండ్రిగారిని మరల స్కూలుకు పంపించారు. అప్పుడు వీరున్నూ, వీరిస్థానే ఉన్న వారున్నూ పనిచేయుటకు అవకాశ మున్నందున, వీరిస్థానే ఉన్నవారు బి. ఏ. పూర్తిగా అయినవా రన్న కారణంచేత వారు అనుభవమూ సర్వీసూ లేనివారయినా వారిని మీదిఉపాధ్యాయులుగాను, వీరు 12 ఏండ్ల సర్వీసూ అనుభవమూ ఉన్నవారయినా పూర్తిగా బి. ఏ. కారన్న కారణంచేత వీరిని క్రింది ఉపాధ్యాయులుగాను నియమించవలెనని ప్రధానోపాధ్యాయులుగారు శిఫార్సుచేశారు. అది చూచి, మా తండ్రిగారు తమకు అన్యాయం జరుగుతూ ఉన్నందుకు ఖేదపడి, అంతవరకున్నూ పరమమిత్రులుగా ఉన్న ప్రధానోపాధ్యాయులు తమ తమ్ముని కోసం చేసిన శిఫార్సుకు విరుద్ధముగా అధికారులతో నివేదించుకొనుటకు ఇష్టపడక, "లీడరీ చదువుకొనుటకు చెన్నపట్టణం వెళ్లదలచినాను గనుక ఒక సంవత్సరము జీతంనష్టముపైని సెలవు ఇప్పించవలసిన" దని కోరుతూ దరఖాస్తు పంపించుకొన్నారు. వీరు చెన్నపట్టణం ప్రయాణం చేయడానికి కావలసిన ఏర్పాట్లు అన్నీ చేసుకొన్నారు. అప్పట్లో మాతల్లి పుట్టింటికి వచ్చుటచేత, ఆమెతో నేనూ, నాతమ్ములూ (అప్పటికి ముగ్గురము సోదరులము) భీమునిపట్టణంలో ఉన్నాము. "నేను సంవత్సరం సెలవు పెట్టి లీడరీ చదువుకోడానికి చెన్నపట్టణం వెళ్తున్నాను. నీవూ పిల్లలూ మీ పుట్టింటనే ఉండవలసినది. సామాన్లు అన్నీ పంపిస్తున్నాను" అని ఉత్తరం వచ్చింది. మరి పదిదినములకు ఈ ప్రయత్నమంతా విడిచిపెట్టుకొన్నట్లు తెలియజేస్తూ మేము పర్లాకిమిడి రావలసినదని తంతివార్త వచ్చినది. ఏమిటో వైపరీత్యమనుకొన్నారు మావాండ్లు. స్కూలు ప్రధానోపాధ్యాయులు తమ శిఫార్సు రద్దుచేసుకొన్నారు. వారితమ్ములు లీడరీచదువుకోడానికి చెన్నపట్టణం వెళ్లినారు. మా తండ్రిగారికి అన్యాయం మరి జరగలేదు. లీడరయి ఉంటే మా తండ్రిగారు ఎక్కువగా ధనమార్జించి ఉందురేమో కాని వీరు సవరభాషావిషయమై చేసిన పని మరి కాకపోవును. ముఖలింగం-పురాతన చరిత్రవిషయములు ఇటీవలి చారిత్రకపరిశోధకులు పరిశీలించగలుగుదురు గాని ఈపనిఅంతవేగముగా కాకపోవును.

సంఘసంస్కరణసన్నాహాలు, తత్ఫలితంగా సంఘబహిష్కారము

పైనిచెప్పిన రెండుపనులున్నూ మందముగానే సాగుతూఉండడానికి చాలా కారణాలున్నవి. ఆకాలంలో కందుకూరి వీరేశలింగం పంతులుగారి సంఘసంస్కరణ ప్రాభవం ఆంధ్రదేశమందు ఎక్కువగా వ్యాపించియుండేది. అది మా తండ్రిగారిని సైతము లోబరచుకొన్నది. బాలవితంతువులకు పునర్వివాహము కావలెనన్న ఆశయము వీరికి వచ్చినది. అప్పుడు పండితుల ఆక్షేపముల ఖండించుటకు స్మృతులు చదువుకొని ఉపన్యసిస్తూ ఉండేవారు. పర్లాకిమిడిలో రీడింగ్ రూమ్ అనే పేర నొకసమాజముండేది. దానికి వీరు చాలాకాలము కార్యదర్శిగా ఉండేవారు. ఒకసారి పర్లాకిమిడిలో ఒక బాలవితంతువుకు పునర్వివాహము చేయించుటకు వీరు తగిన ఏర్పాట్లన్నీ చేసి వీరేశలింగం పంతులుగారికి జాబు వ్రాశారు. అది తెలిసికొన్న వీరిమిత్రులలో పెద్దవారొకరు వీరి ఉద్యమము కొనసాగకుండా చేయుటచేతను, వీరి ననేకవిధముల నిరుత్సాహపరచుటచేతను, సంఘసంస్కారోద్యమమునకు పూనుకొన్న రోజుల తాము అంతకుముందుగా ప్రారంభించిన పనులు (సవరభాషకున్నూ, చరిత్ర పరిశోధనలకున్నూ సంబంధించిన పనులు) నిలిచిపోవునన్న భీతిచేతను సంఘసంస్కారమునకు సంబంధించిన పనులు వీరు మరి తలపెట్టలేదు; గాని, నాటనుండి చనిపోవువరకున్నూ సంఘసంస్కార ప్రియులుగానే ఉండిరి. శ్రీయుత బంకుపల్లి మల్లయ్యశాస్త్రి గారు బాలవితంతువైన తమకూతురికి వివాహము చేసినప్పుడున్నూ, అన్యమతమును స్వీకరించి పశ్చాత్తప్తులయి మరల హిందూమతమందు ప్రవేశింపదలచిన యొక బ్రాహ్మణయువకునికి తోడుగా శ్రీనాసా సూర్యనారాయణశాస్త్రిగారుఉద్యమించినప్పుడున్నూ, శారదా వివాహచట్టమునకు అనుకూలముగా ఈ యిద్దరు శాస్త్రిలవారున్నూ పనిచేసినప్పుడున్నూ వారికి వీరు తోడుగా ఉండి తగిన ప్రోత్సాహము కలిగించినారు. హరిజనుల నంటరాదను పూర్వాచారమును తొలగించి హరిజనుల పురోభివృద్ధికి పూనుకొన్న ఉద్యమమునకు వీరును యథాశక్తి తోడుపడిన వారే. ఈ ఉద్యమము వెలయకపూర్వము 40 సంవత్సరముల క్రిందటనే వీరు సవరలను, సవరభాష తెలిసిన సైడి (పానో) వాండ్లను ఇంటనుంచుకొని, తమకు దగ్గరగానే కూర్చుండబెట్టుకొని, సవరభాష నేర్చుకొంటూ ఉండేవారు. హరిజనులకోసము పెట్టిన బడులలోనికి బడిపని పరీక్షించుటకు తనతోడి ఉపాధ్యాయులు నిరాకరించినప్పుడు వీరుమాత్రము సంతోషముతో వెళ్లుతూఉండేవారు. 1908 లో వీరిశిష్యులలో ఒకరు కీ. శే. కన్నేపల్లి వేంకటనరసింహం పంతులుగారు బారిష్టరయి ఇంగ్లండునుండి మన దేశమునకు వచ్చి, మా తండ్రిగారినీ తక్కిన మిత్రులనూ చూదామని పర్లాకిమిడి వచ్చినప్పుడు మాయింట బసచేసినారు. వారియెడల తమకు గల వాత్సల్యముచేతను, గౌరవముచేతను వీరు ఒకరాత్రి విందుచేసి పదిమంది మిత్రులను ఆహ్వానించారు. ముగ్గురు తప్ప తక్కినవారు రాలేదు; సరిగదా, ఆ మరునాటనుండినీ మాకు ఊరిలో వెలిపెట్టినారు. ఇంట వంట పని చేసే వంటలక్క మరి మాయింటికి రాలే

న్నది. మంచినీళ్లు తెచ్చిపోసే బ్రాహ్మణుడు మరి మాకు కనబడలేదు. ఊరిపెద్దలు కొందరు—మాకు పరమమిత్రులే — వనసంతర్పణ తలపెట్టి భోజనాలకు పూర్వము కొంగంగ 'తీర్థము' పుచ్చుకొమ్మనుటకు సమ్మతించినవారినెల్ల మమ్ముల ఆహ్వానించి వెలితీసి వేయుదు మన్నారు. "మరియొకసారు కావలసినవారెల్ల మారుసారులు తీర్థము పుచ్చుకొందురు గాని ఈ సారు మాత్రము ఒక్క చుక్కయినా పుచ్చుకోనవని వీరు నిరాకరించారు. కొందరు మిత్రులు మా తండ్రిగారిని వెలిలో ఉంచడానికి మనసొప్పకను, కలుపుకోడానికి సాహసములేకను సభ ఏర్పరచి సముద్రయానము చేసినవారు ప్రాయశ్చిత్తము చేసుకోవలెనా, అక్కరలేదా అనే విషయము చర్చకు తీసుకొనివచ్చారు. ఈ వెలి కొద్దికాలములో దానంతట అదే అంతరించినదిగాని మా తండ్రిగారు సహాలకు కొంచెమైనా లొంగలేదు. వీరు మొదటనుండీన్నీ సబబులేని అధికారమునకు గాని, అట్టి అధికారమువహించే వ్యక్తులకు గాని లొంగక తమ పట్టుదల విడువక పనిచేస్తూవచ్చారు. ఉద్యోగం ఊడిపోయినా సరే అనిష్టమైన పని చేయనన్న సంకల్పము మొదటనుండీన్నీ వీరికి బలంగా ఉండేది. ఇందుకు తార్కాణంగా 1892 లో వీరు పర్లాకిమిడి కుమారరాజుకు ట్యూటరుగా ఉన్నప్పుడు ఒక ముచ్చట జరిగినది. భోగీసంక్రమణము తర్వాత కనుమునాడు పసువులపండుగ చేసి పసువులకేకాక మనుష్యులకు సైతము చురకలు వేసే ఆచారము పర్లాకిమిడిలో ఆకాలమందు బలంగా ఉండేది. అందుచేత, వీరు కుమారరాజుకు పాఠము చెప్పుతూఉన్న సమయంలో రాజావారి సేవకులు నిప్పూ కుంపటీ, చురకలువేసే పరికరములూ పట్టుకొనివచ్చి "మీకున్నూ కడుపుపైని రెండుచురకలు వేయవలసినదని రాజావారి ఆజ్ఞ" అని మాతండ్రిగారికి తెలియజేయగా వీరు కోపము పట్టలేక "ఇక్కడి రాజుల మర్యాద చక్కగానే ఉన్నది; తక్కిన సంస్థానాలలో పండితులకూ, ఉద్యోగస్థులకూ పండుగనాడు సంచెలచాపులో, పట్టుబట్టలో బహుమతిగా ఇస్తూఉంటే, ఈ సంస్థానంలో వాత పెట్టడం సంప్రదాయంగా ఉన్నది; సెలాన్! చాలు మీమర్యాద." అన్నారు. అప్పటి కా కుమారరాజు సేవకులను మందలించి పంపివేసినాడట.

వీరు తలపెట్టిన సవరలవిద్యాభివృద్ధి, గవర్నరుగారితో డ్నాటుకు అడ్డుపుల్ల

1894 లో గవర్నరుగారు పర్లాకిమిడికి వచ్చినప్పుడు, రీడింగ్ రూమ్ పక్షాన కొక సన్మానపత్రిక సమర్పిస్తూ సవరల విద్యాభివృద్ధికోసం ప్రభుత్వంవారు సవరదేశంలో బడులు పెట్టించవలసినదనిన్నీ, అందుకు సవరభాష నేర్చిన మాతండ్రిగారు తోడుపడగలరనిన్నీ తెలియజేసినారు. అందుకు గవర్నరుగారు సంతసించి మాతండ్రిగారితో సవరలవిషయమై కొంతసేపు ప్రసంగించినారు. గాని, అప్పుడు జిల్లాకలెక్టరుగా ఉన్న మెకార్టీదొర గారికి సవరలకు చదువు చెప్పించడము ఇష్టముకాకపోయినది. కట్టెలుకొట్టి జీవించే కొండవాండ్లకు చదువెందుకని వారి అభిప్రాయమట! అందుచేత గవర్నరుగారితో భోజనముచేస్తూ ఉన్న సమయమున మాతండ్రిగారి ప్రస్తావన వచ్చినప్పుడు ఆ కలెక్టరుగారు "రామమూర్తిపంతులు పిచ్చివాడు. సౌమ్యులుగా జీవిస్తూ ఉన్న సవరలకు లేనిపోని ఆశలు కలిగించి ప్రశాంతమైన సవరదేశంలో విప్లవం పుట్టించ దలచినాడు. అతడు సవరదేశమునకు పోరాదని శాసించ దలచినాను" అని చెప్పి గవర్నరుగారికి మా తండ్రిగారి యెడల దురభిప్రాయము కలిగించారట. అందుచేత, సవరల విద్యాభివృద్ధికోసం మా తండ్రిగారు చేసిన ప్రయత్నం అప్పట్లో నెరవేరలేదు.

అమితంగా క్వైనైను సేవించుటవల్ల వీరికి చెవుడుపట్టుకొన్నది

సవరభాష, సవరపాటలు, సవరదేశం తిరిగి నేర్చుకొందామని వేసవి సెలవులలో ఒకసారి వీరు కొండలలో తిరిగిరాగానే వీరికి మలేరియా జ్వరము పట్టుకొని మూడు మాసములు పీడించింది. అప్పుడు పోస్టాఫీసులలో అమ్మే క్వినీనుపుండి దినానికి 10 గ్రెయినులు చొప్పున 40 దినములు పుచ్చుకొనేసరికి వీరికి చెవుడు పట్టుకొన్నది. ఎన్నిమందులు తిన్నా అది అంతకంతకు ఎక్కువయినదిగాని తగ్గలేదు.

వీరి చారిత్రక పరిశోధన కృషిమాత్రము కొంతవరకు ఫలించినది. స్వయంకృషివల్లనే శాసనములలోని ప్రాచీన నాగరక గ్రాంథ లిపివర్ణములు చదువుట నేర్చుకొని ముఖలింగేశ్వరాలయములోని రాతిగోడలపై చెక్కియున్న శాసనములున్నూ, రాగిరేకులపై చెక్కిన దానశాసనములున్నూ చదివి ప్రాచీన కళింగ రాజ్యమునకు — ఎనిమిదవ శతాబ్దము నుండి పన్రెండవ శతాబ్దమువరకున్నూ ముఖలింగము రాజధాని అనిన్నీ, నగరకటకము (అనగా త్రివిక్రమ దేవవర్మగారు బాల్యమందున్న గ్రామము) సైనికస్థానమనిన్నీ, కళింగపట్టణము రాజుల రేవుపట్టణమనిన్నీ తెలుసుకొన్నారు. తాము తెలుసుకొన్న విషయములన్నీ చేర్చి "ఆంటిక్విటీజ్ ఆవ్ ముఖలింగం" అనే పేరను ఇంగ్లీషులో ఒక వ్యాసము వ్రాసి మద్రాస్ లిటరేచర్ అండ్ సయిన్సు సొసైటీ మాసపత్రికలో 1895లో ప్రకటించారు. కళింగ గంగవంశపు రాజుల దానపట్టాశాసనములు సంపాదించి ఎపిగ్రాఫియా ఇండికాలో ప్రకటించారు. ముఖలింగము ప్రాచీన కళింగ గంగరాజ్యమునకు రాజధానిగా ఉన్న విషయం వీరి వ్రాతల నాధారంగా గైకొన్నట్లు సూచిస్తూ విన్సెంట్ స్మిత్ గారు తమ హిందూదేశ చరిత్రలో చేర్చుకొన్నారు.

పరిశోధనలును కొంతకాలంపట్టు ఆగాయి

అంతట్లో సవరభాషాకృషికీ, చరిత్ర పరిశోధనలకు సంబంధించిన పనులు మా తండ్రిగారు కొంతకాలము నిలిపివేయ వలసివచ్చినది. అందుకు కారణమే

మంటే, 1895 లో అదివరకు హైస్కూలు మాత్రముగానే ఉన్న కళాశాల సెకండ్ గ్రేడ్ కాలేజీగా అభివృద్ధిపరచుటకు పర్లాకిమిడి రాజావారు సంకల్పించి అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. మా తండ్రిగా రప్పటికి బి. ఏ. పూర్తిచేయలేదు. ఇంగ్లీషు, సంస్కృతభాగములందలి పరీక్షలలోమాత్రమే ఉత్తీర్ణులై ఉండడంచేత మెట్రిక్యులేషన్ తరగతివరకు పాఠములు చెప్పడానికి మాత్రమే అర్హులై ఉండేవి. ఫోర్తుఫారముకు ఇంగ్లీషున్ను, హైస్కూలు తరగతులకు చరిత్రపాఠములున్ను చెప్పతూ ఉండేవారు. చరిత్రాధ్యయనములో వీరికి అభిమానమూ, కృషీ ఎక్కువగా ఉండడంచేత కాలేజీలో చరిత్రాధ్యాపకపదవికి అర్హులు కాగోరి, బి.ఏ. పూర్తి అయితేనేకాని ఆ పదవి తమకు రాదు గనుక సవరభాషకున్ను, చరిత్ర పరిశోధనలకున్ను సంబంధించిన కృషి కట్టిపెట్టి బి. ఏ. చరిత్రభాగపరీక్షకు చదివి 1896 లో జరిగిన పరీక్షయందు మొదటితరగతిలో ఉత్తీర్ణులై, ఆ సంవత్సరం ఉత్తీర్ణులైనవారిలో రెండవవారుగా నిల్చినారు. ఏ కాలేజీలోను ప్రవేశించి చదవకుండా ప్రైవేటువిద్యార్థిగా పరీక్షకు వెళ్లి ఇంత ఎక్కువగా ఉత్తీర్ణులు కావడము చాలా మెచ్చుకోవలసిన విషయముగనుక, పర్లాకిమిడిలో కాలేజీ పెట్టగానే వీరిని రాజావారు చరిత్రోపన్యాసకులుగా నియమించినారు. ఆరంభములో క్రొత్తగా చెప్పవలసినవిషయము తాము పెద్దపుస్తకములు చదివి నేర్చుకోవలసి ఉండడంచేత నాలుగైదు సంవత్సరములవరకున్ను సవరభాషకూ, ప్రాచీనహిందూదేశచరిత్రపరిశోధనలకూ సంబంధించిన కృషి సాగలేదు.

తెలుగు-సవర నిఘంటు రచన

అపిమ్మట సవరభాషాకృషి సాగించి తెలుగు-సవరనిఘంటువొకటి రచించారు. సవరపాటలు, సవరకథలు కొన్ని సవరభాషలోనే వ్రాసిపెట్టుకొన్నారు. సవరభాషకు వ్యాకరణం రచించడానికి పునాది వేసినారు. ఈ పనిలో వీరికి వీరి మిత్రులొకరు మామిడన్నయు కుమారస్వామి పంతులుగారు తోడుగా ఉండేవారు. వీరికి మొదటనుండిన్ని సవరభాష నేర్పినవాడు 'తౌడు' అనే పేరు గల ఒక సైడి (పానో) వాడు. వాడికి ఓఢ్రము, తెలుగు, సవరభాషలు వచ్చిఉండడంచేత వాణ్ని నౌకరుగా పెట్టుకొన్నారు. కొంతకాలానికి ఆసైడివాడు చెప్పిన సవరభాష స్వచ్ఛమైన సవరభాష కాదనిన్ని, స్వచ్ఛమైన సవరభాష నేర్చుకోవలెనంటే స్వచ్ఛమైన సవరల నడిగి తెలుసుకోవలసినదే అనిన్ని మాతండ్రిగారికి బోధపడినది. అది సులభసాధ్యమైన పని కాదు. అందుచేత, అప్పుడప్పుడు స్వచ్ఛమైన సవరలను రప్పించి వారికి అన్నం పెడుతూ, బట్టలిస్తూ, డబ్బిస్తూ ఇంటివద్ద నుంచుకొని కృషిచేశారు. ఏమిచేసి ఎంతశ్రమపడి సవరభాష నేర్చుకొని సవరల విద్యాభివృద్ధికోసం వీరు ప్రయత్నించినా, వీరి ఉద్యమం కొనసాగడానికి రాజావారి తోడుపాటుగాని, ప్రభుత్వంవారి తోడుపాటుగాని లేకపోయినది. వీరు రచించిన గ్రంథము అచ్చుపడడానికి ఆధారం కనబడలేదు; సవరలకోసం బడులు పెట్టించడానికి సాహాయ్యం దొరకలేదు. అప్పటికీ ఊరుకోలేక వీరు తమ సొంతధనం వెచ్చించి, పర్లాకిమిడికి చేరువనున్న సవరపల్లెలలో గ్రాంటుబడులు పెట్టి గ్రాంటుకోసం ప్రయత్నించారు. కొన్నాళ్లకు—అనగా, 1905-6 లో వీరి కృషీ, ఉత్సాహమూ, పట్టుదలా మెచ్చుకొన్న ఉద్యోగస్థులు జిల్లాలో ఉండడంచేత వీరు పెట్టిన బడులు కొద్దిగా వృద్ధిలోనికి వచ్చినవి. సవరల విద్యాభివృద్ధికి ఎక్కడెక్కడ ప్రభుత్వమువారు బడులు పెట్టవలెను, విద్యావిధాన మెట్లుండవలెను అనే విషయములు చర్చకు వచ్చినవి. ఆ చర్చలు గంజాంజిల్లా కలెక్టర్లు ఛత్రపురంలో జరిపిస్తూ కొందరుద్యోగస్థులతో పాటు మా తండ్రిగారినిసైతము ఆహ్వానిస్తూ ఉండేవారు.

సవరభాషాభ్యాసానికి ఒకదొర గారు వీరివద్ద శిష్యరికం చేశారు

1908 లో వెల్ష్‌మన్ అనే ఒక ఫారెస్టు ఉద్యోగస్థుడు సవరదేశములో పనిచేయవలసి వచ్చుటచేత అతనికి సవరభాష నేర్చుకోవలెనన్న కోరిక పుట్టినది. "కొద్దిగా పారితోషికం ఇస్తూఉంటాను; నాకు మా యింటివద్దను సవరభాష నేర్పుతారా?" అని ఆదొర మాతండ్రిగారిని అడిగినాడు. "మీరు నా కేమీ పారితోషికం ఇవ్వనక్కరలేదు. నేను మీయింటికి వచ్చి సవరభాష నేర్పడానికి నాకు వీలుండదు. మీరు మా కాలేజీకి మధ్యాహ్నం మావిశ్రాంతివేళ వస్తే మీకొక గంట సవరభాషాపాఠములు చెప్పగలను" అని వీరు తెలియజేశారు. ఆదొర వీరు కోరినట్లు వీరివద్దకే వచ్చి సవరభాష నేర్చుకొన్నాడు. మొట్టమొదట ఆదొర పెద్ద ఉద్యోగస్థుడనే గర్వంతో అధికారభావంతో మా తండ్రిగారిని చూచేవాడట; గాని, కొద్దిదినములలో వీరి పాండిత్యగరిమ తెలుసుకొని వీరిని గురుభావంతో చూస్తూఉండేవాడు. అప్పటికి నేను రాజమహేంద్రవరం ట్రెయినింగ్ కాలేజీలో (1907 లో) ట్రెయినింగయి పర్లాకిమిడి కాలేజీలోనే హైస్కూలు తరగతులకు చరిత్రాధ్యాపకుడుగా పనిచేస్తూఉండేవాడను. అందుచేత, నేనుకూడా ఆ దొరతో కలిసి సవరభాష నేర్చుకోవలసి ఉండెను. గాని, అప్పుడు స్కూల్సు ఇన్స్పెక్టరుగా ఉన్న యేట్సుదొరగారు ఫొనెటిక్సులిపిని, డైరెక్టుమెథడ్ అనే పద్ధతిని అనుసరించి చిన్నపిల్లలకు ఇంగ్లీషునేర్పడం మంచిదనే క్రొత్తవిధానం తెచ్చిపెట్టి ఆ పనికి మాతండ్రిగారున్ను, నేనున్ను తగినవార మని ఎంచి శిఫార్సు చేయడంచేతను మే మాపని ప్రారంభించాము. క్రొత్తపద్ధతుల ననుసరించి పాఠములను చెప్పేవాడను నేను; నాకు సలహాలిస్తూ మార్గం చూపిస్తూ నాపని పరిశీలిస్తూ ఉండేవారు మాతండ్రిగారు.

ఇంతలో యేట్సుదొరగారి మూలాన్నే వ్యావహారికభాషావాదం ప్రారంభమయినది.

1910 జూలై మాసంలో నేను జయపురం స్కూలుకు హెడ్‌మాస్టరుగా వెళ్లినాను; నాకు అప్పట్లో సవర భాష నేర్చుకోవలెనన్న సంకల్పం నెరవేర లేదు.

మా తండ్రిగారివద్ద సవర భాష నేర్చుకొన్న వెల్డ్‌మన్ దొర పలుకుబడిగలవాడు గనుక ఈ విషయం జిల్లా కలెక్టరుగారికి చెప్పి, వారు రచించి పెట్టుకొన్న తెలుగు - సవర నిఘంటువు, సవరకథలు, సవరపాటలు ప్రభుత్వంవారు అచ్చువేయించేటట్లు గట్టిగా సిఫార్సుచేయవలసినదని ఉద్యోగరీతిగాను, స్నేహపూర్వకంగాను చెప్పడంచేత అప్పటి జిల్లాకలెక్టరయిన మార్ మైకేల్ దొరగారు ప్రభుత్వమువారికి వ్రాసి అనుమతి తెప్పించారు.

ఉద్యోగవిరమణము, రావుసాహెబు బిరుదప్రాప్తి

ఇంతలో మా తండ్రిగారికి కాలేజీ పని నుండి 'రిటైర్' అయి విశ్రాంతి పొందుదామన్న కోరిక పుట్టినది. వయస్సుకు 48 సంవత్సరములవారే అయినా 1880 నుండి 30 సంవత్సరములు పనిచేసినవారు గనుక, వీరు రిటైర్ కావడానికి కాలేజీ అధికారులు అనుమతిచ్చారు. 1911లో వీరు రిటైర్ అయినారు. ఆపని నాకు ప్రాప్తించడంచేత, జయపురం హైస్కూల్ హెడ్‌మాస్టరుపని విడిచిపెట్టి, నేను పర్లాకిమిడి చేరుకొన్నాను. అచ్చుకాకుండా ఉన్న సవరపుస్తకాల ప్రూఫులు చూడడం తప్ప మరి యేసాహాయ్యమూ నేను వారికి చేయలేకపోయినాను. "ఈ పుస్తకాలు రచించినందుకు నీకేమి పారితోషికము కావాలె" నని ప్రభుత్వంవారు అడిగినప్పుడు "నా కేమీ అక్కరలే"దని వీరు తెలియజేశారు. ఎట్లయినా వీరిని గౌరవించడం విధి యని ప్రభుత్వంవారు గ్రహించి, 1911 లో జార్జి చక్రవర్తి రాజ్యాభిషేక సంబంధమైన ఉత్సవం జరిగినప్పుడు వీరికి సర్టిఫికెట్ ఆవ్ మెరిట్టున్ను, 1913 లో రావుసాహెబ్ అనే బిరుదున్ను ప్రభుత్వం వారు వీరి కిచ్చారు.

ఆ బిరుదు వచ్చేసరికి వీరు విజయనగరంలో నివసించవలసి వచ్చినది. అది యొక చిత్రమైన సన్నివేశము. విజయనగరం మహారాజావారి పిల్లలలో మొదటివారు (అనగా రెండేండ్ల క్రిందట చెన్నపురిలో మృతినొందినవారు) ఆ కేంబ్రిడ్జిలో చదువుకొంటూ ఉండేవారు. వారి చెల్లెలున్ను, తమ్ముడున్ను (అనగా క్రికెట్ బంతి ఆటలో ప్రసిద్ధి పొందినవారు) విజయనగరంలో ఉండేవారు. వారికి ట్యూటరు కావలసి ఉండెను. ఆ పని నాకిప్పించడానికి శ్రీ॥ శ్రీ॥ గురజాడ అప్పారావుపంతులుగారు సంకల్పించుకొని నన్ను పిలిచారు. పర్లాకిమిడి కాలేజీలో నేను చేస్తూఉన్న పని ఇంతకంటె ఎక్కువ శాశ్వతమైనపని అన్న ఉద్దేశంతో ఆ పని చేయడానికి నేను సమ్మతించక, మా తండ్రిగారు రిటైర్ అయినా 50 సంవత్సరములు ఈడు గలవారే గనుక, వీరి కాపని ఇప్పించిన యెడల మా కుటుంబమునకు సహాయంగా ఉంటుం దన్నాను. అందుచేత వీరు 1913 లో విజయనగరవాస్తవ్యు లయినారు. అప్పుడు వీరూ, గురజాడ అప్పారావుగారూ, బుర్రా శేషగిరిరావుగారూ వజ్ఝల చిన సీతారామస్వామిశాస్త్రులుగారూ వ్యావహారిక భాషావాదమునకు కావలసిన కృషి, చర్చలూ చేస్తూఉండేవారు. అయితే, ఈ ట్యూటర్ పని ఒక్క సంవత్సరం కంటె ఎక్కువ చేయలేదు.

1914 లో వీరు పర్లాకిమిడికి తిరిగి వచ్చి ఆంధ్రభాషాసృష్టి తీవ్రంగా చేయడానికి మొదలుపెట్టినారు. ఈ వ్యావహారిక భాషావాదపరిణామము వేరే ఒక వ్యాసంగా రచించవలసినది గనుక, దానితో సంబంధించిన వీరి జీవితచరిత్ర మరి ఎక్కువగా ఇక్కడ వ్రాయదలచుకోలేదు.

సవరభాషనుగురించిన వీరిగ్రంథములకు ప్రభుత్వమువారి తోడ్పాటు

'లింగ్విస్టిక్ సర్వే ఆవ్ ఇండియా' అనే గ్రంథాలలో సవరభాషను గురించి వ్రాస్తూ "దీనికి సంబంధించిన నిఘంటువు, కథలు, పాటలు రావుసాహెబు జి. వి. రామమూర్తిపంతులుగారు రచించినారు; ప్రభుత్వమువారు అచ్చువేసి ప్రకటించినారు; గాని, ఇవి తెలుగులిపిలో తెలుగు వర్ణమాలతో ఉన్నందున, ఇవి తెలుగు తెలిసిన వారికే కాని ఇతరులకు ఉపకరించవు; ఆంగ్లభాషలో రచితములై ఉండిన యెడల భాషాతత్త్వవేత్తల కుపకరించి ఉండును" అని గ్రియర్‌సన్ దొరగారు వ్రాశారు. అందుచేత మా తండ్రిగారికిన్ని, ప్రభుత్వోద్యోగస్థులకున్ను, కొండలలో సవర దేశమందు పనిచేస్తూఉన్న మిషనరీలకున్ను, ఆస్సాం తేయాకు తోటలకు సవరలను మైతము కూలీలుగా తీసుకొనిపోతూ ఉండిన సంఘంవారికిన్ని సవరభాషకు సంబంధించిన పుస్తకములు ఇంగ్లీషుభాషలో కావలెనన్న కోరిక పుట్టినది. అవి రచించగలశక్తి మా తండ్రిగారికి తప్ప మరియెవరికిని లేకుండెను. సవరభాష నేర్చుకొన్న వెల్డ్‌మన్ దొరగారు 1917 లో చనిపోయినారు. 1928 లో మిస్ మన్రో అనే మిషనరీ దొరసానిగారు సవరకొండలలో పనిచేయవలసి వచ్చినందున సవరభాష నేర్చుకొనుటకు మొదలుపెట్టినారు. ఆంధ్రభాషాసృష్టిలోను, వ్యావహారిక భాషావాదములలోను నేను మా తండ్రిగారికి తోడుపడి పనిచేయవలసి వచ్చినందున నేను సవరభాష నేర్చుకొనుటకప్పటివరకున్ను అవకాశము లేకపోయినది. అప్పుడు మా తండ్రిగారు నన్నొకసారి పిలిచి "నీవు సవరభాష నేర్చుకోక తప్ప"దన్నారు. "సరే మంచి" దన్నాను. 30 సంవత్సరములు వారు శ్రమపడి నేర్చుకొన్న సవరభాష అంతా నాకు ఆరుమాసాలలో పట్టుపడేటట్లు నేర్పారు. అంతలో ప్రభుత్వంవారు ఇంగ్లీషుభాషలో సవర - ఇంగ్లీషు, ఇంగ్లీషు - సవర నిఘంటువులున్ను, సవర వ్యాకరణము, సవరకథలున్ను రచించవలసినదని కోరుతూ మా తండ్రిగారికి తెలియజేశారు. నేను సవరభాష నేర్చుకొని ఉండడంచేత

ఈ పనిలో కూడా నేను మా తండ్రిగారికి తోడుపడ గలిగినాను. 1931–1936 లలో ఈ గ్రంథములు రచితము లయినవి. ప్రభుత్వము వారు వీటిని ప్రకటించారు. ఈపని జరుగుతూ ఉన్న కాలంలో 1934-వ సంవత్సరమందు వీరికి కైజర్-ఇ-హింద్ సువర్ణ పతకమును ప్రభుత్వమువారు బహుమతిగా ఇచ్చారు.

ఆంధ్రోత్కళ సంక్షోభంలో జోక్యం

ఈపని జరుగుతూ ఉన్న కాలంలోనే ఆంధ్రోత్కళసమస్య, ఉత్కళరాష్ట్రనిర్మాణం, ఆంధ్రదేశభాగములే అయినా పర్లాకిమిడి, బరంపురం మొదలయినభాగములు ఉత్కళరాష్ట్రంలో కలపడం మొదలయిన సంక్షోభం కలిగింది.

ఇందులో మా తండ్రిగారున్నూ, వీరితో పాటు నేనున్నూ జోక్యం కలుగజేసుకోక తప్పింది కాదు. 1931 లో పర్లాకిమిడి రాజులచరిత్ర, గంగవంశపురాజులు ఓఢ్రులు కారన్న విషయం చర్చకు వచ్చినప్పుడున్నూ, ఒడొనెల్ కమిటీవారి యెదుట ఆంధ్రులతరఫున ఆంధ్రులకోర్కెలు నివేదించవలసివచ్చినప్పుడున్నూ ఈ విషయం బాగుగా తెలిసినవారిలో పెద్దలు మాతండ్రిగారు కావడంవల్లను వీరిని ముందుగా పెట్టుకొని ఆంధ్రులు పనిచేయవలసివచ్చినది. ఇదంతా పర్లాకిమిడిరాజాగారి కోపానికి కారణమైనది. అయితే, రాజావారు వీరి నేమిచేయగలరు? వారికాలేజీలో పనిచేసిన వారే అయినా వీరు 1911 లో ఎస్టేటు కోర్టు ఆవ్ వార్డ్సువారి పెత్తనంలో ఉన్నప్పుడు గ్రాట్యుఇటీ పుచ్చుకొని రిటైరయినారు. అందుచేతను వీరిమీద తమకు గల కోపం, నేను వారికొలువులో ఉన్నవాణ్ణి గనుక, నామీద చూపించారు. ఏదో ఒక సాకు చూపి నన్ను 4-2-1932 లో ఉద్యోగం నుండి తొలగించారు. నాటనుండిన్నీ మా కుటుంబము ఆర్థికంగా చాలా చిక్కులు పడవలసివచ్చింది. అయినా మా తండ్రిగారు చలించలేదు; నన్ను చలించ నివ్వలేదు.

1932-33లో పర్లాకిమిడికి తాలూకాబోర్డు కొత్తగా ఏర్పడింది. అదివరకు పర్లాకిమిడిలో ఉన్న మ్యూనిసిపల్ కౌన్సిలును తమకు వశ్యం చేసుకొని పర్లాకిమిడిరాజావారు పర్లాకిమిడి ఒరిస్సాలోచేర్చవలసినదనే తీర్మానం కావించుకొని ఉండడంవల్ల రాబోయే తాలూకా బోర్డుకూడా తమకు వశ్యమయితే దానిలో కూడా ఈతీర్మానం నెగ్గించుకొని పర్లాకిమిడితాలూకా ప్రజలంతా ఒరిస్సాలో చేరడాని కిష్టపడుతున్నట్లు ప్రభుత్వంవారికి తెలియజేస్తారన్న భీతిచేతను తాలూకాలోని ఆంధ్రు లందరూ తాలూకాబోర్డుమెంబర్ల ఎన్నికలవిషయంలో ఉషారుగా ఉండిరి. ప్రతిఘటనలోను రాజాగారు నిలబెట్టిన అభ్యర్థికిన్నీ, తెలుగువారు నిలబెట్టినఅభ్యర్థికిన్నీ తీవ్రమైనపోటీ జరిగింది. రాజాగారితో తాలూకా రైతులు బహిరంగంగా పోటీలో నిలవడానికి ఇదే ప్రారంభం. రాజాగారి మనుష్యులు ఎన్నికలవిషయంలో 'రైతుబిడ్డ'సినిమాలో చేసిన చర్యలు ఇంచుమించుగా అన్నీ చేసినవారే. అయినా, తెలుగువారి ప్రతినిధులసంఖ్య ఎక్కువయినది; నేనే అధ్యక్షుడ నయినాను. ఈ విషయంలో మాతండ్రిగారు తెలుగువారి పక్షమునవిల్చి వృద్ధులయినా యువకులవలెనే పని చేసి మాకు జయము కలిగించారు. పర్లాకిమిడి తాలూకాలో నూటికి 60 మంది పైగా తెలుగుమాటలాడేవారు కలరు గనుక ఇది ఒరిస్సాలో చేర్చకూడదన్న తీర్మానము నెగ్గింది. ఒడొనెల్ కమిటీవారి నివేదికలో ఇద్దరుసభ్యులు పర్లాకిమిడికూడా ఒరిస్సాలో చేర్చవలసినదని సిఫార్సుచేసినా, వారి అభిప్రాయమును ఖండిస్తూ అధ్యక్షులయిన ఒడొనెల్ గారు పర్లాకిమిడి తెలుగువారిదే గనుక ఒరిస్సాలో చేర్చగూడ దన్నారు. దాని ననుసరించి వైట్ పేపర్లోకూడా అదే నిశ్చితమైనది. అయినా, ఈ విషయము జాయింట్ పార్లమెంటుకమిటీవారు ఆమోదిస్తేనేకాని తేలనిది గనుక, వారి యెదుటను ఎవరిపక్షము వారు వాదించుకోడానికి లండన్ వెళ్లవలసివచ్చింది. తెలుగువారి పక్షమున బయలుదేరినవారిలో పర్లాకిమిడి ఒరిస్సాలో కలపరాదని వాదించడానికి నన్ను మా తాలూకా ఆంధ్రులు పంపించారు. ఈ పనిలో కూడా మా తండ్రిగారు శ్రమపడి అనేకవిధముల మాకు మార్గదర్శకులుగా ఉండేవారు. ఈ ఉద్యమంలో నేను జోక్యం కలుగజేసుకోకుండా ఉండేటట్టు చేయడానికి కొన్ని మాయోపాయములూ, తంత్రములూ జరిగినవి. "ఆంధ్రుల యెడలనుగాని, నిన్నునమ్మి తమకు ప్రతినిధిగా నిన్ను లండన్ పంపినవారియెడలను గాని నీవు ద్రోహివి కానేరవన్న నమ్మకం నాకు లేకపోలేదు. అయినా చెప్తున్నాను: నీవు పరుల మాయమాటలకు మోసపోవద్దు. జాగ్రత్త" అని నేను 1933 లో లండన్ వెళ్లినప్పుడు మా తండ్రిగారు నాకు చేసిన ఉపదేశవాక్యాలు నే నెన్నటికీ మరవలేను. అసలు నాకు ద్రోహచింత పుట్టనేలేదు. అందులో మా తండ్రిగారి హెచ్చరిక నన్ను మరింత జాగరూకుని చేసినది; దొంగమాటలకు లొంగిపోకుండా కాపాడినది. నాకు విహితమైనపని నేను నెరవేర్చుకొన్నాను. పర్లాకిమిడి ఒరిస్సాలో చేర్చకూడ దనడానికి నేను చెప్పిన కారణాలు సెక్రటరీఆవ్ స్టేట్ ఫర్ ఇండియాకున్నూ, వారికి తోడుగా ఉన్న కమిటీవారికిన్నీ నచ్చినవి. 1934 జనవరి నెలకి పర్లాకిమిడి ఒరిస్సాలో కలపకుండా ఉంచుటకే జాయింటు పార్లమెంటరీ కమిటీ వారు నిశ్చయించుకొన్నా రన్నవదంతి పుట్టినది. అప్పుడు పర్లాకిమిడిరాజావారు మరల లండన్ పోయి పర్లాకిమిడితాలూకా అంతా కాకపోయినా, పట్టణమున్నూ దానికి చేరువగా ఉన్న కొన్ని గ్రామములున్నూ అయినా ఒరిస్సాలో చేర్చవలసినదని కోరి విశేషంగా ధనం ఖర్చుపెట్టి పలుకుబడి ఎక్కువ చేసుకొని కృతార్థు లయినారు. పర్లాకిమిడిన్నీ, తాలూకాలో మూడవవంతు భాగమున్నూ ఒరిస్సాలో కలిసినవి. 1936 లో ఏనాడు

ఒరిస్సా రాష్ట్రం ఏర్పడి పర్లాకిమిడి అందులో చేరినదో ఆనాడే మాతండ్రిగారు అక్కడ నుండి వెడలి నా కడపటి తమ్మునివద్ద నుండడానికి నిశ్చయించుకొని రాజమహేంద్రవరం వచ్చారు. అక్కడ మా తమ్ముని కొడుకులను చేరదీసి ఇంగ్లీషు, సంస్కృతము, తెలుగు నేర్పడానికి పూనుకొన్నారు.

వీరి విద్యాబోధన పద్ధతులు

బడులలో చెప్పే చదువుకంటె ఎక్కువగా సులభమైన పద్ధతులలో చదువు చెప్పవలెనన్న కోరిక వీరికి చిన్నప్పటినుండిన్నీ ఉండేది. 50 ఏండ్లక్రిందటనే రెండుతరగతుల చదువు ఒక్క సంవత్సరంలో ఎందుకు చెప్పకూడదన్న పట్టుదలతో ఆరంభించి నన్ను బడిలో ప్రవేశపెట్టక ఇంటివద్దనే కూర్చుండబెట్టుకొని చదువుచెప్తూ ఉండేవారు. ప్రైమరీపరీక్ష గవర్నమెంటుపరీక్షగా ఉండేది. అది నేను నా 7-వ ఏటను నెగ్గేటట్లు తర్ఫీదు చేశారు. ఆ కాలంబడులలో పాఠములు చెప్పే పద్ధతులకంటె ఎక్కువ మంచిపద్ధతులనే అనుసరించి వీరు పాఠములు చెప్తూ ఉండేవారు. అయినా వీరిపద్ధతులు నేటి విద్యాబోధకుల దృష్టికి కూడనివిగానే ఉండేవి. ఇది ఇటీవల వీరు ఒప్పుకొన్న విషయమే. పిల్లల బుద్ధికి, గ్రహణశక్తికి మించిన మాటలూ, వాక్యాలూ, అర్థాలూ వల్లవేయిస్తూఉండేవారు. అన్నప్రాశననాడే ఆవకాయ తినిపించారన్నట్లు వీరు నాకు ఇంగ్లీషు చెప్పడానికి ఆరంభించిన మూడునెలలకే వ్యాకరణసూత్రాలు చెప్పి అప్పచెప్పకొనేవారు. అన్నిటికంటే పెద్దలోపమేమంటే కోపము. ఒక్కసారి చెప్పింది రాకపోయినా, చదువువాడు మరచిపోయినా చేతికి వచ్చినట్టు కొట్టేవారు. బడిలో పెద్దతరగతుల పిల్లలను చిన్నతరగతుల పిల్లలను, ఎఫ్.ఏ.క్లాసు విద్యార్థులను సైతము గట్టిగా కొట్టేవారు. వీరినెవరున్నూ మందలించేవారు కారు. కళాశాలలోని ప్రిన్సిపల్ గారు కూడా వీరికి జడిసి ఉండేవారు. అధికారం చెలాయించవలెనేకాని అధికారానికి లోబడి ఉండటం వీరి కెన్నడూ అలవాటు కాలేదు. ఈకోపం వీరికి తగ్గిపోవడానికి కొంతవరకు నేనేకారణం. ఫొనెటిక్ లిపి ననుసరించి, డైరెక్టు మెథడ్ ప్రకారం 1908 లో పిల్లలకు ఇంగ్లీషు నేర్పుతూ ఉన్నప్పుడు ఒకనాడు నేను పాఠం చెప్తున్నాను. అప్పుడు వీరుకూడా నా చెంతనుండి క్రొత్తవిషయాలు, క్రొత్తమాటలు చెప్తున్నారు. ఒకటి రెండుసార్లు చెప్పినా పిల్లలకు పట్టుపడలేదు. వీరు అడిగిన ప్రశ్నలకు పిల్లలు తప్పు చెప్తున్నారు. వీరు కోపం పట్టలేక చికాకుపడుతూ పిల్లలందరినీ గట్టిగా కొడుతున్నారు. ఒకసారి వాణ్ణీ వీణ్ణీ కొట్టవలసిన దని నాతో చెప్పారు. నేను కొట్టనన్నాను. నామీద కోపం వచ్చి వెళ్లిపోయినారు. పిమ్మట కొంతసేపు పోయినతర్వాత శాంతంగా రెండుసార్లు మూడుసార్లు బోధపరచి చెప్పగా మా తండ్రిగారు బోధపరచి చెప్పదలచుకొన్న విషయములు పిల్లలకు చక్కగా బోధపడినవి. ఆ దినమే నాకూ, మా తండ్రిగారికీ ఇంటివద్దను పిల్లలను కొట్టడం గురించి పెద్దవాదం జరిగింది. పిల్లలు అల్లరిచేసినా, నడవడి చెడ్డదయినా వారిని దండించవచ్చునేమోకాని చెప్పిన విషయం వారికి బోధపడకపోతే మరియొకసారి చెప్పవలసినదేకాని దండించడం తప్పు అనిన్నీ, దానివల్ల లాభం లేదనిన్నీ నేను వాదించాను. ఈ ఆశయాన్ని పెట్టుకొనే నేను ఉపాధ్యాయవృత్తి నడుపుకొంటూ వచ్చాను. ఈ వాదం జరిగినతర్వాత ఈ విషయంలో వీరి దృష్టి మారినది. మరి మూడేండ్లకే వీరు రిటైరయినారు. అప్పటికి మా కడపటి తమ్ముడు (గిడుగు సూర్యనారాయణ ఎం.ఏ. ఎల్.టి.) 8 ఏండ్లవాడు. వాణ్ణి, మరి ఇద్దరు పిల్లలను ఇంటివద్దను చదువుచెప్పి రెండేండ్లలో వాండ్లు 4 వ ఫారములో చదువుటకు అర్హులయినట్లు తర్ఫీదుచేశారు. వీండ్లను సాధారణంగా కొట్టేవారుకారు. వీండ్ల ఇంగ్లీషు నిర్దుష్టంగాఉండేది. లాంగ్ ఫెలో కావ్య వాళ్లా అర్థంచేసుకోగలిగారు. పిమ్మట గ్రాంథిక వ్యావహారిక భాషావాదంలో పనిచేయవలసి వచ్చుటచేత పిల్లల చదువులపై వీరి దృష్టి తగ్గిపోయినది. రాజమహేంద్రవరం రాకముందే మాతమ్ముని పెద్దకుమారుణ్ణి తర్ఫీదుచేయడానికి పూనుకొన్నారు. ఒక్క సంవత్సరంలో ఆ అబ్బాయి తెలుగు చదవడం, వ్రాయడం నేర్చుకొని చింతాదీక్షితులుగారు వ్రాసిన కథలు ధారాళంగా చదవగలిగాడు. మరి రెండు సంవత్సరాలలో సుమారు రెండువేల సంస్కృత శ్లోకాలు అర్థజ్ఞానంతో నేర్చుకోగలిగి సంస్కృతమున కొద్దిగా సంభాషిస్తూ ఉండేవాడు. ఆ అబ్బాయి ఇప్పుడు 13 ఏండ్లవాడు; స్కూల్ ఫైనల్ పరీక్షకు వెళ్తున్నాడు. వాడి తరువాతివాడు అంత ఆరోగ్యం గలవాడు కాడని వాణ్ణి విడిచిపెట్టి వాడితర్వాతి అబ్బాయిని తర్ఫీదు చేయడానికి పూనుకొన్నారు. వీడు తొమ్మిదేండ్లవాడు; సంవత్సరమయినది సంస్కృత మారంభించి: వేయి శ్లోకములు అర్థజ్ఞానంతో చదివాడు. సాధారణ ధాతువులకు అన్ని లకారములలోను తిఙంత రూపములు చెప్పగలడు. ఈ అబ్బాయి మా తండ్రిగారితో చెన్నపట్టణం వచ్చాడు. ఈ అబ్బాయికోసం మా తండ్రిగారు సంస్కృత కథలపుస్తకం, వెల్స్ రచించిన ప్రపంచ చరిత్ర కొనుకున్నారు. రెండు దినాలకు మరణ మాసన్న మగునగా వీరు ఈ అబ్బాయిని దగ్గర కూర్చుండబెట్టుకొని "మరి నేను నీకు చదువుచెప్పడం జరగదు; బుద్ధిగా చదువుకో" అని జాలిగా చెప్పారు.

పిల్లలకే కానీ, పెద్దలకే కానీ తమకు తెలిసిన చదువు ఇతరులకు చెప్పడమంటే వీరికి గల ఆసక్తి, ఓపిక సాధారణంగా మరియొకరియందు దుండవు. నేను కాలేజీలో పనిచేస్తున్న దినాలలో ఉదయం వీరు ఆలస్యంగా పక్కనుండి లేస్తూ ఉండడంచేతను, 10 గంటలనుండి సాయంకాలంవరకూ నేను కాలేజీలోనే ఉండడంచేతను రాత్రి భోజనాల సమయంలోనే ఇద్దరం కలుస్తూఉండేవారము. ఆ దినము

వీరు తెలుగుభాషావిషయంలోగానీ, మరి యొక విషయంలోగానీ కొత్తగా నేర్చుకొన్నవన్నీ నాతో చెప్పేవారు. ఏదైనా ఒకవిషయం పరిశోధించి తెలుసుకోవలెనంటే, కాలేజీలో వున్న పుస్తకాలు పరిశోధించి తెలుసుకొని రమ్మనేవారు. మేము నిత్యం మాట్లాడుకొనే మాటలలో గృహకృత్యాల విషయం ఒకపాలు, చదువు విషయాలు తొంభైతొమ్మిదిపాళ్లు.

పత్రికారచయితలకు కడపటి సందేశం

చెన్నపట్టణం చికిత్సకోసం వచ్చినప్పుడు వీరు పత్రికారచయితలకు తమ కట్టకడపటి సందేశం తెలియజేయగోరి అందుకు "ఎక్కడయినా ఒకసభ ఏర్పాటు చేయిస్తావా? ఉపన్యసిస్తాను" అని నాతో ప్రసంగించారు. వీరి దేహస్థితి చూచినవా రెవరూ అందుకు సమ్మతించరు. అయితే, వీరి ఉత్సాహము, పట్టుదల ఎరిగినవాడను గనుక వీరికి ఉపన్యాస మిచ్చే శ్రమ కలిగించడంవల్ల కలిగే హాని కంటె ఉపన్యాసం ఇవ్వకుండా చేయడంవల్ల కలిగే క్షోభను వీరి నెక్కువ బాధిస్తుందని గుర్తించి, చెన్నపురి ఆంధ్రమహాసభ వారితోను, శ్రీ రామబ్రహ్మం గారితోను మాటలాడాను. పెద్దసభలో ఉపన్యసింపజేస్తే వీరికి ఎక్కువ ఆయాసంగా ఉంటుందని రామబ్రహ్మంగారు తమ ప్రజామిత్ర ఆఫీసువద్దను 15-1-40 నాడు సభ ఏర్పాటు చేశారు. ఆ సభలో వీరు వ్యావహారికభాష గ్రంథస్థం చేయించడానికి చేసిన కృషిని గురించి సంగ్రహంగా ముచ్చటించారు; తామింక ఈ లోకమునుండి వెడలిపోయేకాల మాసన్నమైనది గనుక తమ కట్టకడపటి సందేశము తెలుగుపత్రికల సంపాదకులు, రచయితలు వినవలసిన దని కోరారు.

వీరివాదంలోను, సందేశములోను ముఖ్యంగా గుర్తించవలసినవిషయములు సంగ్రహించి తెలియజేస్తున్నాను:

"జీవంతో ఉన్న ప్రతివస్తువూ మారుతూ ఉండడం సహజం. అన్ని జీవద్భాషలున్ను మారుతూ వచ్చినవి. మన తెలుగుభాష సైతము జీవద్భాష గనుక మారుతూ ఉంది. 'చేసితివేని' 'చేస్తే' కావడం భాషలో కలిగిన పరిణామాన్ని చూపిస్తుంది గాని నాశనము చూపించదు. నన్నయనాటి తెలుగుభాషే నేటికిన్ని ఏమార్పూ లేకుండా ఉన్న దనడం అబద్ధం; ఉండా లనుకోవడం అవివేకం. నన్నయనాటి గోదావరే ఈనాడూ ప్రవహిస్తోంది గాని ఆనాటిజలం ఈనాటిది కాదు. అందుచేతనే 'నిత్య ప్రవాహినీ దేశ్యా' అన్నారు.

"భాషలో ఎప్పటి కేరూపములు వాడుకలోనుండి పోయినవో అవి విడిచి, ఏవి వాడుకలోనికి వచ్చినవో అవి ప్రయోగిస్తూ గ్రంథాలు రచించడము సర్వసంప్రదాయం. అందుచేతనే వేదకాలంనాటి వైదికరూపాలు భాషలో అర్షము లనీ, వాటిని సంస్కృత భాషాగ్రంథాలలో ప్రయోగించరాదనీ నిషేధించారు.

"ఇంగ్లీషువారు తమ గ్రంథాలలో ఆధునికప్రయోగాలే చేస్తారు. చాసర్, షేక్స్పియర్, మిల్టన్ మొదలయిన మహాకవులు రచించినగ్రంథాలు చదువుకొంటారు గాని వాటిలో ఉన్నభాష తమనాటి వ్యవహారంలో లేకపోతే వాడరు. అలాగే తెలుగువారుకూడా తమనాటి వ్యావహారికభాషలో గ్రంథరచన సాగించవలెను.

"ఆంధ్రసారస్వతచరిత్ర పరిశీలించి చూడగా పద్యరచన కొక సంప్రదాయమున్ను, గద్యరచన కొక సంప్రదాయమున్ను ఉన్నట్లు కనబడుతుంది.

"పద్యరచన విషయంలో ప్రతికవిన్ని తన పూర్వులు రచించిన కావ్యాలలోని భాషనే ఆదర్శంగా పెట్టుకొని తనకాలమందు శిష్ట వ్యవహారమందున్న కొత్తమాటలే కాక కొత్తగా పరిణమించియున్న సుబంత, తిఙంతాదిరూపములున్ను జతపరచి ప్రయోగిస్తూ వచ్చాడు.

"ఈకొత్త పోకలసమ్మేళనము కొద్దికొద్దిగా సాగుతూ రావడంవల్ల కావ్యాలలోని భాష వ్యావహారిక భాషకు దూరమగుతూ ఉన్నా దాని మార్గాననే నడుస్తూఉంది. అందుచేతనే, లాక్షణికులు ఎప్పటికప్పుడు కవిప్రయోగాల ననుసరించి లక్షణం సరిపెట్టుకొంటూ వచ్చారు. ఆంధ్రశబ్దచింతామణి సూత్రాలనుబట్టి తప్పు లనదగినవి అప్పకవి తననాటివరకున్ను గల కవిప్రయోగాలు చూపించి ఒప్పులుగా చెప్పుకొన్నాడు. అప్పకవిలక్షణంబట్టి తప్పు లనదగిన ప్రయోగాలు ఉదహరించి తిమ్మకవి తనకాలంవరకున్ను గల కవి ప్రయోగాలు చూపించి సాధువు లన్నాడు. పిమ్మట అహోబలపతి ఆధునిక ప్రయోగాలు అదివరలో తప్పు లనదగినవి కవిప్రయోగాలు చూపించి సమర్థించాడు. (ఈసంప్రదాయం తెలియజేస్తూ మా తండ్రిగారు తమ బాలకవిశరణ్యము రచించారు.) చిన్నయసూరి ఆధునిక కవి ప్రయోగాలు చెప్పకుండా లక్ష్యాలు చూపించడం పనిపెట్టుకోకుండా తనమతోచినట్లు వ్యాకరణసూత్రాలు కల్పించి అదివరకు కావ్యరచనకు మాత్రమే కవులు ప్రయోగించిన కావ్యభాషాప్రయోగాలు వచనరచనకు సైతము గ్రహించి వచనరచన విషయంలో కొత్త సంప్రదాయం తెచ్చిపెట్టినాడు.

"చిన్నయసూరిపూర్వం ఆంధ్రసారస్వతంలో వచనరచన లేదనుకోవడం పొరపాటు. వందలకొలది గ్రంథాలు వచనాలతో ఉన్నవి కనబడినవి. అవి అన్నీ వాడుకభాషలో ఉన్నవి. ఇవి అచ్చుపడకపోవడంచేతను, దేశంలోనికి అచ్చుయంత్రాలు వచ్చి గ్రంథాలు అచ్చుకావడం ఆరంభమయేటప్పటికి చిన్నయసూరిగారి నీతిచంద్రిక అచ్చుపడి వారి ఉద్యోగప్రాభవమువల్ల వారి బాలవ్యాకరణమున్ను, నీతిచంద్రికయున్ను బడులలో పాఠ్యగ్రంథాలు కావడంచేతను ఈగ్రంథాలు చదువుకొన్నవారికి, వారి శిష్యులకూ గద్యరచనవిషయంలో ఈకొత్తసంప్రదాయమే కాని అంతకుపూర్వమున్న సంప్రదాయం

ఁయుపోంగా పోయినది. చిన్నయసూరి
ార్థవము కల్పగతమై ఉన్నవారికి మావాద
అతి కటువుగా తోచింది.

మాతంత్రిగారు తెలుసుకొన్న ఈ సంప్ర
య వి వ య ము లు గ్రంథాలలో
ేను చూ పిం చ గా చూ పిం చి
వారివాదం అంగీకరించడానికి మార్గ
ర్పడినది. వ్యావహారిక భాషలో గ్రంథాలు
ద్యకావ్యాలు కాకపోతే పోనీ, గద్య
ంథలు అయినా) రచించండని వారు చెప్పి
ుడు వారు కొత్తగా ఏ సంప్రదాయమూ
ంచి చెప్పడంలేదు; చిన్నయసూరి పూర్వ
న్న సంప్రదాయమే మరల ఉద్ధరించండ
న్నారు. వారు తమ కడపటి సందేశంలో—

"నా శ్రమ వృథాకాలేదు. మొట్టమొదట వలసురయిదుగురు మాత్రమే ఆమోదించినా నా వాదను వేలకొలది విద్యాధిపులు, విద్యార్థులు, కవులు, రచయితలు ఆమోదించారు. ఏదో ఒకటి రెండు తప్ప తక్కిన పత్రికలన్నీ తమసంపాదకీయ వ్యాసములూ, తక్కిన వ్యాసములూ వ్యావహారిక భాషలోనే ప్రకటిస్తున్నవి. ఇంతవరకు నేను కృతార్థుడను.

"యూనివర్సిటీలున్నూ, ప్రభుత్వవిద్యాశాఖవారున్నూ మాత్రం ఇంకా అనుగ్రహించలేదు. 25 సంవత్సరముల క్రిందట ఈ రెండు సంస్థలవారున్నూ వాదుకభాషను గ్రహించవలె నని చూచినప్పుడు నావాదం తెలుసువారు గ్రహించకపోవడంచేతను అలజడి ఎక్కువయినది. అందుచేత, ఆసంస్థలవారు దానిని గ్రహించలేదు. ఇప్పుడు తెలుసువారు నావాదం గ్రహించినవారు గనుక, ఆసంస్థలవారు గ్రహించి ఆమోదించేటట్లున్నూ, ఆచరణలో పెట్టేటట్లున్నూ చేయవలసిన భారం మీది. ఈపని మీకు అప్పగించి నేను విరమిస్తున్నాను—సెలవు." అన్నారు.

'కట్టకడపటి సందేశ'మని మాతంత్రిగారు అన్నట్లుగానే ఇది వాస్తవముగా వీరి కట్టకడపటిసందేశమే అయినది.



సుప్రయోగానది ఏది?

అది ఏ నామాంతరముతో నేడు వ్యవహరింపబడుచున్నది?

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

> భగవదజ్జుకము, భారతము, రామాయణము మొదలైన ప్రాచీనగ్రంథములలో పెక్కింట తెలుగుదేశపు నదులతోపాటు పేర్కొనబడిన ఈ 'సుప్రయోగ' ఏనదియో యని నిరూఢములైన చారిత్రకోపపత్తులతో, సయుక్తికముగా శ్రీ శర్మగారు ఈవ్యాసములో నిరూపించియున్నారు.

సుప్రయోగ అనునది 'భగవదజ్జుక' మను ప్రహసనమున[1] ఒక ప్రసిద్ధనదిగ చెప్పబడినది. 'భగవదజ్జుక' కర్త పల్లవవంశజుడయిన మహేంద్రవర్మయని యూహించుచున్నారు. మహేంద్రవర్మ క్రీస్తుశకము ఏడవశతాబ్ది ఆరంభమున కాంచీపురము నేలిన పల్లవ రాజు. ఇతడు సంగీత, సాహిత్యములందు చతురుడని ప్రతీతి. 'మత్తవిలాస' మన్నదికూడ ఇతడు వ్రాసిన మరియొక ప్రహసన మని పరిశోధకపండితు లూహించుచున్నారు. మహేంద్రవర్మ కుడిమియామలై శాసనమువలన ఆ మహారాజునకు సంగీతశాస్త్రమునందుగల ప్రావీణ్యము విశద మగుచున్నది. మహేంద్రవర్మయే గుహాలయనిర్మాణమును దక్షిణదేశమున మొదలుపెట్టించె నని తెలియుచున్నది. ఈ గుహాలయనిర్మాణవిద్య నీతడు ఆంధ్రదేశమునుండియే గ్రహించె ననియు, ఈతడు ప్రాయికముగ మొదట ఆంధ్రదేశీయుడో, లేక ఆంధ్రదేశముతో సంబంధముగలవాడో అయియుండవలె ననియు పరిశోధకపండితులు కొందరి యభిప్రాయము. ఈ మహారాజు దని అనుమానింపబడుచున్న, నిర్ధరింపబడుచున్న భగవదజ్జుకప్రహసనమున సుప్రయోగానది పేర్కొనబడినది. యమపురుషుడు వేశ్యయైన అజ్జుకప్రాణములను పాశములకు దగిలించి లంకాభిముఖుడై పోవుచు ముందు గంగానదిని, తరువాత వింధ్యపర్వతములను, పిదప నర్మదానదిని, అటువెనుక సహ్యపర్వతములను, ఆవెనుక గోలేయి (గోదావరి), కృష్ణవెణ్ణానదులను, అటుతరువాత పశుపతిభవనమును, ఆతరువాత సుప్రయోగను, అనంతరము కాంచీపురమును, పిమ్మట కావేరీ, తామ్రపర్ణీనదులను, మలయపర్వతమును గడచి వెళ్లినట్లు భగవదజ్జుకమున తెలుపబడినది. ఈపైని చెప్పబడినవాటిలో మన కంత ఎక్కువగ పరిచయములేనిది ఒక్క సుప్రయోగానదియే. అది ఇప్పు డెక్కడ నున్నదో మనకు దెలియుట లేదు. పశుపతిభవన మన్నది శ్రీశైల మని స్పష్ట మగుచున్నది. పైన చెప్పిన వన్నియు సరిగా ఉత్తరమునుండి దక్షిణమునకు వచ్చు త్రోవలో ఒకదానితరువాత నొకటిగ నున్నవని వానివరుసనుబట్టియే తెలియుచున్నది. గోదావరీ కృష్ణానదుల తరువాతను, కాంచీపురమునకు పూర్వమునను పశుపతిభవనము చెప్పబడుటచేత అది శైవక్షేత్రమయిన శ్రీశైల మనుటకు సందియము లేదు. శ్రీశైలము దాటి దక్షిణమునకు కాంచీపురమునకు వచ్చుచో మధ్యమార్గములో తగులు నది సుప్రయోగానది. కాంచీ, శ్రీశైలములకు మధ్య నదులు—చిన్నవైననేమి పెద్దవైననేమి— అనేకములు కలవు. వీనిలో సుప్రయోగ ఏది?

సుప్రయోగపేరు మన కిప్పు డపరిచితమయినను అది క్రొత్తదిగ గన్పట్టదు. పురాణములందును, మహాభారతమునందునుగూడ ఇది పేర్కొనబడినది. మార్కండేయపురాణమున

---

1. భగవదజ్జుకమును బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఆంధ్రీకరించియున్నారు. చూడుడు: భారతి, ౧౯౨౫, సంచికలు ౯,౧౦,౧౧.

"గోదావరీ భీమరథీ కృష్ణవేణ్యా తథాపరా, తుంగభద్రా సుప్రయోగా వాహ్యా కావేర్యథాపగా,
సహ్యపాదా ద్వినిష్క్రాంతా ఇ త్యేతాః సరిదుత్తమాః"

అని కలదు. మారన మార్కండేయపురాణమున భారతవర్షీయనదులను బేర్కొనుచు ఈ విషయ
మునే వచనమున నిట్లు వెల్లడించెను:

"సువాహిని పయోష్ణి నిర్వింధ్య నిమధావతి వైతరణి సినీవాలి కుముద్వతి మహాగౌరి దుర్గ యంతశ్శిర యను మహా
వాహినులు వింధ్యంబునం బుట్టె గోదావరి భీమరథి కృష్ణవేణి తుంగభద్ర సుప్రయోగ కావేరి యనునదులు సహ్యపర్వ
తంబున నుద్భవించె."

భారతవర్ష వర్ణనము సందర్భమున నదులను వర్ణించునపుడు పురాణము లన్నియు కొంచె మించు
మించుగ నీ రీతినే సహ్యమున బుట్టు నదులను పేర్కొన్నవి; చూడుడు:

"గోదావరీ భీమరథీ కృష్ణవే ణ్యాథ వంజులా, తుంగభద్రా సుప్రయోగా వాహ్యా కావే ర్యథాపి చ,
దక్షిణాప్రవహా నద్యః సహ్యపాదా ద్వినిస్సృతాః."

—బ్రహ్మాండపురాణము.

"గోదావరీ భీమరథీ కృష్ణవే ణ్యాథ వంజులా, తుంగభద్రా సుప్రయోగా కావేరీ చ తథాపగా,
దక్షిణాపథనద్య స్తు సహ్యపాదా ద్వినిస్సృతాః."

—వాయుపురాణము.

"గోదావరీ భీమరథీ కృష్ణవేణా చ వఞ్జులా, తుంగభద్రా సుప్రయోగా కావేరీ చ ద్విజోత్తమాః."

—కూర్మపురాణము.

"గోదావరీ భీమరథీ కృష్ణవేణా చ వంజులా, తుంగభద్రా సుప్రయోగా వాహ్యా కవేరీ తైవతు,
దక్షిణాపథనద్య స్తాః సహ్యపాదా ద్వినిస్సృతాః."

—మత్స్యపురాణము.

కాని విష్ణుధర్మోత్తరమునమాత్రము 'సుప్రయోగ'కు 'సుప్రకార' అని యిట్లు కలదు:

"తుంగభద్రా సుప్రకారా వాహ్యా కావేరికా తథా"

మహాభారతము వనపర్వమునను, భీష్మపర్వమునను వేణా, కృష్ణవేణానదులతో పాటు సుప్రయోగ
కూడ పేర్కొనబడినది; చూడుడు:

"తమసా నర్మదా చైవ నదీ గోదావరీ తథా, వేణ్ణోపవేణా భీమా చ వడవా చైవ భారత.
భారతీ సుప్రయోగా చ కావేరీ మురర్మురా తథా, తుంగవేణా కృష్ణవేణా కపిలా శోణవేవ చ.
ఏతా నద్యస్తు తీర్థయానాం మాతరో యాః ప్రకీర్తితాః." —వనపర్వము, అధ్యా. 222, శ్లో. 24-26

"గోదావరీం నర్మదాం చ బాహుదాం చ మహానదీమ్, శతద్రూం చంద్రభాగాం చ యమునాం చ మహానదీమ్.
నదీం వేత్రవతీం చైవ కృష్ణవేణాం చ నిమ్నగామ్, ఇరావతీం వితస్తాం చ పయోష్ణీం దేవికా మపి.
శరావతీం పయోష్ణీం చ వేణాం భీమరథీ మపి, కావేరీం చులుకాం చాపి వాణీం శతబలా మపి.
నీవారా మహితాం చాపి సుప్రయోగాం జనాధిప, పవిత్రాం కుండలీం సింధు రాజనీం పురమాలినీమ్."

—భీష్మపర్వము, అధ్యా. 9, శ్లో. 14-21.

ఈపైశ్లోకములవలన మన కెన్నియో నదులు తెలియవచ్చుచున్నవి. వీనిలో బాహుద
(చెయ్యేరు)వంటి చిన్ననదులుకూడ చేర్చబడినవి. సుప్రయోగమాత్రమేకాక గోదావరి, తుంగభద్ర, కృష్ణ
పెన్నలవంటి ప్రసిద్ధాంధ్రదేశ నదులుకూడ ఎన్నియో పేర్కొనబడినవి. వేణా, వెన్న పేరులతో నొప్పునదులు
కృష్ణవేణ, వేణ, ఉపవేణ, తుంగవేణలు. కృష్ణా, గోదావరీ, తుంగభద్రలతో గలిపి సుప్రయోగను
పేర్కొనుటవలన ఇది ఆంధ్రదేశమునందలి నదియే యని తోచును. పురాణములలో నదులను పేర్కొను

సందర్భమున ఇది తుంగభద్రా కావేరులకు నడుమ చెప్పబడుటవలన ఆరెంటికి నడుమనున్న పెద్దనది పెన్నయే సుప్రయోగ యగునేమో యని సంశయము జనించుట సహజము. అందునను అది పశుపతిభవనమునకును, కాంచీపురమునకును నడుమ నున్నట్లు భగవదజ్జుకమున చెప్పబడుటయు దాని కుపబలకమే కాని పూర్వోక్తము లయిన వెణ్ణలలో కృష్ణవేణ కృష్ణానదిగను, ఒకవేణ — తుంగవేణ తుంగభద్రగను, ఉపవేణ వైణగంగ (Wain ganga) గను, గుర్తించినచో ఇంకను ఒకవేణ మిగులును. కాని పురాణ, భారతాదులయందలి భారతవర్షీయవర్ణనమునుగూర్చి ప్రత్యేకముగ ఇంతవరకు పరిశ్రమచేసినవారు కాన్పింపరు. ఈ నదులపేర్లు సరియైనవో కావో, అవి యే ప్రాంతపువో, వాటిని గుర్తింప వీలగునో కాదో అట్టిపరిశ్రమ చేసిన కాని తెలియదు. అదియునుగాక ఇట్టి విషయమును తేల్చవలసివచ్చినప్పుడు వేరువేరు కూర్పులలోని, ప్రతులలోని పాఠములనుగూడ పరిశీలింపవలసిన యవసరము కలదు. ఒకప్రతిలోని పేరు మరియొకదానిలో మరొకవిధమున నుండుటయు కలదు.[2] నేను పై నిచ్చిన పాఠములు కుంభకోణము ప్రతిలోనివి. అయితే, పైని చెప్పినట్లు మిగిలిపోయిన ఒకవెణ్ణను పెన్న నదియేయని, దానిని సుప్రయోగగా గుర్తింతమన్న ఒకచిక్కు కలదు. ఈ వేణ-వెణ్ణ-లతోపాటు సుప్రయోగయు చెప్పబడినది. అందువల్ల సుప్రయోగ ఏది అను విషయమును నిర్ధరించుటలో పురాణ, భారతాదులను విడిచి అన్యసాధనము నాశ్రయించుట అవసరము.

ఈ సుప్రయోగానది తెలుగు దేశమున గానవచ్చిన ప్రాచీనశాసనములలోకూడ పేర్కొనబడినది. పూర్వము యువమహారాజ విష్ణుగోపు డని ఒక పల్లవరా జుండెను. అతడు ముండరాష్ట్రములోని ఉరుపుపల్లి అను గ్రామమును దానము చేసెను. ఈ యువమహారాజు క్రీస్తుశకము అయిదవశతాబ్ది ఉత్తరార్థమున నున్నవాడు. దాన మిచ్చిన ఉరుపుపల్లి గ్రామమునకు తూర్పు, దక్షిణపు సరిహద్దుల సుప్రయోగానది ప్రవహించుచున్నట్లు చెప్పబడినది. ఈ యొక్క శాసనమున నేకాక కడపమండలప్రాంతము నేలిన తెలుగుచోళులకు చెందిన పుణ్యకుమారభూపతి మాలెపాడుశాసనమునగూడ సుప్రయోగ పేర్కొనబడినది. పుణ్యకుమారమహారాజు హిరణ్యరాష్ట్రములోని బిరిపాడు (విరిపాడు ?)ను దానముచేసెను. ఈ విషయమును దెలుపునదే మాలెపాడు శాసనము. దాన మిచ్చిన బిరిపాడుగ్రామము సుప్రయోగానదిదక్షిణతటమున నున్నట్లు శాసనమున చెప్పబడినది. దీనిని బట్టి సుప్రయోగానది ఉత్తరతటమున ముండరాష్ట్రమును, దక్షిణతటమున హిరణ్యరాష్ట్రమును ఉండినట్లు స్పష్ట మగుచున్నది. బిరిపా డన్నది ఇప్పు డెచ్చట నున్నదో తెలియకపోవుటవల్ల హిరణ్యరాష్ట్రము ఇప్పటి యే ప్రదేశమునకు వర్తించునో తెలియరాకున్నది. హిరణ్యరాష్ట్ర మనుపేరే తరువాతి కాలమున హొన్నవాడిగ మారినది. 'వాడి' అన్నది మధ్యయుగపు శాసనములలో దేశవాచకముగ ప్రయుక్తమయినది. ఉదాహరణము : నొళంబవాడి, రట్టవాడి, గంగవాడి మొదలైనవి. హొన్న అనగా హిరణ్యము ; అందువల్ల హిరణ్యరాష్ట్రమును, హొన్నవాడియు ఒక్క దేశవిభాగమునకే పేరనుటలో సంశయింపబనిలేదు. హొన్నవాడి రాష్ట్రకూటరాజయిన కృష్ణకన్నరదేవుని శాసనమున పేర్కొనబడినది. అందు ములికినాడు హొన్నవాడిలోనిదిగ దెలుపబడినది. పుష్పగిరి, చినమాసపల్లి మొదలైన గ్రామములు—కడప

---

2. పురాణ, భారతాదులకుగల వేరువేరు ప్రతులలో వేణనదికి ఈ పాఠాంతరము లున్నవి:

వేణ (వరాహము)	వైణీ (వాయు)	వేణ్ణా (భాగవతము)
వర్ణ (కూర్మము)	వీణా (మహా భార., భీష్మప.)	

పర్గిటరు వేణను పెన్ననదిగ గుర్తించినాడు (చూడుడు : మార్కండేయపురాణము, నోట్సు, పుట. 803) విమలచరణలా గారు దీనిని తుంగభద్రగా గ్రహించినారు కాని యిది పొరపాటు.

జిల్లాలోనివి—ములికినాటిలోనివి. అందువలన హోన్నవాడి ఒకప్పుడు కడపవరకును వ్యాపించియుండినట్లు విదితము కాగలదు.

హోన్నవాడిపేరు విన్నంతనే మనకు దానితో పోలికగల మరియొకపేరు స్ఫురణకువచ్చును. అది అరోర్ణాయ్. టాలెమీ యను భూస్వరూప శాస్త్రజ్ఞుడు ఈ అరోర్ణాయ్‌ని తన భూస్వరూపశాస్త్రమున (geography) పేర్కొనినాడు. ప్రాక్సముద్రతీరస్థము లయిన రేవుపట్టణములను పేర్కొనుసందర్భమున దీని ప్రస్తావము వచ్చును. 'పొదుకె' అను రేవుపట్టణము అరోర్ణాయ్ సమీపమున నున్నట్లు టాలెమీ తెలిపినాడు. ఇతడు క్రీస్తుశకము రెండవశతాబ్దినాటివాడు. ఇంతవరకు 'పొదుకె' అను రేవుపట్టణము ఎటనున్నదో గుర్తింపగాలేదు. అరోర్ణాయ్‌కూడ ఇంతవరకును గుర్తింపబడలేదు. 'పొదుకె' అన్నదానిని కొందరు పరిశోధకులు పుదుచ్చేరి (Pondichcheri) యే యని గుర్తించినారు. కాని యిది అంత సంగతముగ కన్పట్టదు పుదుచ్చేరి అన్నమాటయే అది కొత్తగా (పుదు అన క్రొత్తయని యర్థము) వెలసిన గ్రామమని స్ఫురింపజేయుచున్నది. పుదుచ్చేరి యంత ప్రాచీనకాలమునుండి యున్నదనుటకును ఆధారములు లేవు. అందువలన 'పొదుకె' పుదుచ్చేరి యనుటకు తగిన బలమయిన ఆధారమేమియు లేదు. 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ' (Periplus of the Erythrean Sea) అను మొదటిశతాబ్దినాటి మరియొక గ్రంథమున ఈ రేవుపట్టణమే 'పొదుక' యనుపేర పేర్కొనబడినది. దీని ననుసరించి ఈ'పొదుక' లేక 'పొదుకె' క్రీస్తుశకము మొదటి శతాబ్దినాటినుంచియు ప్రసిద్ధమయిన సముద్రతీరస్థనగరము (రేవుపట్టణములను పూర్వము 'కరపట్టణము' లని వ్యవహరించువారు. కర యనగా ఒడ్డు; గట్టు. చాల ఎత్తయిన గట్టుకు 'కరకట్ట' యనియు వ్యవహారము. కట్టు రూపాంతరమే కట్టు, — గట్టు. శాసనములలో వచ్చు 'కత్త' యనునది 'కట్టు'యొక్క సప్తమీవిభక్తిరూపము; గట్టుమీద, గట్టున అని యర్థము — 'గంగకఱుత' లేక 'గంగకత్త'—'గంగకర్త'సముద్రతీరమున నున్నపట్టణము లగుటచే రేవుపట్టణములకు 'కరపట్టణము' లని వ్యవహారము పూర్వము.)

స్వర్ణ-సొన్న, కర్మ-కమ్మ, ధర్మ-ధమ్మ అయినట్లే 'అరోర్ణాయ్' 'అరోణ్ణాయ్'—'అరోణ్ణ' యగును. 'వేణ్య' 'వేణ్ణ', 'పళ్యెర' 'పళ్లెర' అయినట్లే 'హిరణ్య' 'హిరణ్ణ' యగును. 'హిరణ్ణ'యే విదేశీయుల నోళ్లలోబడి 'అరోణ్ణ' మైనదని నా యుద్దేశము. అందువల్ల టాలెమీయొక్క 'అరోర్ణాయి' 'హిరణ్ణ' 'హిరణ్య' రాష్ట్రమే యని నేను గుర్తించుచున్నాను. ఈ 'అరోర్ణాయి' దేశము ఉత్తరముగ 'మైసోలియా'వరకు వ్యాపించియున్నదనియు, 'మైసోలస్'నది దిగువభాగమున దానిసెల్లచేత తడుపబడుప్రదేశము 'మైసోలియా' యనియు టాలెమీ వ్రాసియున్నాడు. మెట్టను చాలదూరము వ్యాపించియున్న దేశమునందలి సముద్రతీర ప్రదేశమగు 'మాసాలియా'కు 'పొదుకె' రేవుపట్టణము చేరువనె ఉన్నదని 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సి' అనుగ్రంథమున చెప్పబడినది. 'మైసోలియా', 'మాసాలియా' అనుపేరుగల దేశమేదో తెలిసినప్పుడుకాని హిరణ్యరాష్ట్రము ఉత్తరమున ఎంతవరకు వ్యాపించియున్నదో తెలియదు ఈ 'మాసాలియా'యందు సన్నని 'మస్లిను'లు అతివిస్తారముగ తయారగునని 'పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సి' అనుగ్రంథమున గలదు. వీటినిబట్టి (౧) మైసోలియా లేక మాసాలియా అనునది 'పోదుక' లేక 'పొదుకె' అను రేవుపట్టణమునకు అనతిదూరముననే ఉన్నదనియు, (౨) అది 'మస్లిను'లకు ప్రసిద్ధికెక్కిన దనియు, (౩) అది మెట్టను చాల దూరము వ్యాపించిన దనియు తెలియగలదు. నాయుద్దేశమున 'మైసోలియా'నుబట్టియే 'మస్లిను'పదము ఏర్పడినది. దేశముపేరు మైసోలియా, లేక మసోలియా, లేక మాసాలియా; ఆదేశముగుండా ప్రవహించు నదిపేరు మైసోలస్; ఆదేశమున తయారగు సన్నని నూలుబట్టలకు మస్లిను (మైసోలిన్, లేక మసాలిన్ పద రూపాంతరమే మస్లిను) లని పేరు.

కాని ఇంతవరకు మస్లినుపదము మెసొపొటేమియాయందలి టైగ్రిస్‌నదీతీరమున నున్న మోసల్ (మౌసల్, మౌసిల్ అనిరూపాంతరములు) పట్టణమునుబట్టి వచ్చినదని విశ్వసింపబడుచున్నది. 'ఎన్‌సైక్లొపీడియా బ్రిటానికా'లో ఇట్లే చెప్పబడినది. యూల్ తన 'హాబ్సన్-జాబ్సన్' అను నిఘంటువునందుకూడ 'మోసల్' నుండియే 'మస్లిన్' వచ్చినదని చెప్పినాడు. కాని ఆశ్చర్య మేమన, అతడు మస్లినుపదమునకు 'ఫుట్ నోట్' ఇచ్చియున్నాడు. అందు ఇట్లని వ్రాసినాడు:

"మస్లినుపదము మైసోలియానుండి వచ్చిన దను ప్రతిఘాత్మకమైన సూచనను ఎక్కడో చదివినాము. మైసోలియా ప్రాచీనకాలమునసుండియు సన్నని నూలుబట్టలకు ప్రసిద్ధికెక్కినది. (టాలెమీ వ్రాసినదాని ననుసరించి మైసోలియా యన్నది మచిలీపట్నము చుట్టుపట్లనున్న దేశముపేరు.)"

మైసోలియానుంచి మస్లిను వచ్చిన దను సిద్ధాంతమున ఆదరము లేకపోవుటచేతనే యూల్ ఈ విషయమును 'ఫుట్ నోట్'లో ఇచ్చినాడు. కాని సత్యమదే యని నా నమ్మకము. పదుమూడవశతాబ్దినాటి మార్కొపోలో అను విదేశయాత్రికుడుకూడ యూల్ చెప్పిన అభిప్రాయమునే వెల్లడించినాడు. టైగ్రిస్‌నదిమీది మౌసల్‌నుగురించి వ్రాయుచు 'మసోలిన్స్ అనుపేరుగల బంగారు, పట్టుబట్టలు అక్కడ తయారగు'నని మార్కొపోలో చెప్పినాడు. ఇందరు చెప్పినను ఇది సరియైన యభిప్రాయము కాదనియే నాయూహ. క్రీస్తుశకము మొదటిశతాబ్దులలో మోసల్, లేక మౌసల్ అనుపట్టణము ప్రసిద్ధమయినది కాదు. క్రీస్తుశకము అయిదారుశతాబ్దులలోనే దానికి ప్రాముఖ్యము వచ్చినది (చూడుడు: 'ఎన్‌సైక్లొపీడియా మొస్లామికా'లో 'మోసల్'పదము). క్రీస్తుశకము మొదటిశతాబ్దులలో అది 'మస్లిను'లకు ప్రసిద్ధికెక్కినట్లు ఎక్కడను చెప్పియుండలేదు. 'మస్లిను' అన్నది 'మోసల్'నుంచి వచ్చినదని మొట్టమొదట చెప్పినవాడు అరబ్బీచరిత్రకారుడును, యాత్రికుడును అయిన మసూదీ. ఇతని పూర్తిపేరు అబుల్ హాసన్ అలీ ఇబన్ హాసన్ ఇబన్ అలీ ఉల్ మసూదీ. ఇతడు క్రీస్తుశకము తొమ్మిదవశతాబ్ది అంతిమభాగమున బాగ్దాదుపట్టణమున జన్మించెను. తొమ్మిదవశతాబ్దికి పిదప మోసల్ 'మస్లిను'లకు ప్రసిద్ధికెక్కిన దన్నను మైసోలియానుండి మస్లిను వచ్చిన దన్న మనవాదమునకు భంగము కలుగదు. ఈ కారణములవలన మైసోలియానుండియే మస్లిను వచ్చినదని నేను నమ్ముచున్నాను.

మస్లినుమాట ఎట్లున్నను మైసోలియా ఎక్కడనున్నదో, మైసోలస్‌నది యన్న దేదో ఇంతవరకును తేలలేదు. 'మైసోలస్' ఏది అన్నవిషయమున పరిశోధకపండితులలో భేదాభిప్రాయములు గలవు. కొందరు మైసోలస్ గోదావరి యన్నారు; మరికొందరు కృష్ణానది యన్నారు. మైసోలస్ కృష్ణ యనుటకు గల కారణ మిది: (౧) మైసోలస్‌కు మచిలీపట్టణము (మసులీపటమ్)నకు గల పోలిక; (౨) కృష్ణానదీముఖద్వారప్రాంతపు దేశము మస్లినులకు ప్రసిద్ధికెక్కుట. కాని ఈ రెండునుకూడ నిలిచేప్రమాణములు కావు. మచిలీపట్టణము అంత ప్రాచీనమైన రేవుపట్టణము కాదు. గోలకొండ కుతుబుశాహి సుల్తానుల రాజ్యారంభకాలమున పదునైదవశతాబ్దిలో ఏర్పడిన రేవుపట్టణ మది. అందువలన మచిలీపట్టణప్రాంతమే టాలెమీనాటి మైసోలియా యని చెప్పుటకు వీలులేదు. ఇక మస్లినులకా, విదేశయాత్రికుల వృత్తాంతములను బరిశీలించినచో ఒక్క కృష్ణాతీరప్రాంతమేకాక నెల్లూరుప్రాంతముకూడ ప్రాచీనకాలమునుండియు మస్లినులకు (సన్నని నూలుబట్టలకు) ప్రసిద్ధిగాంచినదే. చూడుడు, ఒక విదేశయాత్రికుడు ఏమని వ్రాసియున్నాడో:

"Policate is to the north of St. Thomas and the factory (which the Dutch have established there) is one of the best they have in the Indies, by reason of the cotton cloths, of which they have great ware-houses full there."

అందువలన కృష్ణాతీరముననుండి పులికాట్‌వరకును గల ప్రాంతమంతయు చక్కని నూలుబట్టలకు (మస్లినులకు) ప్రసిద్ధికెక్కినదే. ఈకారణమున మచిలీపట్టణప్రాంతము మైసోలియా యనుటకు కుదురదు.

మైసోలస్ కృష్ణ యనుటకయినను ఈమాత్రముకారణములు కలవుకాని గోదావరియనుటకు అసలే లేవు. అట్లయిన మైసోలస్ ఏది, మైసోలియా ఏది?

హిరణ్యరాష్ట్రమును, టాలెమీ-అరోర్ణాయియు ఒక్కటేయని తెలిసికొంటిమి. అరోర్ణాయ్ మైసోలియావరకు ఉత్తరమున వ్యాపించియున్న దనుటచే హిరణ్యరాష్ట్ర మంతవరకును వ్యాపించిన దన్నమాటే; అనగా హిరణ్యరాష్ట్ర ముత్తరదిశను మైసోలియాయందలి మైసోలస్నదివరకును వ్యాపించియుండవలెను. శాసనముల ననుసరించి హిరణ్యరాష్ట్ర ముత్తరమున సుప్రయోగానదివరకును వ్యాపించియుండినట్లు విదితమయినది. అందువలన మైసోలస్నదియు, సుప్రయోగయు ఒక్కటేయని తేలుచున్నది. ఇన్ని తిరుగుళ్లుపడినను మైసోలస్ను గురించి మన కెంత తెలిసినదో సుప్రయోగనుగురించియు అంతే తెలిసినది. హిరణ్యరాష్ట్రమును బట్టుకొన్న సుప్రయోగవిషయము తేలలేదు. సుప్రయోగ హిరణ్యరాష్ట్ర, ముండరాష్ట్రములకు నడుమ ప్రవహించుచుండుటవలన ముండరాష్ట్రమును బట్టుకొన్న ఈ విషయము తేలునేమో చూతము.

ముండరాష్ట్రము ఎక్కడిదో పరిశీలింతము. ప్రాచీన పల్లవ, చాళుక్యశాసనములను బరిశీలించినచో చాళుక్యరాజ్యమునందలి దేశవిభాగములకు విషయము లనియు, పల్లవరాజ్యమునందలి దేశవిభాగములకు రాష్ట్రము లనియు పే రుండినట్లు తెలియగలదు. చాళుక్యులకు పల్లవరాజ్య మంతయు వశమయిపోయినపిదప రాష్ట్ర మన్నది అంతరించి విషయమే మిగిలిపోయినది. ఈ 'విషయము' మధ్యయుగమునాటి శాసనములలో 'నాడు'గ మారిపోయినది. ఉదా: వేంగీవిషయము - వేగినాడు; కమ్మరాష్ట్రము - కమ్మనాడు మొదలయినవి.

శాసనమున్న గ్రామము	ముండనాటిలోని గ్రామము	ముండనాటిలోనిదిగ చెప్పబడిన గ్రామము ఇప్పటి ఏ గ్రామ మగును? ఏ తాలూకాలోనిది?	
గండవరము	కంఠనారాయణపురము అను కులోత్తుంగచోళపురము	కంఠనారాయణపురమే కంఠపురము లేక కంఠాపురమై ఇప్పటి గండవరమైనది.	కోవూరు తాలూకా
కొడవలూరు	కొడవలూరు	కొడవలూరు	కోవూరు
నెల్లూరు	తామరైమడువు అను చిత్రమేళినల్లూరు	దామరమడుగు	కోవూరు
,,	మావడిపుంబై	మోడేగుంట	కోవూరు
వేగూరు	వేలూరు	ముండనాటిలోనిదని చెప్పబడిన గ్రామము ఒకశాసనమున వేగూరని, మరియొకదానిలో వేలూరని యున్నది. శాసన మున్నది వేగూరగుటచే వేలూరు పొరపాటనియు, అది వేగూరై యుండు ననియు నా నమ్మకము.	కోవూరు
,,	వేగూరు		
నెల్లూరు	అలంగాడు	అలగానిపాడు ?	కోవూరు
చీకరోలు	తక్కోలం	(తెలియదు)	
బాపట్ల	[కొ]లుకలూరు	(తెలియదు)	

క్రీస్తుశకము పదునొకండు, పన్రెండు, పదుమూడుశతాబ్దులనాటి నెల్లూరుమండలశాసనములలో ముండనాడు, లేక ముండైనాడు అన్న దేశవిభాగము ఒకటి తెలియవచ్చును. ఇది ప్రాచీనపల్లవశాసనములలో పేర్కొనబడిన ముండరాష్ట్రమే యనుటకు సందియములేదు. ముండ, లేక ముండైనాడులోనివిగ చెప్పబడిన గ్రామములను గుర్తింప గుదిరినచో ముండనాడు, లేక రాష్ట్ర మెచ్చటిదో సుకరముగ తెలియగలదు. ముండ

మైనారిటీల సమస్య

- దాని స్వరూప స్వభావ విచారము
- ముస్లిములీగు కోరికలు
- దాని పరిష్కారములోని సాధక బాధకాలు

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య

మైనారిటీలసమస్య క్లిష్టతర మగుచుండుటచేతను, దాని మూలంగా హిందూమహమ్మదీయసఖ్యతకు భంగము కలుగుచుండుటచేతను, మహమ్మదీయులవలె తాముకూడ మైనారిటీల మని చెప్పుకొను హరిజనులు, క్రైస్తవులు మొదలగువారిలో ఆందోళనము చేయుచుండువారి వాదము పెరుగుచుండుటచేతను స్వరాజ్యసమరము ముందునడుచుటకు బదులు వెనుకకు నడుచుచున్న దేమో అను సందేహము కలుగుచున్నది. ఈ మైనారిటీల సమస్యయొక్క నిజస్వభావ మేమో తెలుసుకొనుట స్వరాజ్యవాంఛితు లందరికీ అత్యావశ్యకము. బ్రిటిషుప్రముఖులలో అనేకులు "స్వరాజ్యమేమో మీరు కోరుచున్నారు; మీకు దానిని అనుభవించుటకు హక్కు కలదు; కాని మీలోమీరు పోరాడుచున్నంతకాలము స్వరాజ్యమును అనుభవింపలేరనియు, మీ కది దక్కదనియు మాకు భయముగానున్నది. ఇట్టిపరిస్థితులలో మేము మా అధికారమును వదలుకొనుటమాత్రమే సంభవించును గాని, మేము వదలుకొనిన అధికారమును మీరు కాపాడుకొనలేకపోవుటచేత మూడవవారు మరెవరైనా వచ్చి దానిని లాగుకొనిపోయెదరేమో అను అనుమానము మాకు కలదు. మీరు కోరు స్వరాజ్యవరమును మేము ప్రసాదింపకుండుటకు మీలో మీకు — ముఖ్యంగా హిందువులకు, మహమ్మదీయులకు — సఖ్యత లేకపోవుటయే కారణము గాని మా స్వలాభ ప్రియత్వము గాదు" అని చెప్పుచున్నారు. మనవారిలో అనేకులు ఈ మాటలను నమ్మకపోవచ్చును. ఏలనగా, ప్రపంచంలో ఏ కాలంలోగాని, ఏ దేశంలోగాని అధికారంలో ఉన్నట్టివారు తమంతట తాము అధికారాన్ని వదలుకొనియుండలేదు. అది మనుష్యస్వభావానికి విరుద్ధం. వారిచేతినుండి అధికారాన్ని లాగుకొనుటకు ప్రయత్నిస్తుండేవారిమూలంగా దుర్భరమైన వొత్తిడి కలిగినగాని అధికారాన్ని వదలుట సంభవింపదు. బ్రిటిషువారికి మనదేశంలో ఇంకా అలాటివొత్తిడి కలుగలేదు. ఎప్పుడైతే అది కలుగుతుందో ఆ నిమిషంలో వారు, మార్గాంతరం లేక, అధికారాన్ని వదలుకొంటారు. ఎవరైతే అలాటివొత్తిడి వారికి కలిగిస్తారో వారిచేతిలోకి అధికారం వస్తుంది. రాజకీయపరిణామంలో మనకు కనిపించే న్యాయం-ధర్మం ఇదే.

బ్రిటిషువారు ఇప్పటికి వదలుకొన్న కాస్త అధికారం

1935 లో బ్రిటిషుపార్లమెంటువారు చేసిన శాసనం మూలంగా కొంత అధికారాన్ని వారు వదలుకొన్నారు. అంతకు పూర్వం మహాత్మాగాంధిగారి నాయకత్వంక్రింద కాంగ్రెసు సంస్థలోనివారు రెండుపర్యాయాలు సత్యాగ్రహం ప్రదర్శించి, బ్రిటిషువారికి కలిగించిన వొత్తిడియే దీనికి కారణము. దానిమూలంగా రాష్ట్రప్రభుత్వవిషయాలలో వారు కొంత పట్టును వదలివేసుకొనవలసి వచ్చినది. ఆ వదలివేయడానికి కారణం రాష్ట్రాలలో ఉండే అధికసంఖ్యాకులకును, అల్పసంఖ్యాకులకును పొత్తు కుదిరిందనిగాని, రాష్ట్రపరిపాలనంలో అల్పసంఖ్యాకుల సమస్య లేదనిగాని వారు నమ్మడం కాదు. సత్యాగ్రహంమూలంగా వారికి కలిగిన చిక్కులే దీనికి కారణం. అందుచేత అనవసరా లని వారికి తోచిన అధికారాల నన్నిటిని వారు వదలుకొని, వారికి ఏయేవి అవసరాలో — సైన్యం, విదేశవ్యవహారాలు, యూరోపియన్ వర్తకరక్షణము — అట్టి అధికారాలనుమాత్రం చేతులో పెట్టుకొన్నారు. స్వరాజ్యానికి పోరుతుండేవారు చేసేది సత్య, అహింసలతోకూడిన ధర్మయుద్ధమైనా, వారు చేస్తుండేది యుద్ధం కాని స్నేహం కాదు. యుద్ధంలో ఎదటపక్షంవారు లొంగడానికి కారణం శత్రువులవల్ల అతనికి కలిగే కష్టనష్టాలు. ఇవి దుర్భరమైనప్పుడు అతడు యుద్ధరంగాన్ని వదలి సంధి చేసుకొంటాడు. అవి దుర్భరం కాకపోవుటచేతనే బ్రిటిషువారు అధికారాన్ని పూర్తిగా వదలవలసిన అవసరం లేకపోయింది.

అంతకంటె ఎక్కువగా వారు వదల్లేకపోవడానికి కారణం

స్వరాజ్యవాంఛితులమూలంగా బ్రిటిషువారికి కలిగిన వొత్తిడి దుర్భరం కాకపోవడానికి ఎన్నోకారణా లున్నవి. కాని వాటి అన్నిటిలో ప్రధానమైనది మనదేశంలోను, మనవారిలోను స్వరాజ్యమందు విముఖులుగా ఉండేవారి బలం సుముఖులుగా ఉండేవారి బలంకంటె అధికంగా ఉండడం.

స్వరాజ్య విముఖులలో తరగతులు

స్వరాజ్యవిషయంలో విముఖులుగా ఉండేవారిని రెండు తరగతులుగా విభాగం చేయవచ్చు. స్వరాజ్యం అక్కరలేదనిన్ని, దాని మూలంగా దేశానికి నష్టమేకాని లాభం ఏమాత్రం లేదనిన్ని చెప్పేవారు మొదటితరగతిలోనివారు. సంస్థానాధీశులు, యూరోపియనులు, ఆంగ్లోఇండియన్లు ఈతరగతిలో చేరియున్నారు. బ్రిటిషు ప్రభుత్వంమూలంగా వీరు ఎన్నోలాభాలను అనుభవిస్తున్నారు. అధికారం, ఐశ్వర్యం, గౌరవం వీరిసొమ్ము. భారతీయులలో మరెవ్వరికీకూడా ఇంతటి ఉత్కృష్టత లేదు. కాని దీనికంతా బ్రిటిషువారి అధికారమే ప్రధానకారణం. అది తొలగితే ఈ సదుపాయాలు కూడా తొలగిపోతవి. గనుక వీ రెన్నడూకూడా బుద్ధిపూర్వకంగా స్వరాజ్యాని కంగీకరించరు. స్వరాజ్యం అక్కరలేదని చెప్పే వీరికిన్ని స్వరాజ్యం మాజన్మహక్కు అని చెప్పేవారికిన్నీ రాజీ కుదిరితే స్వరాజ్యం ప్రసాదిస్తామని బ్రిటిషువారు చెప్తున్నారు. కాని ఇది ఎన్నటికీ కుదిరేదికాదు. ప్రస్తుతంలో వీరిసంఖ్య చాలా తక్కువైనా వీరికి గల అధికారబలం, ద్రవ్యబలం చాలా ఎక్కువ. రైల్వేలు, పోస్టు, టెలిగ్రాఫు, ఐచ్ఛికసైన్యం మొదలైన ప్రభుత్వశాఖలలో చాలాభాగం ఆంగ్లోఇండియ న్లున్నారు; వ్యాపారంలో చాలాభాగం యూరోపియనువర్తకులదే; సంస్థానాధీశుల నిరంకుశాధికారాన్నిగురించి ప్రత్యేకంగా చెప్పవలసింది లేదు. సంస్థానాలలో ఉండే ప్రజలు రాజకీయవిషయాలలో ఎక్కువ శ్రద్ధవహించి, పరిపాలకుల నిరంకుశత్వాన్ని తొలగించినప్పుడు తప్ప వీరిబలం తగ్గదు. అంటే బ్రిటిషు రాష్ట్రాలలోని ప్రజలలో ఉండే స్వరాజ్యాభిమానం సంస్థానములలోని ప్రజలలోకూడా ప్రాకవలసిఉంది. అది ఇంకా జరగలేదు.

స్వరాజ్యవిషయంలో విముఖులుగా ఉండేవారిలో అల్పసంఖ్యాకులు (మైనారటీలు) రెండవతరగతిలో చేరియున్నారు. మహమ్మదీయులు, శిక్కులు, క్రైస్తవులు, పార్శీలు, హరిజనులు—వీరిని అల్పసంఖ్యాకులలో గణించడం జరుగుతున్నది. వీరందరూ స్వరాజ్యవిముఖు లని చెప్పడం పొరబాటు. శిక్కులలో అందరూ కూడా సుముఖులుగానే ఉన్నారు. కాని తక్కినవారిలో ఇట్టి సుముఖత్వం పూర్తిగా కనుపించుటలేదు. వీరిలో ఎక్కువమంది విముఖులా, సుముఖులా అనేప్రశ్నకు నిశ్చితమైన జవాబు ఎవ్వరూ చెప్పలేరు. ఇంటింటికీ వెళ్లి జనాభా లెక్కను తయారుచేసినట్లు ఈ విషయమై ఎవరూ లెక్క పెట్టినదిలేదు. కాని ఈ వర్గములవారి నాయకులు కొందరు వ్యక్తపరుస్తుండే అభిప్రాయాలనుబట్టి మహమ్మదీయులలో విముఖత్వం ప్రబలంగా ఉన్నదనీ, హరిజనులలోను క్రైస్తవులలోను కొంతవరకు విముఖత్వం ఉన్నదనీ సాహసించి చెప్పడానికి అవకాశాలు ఉన్నవి. పార్శీలలోకూడ ఇట్టి అభిప్రాయభేదాలు కలవు. దక్షిణఇండియాలో జస్టిసుపార్టీనాయకులలో అనేకులు—అల్పసంఖ్యాకవర్గంలో చేరకపోయినా—ఇట్టి విముఖత్వాన్నే చూపిస్తున్నారని చెప్పవచ్చును.

కాని అల్పసంఖ్యాకుల విముఖత్వానికీ, మొదటితరగతిలో చేరిన సంస్థానాధీశులు లోనగువారి విముఖత్వానికీ ఒక గొప్ప భేదం ఉంది. సంస్థానాధీశుల విముఖత్వం శాశ్వతమైనది. అల్పసంఖ్యాకుల విముఖత్వం కొన్ని సందర్భాలను అనుసరించి ఉన్నది. స్వరాజ్య సమరంలో తాము పూర్తిగా చేరడంలే దని వారు చెప్పడంలేదు. వారు విధించే సూత్రాలకు తక్కినస్వరాజ్యవాదులు అంగీకరిస్తే తాముకూడా వారితో కలిసి బ్రిటిషువారి అధికారాన్ని తొలగించడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్తున్నారు. ఆసూత్రాలకు అంగీకరించకుంటే తాము స్వరాజోద్యమాన్ని విరోధించి, బ్రిటిషుపక్షానికి సహాయం చేసేటట్లు ప్రకటిస్తున్నారు. వారికి ప్రధానం ఈసూత్రాలు కాని స్వరాజ్యం కాదు. ఏవిధమూలంగా ఈసూత్రాల విషయంలో వారికి అనుకూలం కలుగుతుందో వారిపక్షం వహించడమే వారి ఉద్దేశం.

మహమ్మదీయ సమస్యయొక్క ప్రత్యేకత్వం

పైన ఉదాహరించిన అల్పసంఖ్యాకు లందరిలోను మహమ్మదీయులది యొక ఎత్తు; తక్కినవా రందరిదీ మరియొక యెత్తు. వారి ప్రధానసూత్రానికీ, తక్కిన అల్పసంఖ్యాకుల సూత్రాలకూ చాలా భేదం ఉంది. తక్కినవారు మహమ్మదీయుల ప్రధానసూత్రానికి అంగీకరించరనికూడా చెప్పవచ్చును. గనుక మైనారటీల సమస్యను వివరించడంలో మహమ్మదీయసమస్యను ప్రత్యేకించడం మంచిది.

ముస్లిములీగు-జిన్నాల షరత్తులు

మహమ్మదీయనాయకులలో అగ్రగణ్యుడు జిన్నా. వారి సంస్థలలో అగ్రగణ్యమైనది ముస్లింలీగు. దీనికి జిన్నా అధ్యక్షుడు. మహమ్మదీయప్రముఖులలో అనేకులు ఇందులో చేరియున్నారు. స్వరాజ్యవిముఖులుగా ఉండే మహమ్మదీయుల అభిప్రాయం తెలుసుకోడానికి జిన్నాయొక్క అభిప్రాయాలు తెలుసుకుంటే చాలును. సామ్రాజ్యతత్వం జిన్నాకు రుచించదు. అతడుకూడా స్వరాజ్యాన్ని కోరేవాడే. కాని అతడు కోరే స్వరాజ్యానికీ, అతనిని అనుసరించని మహమ్మదీయులు కాంగ్రెసుపక్షంవారు తదితరులు కోరే స్వరాజ్యానికీ ఒక గొప్ప భేదం ఉంది. అది ఏలాటిది రాజీకి లొంగనట్టి భేదం. జిన్నాగారివాదం ఏమిటంటే—"ఇండియా అనేది ఒక దేశం కాదు; ఇది ఒక ఖండం. ఒక దేశమైతే ఒక కేంద్రప్రభుత్వానికి లోబడడం సహజం గాని, అనేకదేశాలతో కూడుకొన్న ఖండం ఒకేప్రభుత్వంక్రింద ఉండడం స్వభావవిరుద్ధం. ఖండం అనే భూభాగంలో అనేక కేంద్రప్రభుత్వా లుండడమే సబబు. అందు స్వతంత్రించిన రాజ్యా లనేకా లుండవలెను; ఒక్కొక్క

రాజ్యాన్ని స్వతంత్రించిన ప్రభుత్వం ఒకటి ఏలుతుండవలెను. ఇంతే గాకుండా హిందూదేశంలో ఒకజాతివారు (Nation) లేరు; అనేకజాతులవా రున్నారు. వీటిలో ముఖ్యములైనవి హిందూ జాతి, మహమ్మదీయజాతి. వీరిద్దరికీ ఒక్క మతంలోనే కాదు భేదం: ఆచారాలలో, సంప్రదాయాలలో, భాషలో, సాంఘికవ్యవస్థలలో —మానవ జీవితంలో ప్రధానమైన ప్రతివిషయంలోకూడా భేదా లున్నవి. ఇంతటిభేదా లున్నప్పుడు వీ రిద్దరూ కలిసి ఒకేరాజ్యం లో పౌరులుగా ఉండడం అసంభవం. బ్రిటిషువారు అధికారా న్నుండి తొలగిపోవడం మంచిదే; కాని వారు తొలగిపోయిన తర్వాత హిందూదేశంలో ఒకప్రభుత్వం ఉండకూడదు. దేశంలో పంపకం జరగవలసిఉంటుంది. కొంతభాగం మహమ్మదీయుల స్వాధీనంలోను, తక్కినభాగం హిందువులస్వాధీనంలోను ఉండ వలెను. హిందూదేశాన్ని ఈవిధంగా రెండుముక్కలు చేయడానికి స్వరాజ్యవాదులు అంగీకరిస్తే నేనుకూడ వారిలో చేరి స్వరాజ్యసమరాన్ని జయ ప్రదంగా సాగిస్తాను. అట్టివిభజనకు అంగీకరించనిపక్షాన నేనుగాని, నన్ను అనుసరిస్తుండే తొమ్మిదికోట్ల మహమ్మదీయులుకాని స్వరాజ్యసంస్థాపనాన్ని మాసర్వశక్తులతోను నిరోధిస్తాము." జిన్నా విధించే షరత్తు ఈవిభాగమే. దీనికి అంగీకరిస్తే స్వరాజ్యం; లేకుంటే బ్రిటిషుసామ్రాజ్యం.

జిన్నా మొదలగు మహమ్మదీయ నాయకు లనేకులు ఈవిధంగా వాదించ డానికి కారణాలు మనం గ్రహించవలసి ఉన్నది. "హిందూదేశంలో నలభైకోట్ల ప్రజ లున్నారు. అందులో ముప్పైకోట్ల మంది హిందువులు. మహమ్మదీయుల సంఖ్య తొమ్మిదికోట్లు మాత్రమే. బ్రిటిషువారి అధికారం తొలగిపోయి స్వరాజ్యమేవస్తే అధికసంఖ్యాకులుగా ఉండే హిందువులదే అధికారం అవుతుందికాని అల్పసంఖ్యాకులగు మహమ్మదీయులకు ఏలాటిఅధికారం ఉండదు. హిందువులకు లోబడిఉండడానికి మహమ్మదీయు లెన్నడూ అంగీకరించ జాలరు. అది అవమానకరం; సమస్తబాధలకూ కారణభూతం. ఒక ప్పుడు హిందూదేశంలో చాలభాగానికి ప్రభువులుగా ఉండి హిందువులపై రాజ్యంచేసిన మహమ్మదీయులు ఈనాటికి హిందువులకు లోబడిఉండడానికంటె గౌరవభంగమైన విషయం మరొకటికలదా? ఇంతేకాకుండా మహమ్మదీయులంటే మ్లేచ్ఛులనేభావం హిందువులలో ఉన్నది. ఆలాటివారిని హిందువులు ఆదరిస్తారా? మరొక విశేషంకూడా ఈసందర్భంలో మనం జ్ఞాపకంఉంచుకోవలెను. మహమ్మదీయ పరిపాలనకాలంలో మహమ్మదీయప్రభువు లనేకులు తెలిసియో తెలియకనో హిందువులవిషయంలో అనేక అపచారాలు చేసినట్లూ, వారి దేవాలయాలను నాశనంచేసినట్లూ, వారి ఉత్సవాలకు నిరోధించినట్లూ, వారికి ఉన్నతోద్యోగాలను ఇయ్యనట్లూ చరిత్రగ్రంథాలు చాటుతున్నవి. ఆగ్రంథాలలోని విషయాలను ఈకాలపు హిందువులు నమ్ముడంచేత మహమ్మదీయులపట్ల వారికి విరోధభావం ఉన్నది. స్వరాజ్యమే వస్తే అట్టి మహమ్మదీయులపై పగతీర్చుకోడానికి హిందువులు ప్రయత్నించడం తప్పదు. అది మనుష్యస్వభావం. మహమ్మదీయుల మసీదులు, పవిత్రగ్రంథాలు, ఉత్సవాలు, సంప్రదాయాలు — వీటి అన్నిటికీ తప్పక ప్రమాదం సంభవిస్తుంది. గనుక హిందూదేశాన్ని రెండుభాగాలు చేయడం, మహమ్మదీయరాష్ట్రాలు ఒకభాగంలో ఉండడం, హిందూరాష్ట్రాలు మరియొకభాగంలో ఉండడం అత్యవసరం. రాజకీయంగా ఈ రెండుజాతులవారికీ పరస్పరసంబంధం ఏర్పడదు; సఖ్యత కుదురదు. ఒకే రాజ్యంలో వీరిద్దరూ ఉంటే మరి కలహాలు, సంఘర్షణలు తప్పవు. గనుక దేశాన్ని పంచుకోవడమే నిజమైన స్వరాజ్యం". ఈ పంపకం ఏవిధంగా జరుగవలెనో, ఏయేభాగాలు మహమ్మదీయులకు చెందవలెనో, ఏవి హిందువులకు చెందవలెనో వ్యక్తపరుస్తూ మహమ్మదీయనాయకులు కొందరు అయిదారు ప్రణాళికలను ఇదివరకే తయారు చేసియున్నారు.

ఈపంపకమే వాంఛితమని మహమ్మదీయనాయకులు పట్టుపడ్తే వారికిని, స్వరాజ్యానికై ఇదివరకు ప్రయత్నిస్తున్న కాంగ్రెసు మొదలగు సంస్థలలోనివారికిని రాజీ కుదరకున్నది. ఈ షరత్తు ననుసరించి రాజీచేసుకోవడం రోగంకుదరడానికి చావుతప్ప వేరొక మందు లేదని చెప్పడంవంటిది.

> అల్పసంఖ్యాకవర్గాల అనవసరాందోళనను, వారి వాదంలోని బలహీనతను, స్వరాజ్యోద్యమనాయకుల అశలంకదీక్షను, ముస్లిములీగువక్తాన జిన్నాగారు గావిస్తున్న వితండవాదనను అతివివరంగా పాఠకమహాశయులు ఈ వ్యాసంలో గ్రహింపవచ్చును. ఈ సమస్య యొక్క పుట్టుపూర్వోత్తరాలన్నీ ఇందులో సింహావలోకనం చేయబడినవి.

ఆషరతులలోని దోషము

స్వరాజ్యానికై పోరాడుతుండేవారి ఉద్దేశం మనదేశాన్నుండి బ్రిటిషువారి అధికారాన్ని తొలగించడంమాత్రం కాదు. దాని స్థానంలో భారతీయుల అధికారం స్థాపించడం, ఆలాగు స్థాపించిన అధికారాన్ని అపాయం రాకుండా నిలబెట్టుకోవడం — ఇవే వారి ఉద్దేశాలు (గతసంవత్సరం సంవత్సరాదిసంచికలో నేను వ్రాసిన వ్యాసం ఈసందర్భంలో చదువవలసిందని కోరుచున్నాను). ఈలాగు స్థాపించి నిలబెట్టుకోవడం జరుగుతుందనే ధైర్యం మనకు ఉండి, దానికి తగిన ఏర్పాటులు మనంచేసుకోగలిగినప్పుడే మనకు నిజమైన స్వరాజ్యం లభ్యమవుతుంది. అట్లు మనం చేయలేనినాడు స్వరాజ్యం

కోసం వదలుకొని ఉన్న పరిస్థితులే ఉత్తమములని నమ్ముట మంచిది. దేశాన్ని రెండువిభాగాలు చేసి మనం అనుభవించే స్వరాజ్యం స్వప్నంలోని సౌభాగ్యంవంటిది. దానిని మనం ఒకనిమిషంకూడా కాపాడుకోలేము.

దీనికి రెండు మూడుకారణా లున్నవి. పంపకంలోని మహమ్మదీయరాష్ట్రాలలో చాలాభాగం మనదేశపు వాయవ్యప్రాంతాలలో ఉంటవి. కాశ్మీరము, పంజాబు, సరిహద్దురాష్ట్రము, సింధురాష్ట్రము, బెలూచిస్థానము — ఇవన్నీ మహమ్మదీయ ప్రభుత్వాలక్రింద స్వతంత్రంగా ఉంటవి. ఇవన్నీ ఇండియాఆవలనుండి మహమ్మదీయ రాజ్యాలను ఆనుకొని ఉన్నవి. ఈపంపకం వాంఛనీయమని వాదించే వారందరూకూడా అఖిలమహమ్మదీయ సమ్మేళనోద్యమాభిమానులు (Pan - Islamic movement). ఈ ఉద్యమంయొక్క ఉద్దేశం జిబ్రాల్టరు మొదలు బంగాళా ఖాతంవరకు వ్యాపించిన మహమ్మదీయ రాష్ట్రము లన్నిటినీ ఒకసమ్మేళనంగా ఏర్పాటుచేసి, దానిద్వారా మహమ్మదీయుల ప్రాచీనగౌరవాన్ని, ప్రతిభను పునరుద్ధారణ చేయటం. ఇండియాను పంచుకోవడం అనే ఉద్దేశం ఈ పునరుద్ధారణలోని ఒక అంతర్భాగం. సమ్మేళితమైన ఈ మహమ్మదీయ సామ్రాజ్యంలో ఇరువదికోట్ల ప్రజ లుంటారు. ప్రాచీనకాలమందుండి ఇటీవలివరకు మనదేశానికీ, మన స్వాతంత్ర్యానికీ వాయవ్యభాగమందుండి వచ్చిన పరాయిదేశస్థులే భంగం కలిగించారు. ఆలాటి ప్రమాదం తిరిగీ కలగటం, దానిమూలంగా హిందూరాష్ట్రాలకు వినాశం సంభవించడం, బ్రిటిషుసామ్రాజ్యానికి బదులు మహమ్మదీయసామ్రాజ్యం స్థాపితం కావడం సంభవిస్తుంది. పరాధీనమునుండి విముక్తి పొందడానికి ప్రయత్నిస్తుండే మనము ఆఫ్గనిస్థానము, పర్షియా, ఇరాక్, ఈజిప్టు లోనగు దేశాలలోని మహమ్మదీయులకు వశం కావడం జరుగుతుంది.

ఈలాటి ప్రమాదం రాకపోయినా సామ్రాజ్యకాంక్ష గల జపాను, రష్యా, జర్మనీ మొదలగు దేశాలనుండి మనదేశానికి ప్రమాదం సంభవిస్తుంది. మనదేశం అంతా ఒకే ప్రభుత్వానికి లోబడి ఉంటే అట్టి ప్రమాదాన్నుండి దేశాన్ని రక్షించుకోవడం సులభం కాని కొంతభాగం హిందువులక్రింద, కొంతభాగం మహమ్మదీయుల క్రింద విభాగమైనప్పుడు పరాయివారు తిరిగీ మనదేశాన్ని జయించుకోవడం సులభం. ఇట్టి విభాగంవల్ల హిందువులకే గాక మహమ్మదీయులకుకూడా తప్పకుండా నష్టం కలుగుతుంది. ప్రస్తుతం స్వరాజ్యానికై మనవారు చేస్తుండే త్యాగమంతా వ్యర్థమైపోతుంది. ప్రస్తుతం స్వరాజ్యానికై మనవారు చేస్తుండే త్యాగమంతా వ్యర్థమైపోతుంది. పూర్వకాలంలోను, మధ్యయుగంలోనూ మనదేశంలో ఇదేవిధంగా స్వతంత్రించిన రాష్ట్రాలెన్నో ఉండబట్టి మహమ్మదీయులు, బ్రిటిషువారు వారి సామ్రాజ్యాన్ని స్థాపించుకోగలిగిరి. పద్దెనిమిదో శతాబ్దంలో రాజ్యాలు అనేకం మనదేశంలో ఉండడంచేత దేశం అనాథయై పరాయివారికి లోబడవలసివచ్చిం దనే మాటను మనం ఎన్నటికీ మరవకూడదు. వాళ్లు లక్షలు లుండడమున్నా, అనాథగా ఉండడమున్నా ఒక్కటే.

మైనారటీల సమస్య పరిష్కారం కావడానికిన్ని, అల్పసంఖ్యాకులూ అధికసంఖ్యాకులూ కలసి స్వరాజ్యానికి పోరాడడానికిన్ని జిన్నా సూచించిన పంపకమే మార్గం అయ్యేపక్షాన ఈమార్గం అవలంబించడం ఆత్మహత్యచేసుకొన్నట్లే. దీనిమూలంగా ఎన్నడూ ఈసమస్య పరిష్కారం కాజాలదు—కాగూడదు.

జిన్నాగారి పాటకు తాళంవేసే ప్రముఖులు

ఈ పంపకం అనే సూచన ఎంతవరకూ ప్రాకిందో, ఎందరి మనస్సులను ఆకర్షిస్తున్నదో, దానిమూలంగా కలుగబోయే ప్రమాదాలు ఎంతటి ఘోరములో గ్రహించనివా రెందరున్నారో మరి కొన్ని నిదర్శనాలవల్ల స్పష్టం అవుతుంది. ద్రవిడదేశంలోని జస్టిసు పార్టీనాయకుడగు ఇ. వి. రామస్వామినాయకర్ ఈ పంపకవాదానికి చేయూతనిస్తూ ద్రవిడులు ఆర్యులకంటె భిన్నులనీన్నీ, తమిళ్‌రాష్ట్రంలోని ప్రజలలో బ్రాహ్మణులు తప్ప తక్కినవారందరూ ద్రవిడులనీన్నీ, ద్రవిడులకు స్వరాజ్యం రావలెనంటే ద్రవిడదేశం తక్కిన భారతదేశంతో సంబంధంలేకుండా ప్రత్యేకస్వతంత్ర రాజ్యంగా ఏర్పడవలెననీన్నీ వాదిస్తుండడం అందరూ ఎరుగుదురు. ద్రవిడులను బానిసలనుగా చేస్తుండేవారు ఆర్యులును, ఆర్యులసంతతి వారగు బ్రాహ్మణులేగాని బ్రిటిషువారుకారని వీరి అభిప్రాయం. ఇదేవిధంగా హైదరాబాదుసంస్థానంలోని ప్రముఖులు కొందరు ఉత్తరసర్కారులు, రాయలసీమ మొదలగు ప్రదేశాలన్నీ నిజాం రాష్ట్రంలో కలిసిపోవలసినదనీన్నీ, ఇట్లేర్పడిన నిజాంరాష్ట్రం స్వతంత్రరాజ్యం కావలసిందనీన్నీ వాదిస్తున్నారు. దేశాన్ని పంచుకొందా మని చెప్పేవారు అక్కడక్కడ బయలుదేరుతున్నా రన్నమాట దీనినిబట్టి స్పష్టం అవుతున్నది. జిన్నాగారు పాడే పాటకు వెనుక నిలబడి తాళంవేసే ప్రముఖులు చాలామంది ఉన్నారు.

రాజీకి ఒక్కటే ఉపాయం

మైనారటీలకు (అల్పసంఖ్యాకులకు) మెజారటీలకు (అధిక సంఖ్యాకులకు) రాజీకుదరడానికి ఈ పంపకసూత్రం పనికిరాదు. వీరందరూ భారతీయులనీన్నీ, ఒక్క తల్లికడుపునపుట్టి పెరిగినవారనీన్నీ, హిందూదేశముయొక్క ఐక్యతను రక్షించడానికి సిద్ధపడినవారనీన్నీ, ఈ ఏకత్వంలేని స్వరాజ్యం మిథ్యాస్వరాజ్యమనీన్నీ ఎప్పుడైతే ఈరెండు పక్షాలవారూ అంగీకరిస్తారో అప్పుడే రాజీ కుదురవలసిఉంటుంది. రాజీకంతా ఇదే పునాది. దీనిని ఆధారం చేసుకొంటేనేగాని మైనారటీలసమస్య ఎన్నటికీ పరిష్కారంకాదు.

హిందువులు పరమతావలంబకులను ఎన్నటికీ హింసించరు

స్వరాజ్యం వచ్చినతర్వాత అధికసంఖ్యాకులైన హిందువులు అల్పసంఖ్యాకులైన మహమ్మదీయులను, తదితరులను బాధిస్తారనే వాదం నిరాధారమైనది.

౧. పరమతావలంబకులను హింసించడం హిందువుల స్వభావానికి విరుద్ధం. ఏకాలంలోకాని హిందూరాజులు ఈవిధంగా చేసినారని చెప్పటకు చరిత్రగ్రంథాలలో ఎట్టినిదర్శనాలూ లేవు. హిందూదేశచరిత్రానికీ, ఇతరదేశాల చరిత్రానికీ ఏదైనా భేదముంటే ఆభేదం ఈవిషయంలోనే కనిపిస్తుంది. హిందూరాజులు చూపినంత మతసహనం మరెవ్వరూ చూపియుండలేదు. ఇతరదేశాలలో తాము పడుచుండిన బాధలను అనుభవింపలేక మనదేశానికి పారివచ్చిన పారసీకులు, యూదులు, క్రైస్తవులు మొదలగువారిని హిందూరాజులు చేరదీసి పోషించిరి. వ్యాపారమునకును, మరికొన్ని ఉద్దేశములతోడను హిందూరాజ్యాలలో కాపురం చేయడానికి వచ్చిన మహమ్మదీయులనుకూడా హిందూరాజులు ఎన్నడూ హింసపెట్టినది లేదు. ఇంతేకాకుండా, వారికి కావలసిన మతసౌకర్యాలనుకూడా కల్పించినట్లు తెలియవస్తున్నది. హిందూమతము ఇతరములతో పోటీకిదిగేది కాదు. ఇతరమతములను అవలంబించినవారిని నిర్బంధించి స్వమతంలో చేర్చుకోవడం హిందూసాంప్రదాయంకాదు. స్వధర్మమును ననుసరించడమే ప్రతిమానవునికీ ధర్మం అన్నదే హిందూమతత్వానికి మూలం. ఈలాటిహిందువులు సంప్రదాయవిరుద్ధంగా మహమ్మదీయులను, క్రైస్తవులను స్వరాజ్యం వచ్చినతర్వాత బాధిస్తారని అనుకోవడానికంటె పొరబాటు మరియొకటి లేదు.

౨. ఇదిగాక ప్రస్తుతకాలంలో రాజకీయవిషయాలను చర్చ చేస్తూ, స్వరాజ్యసమరంలో దిగి స్వార్థత్యాగంచేసిన నాయకులుగాని, వారి అనుచరులుగాని చాలామట్టుకు మతమందు విముఖత్వం చూపుచుండేవారని చెప్పవలసివస్తున్నది. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాస్ చంద్రబోసు మొదలైనవారు దేశంలోని దారిద్ర్యం తొలగించి, ప్రజలనందరిని ఐశ్వర్యవంతులనుచేయడమే ప్రధానోద్దేశంగా పెట్టుకొనియున్నారు. ప్రజలనందరినీ ఆర్థికంగా బాగుచేయడమే స్వరాజ్యానికి ఫలితమని వారి నమ్మకం. హిందూమతాన్ని ఉద్ధరించవలెననిగాని, ఇతర మతాలను ఖండించి నాశనంచేయవలెననిగాని వారీ సమరంలో దిగినవారుకారు. వారిదృష్టిలో మతం అప్రధానం. ఎవరేమతం అనుసరిస్తున్నారో తెలుసుకోవడంకూడా ప్రభుత్వంచేసేవారికి విధి కాదనేదే వారినమ్మకం. స్వరాజోద్యమనాయకులలో చాలమంది సాంఘికవాదులు (Socia lists). మతవిషయాలలో వారు జోక్యంకలుగచేసుకోరన్నదానికి ఇది యొకటే తార్కాణం.

౩. మహమ్మదీయు లొకప్పుడు హిందువులను బాధపెట్టినట్లు చరిత్రగ్రంథాలలో ఉన్నది గనుక స్వరాజ్యంవచ్చినతర్వాత హిందువులు వారిపై పగతీర్చుకొంటారని చెప్పడంకూడా హాస్యాస్పదం. మన చరిత్రగ్రంథాలు సత్యం చెప్పడం లేదనిన్నీ, స్వార్థపరులగు యూరోపియనులు కల్పించిన కథ లనేకాలు వానిలో ఉన్నవనిన్నీ జాతీయవాదులూ, స్వరాజోద్యమమందు పనిచేయుచుండేవారూ ప్రకటిస్తున్నారు. హిందూమహమ్మదీయ సమ్మేళనం కోరే నాయకులు ఈవిధంగా అల్పసంఖ్యాకులను బాధించుట ఎన్నటికీ సంభవించదు.

ఇంతకూ లోపం ఎక్కడ ఉన్నదంటే ఈ మోస్తరుగా వాదించేవారందరూ వెనుకవైపున చూస్తూ ముందువైపున ఏమిజరుగుతుందో నిర్ణయించడానికి ప్రయత్నంచేస్తున్నారు. మన కిప్పుడు కావలసింది ముందుచూపు గాని వెనకచూపుకాదు. హరిజననాయకులు కొందరిలో ఉండే లోపంకూడా ఇదే. అగ్రజులు ఇదివరకు అంత్యజులను నిరాదరిస్తూ ఉండుటచేత ఇకమీదట వారట్లే చేస్తారని వీరిభ్రమ. ప్రస్తుతం మనదేశంలో జరుగుతుండే విషయాలను వీరెవరూ చక్కగా గమనించడంలేదు. హరిజనులను అనాదరించువారి సంఖ్య తగ్గుచుండడం, అట్టి అనాదరణాన్ని సమర్థించేవారెవ్వరూ లేకపోవడం వీరు మరిచిపోతున్నారు. ఇదివరలో హరిజనులపట్ల తక్కినవారు అపచారం చేసినందుకు ఇప్పుడు పశ్చాత్తాపపడుతున్నారు. అస్పృశ్యులు స్పృశ్యులు కావలెననీ, వారికి దేవాలయప్రవేశం ఉండవలెననీ, వారి ఆర్థికపరిస్థితులు చక్కబడవలెననీ, హిందూసంఘంలో వారికి తగిన మర్యాదాగౌరవములు ఉండవలెననీ మాటలపూర్వకంగా కాకుండా క్రియారూపంగాకూడా అగ్రజులలో అనేకులు చూపుచుండడం అందరికీ విదితమైన విషయమే. ఈవిషయంలో హిందువుల మనోభావం చాలవరకు మారినది; ఇంకా మారుతుంది. ఇంతకూ అస్పృశ్యతను పోగొట్టడానికి మధ్యయుగంలో పాలించిన మహమ్మదీయులుగాని, ఇప్పుడు పాలిస్తుండే బ్రిటిషువారుగాని చేసిన ఘనకార్యాలేవైనా ఉన్నవా? హరిజనుల స్థితిగతులు ఇప్పుడు బాగుపడుచుండుటకు బ్రిటిషువారి ఔదార్యం కారణం కాదు. హిందూసంస్కర్తల పట్టుదలయే కారణమని చెప్పవలసి ఉన్నది. పిఠాపురం మహారాజావారివంటి సామంతులు, వెంకటరత్నంనాయుడుగారివంటి మహర్షులు, రానడే, గోఖలే మొదలగు దూరదృష్టిగల మహాశయులు, మహాత్మాగాంధీగారు హరిజనోద్ధరణానికి పూనుకొని పనిచేయడం సర్వవిదితం. స్వరాజ్యసంస్థాపనానంతరం ఈ ఉద్ధరణము ఇప్పటికంటెకూడా జయప్రదంగా జరుగుతుంది గాని మరొకటి కాదు.

మతాలకూ రాజకీయపక్షాలకూ సంబంధం కల్పిస్తున్న జిన్నాగారి భ్రమ

ఈ సందర్భంలో మరియొక విషయంకూడా మనం గమనించవలసి ఉంది. దానిని గమనించనందువనే మహమ్మదీయులు మొద

అను అల్పసంఖ్యాకులు హిందువులవలన తమకు బాధకలుగుతుందని భ్రమించడం సంభవిస్తున్నది. మతాన్నిబట్టి హిందువులంతా ఒకటి గనుక రాజకీయవిషయాలలోకూడా వారందరూ ఒకే అభిప్రాయం కలవారై, ఒకేపక్షంగా ఏర్పడి, అల్పసంఖ్యాకులకు నష్టకరమైన శాసనాలు చేసి, వారికి నష్టంవచ్చేటట్లు ఆశాసనాలను అమలులో పెడ్తారని జిన్నామొదలయినవారు వాదిస్తున్నారు. ఈ వాదం సత్యానికీ, అనుభవానికీ ఎంతోదూరంగా ఉంది. మతాన్నిబట్టి హిందువులంతా ఒక్కటైనా, రాజకీయాలలో వారియందు పరస్పర భేదా లెన్నో కనిపిస్తున్నాయి. వారిలో కొందరు కాంగ్రెసుపక్షం; కొందరు జస్టిసుపక్షం; కొందరు లిబరల్ పక్షం; కొందరు బ్రిటిషుపక్షం; కొందరు సనాతనులు; కొందరు హిందూమహాసభాభిమానులు. కొందరిది ధనికపక్షం, కొందరిది రైతులపక్షం. ఈ విధంగా వారిలో ఎన్నోకక్షలు ఏర్పడి ఉన్నవి. ఈభేదాలు ఎల్లప్పుడూ ఉంటవి. జస్టిసుపక్షంవారు, సనాతనులు ఈమధ్యను జిన్నాతో కలిసిపనిచేయడానికి ఉద్యుక్తులైనట్లు మనకు తెలుస్తున్నది. సింధురాష్ట్రం, పంజాబు, బంగాళము మొదలగు రాష్ట్రాలలో మహమ్మదీయులు అధికసంఖ్యాకులు; హిందువులు అల్పసంఖ్యాకులు. అయినప్పటికీ ఆరాష్ట్రాలలోని శాసనసభలలోని హిందూసభ్యులు ఒకేపక్షంలో లేరు; రాజకీయవిషయాలలో రెండుమూడు పక్షాలుగా విభాగమై ఉన్నారు. మహమ్మదీయులు హిందూదేశంపై దండెత్తి దేశాన్ని జయించడానికి వచ్చిన కాలంలోనూ, అలాగు జయిస్తున్న కాలంలోనూ హిందువులంతా కలిసి వారి నెదుర్కొనకపోవడంచేతనేగదా దేశం పరాధీనం కావలసివచ్చింది? ఇదేవిధంగా బ్రిటిషువారు మన దేశాన్ని జయిస్తున్న కాలంలో హిందువులలో ఐకమత్యం లేకపోవడం, కొందరు హిందువులు తక్కిన హిందువులతో కలియక బ్రిటిషువారికి సహాయంచేయడం, కొన్నిసందర్భాలలో కొందరు హిందువులు,మహమ్మదీయులు కలిసి బ్రిటిషువారికి తోడ్పడడం జరిగిందికదా! వీటినిబట్టి ఏమి తేల్తుందంటే మతాన్నిబట్టి ఒక్కటే అయినా రాజకీయవిషయాలలో వారు భిన్నులుగా ఉండవచ్చునన్నది. ఇట్టిసందర్భంలో హిందువు లంతా కలిసి, ఒకేరాజకీయపక్షంగా ఏర్పడి అల్పసంఖ్యాకులను హింసిస్తారనడం వట్టిభ్రమ. ప్రస్తుతకాలంలో ప్రతిదేశమందుకూడా ఆర్థికపరిస్థితులనుబట్టి రాజకీయపక్షాలు ఏర్పడుతున్నవే కాని మతపరిస్థితులను బట్టి అది జరగడంలేదు.

ఈవిషయంలో మహమ్మదీయనాయకులు, వారిపద్ధతి ననుసరించు తక్కిన అల్పసంఖ్యాకులనాయకులు మరియొక గొప్ప పొరబాటును చేస్తున్నారు. మతమునుబట్టి మహమ్మదీయులంతా ఒకరే కాబట్టి, రాజకీయవిషయాలలో కూడా వారందరూ ఒకరుగానే ఉండి ఒకేపక్షంగా ఏర్పడి, మహమ్మదీయులు కానివారికి భిన్నంగా ప్రవర్తించవలసిందని చాటుతున్నారు. ఇదే న్యాయమార్గం అని సామాన్యు లనేకులు నాయకులమాటలను అనుసరిస్తున్నారు. కాని ఈలాగు చేయడం నిర్బంధంగాను, మనుష్యస్వభావానికి విరుద్ధంగాను ఉంది. మహమ్మదీయులలో మాత్రం కొందరు పెట్టుబడిదార్లుగాను, కొందరు కూలివాండ్రుగాను, కొందరు జమీందార్లుగాను, కొందరు వారిక్రింద రైతులుగాను లేరా? వారిలో మాత్రం ఆర్థికంగా అధోగతిపాలైన నిమ్నజాతులవారు లేరా? జమీందారులవల్లనూ కలుగు బాధలనుండి విముక్తిని కోరు మహమ్మదీయ రైతులు హిందూరైతులతో కలిసి ఒకపక్షంగా ఏర్పడి తమస్థితిగతులను బాగుచేసుకొనుటకు ప్రయత్నించడంలో తప్పేమైనా ఉందా? అది తప్పనిచెప్పడం మతధర్మాలకు అపార్థం కల్పించడం కాదా? మహమ్మదీయ జమీందార్లు పెట్టేబాధ ఓర్వతగిందనిన్నీ, వారిని విరోధించకూడదనిన్నీ, జమీందారు హిందువైనప్పుడు అట్టి విరోధం తప్పకుండా సాధించవలసిందనిన్నీ ప్రబోధం చేయడంలో సబబేమైనా ఉన్నదా? ఇది అనవసరంగా వైమనస్యాన్ని వృద్ధి చేయడంకాదా? ఐకమత్యం అవసరమే. కాని ఎప్పుడు, ఎందుకు ఐకమత్యం అవసరమో, ఏయేసందర్భాలలో మనం ఎవరెవరితో ఐకమత్యం పొందియుండవలెనో వివక్షచేయకపోవడంవల్లనే మైనారిటీలసమస్య రోజురోజూకూ క్లిష్టతరమవుతున్నది.

ఒకేభాషనుమాట్లాడేవారు భిన్నమతాలను అవలంబించడంలో తప్పేమైనా ఉన్నదా? ఆంధ్రభాషను మాట్లాడేవారిలో కొందరు హిందువులుగను, కొందరు మహమ్మదీయులుగను, కొందరు క్రైస్తవులుగను ఉంటున్నారుగదా! ఇది అనుచితమా? దీనిమూలంగా ఆంధ్రభాషకు నష్టమా? మతాలకేమైనా నష్టమా? "క్రైస్తవమతంలో నమ్మకం కుదిరి, ఆమతంలో చేరవలెనని అనుకొన్నవా డెవ్వడూ ఆంధ్రభాష మాట్లాడకూడదు, ఇంగ్లీషుభాషనే మాట్లాడవలెను" అని అంటే క్రైస్తవమతంలో నిజమైన అభిమానం కలవా రనేకులు ఆమతంలో చేరడానికి వీలులేకపోవును కదా! క్రైస్తవుడు ఆంధ్రభాషను మాట్లాడటంచేత ఆభాష కేమైనా న్యూనత కలుగుతుందా? భాషకూ మతానికీ ముడిపెట్టడం ఎంత అనుచితమో మతానికీ రాజకీయాభిప్రాయాలకూ ముడిపెట్టడంకూడా అంతఅనుచితమే. ఈముడిపెట్టడానికి అల్పసంఖ్యాకనాయకులలో కొందరు ప్రయత్నిస్తుండడంచేత స్వరాజ్యసంపాదన కష్టతరం అవుతున్నది. "స్వేచ్ఛ", "నిర్బంధం" అనే మాటలను సాధారణంగా మనం వాడుతుంటాం. ఈలాగు ముడిపెట్టడమే నిర్బంధం; ఈలాటిముడులను త్రెంచివేయడమే స్వేచ్ఛ.

అల్పసంఖ్యాకనాయకుల ఈ ప్రవర్తనకు గల కారణం

నాయకు లీ విధంగా ప్రవర్తించడానికి ప్రధానకారణం వారి స్వాధికారాభిలాష. "మతంలో మహమ్మదీయులు వేరే, హిందువులు వేరే; గనుక రాజకీయవిషయాలలో కూడా వారు వేరుగాను, వీరు వేరుగాను ఉండవలెను" అనే సిద్ధాంతం బయలుదేరడంవల్ల లాభం నాయకత్వం కోరేవాడికి గాని జనసామాన్యానికి కలుగదు. రాజకీయాలలోకూడా వారు వేరు, వీరు వేరు అనే సిద్ధ

యం జరిగినవెంటనే ఇద్దరికీ కలిసి ఒకేనాయకుడు ఉండడంగాని, హిందూనాయకునిక్రింద మహమ్మదీయులు రాజకీయవ్యవహారాలను పరిష్కరించుకోవడం గాని సంభవించదు. మహమ్మదీయులకు ఒక నాయకుడున్నూ, హిందువులకు మరియొక నాయకుడున్నూ అవ సర మవుతుంది. నాయకుడు కాగోరు మేధావి యగు హిందువు యొక్క పోటీ లేకుండా మహమ్మదీయుడును, మేధావి యగు మహమ్మదీయుని పోటీ లేకుండా హిందువుడును నాయకత్వానికి రావడం వీలవుతున్నది. అతిసమర్థు డగువాడు ఇద్దరికీ నాయకు డగుటకు బదులు అల్పసమర్థులు, అధికారకాంక్షయే ప్రధాన లక్షణముగా గలవారు ఇద్దరు నాయకు లగుతున్నారు. మతానికీ రాజకీయానికీ ముడిపెట్టడంలో ఇదే ప్రధానోద్దేశం.

కుల, రాజకీయాలకు కృత్రిమ సంబంధం కల్పించేవారి ఉద్దేశ్యం

హిందువులలో కులానికీ రాజకీయవిషయాలకూ కృత్రిమసం బంధం కల్పించి ముడిపెడ్తుండేవారి ఉద్దేశంకూడా ఇంతే. "కులాన్ని బట్టి బ్రాహ్మణులు వేరే, బ్రాహ్మణేతరులు వేరే. అందుచేత రాజ కీయాలలోకూడా వారు వేరువేరుగా ఉండవలసిందే కాని కలియ కూడదు" అని వాదిస్తూ, బ్రాహ్మణులను తమపక్షంలో చేర్చుకొన నట్టి జస్టిసునాయకు లిట్టివారే. ఈలాగు వాదిస్తేనేకాని బ్రాహ్మణుల మూలమున పోటీలేకుండా వారు నాయకు లగుట సంభవించదు. ఇదే విధంగా హరిజనులు కులమునుబట్టేకాక, రాజకీయ విషయాలలో ప్రత్యేకవర్గమునకు చెందినవా రనియు, తక్కిన హిందువులతో వారు చేరకూడ దనియు కొందరు హరిజననాయకులు వాదిస్తుం టారు. వారు నాయకు లగుట కట్టివాదముతప్ప మరియొక ఆధారము లేదు. నాయకత్వంసంపాదించుటలో అపరిమితమైన పట్టుదలకలవారికి ఈలాటి కృత్రిమసంబంధాలను కల్పించుట స్వభావము. కాని వారు ఒక గొప్పవిషయమును గమనించుటలేదు. ఇట్టి ప్రవర్తనచేత వివిధ కులములలోనివారు, మతములలోనివారు, జాతులలోనివారు కలిసిన గొప్ప రాజకీయపక్షానికి నాయకులగు అవకాశాన్ని వారు కోల్పో తున్నారు. కోరతగినది ఇట్టి నాయకత్వమేకదా!

ఆ ఉద్దేశ్యంలోని అసందర్భాలు

ఇట్టిపొరపాటు మన దేశంలోనేకాక ప్రపంచంలో మరి కొన్ని దేశాలయందుకూడా స్వాధికారాభిలాష లుగువారు చేయు చున్నారు. దీని కంతకూ మానవజీవితముయొక్క నిజమైన లక్షణ మున్నూ, సోదరభావముయొక్క నిజస్వరూపమున్నూ అనేకులు తెలుసుకొనకుండుటే కారణము. మానవజీవితం బహుముఖ మైనది. మానవుడు సాధించవలసిన ప్రయోజనాలూ, నెరవేర్చ వలసిన గమ్యాలూ అనేకములు కాని ఒక్కటిమాత్రమే కాదు. ఒక్కొక్కప్రయోజనం సాధించడంలో ఒక్కొకరితో అతనికి అను బంధం కలుగుతుంది. ఎవరితో సంబంధం కల్పించుకుంటే ఆ ప్రయోజనం సాధించడానికి వీలగుతుందో ఆలాటివారితో సంబంధం కల్పించుకోవడమే ఉత్తమమార్గం కాని, ఆవిషయంలో సహాయం చేయలేనివారితో సంబంధం పెట్టుకోవడం ఉచితం కాదు. దుకాణాన్ని పెట్టుకొని వ్యాపారం చేసి లాభం సంపాదించకోరిన మహమ్మదీయుడు "నేను మహమ్మదీయులకు తప్ప మరెవ్వరికీ నా దుకాణంలోని వస్తువులను విక్రయించను" అని పీఠంవేసుకొని కూర్చుంటే అత డేమి వ్యాపారం చేయగలడు? ఎంతలాభం సంపాదించగలడు? ఆలాగు కూర్చోవడం వ్యాపారధర్మమా? ఆకలిగొన్న హిందువు వచ్చి నిర్ణయించిన ఖరీదు ద్రవ్యానికి అంగీకరించి బియ్యంకావలెనని కోరితే అతడు హిందువునే కారణం చేత బియ్యం అమ్మకపోవడం ధర్మవిరుద్ధం; సోదరభావానికి విరో ధం. వ్యాపారంలో మతాన్ని తీసుకోవచ్చి ముడిపెట్టడం అసంబద్ధం; మతాని కచ్చట తావు లేదు. క్రయవిక్రయాలు చేయడంలో హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు—అందరూ సంబంధీ కులే. విద్యను నేర్చుకోవకోరువాడు విద్యను నేర్పగల గురువులలో ఉత్తము డెవడో అతనివద్దకు వెళ్లి వరుసల చక్కనివిద్య లభింప చునుగాని "నేను హిందువును. గురువుకాతగ్గవాడు మహమ్మదీయ పండితుడు. ఆలాటివానివద్ద విద్య నేర్చుకోవడమా? అంతకంటె విద్యావిహీనుడుగా ఉండడమే మేలు" అని ఎవరైనా అంటే ఆలాటివాడు బుద్ధిహీనుడని చెప్పవలసి యుంటుందిగదా? తక్కిన విషయాలలోకూడా ఇంతే. ఒక్కొక్కప్రదేశంలో ఒక్కొక్క విషయం ప్రధానం వహిస్తుంది. విశాలహృదయం కలవాడు ఈ సత్యాన్ని గ్రహించి సందర్భానుసారంగా మతవిషయాలలో ఒకరితోను, వృత్తివిషయాలలో మరియొకరితోను, విద్యా విషయాలలో ఇంకొకరితోను, రాజకీయవిషయాలలో మరి యొకరితోను కలిసి పనిచేయడానికి సిద్ధపడతాడు. అతనికి ఒక్కొక్కవిషయంలో ఒక్కొక్కరు సోదరు లవుతారు. వృత్తినిబట్టి కొందరు, మతమునుబట్టి మరికొందరు, రాజకీయా లనుబట్టి తదితరులు అతని భ్రాతృవర్గంలో చేర్తారు. అన్ని భ్రాతృవర్గాలవిషయంలో కూడా అతడు సోదరభావాన్ని చూప వలసి ఉంటుంది. అప్పుడే అతడు నిర్బంధం అన్నది లేకుండా, స్వేచ్ఛగా విహరించకలిగిఉంటాడు. పదిమందితో కలిసి ఏదైనా పని చేస్తున్నప్పుడు—మీ రందరూ ఆంధ్రులా, బంగాళీలా, హిందు వులా, మహమ్మదీయులా అనే ప్రశ్న వేసుకోవడం ఆపనికి భంగం కలిగించడమే. ఈలాటిప్రశ్నలు వేసుకోవలసిన సందర్భాలు ఉన్నవి. కాని విచక్షణలేకుండా ప్రస్తుతం అప్రస్తుతం ఆలోచించకుండా మనంచేసే ప్రతికార్యమందుకూడా ఈలాటి ప్రశ్నలు వేసుకొని పని లోకి దిగడం గర్హింపదగిఉన్నది. ఈవిచక్షణ లోపించుటచేతనే మైనారటీసమస్య రోజురోజుకూ క్లిష్టతరం కావడం సంభవిస్తు న్నది. ప్రతిమనుష్యుని యొక్క జీవితమూ ఒక మహావృక్షం. అందు ఎన్నో శాఖోపశాఖ లున్నవి; వాటినుండి పూచే పుష్పాలు, పండే పండ్లు వివిధాలు. అన్నిశాఖలు, అన్ని ఉపశాఖలు, అన్నిపండ్లు,

యం జరిగినపిదపనే ఇద్దరికీ కలిసి ఒకేనాయకుడు ఉండడంగాని, హిందూనాయకునిక్రింద మహమ్మదీయులు రాజకీయవ్యవహారాలను పరిష్కరించుకోవడం గాని సంభవించదు. మహమ్మదీయులకు ఒక నాయకుడున్నూ, హిందువులకు మరియొకనాయకుడున్నూ అవసర మవుతుంది. నాయకుడు కాగోరు మేధావి యగు హిందువు యొక్క పోటీ లేకుండా మహమ్మదీయుడును, మేధావి యగు మహమ్మదీయుని పోటీ లేకుండా హిందువుడును నాయకత్వానికి రావడం వీలవుతున్నది. అతిసమర్థు డగువాడు ఇద్దరికీ నాయకు డగుటకు బదులు అల్పసమర్థులు, అధికారకాంక్షయే ప్రధాన లక్షణముగా గలవారు ఇద్దరు నాయకు లగుతున్నారు. మతానికి రాజకీయానికీ ముడిపెట్టడంలో ఇదే ప్రధానోద్దేశం.

కుల, రాజకీయాలకు కృత్రిమ సంబంధం కల్పించేవారి ఉద్దేశ్యం

హిందువులలో కులానికీ రాజకీయవిషయాలకూ కృత్రిమసంబంధం కల్పించి ముడిపెడుతుండేవారి ఉద్దేశంకూడా ఇంతే. "కులాన్ని బట్టి బ్రాహ్మణులు వేరే, బ్రాహ్మణేతరులు వేరే. అందుచేత రాజకీయాలలోకూడా వారు వేరువేరుగా ఉండవలసిందే కాని కలియకూడదు" అని వాదిస్తూ, బ్రాహ్మణులను తమపక్షంలో చేర్చుకొననట్టి జస్టిసునాయకు లిట్టివారే. ఈలాగు వాదిస్తేనేకాని బ్రాహ్మణులమూలమున పోటీలేకుండా వారు నాయకు లగుట సంభవించదు. ఇదే విధంగా హరిజనులు కులమునుబట్టేకాక, రాజకీయ విషయాలలో ప్రత్యేకవర్గమునకు చెందినవారనియు, తక్కిన హిందువులతో వారు చేరకూడ దనియు కొందరు హరిజననాయకులు వాదిస్తుంటారు. వారు నాయకు లగుట కిట్టివాదముతప్ప మరియొక ఆధారము లేదు. నాయకత్వంసంపాదించుటలో అపరిమితమైన పట్టుదలకలవారికి ఈలాటి కృత్రిమసంబంధాలను కల్పించుట స్వభావము. కాని వారు ఒక గొప్పవిషయమును గమనించుటలేదు. ఇట్టి ప్రవర్తనచేత వివిధ కులములలోనివారు, మతములలోనివారు, జాతులలోనివారు కలిసిన గొప్ప రాజకీయపక్షానికి నాయకులగు అవకాశాన్ని వారు కోల్పోతున్నారు. కోరతగినది ఇట్టి నాయకత్వమేకదా!

ఆ ఉద్దేశ్యంలోని అసందర్భాలు

ఇట్టిపొరపాటు మన దేశంలోనేకాక ప్రపంచంలో మరికొన్ని దేశాలయందుకూడా స్వాధికారాభిలాషులగువారు చేయుచున్నారు. దీని కంతకూ మానవజీవితముయొక్క నిజమైన లక్షణమున్నూ, సోదరభావముయొక్క నిజస్వరూపమున్నూ అనేకులు తెలుసుకోవకపోవడమే కారణము. మానవజీవితం బహుముఖమైనది. మానవుడు సాధించవలసిన ప్రయోజనాలూ, నెరవేర్చవలసిన ధర్మాలూ అనేకములు కాని ఒక్కటిమాత్రమే కాదు. ఒక్కొక్కప్రయోజనం సాధించడంలో ఒక్కొకరితో అతనికి అనుబంధం కలుగుతుంది. ఎవరితో సంబంధం కల్పించుకుంటే ఆ ప్రయోజనం సాధించడానికి వీలవుతుందో ఆలాటివారితో సంబంధం కల్పించుకోవడమే ఉత్తమమార్గం కాని, ఆవిషయంలో సహాయం చేయలేనివారితో సంబంధం పెట్టుకోవడం ఉచితం కాదు. దుకాణాన్ని పెట్టుకొని వ్యాపారం చేసి లాభం సంపాదించకోరిన మహమ్మదీయుడు "నేను మహమ్మదీయులకు తప్ప మరెవ్వరికీ నా దుకాణంలోని వస్తువులను విక్రయించను" అని పీకంవేసుకొని కూర్చుంటే అతడేమి వ్యాపారం చేయగలడు? ఎంతలాభం సంపాదించగలడు? ఆలాగు కూర్చోవడం వ్యాపారధర్మమా? ఆకలిగొన్న హిందువు వచ్చి నిర్ణయించిన ఖరీదు ఇవ్వడానికి అంగీకరించి బియ్యంకావలెనని కోరితే అతడు హిందువుడనే కారణంచేత బియ్యం అమ్మకపోవడం ధర్మవిరుద్ధం; సోదరభావానికి విరోధం. వ్యాపారంలో మతాన్ని తీసుకోవచ్చి ముడిపెట్టడం అసంబద్ధం; మతాని కచ్చట తావు లేదు. క్రయవిక్రయాలు చేయడంలో హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు—అందరూ సంబంధీకులే. విద్యను నేర్చుకోవకోరువాడు విద్యను నేర్పగల గురువులలో ఉత్తము డెవడో అతనివద్దకు వెళ్లినయెడల చక్కనివిద్య లభించునుగాని "నేను హిందువును. గురువుకాతగ్గవాడు మహమ్మదీయ పండితుడు. ఆలాటివానివద్ద విద్య నేర్చుకోవడమా? అంతకంటే విద్యావిహీనుడుగా ఉండడమే మేలు" అని ఎవరైనా అంటే ఆలాటివాడు బుద్ధిహీనుడని చెప్పవలసి యుంటుందిగదా? తక్కిన విషయాలలోకూడా ఇంతే. ఒక్కొక్కప్రదేశంలో ఒక్కొక్క విషయం ప్రధానం వహిస్తుంది. విశాలహృదయం కలవాడు ఈ సత్యాన్ని గ్రహించి సందర్భానుసారంగా మతవిషయాలలో ఒకరితోను, వృత్తివిషయాలలో మరియొకరితోను, విద్యావిషయాలలో ఇంకొకరితోను, రాజకీయవిషయాలలో మరియొకరితోను కలిసి పనిచేయడానికి సిద్ధపడతాడు. అతనికి ఒక్కొక్కవిషయంలో ఒక్కొక్కరు సోదరు లవుతారు. వృత్తినిబట్టి కొందరు, మతమునుబట్టి మరికొందరు, రాజకీయాలనుబట్టి తదితరులు అతని భ్రాతృవర్గంలో చేర్తారు. అన్ని భ్రాతృవర్గాలవిషయంలో కూడా అతడు సోదరభావాన్ని చూపవలసి ఉంటుంది. అప్పుడే అతడు నిర్బంధం అన్నది లేకుండా, స్వేచ్ఛగా విహరించకలిగిఉంటాడు. పదిమందితో కలిసి ఏదైనా పని చేస్తున్నప్పుడు—వీ రందరూ ఆంధ్రులా, బంగాళీలా, హిందువులా, మహమ్మదీయులా అనే ప్రశ్న వేసుకోవడం ఆపనికి భంగం కలిగించడమే. ఈలాటిప్రశ్నలు వేసుకొనవలసిన సందర్భాలు ఉన్నవి. కాని విచక్షణలేకుండా ప్రస్తుతం అప్రస్తుతం ఆలోచించకుండా మనంచేసే ప్రతికార్యమందుకూడా ఈలాటి ప్రశ్నలు వేసుకొని పనిలోకి దిగడం గర్హింపదగిఉన్నది. ఈవిచక్షణ లోపించుటచేతనే మైనారటీసమస్య రోజురోజుకూ క్లిష్టతరం కావడం సంభవిస్తున్నది. ప్రతిమనుష్యుని యొక్క జీవితమూ ఒక మహావృక్షం. అందు ఎన్నో శాఖోపశాఖ లున్నవి; వాటినుండి పూచే పుష్పాలు, పండే పండ్లు వివిధాలు. అన్నిశాఖలు, అన్ని ఉపశాఖలు, అన్నిపండ్లు,

తెలుగు ఫిలిం పరిశ్రమ

లాభదాయకంగా ఉండాలంటే......!

ప్రజాభిప్రాయాన్నీ, ప్రజాభిరుచులను గమనించి చిత్రాలు తీయాలి
కొత్తనటీనటులతో వేరంసాగించటంకంటె పేరుప్రతిష్ఠలుగల నటీనటులనే ఎన్నుకోవాలి
ఆ నటీనటులతో దీర్ఘకాలం పద్ధతిమీద అగ్రిమెంట్లు ఏర్పాటు చేసుకోవాలి
నిర్మాణవ్యయంలో యథోచితమైన పొదుపు చూపాలి
అట్లని పబ్లిసిటీకోసం విరివిగా ఖర్చుపెట్టటానికి వెనుదీయరాదు
అద్దెస్టూడియోలలో ఫిలిముతీయటం మానాలి
తెనుగువాట స్వంతస్టూడియో ఒకటి నిర్మించాలి

● శ్రీ గూడవల్లి రామబ్రహ్మం ●

ఫిలిమ్ పరిశ్రమాభివృద్ధికి అనుకూల వాతావరణం ఆంధ్ర దేశంలో విరివిగా కనబడుతూ ఉన్నది. పట్టణాల్లోనే కాక పల్లెలలోకూడా ఫిలింకంపెనీల ప్రారంభోత్సవాలు జరుగుతూవున్నట్టు రోజూ వార్తలు వస్తున్నాయి. అందుకు సంతసింపవలసిందే.

కాని,—వ్యాపారపద్ధతులు తెలియక, కావలసిన పెట్టుబడి సేకరించుకోకుండా కేవలం ఉత్సాహమే ప్రధానంగా పెట్టుకుని ఈ కంపెనీలు స్థాపించటంవల్ల నూతనోత్సాహం తగ్గిపోతున్నది; కంపెనీలకు ఎక్కువ నష్టం వస్తున్నది. చివరకు పరిశ్రమకే దెబ్బ తగుల్తూ వున్నది.

ఆంధ్ర దేశంలో ఉరుకులెత్తుతూ ఉన్న ఈ ఉత్సాహం శిథిలం కాకుండా చిరస్థాయిగా నిలవటానికీ, కంపెనీలకు నష్టం రాకుండా లాభాలు ఎక్కువగా రావటానికీ, పరిశ్రమ కళాకాంతులతో వికసించటానికీ - నాయీ క్రింది సలహాను తోటి పరిశ్రమదారులు శ్రద్ధగా గమనించాలని ప్రార్థన.

గత సంవత్సరంలో సినిమా పరిశ్రమాభివృద్ధికి దోహదం కల్గించే పరిస్థితు లేవీ కనబడ లేదు. అంతా 'చుక్క ఎదురు'గానే ఉన్నది. విడుదలయిన పదిహేను ఫిలిములలో ఏ ఒకటి రెంటికోమాత్రం లాభం వచ్చిందన్న మాట వినగలిగాం. తక్కినవాటికి అంతగా నష్టం రాకపోయినా, లాభంమాత్రం రాలేదని ఖండితంగా చెప్పవచ్చు.

దీనికి కారణాలు అనేకము లున్నా, ఈ పరిస్థితుల్లో ... వ్యాపారానుభవం లేనివారు - చివరకు కంపెనీల రిపోర్టు ఐనా చూడనివారు, రోజుకొక ఫిలిం కంపెనీ 'లిమిటెడ్' చేస్తున్నారంటే ఆంధ్రుల సాహసాన్నే తెలుపుతున్నది. కాని, వ్యాపార వ్యవహార నిర్వహణ శక్తినిమాత్రం చాటటంలేదు; అనుభవం ఉండీ, పెట్టుబడికి కావలసిన డబ్బుండీ, పలుకుబడి ఉండీ- తీసినఫిల్ములే జనరంజకంగా ఉండక నష్టంపా లవుతూ వుంటే... ఇంతమంది ఇన్నికంపెనీలు ఈ సమయంలో స్థాపించటం వ్యాపారంకోసం కాకుండా విలాసార్థమే అవటంవల్ల నా ఈవ్యాసం వారికి ఉద్దేశింపబడ లేదు.

తెలిసి, కళ్లు మూసుకుని, భోగలాలసత్వానికి ఈ పరిశ్రమలోకి దూకేవారిని ఎవరు అడ్డగలరు?— కాక ఇతరులుచెప్పిన మాయమాటలకు లోబడి, అపరిమితమైన లాభాలు గడింపవచ్చుననే అభిలాషతో ఈ

పరిశ్రమలో కాలుపెట్టినవారికే నాయీవ్యాసం ఉపకరిస్తుంది,

... ...

తొలుతలో మన ఫిల్ములకు మాంచి రాబడి వచ్చినమాట నిజం. ఇందు కనేక కారణా లున్నాయి: ఫిలింనిర్మాణానికి నేడు అవుతున్నంత వ్యయం అప్పుడవసరం లేకపోవటం, నాటకాల్లాగు సినిమాలు మనుషుల్ని నిలబెట్టి తీసివేయటం, కొత్త వింత అవటంవల్ల వేలంవెర్రిగా జనం విరగబడిచూడటం—ఇవి ముఖ్య హేతువులు.

ఇప్పుడా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రజల కొక అభిరుచి ఉదయించింది. కళావిమర్శకులు బయల్దేరారు. ప్రేక్షకవర్గం తప్పొప్పులను పట్టి సాగదీస్తున్నారు. పోటీ అతివ్యాప్తిగా ఉన్నది. సంవత్సరానికి ఇరవై ఫిల్ములు తయారవుతున్నాయి. ఊరి కో నాలుగైదు థియేటర్లు ఉదయిస్తున్నాయి. ఫిలిం అన్నివిధాలా బాగావుంటే నాల్గుడబ్బు లొస్తున్నాయి; లేకపోతే, కంటికి కనబడకుండా టుప్పున ఎగిరిపోతున్నాయి.

ఈ పరిస్థితి ఒక్క తెలుగునాటనే ఉన్నది. అరవంలో ఏ పిక్చరు విడుదలయినా, ఆలస్యమయితే కావచ్చుగాని, పెట్టుబడికి భంగం రాదు. కాని, మన తెలుగు చిత్రాలకు ఆ భాగ్యం లేదు. నచ్చిందా ... ఏదో విధంగా డబ్బు చేసుకుంటున్నది. లేకపోతే ఆరంభంలోనే అంత్యక్రియలు! అంత 'రిస్కీ'గా —అంటే అపాయకరంగా ఈ పరిశ్రమమనకి దాపరించింది.

కనుక, యీ వ్యాపారంలో వేలుపెట్టేవారు చాల జాగరూకతతో వ్యవహరించాలి. జనాభిప్రాయాన్ని, అభిరుచుల్ని గమనించి, చక్కటి చిత్రం తీయటానికి సంకల్పించాలి. నష్టం రాకుండా లాభం వచ్చేటట్టు నిర్వహించుకోవాలి. ఎందుకు నష్టం వస్తుందో, ఎట్లా లాభం వస్తుందో దూరం యోచించుకోవాలి.

ఒక్క ఫిలిమ్ నిర్మించటానికి మొత్తం ఖర్చు ఎంతవుతుందో, ఈ ఖర్చులో ఎంతెంత ఏయే శీర్షిక క్రిందకు వస్తుందో ముందు అంచనా వేసుకోవాలి.

'ఎంచి ఏట్లో పోయు' మన్నట్టు ఇటువంటి రిస్కీ వ్యాపారం చేస్తున్నప్పుడు—మన పరిస్థితులూ, పెట్టుబడీ సరిచూచుకుని, ఇంత మదుపూ నష్టపడటాని కిష్టపడే ఈ ఫిలింపరిశ్రమలో దిగాలి.

అప్పుడు నష్టపడినా పెద్ద దిగు లుండదు. లాభం వస్తే ఎగిరి కుప్పిగంతులేయవలసిన అవకాశమూ ఉండదు.

... ...

హిందీ అయినా, తెలుగయినా, అరవమైనా నిర్మాణవ్యయం ఒక్కటే. మంచి పిక్చరు తీయాలంటే కనీసం ఒక లక్ష రూపాయలు కావాలి. అందుకు వివరాలు వివిధ శీర్షికలకింద విపులీకరిస్తున్నా గమనించండి:

ఒక ఫిలిముకు అయ్యే ఖర్చు

స్టూడియో అద్దెలు వగైరా	రూ. 15,000
రా "ఫిలిం" [కాపీలకు సైతంగా]	25,000
కథ కాపీరైటు, కవి వగైరా	1,500
డైరెక్టరు, అసిస్టెంట్లు	5,000
మ్యూజిక్ డైరెక్టరు, పరివారము	5,000
ఆర్టు డైరెక్టరు, అసిస్టెంట్లు	2,000
సెట్టింగుల అలంకారాలు, ప్రత్యేక నిర్మాణాలు వ॥	4,000
దుస్తులు	1,000
వేష పరికరాలు	200
బోర్డింగ్, లాడ్జింగ్ ఏర్పాటులు	5,000
షూటింగ్ సమయాన భోజనాలు, ఫలాహారాలు, సిగరెట్లు వ॥	2,000
నటీనటుల వేతనాలు	15,000
ఇతర ఎక్స్ట్రాలు	1,500
లేబరేటరీ ఖర్చులు [కాపీలకు వ॥]	3,000
ట్రావెలింగ్ ఖర్చులు	2,000
మెడికల్ ఖర్చులు	400
పెట్రోలు, కార్లు, టాక్సీలు	5,000
'లోకల్' పబ్లిసిటీ: [పోస్టర్లు, కటవుట్లు, బ్లాకులు వ॥]	5,000
పేపర్ల అడ్వర్టయిజ్‌మెంటు	5,000
రిలీజు పబ్లిసిటీ	5,000
సాదరు, ఇతర ఖర్చులు	5,000
	రూ. 1,12,600

ఇది సామాన్యంగా ఒక ఫిలిమ్‌కు అయ్యేఖర్చు మదింపు. అన్నీ అనుకున్నట్టుగా సానుకూలంగా జరిగి పోతేమాట!

మాటవరసకి—ఒకఫిలిం నిర్మించడానికి కనీసం ఒక లక్షరూపాయలు కావాలని నిర్ణయిద్దాం. అందులో ముఖ్యమయిన పద్దులు నాలుగు :

i.	రా ఫిలిం	[మొత్తం ఖర్చులో నాల్గవ వంతు.]
ii.	నటీనటులు	[" " ఆరవ "]
iii.	పబ్లిసిటీ	[" " " "]
iv.	స్టూడియో అద్దెలు	[" " " "]

తదితరఖర్చులు అట్టే గమనింపతగ్గవి కావు. ఈ నాలుగు పద్దుల్లోనూ ఏమయినా పొదుపు చేయటానికి వీలుందేమో చూతాం :

(i) 'రా' ఫిలిం :—ఇది మన దేశంలో తయారయ్యేది కాదు. అంచేత ధరనిర్ణయంమీద మనప్రభుత్వానికిగాని, మనకి కాని ఏవిధమైన పెత్తనంలేదు. పైగా-యుద్ధం రావటంవల్ల నూటికి 25 వంతున ధరలు హెచ్చాయి. కనుక, ఈ ఐటమ్‌లో ఖర్చు తగ్గకపోగా, హెచ్చటానికే అవకాశం కనపడుతూంది.

(ii) నటీనటులు :—ఒక లక్ష రూపాయిలతో తయారయ్యే పిక్చరులో ఈ శీర్షికకు రూ. 15,000 లు మాత్రమే ఖర్చు వేశాం. కాని, ఇదంత నికరం కాదు. పేరుప్రఖ్యాతులుగల నటీనటవర్గం కావాలంటే ఫిలిమ్‌కి నలభై వేలకుపైగా ఖర్చుపెట్టిన తెలుగు ప్రొడ్యూసర్లున్నారు. అక్కర్లేదనుకొని పదివేలల్లో పూర్తిచేసుకొన్న వారూ ఉన్నారు.

'ద్రౌపది' నటీనటవర్గానికి రూ. 35,000 లు అయింది. 'రైతుబిడ్డ' నటీనట వర్గానికి రూ. 25,000 లు అయింది. 'చండిక'కు రూ.40,000 లు దాటుతూఉన్నది. ఒక్క 'కాళిదాసు'లోని నటీనటవర్గానికి ఇచ్చిన వేతనాలు రూ. 90,000 లకి మించాయంటే మీరు నమ్మితీరాలి. ఎక్కడిమాటో ఎందుకు?—నేను ఇప్పుడు డైరెక్టుచేస్తున్న "ఇల్లాలు"లో ఒక్క కాంచనమాల వేతనమే నాల్గునెలలకూ రూ. 12,000 లు!

దీనికి తలా తోకా లేదు; నియమమూ నిర్ణయమూ లేదు. ప్రొడ్యూసర్ రుచుల్నిబట్టి తారాబలం చంద్రబలం గుణించాలి. పేరుప్రతిష్ఠలు గల తారల్ని లంకించుకొంటే "బేడడబ్బుల వర్షం" కురుస్తుందంటారు కొందరు! కొత్త నటీనటులను సృష్టించి పొదుపుగా బేరం సాగించా లంటారు కొందరు!

ఎటు చెప్పటానికీ వీల్లేని సమస్య ఇది. కాని, డబ్బు పోయినా, పేరుప్రతిష్ఠలు గల నటీనటులతోనే ఫిలింతీస్తే అట్టే 'లుక్సానా' లేని వ్యాపార మంటాను నేను. కొత్తవారితో బేరం సాగించటం ఒకప్పుడు లాభించినా, చాలవోట్ల నష్టదాయకంగానే మారుతుంది. అందుచేత పేరుప్రతిష్ఠలు గల నటీనటవర్గాన్నే — కాస్తో కూస్తో అనుభవం ఉన్నవారినే — ఏరుకోవటం మంచిది.

అయితే, రోజుకో కంపెనీ బయల్దేరే యీ రోజుల్లో - ఫిలిం తీసినా తీయకపోయినా, పోటీలు నంత బేరాలు హెచ్చిపోవటంవల్ల, ప్రతితారా చుక్కల్లో కూర్చోవటం వల్ల ఈ కష్టాన్ని ఎట్లా ఎదుర్కోవటమో మన మిప్పుడు తర్కించుకోవాలి.

దానికి ఒకటే మార్గ ముంది : అది యేమిటంటే — ఫిలిం పద్ధతిమీద కాకుండా దీర్ఘకాలం పద్ధతి మీద నటీనటులవల్ల అగ్రిమెంట్లు కట్టుకోవటం.

ఇందుతో — పోటీలవల్ల బేరాలు పెరగకుండా ... ఒక కంపెనీకి ఒక తార అకట్టుకొని ఉండీ, ఆ కంపెనీకి పేరుప్రతిష్ఠలు కలిగించటం, ఆ తారకు ఫిలిం ఫిలింకూ సంతనబడి-ఎదురుచూడకుండా నాల్గు కాలాల పాటు కడుపులో నీళ్లు కదలకుండా ఉండటం కలుగుతవి. ఇది ఉభయతారకమైన పద్ధతి.

ఈ విధంగా సుస్థిరమైన నటీనటవర్గం కూర్చుకోవాలంటే కంపెనీలకు ఎక్కువ పెట్టుబడి వుండాలి. లాభ నష్టాలను లెక్కించకుండా సంవత్సరానికో నాల్గు ఫిలింలు తీసేటట్టు ఉండాలి. ఈ విషయం తరవాత చర్చిద్దాం.

(iii) పబ్లిసిటీ:—దీనికింద మొత్తం రూ.15,000లు ఖర్చు అంచనా వేశాం. ఇది చూడగానే "అబ్బో! ఇది

రామబ్రహ్మం పద్ధతి" అని గుండెలు బాదుకొంటారు చాలమంది. ఈ ఖర్చు అనవసరమని నాతోటివారు తుడుపెట్టటానికి తయారవుతారు. అంచేత ఈ ఖర్చు లోని 'వ్యాపార మర్మం' తెలియపరిచి, ఈ ఖర్చు అత్యంతావసరమైనదని రుజువు చేయాల్సిన బాధ్యత నాపైని ఉన్నది. మనకు విస్తీర్ణం చాల తక్కువ. "Small profits and quick returns" అనేది వ్యాపారసూత్రం. మన పెట్టుబడి ఎంత తొందరలో మనం రాబట్టుకొంటామో అంత ప్రయోజకులమన్నమాట.

ఒక లక్షరూపాయలు ఖర్చుపెట్టి ఒక ఫిలిం తీశామంటే—ఆ మొత్తం కనీసం మూడు నెలల్లోనైనా రాబట్టుకోవాలంటే: ఎక్కువ కాపీలు ఎక్కువ సెంటర్లలో విడుదల చేయాలి. కాపీలనుబట్టి "లోన్ పబ్లిసిటీ" సెట్లు తయారు కావాలి. ఒకేసారి ముఖ్యమైన పట్టణాల్లో విడుదల చేస్తున్నాము కాబట్టి ప్రత్యేకించి "రిలీజు పబ్లిసిటీ" చేస్తే ఎంతో లాభం.

ఎక్కడ చూచినా, ఏ పేపరు తిరగేసినా, ఏ రైలెక్కినా, ఏ మూల చూచినా ఆఫిలిం "పేరు" కనబడాలి. దానికితోడు పత్రికల బాకాలు పల్లెపల్లెలా మార్మ్రోగాలి. అదంతా ఒకపద్ధతిమీద నడపాలి. ఆ నడపటానికి ప్రత్యేకశిక్షణ అవసరం. లేకుంటే దుబారా జాస్తిఅవుతుంది. అట్లాచేస్తే మంచిపిక్చరుకు భలేఊపు.

ఒకచోట రెండువారాలు "రన్" అయ్యేది 7, 8 వారాలు "రన్" కావచ్చు. పల్లెజనాలు చద్దిమూటలతో తయారవుతారు. మూలనుండే ముసలమ్మలు మనుమనవరాళ్లతో వచ్చి మూగిపోతారు. అట్లా కాకపోతే ఆ వూరి జనంతోనే ఆఖరు. పల్లెలకు ఆ ఫిలింపేరు అట్టే పాకటానికి వీల్లేదు. 'కొత్త ఒక వింత; పాత ఒక రోత!'

మొదటి రోజుల్లోనే బండి కదలాలి. పల్లెటిజనం ప్రయాణం కట్టాలి. ఒకసారి ఆ దండు బయల్దేరిందంటే, ఒక జగన్నాథరథం మరి ఆగదు. ఆ కదలికకోసమే బ్రహ్మాండమైన ఈ పబ్లిసిటీ. పబ్లిసిటీ లేకపోతే తొందరలో పెట్టుబడి తిరిగిరాదు. మరొకఫిలిమ్ తీయటానికి వీల్లేదు. పబ్లిసిటీకి తగినట్టుగా ఫిలిం ఉంటే...పెట్టుబడి మూడునెలల్లో గిర్రున తిరిగి ఒళ్లో పడుతుందని నమ్మండి. ఆ పబ్లిసిటీ ఆశాభంగం కలగజేస్తే, ఫిలిం జనరంజకంగా ఉండకపోతే పబ్లిసిటీ అంతా శుద్ధదండగ అనే భావించాలి.

అంచేత, లాభాలు రావాలనే ఆశతోనే మనం వ్యాపారం చేస్తాము కాబట్టి, ఈ ఖర్చుకే ఎంతమాత్రమూ వెనుదీయకూడదని నా మతం. జంకినపక్షమందు మంచిఫిలిముకూడ దెబ్బతింటుందని నావాదం.

రిలీజ్ పబ్లిసిటీ లేకుండా విడుదలయిన "వరవిక్రయం" ఫిలిమ్ ఎంత జనరంజకంగా ఉన్నా ఇంతవరకు అసలు వసూలు కాలేదంటే, దానికి లోపం ఇదేనని నమ్మాలి. అందుచేత యీ ఖర్చు అత్యవసరమనీ, తగ్గించటానికి కొంతమాత్రమూ వీల్లేదనీ నా విశ్వాసం.

(iv.) స్టూడియో అద్దెలు:—సుమారు రూ. 15000 లు ఖర్చు అంచనా వేశాం ఈ శీర్షికకింద. కాని, శ్రద్ధగా చూస్తే, విపులంగా పరిశీలిస్తే ఇంకా యెంతో ఎక్కువే ఖర్చుపెట్టాల్సి వస్తుంది. ఒక్కొక్క స్టూడియోకు ఒక్కొకవిధమైన అగ్రిమెంటు. ఆ యగ్రిమెంటు సాగదీసి అమల్లో పెడితే అంతా ఘోరమే!—దినదినగండం. ఫిలిం పూర్తయ్యేవరకు స్టూడియో అధికారులతో దెబ్బలాట్టానికి వీల్లేదు ... 'నం బిచ్చింద ప్రసాదం!'

వాళ్లకు అందుబాటులో వున్న ఒక చిరిగి మాసిపోయిన సెట్టు ఇచ్చి, ఇది ఇంద్రభవనం అంటే — అందులో షూట్ చేయటానికి తయారు కావాల్సిందే.

లేకుంటే — మేకులు దగ్గర్నుంచి రంగుల వరకు, పనిచేసే పనివాళ్ల భోజనాల దగ్గర్నుంచి ముడుపులవరకు, స్టూడియో నిర్వాహకుల బహుమతుల దగ్గర్నుంచి పెట్టుబడులవరకు నడీ చప్పుడూ కాకుండా - రట్టూ రవ్వా లేకుండా - డబ్బు అంటే లెక్క లేకుండా విరజిమ్మితే ... పదిరోజులు ఆలస్యమయినా మనం ఇచ్చిన డిజైన్‌కు ఒక బారెడు దూరంగా, ఏదో ఒక రకమయిన సెట్టు తయారవుతుంది. అందువల్ల ఖర్చు జాస్తీ అవుతుంది.

ఆ సెట్టులోకి కావలసిన పరికరాలు కూడ బోలెడు అద్దెలు పోసి మనమే సమకూర్చుకోవాలి. అప్పుడే కాస్త స్వాభావికత ఏర్పడుతుంది.

లేకపోతే, పీర్లపండగలో హిందూ మహమ్మదీయ కలగలుపులాగు — స్టూడియోవా రిచ్చిన సెట్టులో పౌరాణికం, చారిత్రకం, సాంఘికం అన్నీ 'ఏక్ దమ్ము'గా షూట్ చేయాల్సిందే. చేయకపోతే కాలవిలంబనం!

కనక, నాల్గునెలల్లో ఫిలిం పూర్తికావాలన్నప్పుడు - అన్ని సెట్లూ మన యిష్టం వచ్చినట్టు తయారు కావాలంటే అటు నటీనటకులకూ, ఇటు స్టూడియోకూ ప్రోరేటాలు కుమ్మరించవలసిందే.

... ...

కాలక్రమేణా ఫిల్ములవల్ల రాబడి తగ్గుతున్నదనీ, పెట్టుబడి పెరుగుతున్నదనీ పైని మనవిచేశాను. పెట్టుబడి తగ్గటానికి మనం ఆలోచిస్తున్నప్పుడు రాబడి తగ్గటానికి గల కారణాలుకూడా ఆలోచించాలి:

(1) ఊరూరా, ఒకటికి రెండు థియేటర్లు వెలసి, పోటీ మితిమీరటం

(2) ప్రజాభిరుచికి అనుగుణంగా ఫిల్ములు తయారు కాకపోవటం

(3) ప్రత్యేకత, విశిష్టత, జాతీయత—మన ఫిలిమ్ లలో లోపించటం

ఇవి—రాబడి తగ్గటానికి ముఖ్యమయిన మూడు కారణాలుగా ఎంచుకోవచ్చు.

మొదటికారణం మనచేతులు దాటిన విషయం. కట్టిన థియేటర్లు కూలదోయటానికి ఎవరూ ఉద్యమించరు. కాకపోతే, మరి కొత్తవి లేవకుండా ప్రయత్నించవచ్చు.

ఇక - రెండు, మూడు కారణాలు ముఖ్యమైనవి. మనకు ప్రత్యేకంగా స్టూడియోలు లేనప్పుడు, ఏ యితర స్టూడియోలలోనో మనం ఫిల్ములుతీస్తూ, జాతీయత ఉట్టిపడాలెనంటే మాటలా?

'మద్రాసు మాది' అని రొమ్ము చరుస్తాం. కాకపోతే, అర్థానికైనా హక్కుందంటూ వాదిస్తాం. మద్రాసులో ఉన్న స్టుడియోలలోనే - తెలుగువారు పెత్తనం చెలాయిస్తున్న స్టూడియోలలోనే _ ఇంతెందుకు, చివరొ నా స్టూడియోలోనే - నేను డైరక్టుచేసిన 'రైతుబిడ్డ'కి లోనే—రామిరెడ్డి విజయోత్సవంలో రైతులుగా దాపరించిన ఎక్స్ట్రాలచేత తెలుగురైతుల కట్టుమోస్తరుగా గోచీలు పెట్టించడం నాతరం కాకపోయింది.

ఇక — ప్రత్యేకతనుగురించీ, విశిష్టతనుగూర్చీ అట్టే తర్కించటం అనవసరం. వాళ్లందరకూ గోచీలు సర్దుతూ కూచుంటే రోజు రోజంతా వృథా ఐపూరుకుంటుంది. రోజుకి రూ. 300లు స్టూడియోబాడుగ చెల్లించాలి. ఇంతమందికీ తలకొక అర్థరూపాయి చొప్పున రూ. 200లు కుమ్మరించాలి. భోజన మజ్జనాదులకు మరి రెండువందలు తగులుబాటు. పెట్రోలు వగైరా చిల్లరకర్చులకి మరో వంక.

ఇంత డబ్బు విరజిమ్మి గోచీలు సర్దుతూ కూచోవటం మంచిదా వ్యాపారదృష్టిలో?—లేక కళాలక్ష్మికి స్వస్తి చెప్పి, కళ్లు మూసుకొని షూటింగు సాగించుకుపోవటం మంచిదా?

ఇట్లా తయారవుతున్నాయి మన ఫిల్ములు. ఈ చిక్కులు తొలగాలెనంటే అద్దెస్టూడియోలలో ఫిల్ములు తీయటం మానాలి; తెలుగునాట స్వంతస్టూడియో ఒకటి నిర్మించాలి. దీర్ఘకాలపు అగ్రిమెంట్లతో నటీనటులను సేకరించాలి. కళాదృష్టినీ, వ్యాపారదృష్టినీ మేళవించి, తెలుగుదనంతో పరిమళించే తెలుగుఫిల్ముల్ని తయారు చేయాలి.

బాగో ఓగో—ఫిలిం కాగానే ఫిలిం తీయకలిగి ఉండాలి. స్టూడియోకు, నటీనటులకు విరామంలేకుండా ఫిలింనిర్మాణం సాగిపోవాలి.

ఇందుకు కనీసం అయిదు లక్షలైనా కావాలి. ఇట్టి నిర్మాణానికి— పుట్టగొడుగుల్లాగు ప్రతిపల్లెలోనూ బయలుదేరే కంపెనీలు వారివారి వేరువేరు ప్రయత్నాలు మానుకొని, సంయుక్తంగా సాయపడాలి.

అంటే... తెలుగు ప్రొడ్యూసర్ల సమాఖ్య ఒకటి యేర్పడాలి. అప్పుడు మహారాష్ట్రులకు ప్రభాత్ కంపెనీ లాగున, వంగీయులకు న్యూథియేటర్సు లాగున తెలుగువారికి 'తెలుగుటాకీస్ లిమిటెడ్' విలసిల్లగలదు.

దొంగలున్నారు, జాగ్రత్త!

[కథానిక]

★

శ్రీ
ఇంద్రకంటి
హనుమచ్ఛాస్త్రి



౧

అప్పుడే—ఇంటర్మీడియేట్ ఎగ్జామినేషన్‌లో పేపరు రాసివచ్చిన విసుగున—ఒక్క విసురున కారులోంచి దూకి, ఒక్క అంగలో మేడపైకి వెళ్లి, పుస్తకాలనూ, నోట్సునూ 'మీ దిక్కున్నచోట చెప్పుకో'మన్నట్టు టేబిల్ మీదకు విసరి, ఆత్రంగా కిటికీలన్నీ తెరచి, హఠాత్తుగా గదిలో చొరబడే మలయపర్వత సానువులనుండి దిగుమతియగు కమ్మతెమ్మెరలకు నల్లపట్టు ముంగురులూ, తెల్లనిపైటా తపతప కొట్టుకోగా, గ్రామొఫోన్ టేబిలుకు దగ్గరగావున్న ముఖమల్ సోఫాను ఆప్యాయంగా అనుగ్రహించింది శకుంతలాదేవి.

కమ్మని కళావలయాలుగా, మాధుర్య నిలయాలుగా ... అక్కడి శబ్దగుణక ఆకాశాన్ని ఘూర్ణనహోయితో, పరిమళపు తేనెల్తో నింపుతూ గిరగిర సైగాల్ మహాశయుడు పాడుకుపోతున్నాడు— "సుఖ్ కే... ...దుఃఖ్ కే...ఏక్ స్వపన్ హై" ఇత్యాది.

ప్లేటు మార్చడానికి రికార్డుబాక్సువైపు చేయి చాచుతూ, చటుక్కున ఆత్మారాధన జ్ఞప్తివారి, అధోలోకాన్ని ఉద్దేశించి—

"మంగా, కాఫీ... కాలేజీనుంచి రావడం చూడలేదూ ?"

"అమ్మా, ఇదిగో తెస్తున్నా—మరిచిపో లేదు"

శకుంతల కావలసిన రికార్డుకోసం తడవుతూ వుండగా... టేబిల్ మీద ఒక కవరుత్తరం కంటపడింది.

ఆకస్మికంగా ఆ మొముఖంలో ఒక వెయ్యి ప్రశ్నార్థక చిహ్నాలు—ఇదేమిటీ—అపరిచిత అక్షరాలు?

ఆశ్చర్యంబరువున అనుకోని అనిమేషత్వం దఖలుపడ్డ ఆ అచ్చర ఆ ఉత్తరం అందుకుని చించింది.

చిత్తరంజన విలాసం,
4 ఏప్రిల్ 1932

ప్రియమైన శకుంతలకు—

ఈ ఉత్తరం ఎట్లా ప్రారంభించాలో నిజంగా నాకర్థం కాలేదు.

నీవు నన్ను సరిగ్గా అర్థం చేసుకోక...నీ చల్లని నల్లని కళ్లల్లో కెంపులు చేరుసుకూ నావైపు చూస్తే...మరణాన్ని శరణుపొందవలసే వస్తుంది.

నీవు మోహినీదేవతవలె ఒక్క చూపుతో నా హృదయాన్ని—ప్రాణాలను ఆకర్షించావు.

ప్రేమ సాక్షాత్తూ భగవత్స్వరూపం. దానిశక్తి అనంతం. దానికి ఏవీ అడ్డురావు. పవిత్రమైనప్రేమలో ఎవ్వరూ తప్పులు పట్టలేరు.

హృదయపూర్వకంగా ఒకరి నొకరం ప్రేమించుకుని, రెండు నీలిమబ్బుల్లాగ—నవ్వజంటవలె నీలాల నింగిపై తేలిపోవడం కన్న భాగ్యం ఏమిటి? నీవు మనస్ఫూర్తిగా ఒక్కపరి......

నీ,

రా జా రా వు.

సగంలోనే చదవడం పూర్తిచేసి...చివాలున సోఫాలోనుంచి లేచి—కవరుతో సహా ... కాదగినంత ఉండచేసి చిత్తుకాగితాల బుట్టవైపుగా విసరి, కిటికీలో నుంచి శూన్యంగా చూస్తూ—

"ఎవ రీ అనూచిత ప్రేమమూర్తి? ఎప్పుడూ క్లాసులో ఇతన్ని నిదానించి చూచినట్లైనా జ్ఞాపకంలేదే?

"మొగవాళ్లు ఎంత బుద్ధిహీనులు! పొరపాటున గోడలవైపు—దూలాలవైపు చూచినట్టు చూసినా ఆ మామూలు చూపులోగూడా 'తివిరి ఇసుమున తైలంబు తీసి'నట్టు ప్రేమనుతీసి ఉత్తరాలు రాస్తారుకాబోలు!

"అప్పటి అమాయిక శకుంతలను దొంగ రాజు ప్రేమను అభినయించి టోపీవేసినట్టు...పిచ్చివాడు... ఈ రాజారా వెవరో 20వ శతాబ్ది శకుంతలమీద ట్రయి చేస్తున్నాడు"

అని విరగబడి నవ్వుతూ సోఫాలో ఒరిగింది.

మంగ ట్రేలో పింగాణీ కాఫీ కెటిలూ, కప్పులూ తెచ్చి ఎదుటపెట్టి, శకుంతలను చూసి తెల్లబోయి నించుంది.

శకుంతల ఆగి గంభీరంగా—

"మంగా, నే వచ్చేసరికి నా టేబిలుమీద ఒక ఉత్తరం ఉంది. ఎట్లావచ్చింది ఇక్కడికి? నిజం చెప్పు—"

పాపం, మంగకు అంతా అయోమయంగా వుంది. నిజం చెప్పివేస్తే ఏంతప్పుగా పరిణమిస్తుందో? అబద్ధంగా నే నేమీ ఎరగనంటే ఇప్పుడే ఇక్కడనుంచి గెంటివేస్తారేమో—?

గొంతులో పడి పచ్చి వెలక్కాయలు పిసికినట్ల యింది.

"మాట్లాడవేం? నువ్వు దీనిసంగతి ఎరగవా?"

"అమ్మా, కోపం చెయ్యకండి. ఆ కాగితం మడత కూడని దని తెలిస్తే—తెచ్చి మీ బల్లమీద పెట్టను. ఈవేళ పొద్దున్న దొరలాంటి ఒకాయన మన 'గేటు గుమ్మం' దగ్గిర నాక్కనిపించి మంచిగా నన్ను పిల్చి 'ఇది మీ అమ్మాయిగారి కిచ్చెయ్యి—చాలా అవసరం' అని ఇచ్చి వెళ్లారు. ఈకాలపు చదువుకునేవారికి ఇల్లాంటి తప్పు లుండవు కాబో లనుకుని మీ బల్లమీద పెట్టా నమ్మా ... తెలివితక్కువదాన్ని — " నీళ్లు తిరిగే కళ్లను చాటుచేసుకోబోయింది.

అవమాన క్లిన్నమైన సావిత్రి హృదయవేద నను గ్రహించి, జాలిగా

"ఛా! నిన్నేమీ అనలేదుగా? ఈపైని ఎవ రిచ్చినా ఇట్లాంటివి పుచ్చుకోకు. ఏకాలపు చదువులైనా చదువుల్లో ఏముంది ... బుద్ధి సూటిగా వుంటే—?"

కాఫీకప్పు అందుకుని రెండుగుక్కలు తాగి మళ్లీ ఆలోచనలో పడింది.

మంగ బల్లలమీద వస్తువులను సర్దుతూ తన పనుల్లో నిమగ్న అయింది.

"ఎవ రీరాజా...రావు? మంగ చెప్పినట్టు సూటుతో వుంటాడా? ఓహో...ఈ వీధి చివ్వరిమేడ .. ప్లీడరు బలరామయ్యగారి మేనల్లుడు — సరే — తరచు ఆడపిల్లలకంటెకూడా శ్రద్ధగా టాయిలెట్ చేసకుని అందరికళ్లనూ ఆకర్షించాలని చూస్తూవుంటాడు ఔను, యువతులు తిరిగిచూడదగిన కోమలమూర్తే కాని—ఇంత దుర్బలహృదయుడా? నిజంగా ప్రేమారాధకుడైతే ఎంత నిదానిస్తాడు? మహాభక్తుడికి తాన భక్తుణ్ణనే తెలియదే...మహాకవికి తాను కవిననే జ్ఞాకం ఉండదే? తన ఉన్నతిని ఎదుటివారు గ్రహించి నప్పుడే దానికి స్థిరత్వం! గొప్పవారు గొప్పసాధన చేస్తారు—సిద్ధిపొందుతారు.

"ఈ క్షుద్రప్రేమికులు మా సిల్కుచీరలను,రిబ్బన జడలను చూసి భ్రమసి, ప్రేమలనీ విరహాలనీ—పెట్ట

లను చూసి, కృష్ణపక్షాల్లో కుంగి ప్రేమలు నేర్చుకుని—కంటిఎదటివారినీ ఇంటిఎదటివారినీ పీడిస్తారు.

"వీళ్లు—ప్రేమకోసం—కొన్నియేళ్లు తపించి ఉండగలరా? అగ్నిపరీక్షలకు ఓర్వగలరా? ఒకప్పుడు... అవసరమైతే—ఎట్టిత్యాగమైనా చెయ్యగలరా? పట్టిది.

"అదృష్టవశాత్తూ ఏ అమ్మాయిక కోమలి ఐనా వలలో పడితే—పీల్చివేసి 'ఏమిటో' నీసాలా మూలకు విసరి చక్కాపోతారు.

దుష్యంతు డేం చేశాడు? మధురవనదేవత శకుంతలను చల్లని మాలినీతీరాన — కుసుమితపాటల వృక్షచ్ఛాయల్లో—శెల్లించి, అనుభవించి, ఛీ—

"ఈ పురుషవంచకులకు ఈశకుంతల ఘాటైన పాఠం చెప్పాలంటే ఎట్లా?

"సరే — అట్లాగే చెయ్యాలి. సాహసం? — ఫర్వా లేదు.

ఉత్సాహ బలవన్నిశ్చయంతో లేచి

"మంగా, ఈ వేళ రాత్రి...మన మోచిత్రనాటకం చూడబోతున్నాం. నువ్వుకూడా నాతో వుండాలి. మూడోకంటివాళ్లకు తెలిస్తే—తల ఎగిరిపోతుందిసుమా!"

"మీ మాటకు ఎదురు చెప్పడం...ఎప్పుడేనా వుందా అమ్మా"

"షరే వ...ను...వు"

హుషారుగా లేచి శకుంతల మేడకిందికి వెళ్లింది.

2

వైట్ కలర్ పారిస్ సిల్కుచీర కొత్తఫక్కీలో తీర్చి కట్టుకొని, లేత ఊదారంగు బ్లౌజు తొడుక్కుని, నిగనిగలాడే నల్లనిజుట్టును వదులుగా—చెవులు కమ్ముకునేలాగు వాలుజడగా మలచి మెడమీదనుంచి వక్షస్థలం మీదకు విడచి, ఆననశ్రీకి 'హిమానీ' స్పర్శతో లావణ్యాదోహదాన్ని పచరించి, రాత్రి పదిగంటలకు తన ప్రసాధనం పూర్తిచేసి శకుంతల...డ్రెస్సింగ్ టేబిల్ వద్ద ఒకసారి తన అందాన్ని కొంటెకళ్లతో పరీక్షించి "బస్—మంగా, రెడీ" అంది.

మంగకు పట్టి గందరగోళంగా వుంది. ఈ మహాప్రస్థానం ఎంతవరకో, ఎందుకో సూచాయగా అడగడానికైనా దమ్ములు లేవు. సినిమాకా? వేళ దాటిపోయింది. ఇందాకా నాటకం అన్నమాట పట్టి తమాషాకు. ఊహుఁ—తెలియదు.

శకుంతల అప్పుడే మేడమెట్లు దిగిపోతోంది. గదితలుపులు దగ్గరగా లాగి మంగ ఆమెను అనుసరించింది.

మేడముందటి మాలతిబవరును దాటి, గేటును వెనక్కి నెట్టి, రోడ్డుమీదుగా చైత్రశుద్ధ చవితిమసక వెన్నెల్లో ఇద్దరూ ముందుకు నడుస్తున్నారు.

3

రెండు మలుపులు తిరిగి తిన్నగా వీథి చివర ప్లీడరు ---- గారి ఇంటిముందు హఠాత్తుగా ఆగి వీథిగదిలో వెలిగే దీపపుకాంతిని నిదానించి, మంగను గదికి చేరువగా—ఒక స్తంభంచాటున నుంచునేటట్టు సంజ్ఞచేసి, గంభీరంగా తలుపుదగ్గిరకు వెళ్లి మెల్లగా తలుపుమీద 'టాప్' చేసింది.

కొన్ని నిమిషాల్లో గదితలుపులు 'హల్లో-కమిన్' అంటూ మామూలుస్నేహితులెవరో అనుకుని విడుతూండగా శకుంతల లోపల ప్రవేశించింది.

గళ్లలుంగీ, చేతులులేని తెల్ల బనియనూ, పాంపియూతలనూనెసువాసనతో చిక్కులు చిక్కులుగా వేలాడే ఉంగరాలక్రాపూ, ఒకచేతిలో 'సిజరు' ధూమవర్తికసుగంధధూమం, రెండవచేత మర్నాడు పరీక్షకు కసరత్తుచేసే షేక్స్పియరునాటకం—తో కుసుమచుకుమారమూర్తి ... రాజారావు తన బంగారుకలల్లోని ప్రేయసి ఆకస్మికంగా ప్రత్యక్షంకావడం చూసి నిశ్చేష్టితుడై విస్తుపోయి, మంచి మాటలకోసం వెదుక్కుని, ఎట్టకేలకు—

"స్వర్గలోకపుదారి తప్పి...అప్సరస ఇట్లా నడచివచ్చిందా?"

" * * * * "

"ఉత్తరం చూసి...ఏమనుకుంటావో, నా పవిత్రప్రేమను అపార్థంచేసుకుని ఎలా అవమానిస్తావో అని మహా పరితపించాను."

" * * * * "

"నీకు మెత్తని అమృతహృదయం వుంది. గాఢానురాగాన్ని అర్థంచేసుకుని, ఉత్తమప్రేమకు స్వాగతం ఇచ్చి ఆదరించగలవని నాకు మొదటినుంచీ ధైర్యమే."

" * * * * "

"అదేమిటి—పలుకే బంగారం అయిపోయిందా? ఒక్కసారి ఆ కుర్చీలో కూచుని అనుగ్రహించరాదూ? రేపటి పేపరుకు నీవు ఎంతసేపు చదవాలి—రా! వీణ వాయించినట్టు కాస్సేపు హాయిగా మాటాడు."

ఇంతవరకు శకుంతల పొంగివచ్చే నవ్వును నల్లని కొంగుకళ్ల పుక్కిట బట్టి—

"ఇదేమిటి, రాజా, నన్నింతగా మన్నిస్తున్నావు? అచ్చర తోవతప్పి నలకూబరుడి చైత్రరథంలోకేగా వచ్చిపడింది?

"ఎన్నాళ్లో నా ప్రియుడికోసం కలలుగన్నాను! ఇంతవరకూ—ఈ పాపలోకంలో నన్నింతగా ప్రేమించినవారే కరవైపోయారు. ప్రేమపరమార్థం నీవంటి బుద్ధిమంతులకు తెలుస్తుందిగాని తదితర క్షుద్రులకు ఎట్లా తెలుస్తుంది?"

" * * * * "

"కొందరు మూర్ఖులు మా మెరుగులువారే యౌవనాన్ని చూసి, మా విలోలనేత్రాలకు తల్లకిందులై మమ్మల్ని తరింపచెయ్యడానికిమల్లె మోహించి అనేక విధాల పీడిస్తారు. నాకు తెలుసు, నువ్వు అట్లాంటివాడవు కాదు."

" * * * * "

"అవును: నీవంటి సర్వహృదయుడు ప్రేమకోసం ఎంతటి త్యాగమైనా చేస్తాడు—కదూ?"

" * * * * "

"నేను గాఢంగా ఆలోచించి—ఒక్కనిమిషం మాఇంట ఇక ఉండలేక ఇక్కడికి వచ్చేశాను. నిరీక్షించగా నిరీక్షించగా శిశిరలతానికుంజానికి వసంతమూర్తిలాగా నువ్వు దొరికావు. ఈవేళ నీఉత్తరం చూసి నా జన్మ ధన్యం అనుకున్నాను.

"అంతా నిశ్చయమైపోయింది—ఇంక తిరగను. నా కీచదువు, పరీక్షలు, మా అన్నయ్య, అతనిసంపద—ఏమీ అక్కర్లేదు. లే—క్షణం ఆలస్యంచెయ్యకు. నాది ఓమర్ ఖయ్యాంమతం, నాకు పాస్టు, ఫ్యూచరు లేదు; ఉన్నది ఒక్క ప్రెజెంటెన్స్.

"స్త్రీ హృదయం ఇవ్వడమేగాని తీసుకోడం ఎరగదు. రా—ఈరాత్రే ఏ దూరదేశాలకో వెళ్లిపోయి హాయిగా పావురాదంపతుల్లా విహరిస్తూ ధన్యజీవితాలను గడుపుదాం. అడ్డుచెప్పకు—"

తనప్రేమ ఇట్లా నడికిరేయిలో గొంతు పట్టుకుని ఉక్కిరిబిక్కిరి చేస్తుం దని రాజారావు ఎప్పుడూ అనుకోలేదు, పాపం!

అతనికి శకుంతలధోరణి ఏ ఉల్లోలకల్లోలసముద్రంలోకో తనను విసరివేస్తూన్నట్టు అనిపించింది. కళ్లు గిర్రున తిరిగాయి.

అతను ఊహించుకునే భవిష్యత్తంతా వికృత దృశ్యాలతో, తెరలుగా తనఎదుట వేలాడుతోంది—మామయ్య ఇంక తనగుమ్మం ఎక్కితే మాట దక్కదన్నాడు. అతని ఆశ్రయంవల్ల తనకు లాభించే బి. ఎ. డిగ్రీ, ఉద్యోగం—అన్నీ, రైల్లో కూచున్నప్పుడు చెట్లు వెనక్కి పరిగెత్తుకు పోయినట్టు, వెనక్కి పరుగెత్తుకు పోతున్నాయి. దేశాంతరాల్లో—స్వయంపోషక శక్తి లేక—ఈ సుకుమారితో...అన్నానికికూడా బాధపడి తిరుగుతున్నాడు. అంతా ఊహించి నవ్వుతున్నారు.. ప్రేమ—ఆదర్శాలు కథలపుస్తకాల్లో చదువుకోడానికి బాగుంటాయిగాని ప్రాక్టికల్ లైఫ్‌లో ఫెయిల్యూర్ అనుకున్నాడు. కుదేలయిపోయి—

"శకుంతలా! నిర్మలప్రేమ అంటే నీ కంతగా బోధపడినట్టు లేదు! బుద్ధిమంతురాలవు—ఊహించు. ప్రేమకు ఇంత తొట్రుపాటు పనికిరాదు. బహు నిదానించాలి, ఓపికపట్టాలి; తొందరపడి ఎట్టి నిర్ణయాలకూ రాకూడదు." ఏం తోచక ఖంగారుగా—లాలసగా అన్నాడు రాజా. శకుంతల మరింత బిగిసి—

"నే నిప్పు డేమీ ఆలోచించలేను. నే నింక ఆ నీరసపు టింటికి—శుష్కజీవితానికి వంచేసినా వెళ్లను. నా ప్రేమమూర్తిదగ్గరనే నే నుండిపోతాను"

రాజా...కు కర్తవ్యం తోచలేదు. మామయ్య ఇదేమైనా వింటే కొంప మునిగిపోతుంది.—తా నసలు చాలా తెలివితక్కువపని చేశా నని తాత్కాలికంగా అనుకోక తప్పిందికాదు. తెగించి అన్నాడు—

"శకుంతలా, నిన్ను బతిమాలుకుంటా: ఇప్పటికి వెళ్లిపో—వెళ్లు. దీనితో నా బ్రహ్మచర్యంతా ధ్వంసమై పోతుంది. క్షమించ మనడంకన్నా ఇప్పు డేమీ చెప్పలేను. న న్నింక హింసించకు—"

శకుంతల విజయగర్వంతో చటాలున విజృంభించి—

"రాజారావ్! ఇప్పటికేనా నీ దుర్బల హృదయం నీకు బోధపడిందా? మొగజాతిది ఎంత తేలిక బుద్ధో అర్థమయిందా? స్త్రీయౌవనవిలాసాలకు గుండె చెదిరి, ప్రేమ అనుకుని ఆత్మవంచన చేసుకుని ఏ అమాయికైనా దొరికితే ద్రోహంచేసి తమదారిని పోతారా? ఇకమీదనైనా బుద్ధిగా చదువుకుని బాగుపడు. ప్రేమను గూర్చి ఇప్పుడు నువ్వు నాకు చెప్పిన సూత్రాలను నువ్వు బాగా మననంచెయ్యి.

"ఇట్లా మనం తేలికబుద్ధులతో సంచరిస్తున్నాం గనకనే కాలేజీల గౌరవం గంగలో కలిసింది. అజ్ఞానులూ — సుజ్ఞానులూ ఇందుకే కో ఎడ్యుకేషన్ అంటే చులకనగా మాట్లాడుతారు.

"ఇకమీదనైనా నావలె ఎవ్వరి మనశ్శాంతినీ చెడగొట్టకు. ఇట్లా అన్నందుకు మనస్సులో ఏమీ కించపడకు. ఇట్లా జరిగినట్లే జ్ఞాపకం ఉంచుకోకుండా— ఈ పైని ఆప్తస్నేహితులుగా వుందాం. గుడ్ నైట్!"

జయప్రదంగా, పాంచజన్యంఊదిన ఉత్సాహంతో, నవ్వుతూ శకుంతల మంగతో ... ... గబగబ ఇంటిమార్గం పట్టింది.



చెన్నపురికి ఆదిపురుషులు ఆంధ్రులే

మన చెన్నపట్టణము

ఆదిలో

ఆంధ్రదేశములోనిది:

ఆంధ్రనాయకుల ఏలుబడిలోనిది:

ఆంధ్రసామ్రాజ్యాధిపత్యమునకు లోబడినది:

ఆంగ్లేయులకు ఆస్కారమిచ్చినవారు ఆంధ్రులు.

ఈ పట్టణముమీది 'సర్వహక్కులు'ను అక్షరాలా ఆంధ్రులవే యనుటకు ప్రాచీనప్రబంధముల ఆధారముతో నిరూపితములైన ఈ ఉపపత్తులను అవధరింపుడు.

శ్రీ

శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి

చెన్నపురి, లేక మద్రాసు

మన రాజధానికి చెన్నపట్టణ మనియు, మద్రాసు అనియు రెండుపేర్లు ఉన్నవి. తెలుగువారు చెన్నపట్టణ మని వాడెదరు. తమిళులు 'చెన్నై', 'చెన్ననగరం' అని వాడెదరు. సాధారణముగా దేశీయవర్తకులు మొదలగువారు మద్రాసు అని వాడరు. మద్రాసు అనునది రాజవ్యవహారాదులలోను, ఆంగ్లసంబంధవ్యాపారములలోను ప్రచారము నొందినది; రాజకీయ ధోరణిని ప్రచారమునకు వచ్చి నిలిచియున్నది. ఆ పేర్లు వచ్చుటకు కారణములు ముందు తెలియును.

ఈ రాజధానిలో ఆంధ్రులు, అఱవలు (తమిళులు), కర్ణాటకులు, మలయాళీలు, మహారాష్ట్రులు, ఉత్కలులు, ఘూర్జీవారు, ఇంకను భారతీయశాఖలలో నచేకులును, ఆంగ్లేయులు—వారివారి యవాంతరశాఖలలో వివిధజాతులవారును, వివిధ భాషలను మాటలాడువారును నివసించుచున్నారు.

గ్రామములోఁ గాని, పట్టణములోఁ గాని, దేశములోఁ గాని ఖండములోఁ గాని తమరు నివసించుటచేతను, అక్కడ తాము పుట్టుటచేతను, తమపూర్వు లచట నివసించుటచేతను 'ఇది మాది, ఇవి మావి' అనెడి యభిమానము వారివారి కాయా గ్రామాదులయందుఁ గలుగుట మానవసహజము. అది లేనివాఁడు అభిమానశూన్యుఁడే. దురభిమానము గూడదుగాని న్యాయ్యమైన యభిమాన ముండుట యలంకారమే.

నివాసము, అభిజనము

తాను నివసించినది 'నివాస' మనియు, తనపూర్వులు నివసించినది 'అభిజన' మనియు మనవారు విభాగ మేర్పఱచిరి. ప్రకృతము చెన్నపురిలో నున్నవా రందఱకును ఇది నివాసమే. ఇక్కడ జన్మించినవారికి 'జన్మహక్కు' ఉండితీరును. వారివారికుటుంబములలోని పూర్వులు ఇక్కడనే నివసించినయెడల వారికి ఇది అభిజనము (అనఁగా వారిపూర్వు లున్నది).

వారివారి మాతృభాషనుబట్టియో, దేశవాసమును బట్టియో యొక్కొక్కవర్గమువారిని ఒక్కొక్కకుటుంబముగా భావింతము. అప్పుడు ఆంధ్రులు అందఱును ఒకకుటుంబము, తమిళులు అందఱును ఒకకుటుంబము. అట్లే కర్ణాటకాదులు. అట్టి యేర్పాటు గావించుకొనినపుడు, చెన్నపురి యేకుటుంబమువారి పూర్వులది అను విషయమును పరిశోధించి దీనిని ఆంధ్రకుటుంబమువారి పూర్వులది అని స్పష్టముగా తేలుచున్నది. అది ఆంధ్రులును, ఆంధ్రేతరులునుగూడ నిష్పక్షపాతబుద్ధితో పరిశీలింపవలసిన విషయములలో ముఖ్యమైనది.

ఆ విషయమును ఉద్ఘోషించుచున్న తెనుఁగుప్రబంధములు చూతము. ఆంధ్రభోజుఁడయిన శ్రీ కృష్ణదేవరాయలు విజయనగరమున సామ్రాజ్యపీఠము నలంకరించి పాలించునపుడు తాను జయించిన దేశములలో ఒక్కొక్కభాగమునకు ఒక్కొక్కనాయకుని పాలనముచేయ నియోగించి సామ్రాజ్యము ఏలుచుండెడివాఁడు.

ఆ వరుసలో చెన్నమనాయకుఁడు పెద్దనాయకుఁడుగా నుండి శత్రువులను నిర్మూలము గావించి సామ్రాజ్యశాసనప్రకారము

చెన్నపురి అను పే రేల వచ్చెను?

ప్రవర్తించుచుండెడివాఁడు. ఆతని కుమారులలో వేంకటనాయకుఁడు విజయనగరసామ్రాజ్యాధికారి యగు పెద్దవేంకటరాయల యాజ్ఞాప్రకారము నాయకరాజు లందఱుపైని అధికారిగా నుండెడివాఁడు. చెన్నమనాయకుని కొడుకులలో నొకఁ డగు అయ్యపనాయకుఁడు ఈ సముద్రప్రాంతమునకు ప్రభు వయియుండెడివాఁడు. చెన్నప్పనాయకుని కుమారులలో మరొకఁడు అంకనాయకుఁడు రాజకార్యనిర్వాహకుఁడే కాక గొప్పకవీశ్వరుఁడును అయ్యెను. ఆతఁడు తెనుఁగున 'ఉషాపరిణయము' అను ప్రబంధము రచించెను. వారి కుటుంబమున వందలును మహాయోధులు, మహావిద్యావంతులు, మహా కవీశ్వరులు నయి యుండెడివారు. వారికి దామరలవారు అని ప్రసిద్ధి. అదే యింటిపేరు. వారు వెలుగోటివారితో సంబంధబాంధవ్యములుగల వెలమకులభూషణులు.

దామర్ల వంశము

అంకనాయకుఁడు రచించిన ఉషాపరిణయమునందును, చెన్నమనాయకుని తమ్ముఁడగు వేంగళభూపతి రచించిన బహులాశ్వ చరిత్రయందును వారివంశము వర్ణింపఁబడినది. దానిని వానినుండి గ్రహింతము. వారికి మూలపురుషుఁడు శ్రీపాదవిభుఁడు. ఆతనికుమారుఁడు అబ్బరాజు. ఆయనకొడుకు ధర్మవిభుఁడు. ఆయన వలిపేటి తిమ్మరాజుకూఁతురగు వేంగళమ్మను పెండ్లాడి ఆమెయందు వరదరాజు, వేంగళరాజు, తిమ్మరాజు, కోనరాజు అను నలుగురు పుత్త్రులఁ బడసెను. వారిలోని వేంగళ (వేంకట) రాజునకు అయ్యమ్మయందు చెన్నరాజు (ఇతఁడే మన చెన్నప్ప), శేషనయును, సర్వమ్మయందు వేంగళరాజును (ఇతఁడే బహులాశ్వచరిత్ర రచయిత), వరదరాజును, శేషమ్మయందు కృష్ణరాజును పుట్టిరి. వారిలో చెన్నప్పనాయకునకు కృష్ణమ్మయందు వేంకటరాజును, లింగమ్మయందు అయ్యపరాజును, తిమ్మాంబయందు అంకరాజును (ఇతఁడే ఉషాపరిణయ కృతికర్త), తిమ్మరాజును, వేంగళమ్మయందు చినవేంకటరాజును ఉద్భవించిరి. వీరిలో వేంకటనాయకుఁడు (దామర్ల వేంకటనాయకుఁడు) అప్పటి విజయనగర సామ్రాజ్యాధిపతియగు పెద్ద వేంకటపతిరాయల యాజ్ఞచొప్పన నాయకరాజు లందఱిలోను ప్రధానుఁడుగా నుండెడివాఁడు.

ఉషాపరిణయమున[1] కవి వంశవర్ణనలో అంకభూపాలుఁడు వేంకటనాయకుని శౌర్యధైర్యాదులు వర్ణించి యిట్లు వచించె:

"ఇహి నవ్వేంకటధారుణీరమణుఁ డా
రా తండ్రిపే రొప్పఁగా
మహిఁ జెన్నంబుధి చెన్నసాగరము ధ
ర్మస్ఫూర్తిఁ గట్టించె స
త్యహరిశ్చంద్రుడు తేజుఁ గృష్ణఘనవా
హాధీశు నావాలి బల్
విహిసే దిం (డిం?) తిరమాథుఁ ద్రుంచి కృతిలీ
లం గాంచె రామోన్నతిన్"

దామర్ల వేంకటనాయకుఁడు తంజారాజును త్రుంచినవిషయమును, తనతండ్రియగు చెన్నమనాయకునిపేర చెన్నసాగరము కట్టించిన విషయమును ముఖ్యములు. ఈ చెన్నసాగరము నార్త్ ఆర్కాటు డిస్ట్రిక్టులో ఉన్న తటాకమునకు పేరు. కావున పెద్దతటాకమొకటి చెన్నప్పపేర వేంకటనాయకుఁడు కట్టించెనని తేలినది.

చెన్నపురి కట్టడము

ఈ చెన్నసాగరము ఊరిపేరు అని దొరతనమువారి అముద్రితగ్రంథభాండాగారమందలి పుస్తకములపట్టికలో ఉషాపరిణయమునుగురించి వ్రాసినదానిలో కలదు. కట్టించెను పదమును బట్టియు, అంబాసముద్రము మొదలగు గ్రామనామము లుండుటనుబట్టియు అట్లు చెప్పియుందురు గాని చెన్నసాగరమను పేర ఒకతటాకము ఒకచోట నున్నదని తెలిసినపుడు గ్రామనామ మనుట కవకాశము లేదు. వోపావాడులతో నున్న తటాకమును వాపి మొదలగువానివలెనే కట్టించె నని చెప్పఁదగును. దామర్ల వేంకటరాజు తండ్రిపేర చెన్నసాగరము కట్టించినట్లే అయ్యనృపతి తనతండ్రిపేర చెన్నపట్టణమును కట్టించెను. ఆవిషయము చూతము—

"అయ్యధరాధినాయకుఁ డ
హార్పతి తేజుఁడు మీఱఁ జంద్రుతో
వియ్యముఁ బొందఁజాలు సుఖ
బింబము దాపసుబంబుఁ జెందుచున్
దొయ్యలు లెల్లఁ జూచి పరి
తోషము గాంచుచు మానసంబులన్
దియ్యనివిల్లు డాఁచి జగ
తిం జరియించు మనోజుఁడో యనన్."

"ప్రళయకావేరి మైలాపురంబు గల్గి
తీరమునఁ జోర వది మట్టుపెట్టఁ దండ్రి
పేరఁ దనర్ధర్మభూమిని బృహువిభూతి
నలవరిచెఁ జెన్నపట్టణ మయ్యనృపతి."

అయ్యపనాయకుఁడు తనతండ్రిపేర గొప్పసంపదతో చెన్నపట్టణము కట్టించినాఁడు. దాని పరిణామముగా ప్రళయకావేరియు,

---

1. ఉషాపరిణయము అముద్రితము; దొరతనమువారి అముద్రిత గ్రంథభాండాగారమున నున్నది.

మైలాపురమును సంపదవిషయమై కౌర్యముతో పోరాడుచుండుట మట్టుపెట్టఁబడినది; అనఁగా అడఁచివేయఁబడినది. మట్టుపెట్టన్ = అణఁచివేయునట్లు అని యర్థము.

ఈ సందర్భము తెలిసికొనుటకై అప్పటి దేశస్థితి కొంత తెలిసికొనవలసియున్నది. అదేమనఁగా—

మన చెన్నపట్టణము కట్టుట 1630 ప్రాంతమున జరిగియుండును. అప్పటికే మన దేశములోనికి ఈస్టు ఇండియాకంపెనీవారు వర్తకమునకై వచ్చియుండిరి. పోర్చుగీసులు ఇతరులకంటె ముందే మైలాపురము చేరి యిది వారి వర్తకమునకు అనువైన ప్రదేశమగుటచేత చాల ద్రవ్యము సంపాదించి మైలాపురమున స్థిరవసతి కల్పించుకొనిరి. అప్పటికి డచ్చివారు సూరతులో నివసించి లాభము లేక మసూలిపటము, ఆర్మగాన్ (దుగ్గాన్పటము)చేరిరి. అంతకంటె దక్షిణభాగము వారివ్యాపారమునకు లాభకరమని యెంచి పులికాటుకు వచ్చిరి. ఈ ప్రాంతము ప్రత్తిపంటకు, బట్టలనేతకు, రంగులవేతకు కావలసిన సామగ్రి లభించు దేశము గావున వారికి చాల లాభకరము. పులికాటులో నుండి అక్కడకు ఇరువదిరెండుమైళ్లదూరమున దక్షిణభాగమున నున్న మైలాపురమునకు వచ్చి తమకంటె ముందుగానే ఎక్కువలాభము సంపాదించిన పోర్చుగీసువారిపైని అసహనము చెంది అప్పుడప్పుడు ఏదోవంకతో పోరాడుచుండెడివారు. అప్పుడు ఇక్కడ కొంత దిబ్బ, కొన్ని కొంపలు ఉన్నను అరణ్యప్రాయముగా నుండియుండును. ఈ ప్రాంతమునకు ఏలికయైన అయ్యపరాజు తన తండ్రిపేర గొప్పసంపత్తుతో పట్టణము కట్టఁగా అటు పోర్చుగీసు వారికిఁగాని, యిటు డచ్చివారికిఁగాని ఆవైపునకు 'రావడము' అంటే బెదురుపుట్టినది. దానివలన ఆ పోరును మట్టుపెట్టినట్లయినది.

ప్రళయకావేరి అనఁగా పులికాట్ (ఇది చెన్నపురికి 22మైళ్లలో ఉత్తరమున నున్నది. పయిపద్యములో ప్రళయకావేరి-అనఁగా పులికాటులో ఉన్నవారు, అనఁగా డచ్చివారు అని అర్థము. (ప్రళయకావేరి, పులికాటు అనుమాటలను గురించి యొకవ్యాసము వ్రాయఁదగినవిషయము ఉన్నది. ఇప్పుడేల ?) మైలాపురము-అనఁగా మైలాపురములో ఉన్నవారు, పోర్చుగీసులు అని యర్థము. ఇది లక్షణ. 'మంచాః క్రోశంతి' అన్నారు మన లాక్షణికులు. మంచములు ఏడ్చుచున్నవి 'అంటే' మంచములమీఁద నున్నవారు అని అర్థము చెప్పిరి. ఇక్కడను అట్లే చెప్పుకొనవలసియున్నది.

పోర్చుగీసువారును, డచ్చివారును పోరుచుండఁగా అది మట్టుపెట్టన్ = మట్టుపెట్టుటకై, అంటే "మట్టుపెట్టడముకోసము" తండ్రిపేర పట్టణము కట్టించెను. అనఁగా-వారిద్దఱును పోరుచుండెడివారు-దానివలన తమకు (ప్రభుత్వము చేయుచున్న అయ్యపరాజుకు) బాధ కలుగుచుండెడిది- అది! ఆఁపుటకై ఈ పట్టణము తండ్రిపేర అయ్యనృపతి కట్టించెను అని అర్థము చెప్పికొని, ఈ చెన్నపట్టణము కట్టించుటలో ముఖ్యోద్దేశ మేమంటే డచ్చివారును, పోర్చుగీసువారును పోరుచుండెడి పోరు ఆఁపుట అని కొందఱు తేల్చుచున్నారు.

అయ్యనృపతి యుద్దేశము, కవియుద్దేశమున్ను

మహారాజ సమానుఁడయిన చెన్నరాజా పేర సర్వనాయకప్రధానుఁ డయిన దామర్ల వేంకటనాయకుని సర్వాధికారము క్రింద సామంతరాజయి ఈ ప్రాంతమునకు ఏలికయయిన అయ్యపరాజు, వర్తకమునకు వచ్చిన డచ్చివారును, పోర్చుగీసువారును పోట్లాడుచుండ నపుడు ఆబాధ తొలఁగించుకొనుటకై తండ్రిపేర గొప్ప వైశ్వర్యముతో పట్టణము కట్టినాఁడు అని కవి చెప్పఁదలఁచెనా? అప్పుడు వెంకటనాయకుఁడు ఏ యుద్దేశముతో చెన్నసాగరము కట్టినాఁ డందురు? తమతండ్రిపేరు శాశ్వతముగా లోకమున విలసిల్లఁజేయునుద్దేశముతో అయ్యనృపతి తనతండ్రిపేర గొప్ప సంపద నుపయోగించి పట్టణము కట్టుకొనఁగా అంతకు మునుపటివలె వారికి వారికి పోరాటము జరుగుటకు వీలులేక, ఆపోరు అడఁగిపోయిన దని తాత్కాలికస్థితి చూపుట కవియుద్దేశముగాని వారి పోరాటములవలనఁ గలుగు బాధలు మాన్పుకొను నుద్దేశముతో తండ్రిపేర పట్టణము కట్టినాఁ డని చెప్పుట కవియుద్దేశము కాదని తోఁచును. ఒకవేళ అట్లు చెప్పినను, ఆతనితండ్రిపేర ఏదో పట్టణము కట్టినపుడు వారిపోరు మట్టుపెట్టఁబడునా ? వారి ప్రభావము అట్టిదే యయి, అంతమాత్రముచేతనే మట్టుపెట్టఁబడునపుడు తండ్రిపేర ఊరుకట్టకుండఁగా ఆనాయకులు మరొకవిధమున వారిని ఆఁపఁజాలరా? కావున ఆయుద్దేశము కల్పించుట సరియైనదికాదు. ఆ మట్టుపెట్టుట తాత్కాలిక సందర్భమునుబట్టి సంభవించిన పరిణామమనుట యుచితము. ఇంతకును ఆపద్యపాదమున 'అది' అనునది అంత సందర్భముగానున్నట్లు తోఁచుటలేదు. ప్రత్యంతరము లభించు భాగ్య మబ్బినయెడల చాల మంచిది. యత్నింతము. ఇదైనను లభించి నందులకు మనము ధన్యుల మనుకొనవలెను. ఇవన్నియు కవుల పిచ్చివ్రాఁత లని 'హంబగ్ కాకి' అన్నట్లు దీనిని చరిత్రకపరాయణులు కొట్టివేయవలసినదే కాని యీస్టు ఇండియా కంపెనీవారి ధర్మమా అని, అప్పటి వ్యాపార వ్యవహారాదులను వారినిమిత్తమై వ్రాసియుంచుకొన్నను యథార్థస్థితిని వారి వ్యవహారపత్రములలో నిలిపియుంచిరి. వానిలోఁ గొన్నివ్రాఁతలు పైని చెప్పిన చెన్నపురీనిర్మాణవిషయమును ధ్రువపఱచుచున్నవి గావున మనవారు 'హంబగ్', పొమ్మనుటకు అవకాశము లేకపోయినది.

ఏది యెట్లున్నను అయ్యనృపతి తనతండ్రిపేర చెన్నపట్టణము కట్టించె ననుట నిర్వివాదమేకదా. నాయకప్రధానుఁడగు దామర్ల వేంకటపతి చెన్నసాగరము కట్టించి తండ్రిపేరు శాశ్వతము గావించెను. అయ్యనృపతి తండ్రిపేర చెన్నపట్టణము నిర్మించి తండ్రి

కీర్తిని శాశ్వతతరము చేసెను. అంకభూపాలుఁడు తనతండ్రికీర్తిని తనయన్నలయొకన్నను గూడ శాశ్వతబ్రహ్మకల్పముగా నుండునట్లు చేయుటకై ప్రబంధము రచించి తమవంశవర్ణనమున ఆ విషయములను వక్కాణించినాఁడు. అంకభూపాలుని గ్రంథమే లేనిచో ఈ విషయము మనకుఁ దెలియ నవకాశము గలుగదుగదా? చెన్నసాగరము, చెన్నపట్టణము అను పేర్లు పేర్లేకాక తటాకమును పట్టణమును ఉన్నను వీనిలో పేరనుకొనవలసియుండును. అంకనృపతిరచన వలన చెన్నప్ప, వెంకటరాజు, అయ్యపరాజు గూడ ధన్యులు. వారియందుఁ కంటె ఆంధ్రజాతి ధన్యమైనది. అతనియెడలఁ గృతజ్ఞమై యుండవలెను. అందులకే మనవారు ప్రబంధము సప్తసంతానములలో శ్రేష్ఠమైన దన్నారు.

చెన్నప్ప సామాన్యుఁడా? అతనినిగురించి ఉదాహరించియున చెప్పినదానినిబట్టి యాతని శౌర్యధైర్యదానాదులు స్పష్టమగును. మఱియు చెన్నప్పనాయకుని తమ్ముఁడగు వేంగళరాజు రచించిన బహుళాశ్వచరిత్రపీఠికలో రచించిన చెన్నప్పవర్ణనము అత్యద్భుతము; కేవలము అతిశయోక్త్యాదులు లేకుండఁగ జరిగిన విజయాదివిషయములను ఉద్ఘోషించుచున్నది.

బహుళాశ్వచరిత్ర పీఠిక చూచునది:

చెన్నప్పవర్ణన

"సీ. తనభుజాభుజగప్రతాపానలమునకుఁ
బ్రత్యర్థికీర్తి పారదముగాఁగ
దన ధాటికారటత్పటహాగ్ర కరాతి
పార్థివావలి హంసపటలిగాఁగ
....
వఱలు దామర్లవంశపావనచరిత్రుఁ
డాహవకిరీటి యర్థిదైన్యాంధతమస
భాస్కరుఁడు శోభమానయశస్కరుండు
చెన్నభూపాలుఁ డరిరాజసన్నుతుండు."

"ఘోరాజిం దనచేతఁ దోలి విమతక్షోణీతలాధీశులన్
నారాజం దెగటార్చి వీరభటసన్నాహంబుతోఁ జేరునా
నారీజాగజముఖ్యము న్నఱకి నానావస్తువుల్ గొన్న యా
నారీజాలమనోజు దామరల చెన్నక్ష్మాపు వెన్నుందునన్."

సీ. "మునుమున్న యేరాజు మున్నలిబెళ్లను
వేలూరిలింగభూవిభునిఁ గొట్టెఁ
బంచపన్నియడాలు పట్టించె నేరాజు
పరవీరభద్రేభపటలి దెచ్చి
శుక్రవారమునాఁడె చొరఁబాఱి యేరాజు
పాండేని బలముల భంగపఱిచె
ధీరతఁ గూడలూరిలో నేరాజు
శాత్రవబలముల సంహరించె
వరుఁడు సామ్రాజ్యుఁడే దామర్ల నాయ
కలశవారాశిపూర్ణిమాకాశశాంకుఁ
డనఘుఁ గడికోటమల్లశుభాంకయుతుఁడు
వేంకటేంద్రుని చెన్నభూవిభువరుండు."

మహాయోద్ధ, మహారాజు, మహారసికుఁడు, మహానుభావుఁడును అగు మన చెన్నమనాయకుని పేరఁ గట్టినది మన చెన్నపట్టణము. ఆంధ్రు లయిననేమి ఆంధ్రేతరు లయిన నేమి అందఱును అట్టివాని పేరఁ గట్టిన పట్టణమున నుండు భాగ్యమబ్బినందుకు ఆనందింపవలసినదే. అయ్యప్ప, అహా, ఎట్టిచోటు వెదకినాఁడు! సముద్రతీరము. ఏమిటీదిసుఖము! ధనవంతులకు, దరిద్రులకుఁగూడ హాయిగదా!!

చెన్నపురి పూర్వవృత్తము, మద్రాసు

ఇది మన చెన్నపురిపుట్టువు. ఇంక దీని పూర్వోత్తరములను పరిశీలింతము. దీని పుట్టువునకుఁ బూర్వమే ఇదస్థలమునకో, దీనికి కొంచెము ఈవలనో ఆవలనో చిన్న యూరు ఉండియుండును. అది మొట్టమొదట పెద్ద పట్టణమయి తర్వాత క్షీణదశకు వచ్చియుండును. దానిని ఆ పేరనే పట్టణమని వాడుట సహజము. పూర్వము సర్వప్రసిద్ధి పొందిన వేంగీపురమును– నేఁడు దిబ్బలైనను– వేంగీపురము అనియే వాడుచున్నారుకదా! ప్రకృతస్థలము పట్టణముగాను, నివాసార్హముగాను ఉండినయెడల పోర్చుగీసువారు అక్కడనే నివసింపఁ బ్రయత్నించియుందురు. మైలాపురమువలె సదుపాయముగా నది కన్పడియుండదు. ఆస్థలమును పోర్చుగీసులు, డచ్చివారు, ఇంగ్లీషువారు వారివారి రికార్డులలో మొట్టమొదట మద్రాస్పటము, మదరాస్పటము, మద్దరాసపటము, మదిరాసపటము, మద్రాస్పటము మొదలగు పదములతో వాడియుండిరి. వ్యవహారములో ఏకరూపమునుంచుటకై వారదే వాడుచుండఁగా వాడుచుండఁగా చివరకు మద్రాస్ అయినది. తర్వాత వచ్చిన చెన్నపట్టము అను పేరు వారు వాడలేదు. దానిమూలమును తెలిసికొనుటకు యత్నించినను అది మొట్టమొదట వ్రాసినవ్రాతలలో మదరాస్స, మద్దరాస మొదలగు రూపములు కనఁబడుటచేత మాదిరాజ, లేక మాదరాజ అనుపదములు దానికి మూలపదములు కానోపు నని యూహింపవలసియున్నది. మాదిరాజు పేరనో, మాదరాజు పేరనో ఎప్పుడో కట్టిన పట్టణమయియుండవచ్చును. దానివిషయము ఇంకను పరిశోధింపవలెను. దానికి సాధనములు దొరకినపుడుగాని నిర్ణయింప శక్యముగాదు. ఏమయినను అది యాంధ్రరాజుల పరిపాలనలోని దేశమనుట తప్పదుగదా! ఇంగ్లీషువారికి కవులిచ్చునప్పటికి విజయనగరసామ్రాజ్యమున ఆంధ్రనాయకులలో దామర్ల వేంకటపతిపాలనయందు అయ్యనృపతి యేలుబడిలో నున్నదనుట నిస్సందేహము. ఇది యే చోడరాజుల కాలముననో నెలకొనియుండును. చెప్పఁజాలము. విశ్వసనీ

దర్శనము, ఆనందరంగరాయచంపువు, సర్వదేవతావిలాసము అను సంస్కృత గ్రంథములలోను, ఉషాపరిణయము, చెన్నపురీవిలాసము అను తెలుగుగ్రంథములలోను చెన్నపురిప్రశంస గలదు. మద్రాసు అనుపేరు గ్రంథములలోఁ గానరాదు. ద్వీపాంతరస్థులగు ఆంగ్లేయుల వ్యవహారమున నిలిచి బ్రిటిషురాజ్యముతోపాటు వ్యాపకమయి స్థిరత్వమును గాంచినది. వారికి ఎన్ని దేశములతోనో వ్యాపారముండును. మొదట వాడిన పేరు మార్చుటకు ఎంతెంతో వ్యవహారము జరుగవలయును. అందుచేత వారికి మార్చ వీలు గలిగియుండదు.

కొందరు పండితులు మద్రపురి అని వాడుదురు. అది నిఘంటువులలోకిఁగూడ నెక్కి మద్రులపట్టణము అనుఅర్థముతో కనఁబడుచున్నది. మద్రు లెక్కడివారు? మన దేశముతో వారికి సంబంధ మేమి? అది చింత్యము. అది మద్రాసుపట్టణమునకు గీర్వాణీకరణము కాఁబోలు. మరి కొన్ని వ్యుత్పత్తులు కొందరు సూచించిరి గాని అవి దేశకాలభేదదోషగ్రస్తము లగుటచేత పొసఁగవు. ఏమయినను చెన్నపురి, మద్రాసులు పర్యాయపదములవలె నొకపేరును తెలుపుచున్న వనుటకు సందేహము లేదు. ఇది చెన్నపురి పూర్వ వృత్తము. ఇంక ఉత్తరవృత్తము చూతము.

ఇంగ్లీషువారి ప్రవేశము

చెన్నపురి కట్టిన కాలదికాలములోనే ఇంగ్లీషువారి ఏజెంటు ఫ్రాన్సిస్ డే విజయనగరసామ్రాజ్యాధిపతి యయిన పెద్దవేంకటపతి రాయల క్రింద ప్రధాననాయకుఁ డయిన దామర్ల వేంకటనాయకునివలన చెన్నపట్టణమున వర్తకము చేసికొనుటకును, సంరక్షణార్థము కోట యొకటి కట్టుకొనుటకును కొన్ని షరతులతో రెండుసంవత్సరములకు కౌలొకటి పొందెను. ఆ పెద్దవేంకటపతి 1642 లో మృతి నొందుటచేత అతని స్థానమున శ్రీరంగరాయ లభిషిక్తుఁ డయ్యెను. అతఁడు విజయనగర సామ్రాజ్యమును పూర్వప్రభౌన్నత్యమునకుఁ దీసికొనిరాఁదలఁచి, స్వయముగా వ్యవహారములు చూచునపుడు దామర్ల వేంకటనాయకుఁడు గోల్కొండనవాబులతో కలసి తనకు ద్రోహము చేయుచున్నట్లు గ్రహించి వానిని అధికారమునుండి తొలఁగించెను. పులికాటు, తిరుపతిప్రాంతములవఱకు వచ్చిన గోలకొండసేనలను వెనుకకుఁ ద్రుమ్మఁగొట్టెను. అప్పుడు ఆ ఇంగ్లీషువారి యేజెంట్లు శ్రీరంగ రాయలవలన క్రొత్తకౌలు సంపాదించుట మంచి దని యెంచిరి. అంతకుముందు కౌలిచ్చిన దామర్ల వేంకటనాయకుఁడు పదభ్రష్టుఁ డయినాఁడు. అతనిపైని అధికారియగు పెద్ద వేంకటపతిరాయలు మృతిఁజెందినాఁడు. శ్రీరంగనాయకులు పొమ్మన్నచో వారికి గతి యేమున్నది? వారు కొందరు కలసి శ్రీరంగనాయకుని దర్శనమునకుఁబోయి క్రొత్తకౌలు సంపాదించిరి. దానివలన వారికిఁ గావలసిన సదుపాయము లన్నియు సంపాదితము లయినవి.

ఇంగ్లీషువారి పరిపాలనలో చెన్నపురిని ఉన్న రాజుల స్థితి

శ్రీరంగరాయలు ముప్పదిసంవత్సరములు రాజ్యము చేసెను. విజయనగరసామ్రాజ్యమును పూర్వప్రభౌన్నత్యమునకు తీసికొనిరావలయు నని యత్నించి కొంత సాధించెను. కాని చిట్టచివరకు రాజ్య మన్యహస్తగత మయ్యె నని తెలియుచున్నది. మనపురము క్రమముగా ఆంగ్లేయులపాలనకు వచ్చినది. సర్వదేవతావిలాస మను సంస్కృత చంపువులో చెన్నపురీవర్ణనము గలదు. దానిలో "శ్వేతముఖపాలితా స్వశ్వేతముఖపాలితా ... చెన్నపురీ" అని కలదు. ఆ విరోధాభాసమునకు సమాధానము చెప్పుటకు ఇట్లు సమర్థింపవలెను: "శ్వేతముఖులచేతను పాలితమైనను శ్వేతముఖేతరుల పాలనములోనిది." మన చెన్నపట్టణము మనరాజుల యాధిపత్యమున నున్నను పట్టణమున దొంగతనములు, దుండగములు, హత్యలు మొదలగునవి జరుగకుండఁగ కాపాడుటకును, తప్పు చేసినవారిని శిక్షించుటకును అధికారము శ్వేతముఖులు ఆరాజులవలన పొందియున్నారు. దాని ప్రకారము పాలించుచుండువారు కావున శ్వేతముఖపాలిత మయినది. శ్వేతముఖపాలితమయినను అశ్వేతముఖ పాలిత మయినది (అనఁగా రాజాధిపత్యము శ్వేతముఖేతరులది) అను భావము పొసఁగుచున్నది. ఆ గ్రంథమందే రంగరాయలు వేదాచలనాయకుఁడు, కళింగమహారాజు మొదలగువారితో చెన్నపురమున సర్వాధికారము చేయుచు ఇచ్చటనుండి సేనలతో చిదంబరాది క్షేత్రములకు పోయివచ్చుచుండినట్లును, ఇక్కడ ఆంగ్లేయులతో సరసపల్లాపములతోఁ గాలక్షేపము చేయుచుండినట్లును, వారివారి మహాభోగభాగ్యవైభవముతో నాటకప్రదర్శనవిద్వత్కవితాదివినోదములతో నుండినట్లును చెప్పఁబడినది. అది చంపు వయినను గ్రంథమంతయు నాటకరూపమునఁ గలదు. అది అసంపూర్తిగా నున్నది. మరొకప్రతి లభించినతోడనే దానిని లోకమునఁ బ్రకటింపయత్నము జరుగుచున్నది. ఆ రంగరాయలు ఈ రంగరాయలు ఏకపురుషుఁ డనునో కాఁడో ప్రకృతము చెప్ప నవకాశము లేదు. ఆంగ్ల పరిపాలనకు వచ్చినతర్వాతఁగూడ ఆంధ్రప్రభువు లెందఱో ఈ చెన్నపురిలో మహావైభవముతో విలసిల్లిరని చెప్పుటకు సంశయము లేకుండఁగ నాగ్రంథ ముపయోగపడును.

ఇంగ్లీషువారికి ఆంధ్రులు తోడ్పడుట

విజయనగరరాజుల తర్వాతను దేశము గోలకొండ నవాబుల యధీన మయినపుడు ఆంగ్లేయులు వారివలనను పట్టా సంపాదించిరి. అప్పుడుగూడ అక్కన్నమాదన్నల ప్రధానిత్వము. వారి మేనల్లుఁడు పొదిలి లింగన్న పూనమల్లిలో రాజకార్యనియుక్తుఁడు. వారును తెలుఁగువారే కదా! అక్కడను ఆంధ్ర ప్రధానిత్వమే. తర్వాత మొగలు సామ్రాజ్యము వచ్చినది. అప్పుడుగూడ మద్రాసు పరిస్థితులకు ఆటంకము రాలేదు.

క్రమక్రమముగా వారివలనఁగూడ సర్వాధికారమును, హక్కులను ఈస్టుఇండియా కంపెనీవారు పొందిరి. పట్టణమును, ఓడరేవును బాగు చేసిరి. క్రమముగా బ్రిటిషుపరిపాలనలోనికి వచ్చి గొప్పరాజధాని యైనది. ఈ పట్టణమును వృద్ధిలోనికిఁ దీసికొనివచ్చిన వర్తకులలోను, ఉద్యోగస్థులలోను తెలుఁగువారే ఎక్కువమంది ఉన్నట్లును, ఎక్కువ మంది కాదు—ముఖ్యు లున్నట్లును కొన్ని "రికార్డు"లవలనఁ దెలియ వచ్చుచున్నది. ఈవిషయమును కొంతవఱకు భాషోద్ధారక శ్రీ వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రులుగారు 1938 సం. న చెన్నపురిలో జరిగిన యాంధ్రమహాసభలో తమ స్వాగతోపన్యాసమున స్పష్టముగా తెలిపిరి.

అంతేకాక శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రులవారు ప్రకటించిన చెన్నపురీవిలాసము అను గ్రంథమువలన చెన్నపురిలోనున్న తెలుఁగువా రెట్టివా రుండెడివారో తేటతెల్లమగును. నల్లూరిరాజగు బొమ్మదేవర నాగభూపాలుని ప్రోత్సాహమున మకుటమల్లి నరసింహశాస్త్రులవా రది రచించిరి. అది పరిశీలించినచో ఆంగ్లులకును, ఆంధ్రులకును గల పరస్పర హితాభిలాషిత్వము తెలియఁగలదు. చెన్నపురీవిలాసము క్రీ. శ. 1864 సం. న మకుటమల్లి నృసింహ శాస్త్రులవారిచే రచింపఁబడినది. బొమ్మదేవర నాగభూపాలుఁడు నృసింహశాస్త్రిని పిలిచి,

"పురములలోనఁ జెన్నపురిపూర్ణవిలాసము వర్ణనీయమై
ధరి యనఁగానఁ దత్పురవికస్వరచారు విలాస వర్ణన
స్ఫురణ నొనర్పు మొక్కకృతి భూరికథీకరతార్థసంధన
ద్మరసభరంబుగా మకుటమల్లినృసింహకవీంద్రశేఖరా!

అని సగౌరవంగా నానతియొసంగిన" కవి యీ గ్రంథమును రచించెను. ఆ నాగభూపాలుఁడు నల్లూరిరాజులలోనివాఁడు. ఆతనిని నుతించి కవి చెప్పిన భాగములోనివి కొన్ని తెలిపినచో ఆతనిస్థితియును, తెలుఁగురాజులు ప్రభుత్వముజరుపుచున్న యాంగ్లేయుల మొదల ప్రవర్తించినపద్ధతియు స్పష్టమగును.

"ప్రబలు రాజాబహద్దరు ప్రభృతినిభృత
బిరుదపుంభిత ధక్కా గభీర నినద
ధీతధీశాఖిలాహితవ్రాతుఁ డనుచు
బొమ్మదేవరకుల నాగభూవిభుండు.

"అయ్యవనీతలాధిపజనాగ్రణి గొర్నరు మెంటువారి క
న్నయ్యవిభూతిచే నమితసంఖ్య మహోత్కటప్రచారసా
హాయ్యము చేర్చి సైన్యముల కాహవసన్నహనోద్యమంబులన్
జయ్యనఁ జేసి మేల్గను నజప్రతికార్తితవైభవోన్నతిన్.

"ప్రకటప్రీతిని హూణవల్లభులు కార్యకర్తల్ల సారాజపు
త్రికమూడామణి కిచ్చిరిచ్చెదరు హైదర్యాదులోన న్నరా
జాకమే ల్కల్కురాయి రత్నరుచిరం బుద్యోతిసద్రాక్షకీ
ద్రకరాకల్పయుగంబు నద్ధినిడె సన్మానక్రియాసైఖరిన్."

ఈ గ్రంథమున గద్యపద్యములతో పురము, శాఖానగరములు (పేటలు), వీధులు చక్కఁగ వర్ణింపఁబడినవి. ముత్యాలపేట, పెద్దనాయనిపేటవీధి, వగడాలవీధి, ఏడుబావులకొట్టి, వినోదసభ (మ్యూజియమ్), పార్థసారథిదేవాలయము మొదలగునవి అన్నియుఁ గన్నులఁ గట్టినట్లు వర్ణింపఁబడినవి.

హూణదేవాలయము, హాసు (హూణవాణిజ్యశాలలు) "అల కూర్చు తెన్నటుహాసు చెన్నిహాపుకున్ ......" మొదలగునవి గూడ వర్ణింపఁబడినవి. పట్టణమంతటిలోను ఆంధ్రుల ప్రాభవము, ఐశ్వర్యము, తాత్కాలికపుర పురోభివృద్ధికిఁ దోడ్పడిన పని నిస్సందేహముగాఁ జెప్పవచ్చును. ఆంధ్రుఁడు విచారింపవలసినవిషయ మొకటి కన్పట్టుచున్నది.

ఒకపద్యములో మనరాజధానిని వర్ణించుచు

"సీ. పంథకోణము కల్లికోట......
అవల శ్రీకాకుళము గంజ మనఁగఁబరఁగు
నిరువదియు రెండు జిల్లాల కిరువు మీఱు
రాజకార్యంబులకు నెల్ల రాజధాని."

అన్నాఁడు. అందు అప్పుడు ఉన్న గంజాము ఇప్పుడు విడి పోయినదిగదా. అది ఆంధ్రదేశప్రాంతములోనిది. దానికి విచారించిన లాభమేమి? నాలుగుప్రక్కలను నాలుగుభాగములు పోకుండఁగఁ జూచుకొనవలసియున్నది.

సింహావలోకనము

సింహావలోకనము చేయఁగా ఏమికన్పడుచున్నదో చూతుఁడు. చెన్నపురికి ఆదిపురుషులు ఆంధ్రులు. దేశము ఆంధ్రము. చెన్నపురి ఆంధ్రనాయకుల ఏలుబడిలోనిది. ఆంధ్ర సామ్రాజ్యాధిపత్యములోనిది. ఆంగ్లేయులకు ఆహ్వానమిచ్చినవారు ఆంధ్రులు. ఆదిని ఆంధ్రులహక్కు. ఆహక్కు ఎట్లుపోవును? ఆంధ్రుల తాతగారి సొమ్ము. అప్పటినుండియును ఆంగ్లేయులకు తోడ్పడుచు పట్టణమున నివసించి పట్టణాభివృద్ధికి ముఖ్యకారకు లయినవారు ఆంధ్రులు. ఆంధ్రులకు హక్కుభుక్తము లున్నవి. ఎవరు లేవనఁగలరు?

ఆంధ్రులకు అసూయ లేదు. అన్ని భాషలవారిని, అన్ని దేశములవారిని ఆదరించి వారిచేత నాదరింపఁబడి యానందముగా కలసిమెలసి ఉండుట ఆంధ్రులకు సహజగుణము.

ఏకారణముల నయిన నేమి వివిధభాషలవారికి, వివిధదేశములవారికి మన చెన్నపురి యను పురమతల్లి తల్లివంటి దైనది. ఆంధ్రులు, అఱవలు (తమిళులు), కన్నడులు, మహారాష్ట్రులు, మహమ్మదీయులు, పార్సీలు, ఇతర భారతీయజాతులవారు, యూరపు దేశాగత వివిధజాతిమతములవారు అందఱును సోదరతుల్య లయి మన మద్రాసు, మన చెన్నపురి ఇంకను ఇతోధికముగా వృద్ధిలోనికి వచ్చు మార్గములను చూచి ఐకమత్యముతో పరస్పర క్షేమాభిలాషు లయి మెలఁగుదురుగాక!

విక్రమవత్సరము వచ్చుచున్నది గావున మీ విక్రమములు చూపుచు సక్రమముగా సంచరించి సంవత్సరమంతయు సంతోషముతో జరుపుదురుగాక!

ఐకమత్యమున తేజస్వంతు లగుదురుగాక!
అనావశ్యక ద్వేషములఁ బొందకుందురుగాక!

"తేజస్వినా వధీత మస్తు
మా విద్విషావహై"
ఓంశాంతి శ్శాంతి శ్శాంతిః.

నాప్రక్కనే పరున్నావా?

[గేయము]

శ్రీ వెదురుమూడి వెంకటకృష్ణారావు

రాగము - యదుకులకాంభోజి : తాళము - మిశ్రచాపు

పల్లవి

పడతిరో! పెడమొగముగ నా-ప్రక్క-నేపరున్నావా!

అనుపల్లవి

ఎడబాటుకోర్వక నామది-ఎంతో తపించుచుండ॥ పడ॥

చరణములు

వాలుజడను చూడ-కాలసర్ప మని
లోలోన ఇపుడేమొ-చాలా భయమయ్యె,
కాళరాతిరినాటి-కాఱుచీకటి గ్రమ్మి
కాలుసేతులకే-ఘనయుద్ధము లాయె॥ పడతిరో॥

కేలుసంధుల-తాలిమి తప్పి
నేల కూలనున్న దే-యీ నా నిలు వెల్ల!
జాల మింత చేయ మేలకి-జాలి చూపవె, చెలియా!
నాలీలాలోకములకు-నవమహోదయ మౌనె॥ పడతిరో॥

బాలకృష్ణునిపాలి-ప్రాణామృతభాండమే!
కేలు మోడ్చి నీపాద-నీరేజములపై వ్రాలెద,
శ్రీ లొనగూర్చు దివ్య-శృంగారము వెలయ,
పాలసముద్రమ్ముఁ-బోలుమోము మిటు త్రిప్పవే॥ పడతిరో॥

ఆంధ్ర ఇన్సూ్యరెన్సు



శ్రీ. జి. లక్ష్మీనారాయణగారు
చైర్మన్, బోర్డు ఆఫ్ డైరెక్టర్సు.

1925-వ సంవత్సరమున కొందరు ఆంధ్రనాయకులు ప్రారంభించిన "ఆంధ్ర ఇన్సూ్యరెన్సు కంపెనీ" దినదినాభివృద్ధినొంది ఆసేతుహిమాచలపర్యంతము విస్తరించి, నిర్మాణసౌష్ఠవము కల్గి, నేడు భారతదేశమందలి ప్రధాన భీమాసంస్థలలో ఉన్నతస్థాన మాక్రమింపగల్గినది. భారతదేశములో ప్రతి రాష్ట్రమందు కూడ "ఆంధ్ర ఇన్సూ్యరెన్సు కంపెనీ" అనూయకల్గించు స్థయిర్యము కల్గి, ప్రజానురాగము నొందగల్గుటకు అనేక కారణములు గలవు. అవేవన:—

1. దేశోద్ధారక కె. నాగేశ్వరరావుగారు
   టంగుటూరి ప్రకాశంగారు
   డా. పట్టాభిసీతారామయ్యగారు
   వి. రామదాసుపంతులుగారు

మున్నగు ఆంధ్రప్రముఖులును త్యాగశీలురును, ప్రజాసేవకులు నైనవారిచే ప్రారంభింపబడిన ఈసంస్థయొక్క అత్యున్నతములైన ఉదారాశయములు.

2. ప్రధానకార్యాలయమునందును, వివిధశాఖలయందును జరుగుచున్న మితవ్యయము, సంరక్షణ క్రమాభివృద్ధులతో గూడిన పరిపాలనావిధానం.

3. రాష్ట్రమందలి మారుమూలప్రదేశములకు కూడ విస్తరించి అతి బాహుళ్యమైన వ్యాపారాంగ నిర్మాణక్రమము, పట్టాదార్లకు ప్రయోజనకారులుగా నుండునట్లెన్నుకొనబడిన కంపెనీ ప్రతినిధులయొక్క ఉన్నత పరిమాణము.

4. అతితక్కువ ప్రీమియములు; ఎక్కువైన సదుపాయములు; చక్కని సంవత్సరలాభాలు, పట్టాదార్లకు అద్వితీయమైన సౌకర్యాలు; ఏమాత్రం చిక్కులులేనిపట్టా స్వాభావిక లక్షణములు.

ఇవన్నీ కాక—

5. కంపెనీ ప్రతినిధులద్వారా క్లెయిముల పరిష్కారము. మా ప్రతినిధులు న్యాయశాస్త్రరీత్యా జరుగవలసినవిధానమంతయు నడిపి పట్టా క్లెయిముగా ఫలించిన వెంటనే పరిష్కారమగునట్లు సహాయపడెదరు.

"ఆంధ్ర" అభి
మొత్తం జీవితనిధి
మొత్తం అమలులో నున్న
ఇవ్వబడిన పట్టాల మొ
మొత్తం ఆస్తులు

పై ఉదహరింపబడినవి మిగతా సంస్థలకంటె 'ఆంధ్ర' కల్గియున్న యుత్కృష్ట లక్షణములలో కొన్ని మాత్రమే. అతి తక్కువ వెలకు లభించు సదుపాయములు, అద్వితీయములైన పట్టా లక్షణములు—ఇవియే "ఆంధ్ర"కు తన మాతృరాష్ట్రమునందు కంటె పరరాష్ట్రములలో కూడ అత్యధిక ఆదరణ అభిమానములను చేకూర్చినవి.

ఆరంభమునుండి చక్కని బోనసు పంచిపెట్టగల్గినంత మితవ్యయపరిపాలనగల కొద్ది భీమాసంస్థలలో 'ఆంధ్ర' ఒకటి. కనుక 'ఆంధ్ర' పట్టాదార్లు అమోఘమగు సదుపాయములను అతితక్కువ



శ్రీ. వై. మంగయ్యగారు, కార్యదర్శి.

కంపెనీ, లిమిటెడ్.

వృద్ధి అంకెలు
26,30,000
వ్యాపారం **2** కోట్లు
త్రం సంఖ్య **23,920**
30,00,000

ఖర్చుతో పొందుటయే గాక అవసరము కలిగినపుడెల్ల శిక్షణపొందిన "ఆంధ్ర" ప్రతినిధుల ద్వారా విలువలేని సహాయము పొందుచుండ గలరు.

'ఆంధ్ర' ప్రతి ఆంధ్రుడును గర్వించదగినసంస్థ. అంతేకాదు. దాని ఆకర్షణీయమగు లక్షణములను గమనించినవెనుక దానితో భీమా చేయుట అత్యుత్తమమైనదని మీరే గ్రహింపగలరు. "జీవితవిమాయిలు" అను ఉపయోగకరంతోమైన మా చిన్నిపొత్తమునకు వ్రాసి మితవ్యయము, ఆదాచేయుట మున్నగువాటికి సంబంధించిన కొన్ని ప్రధానవిషయముల నెఱుంగుడు. ఈ ప్రతి కొరకు ప్రధాన కార్యాలయమునకుగాని, శాఖాకార్యాలయములకుగాని వ్రాయుడు.



శ్రీ. ఓ. పార్థసారథి నాయుడుగారు
మేనేజింగు డైరక్టరు.



శ్రీ. బి. సుబ్రహ్మణ్యంగారు
సహాయ కార్యదర్శి.

The ANDHRA
INSURANCE COMPANY LIMITED
MASULIPATAM

ఆంధ్ర ఇన్స్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్.

ప్రధాన కార్యాలయం:
ఆంధ్ర ఇన్సూరెన్సు భవనములు, మచిలీపట్టణము.

శాఖలు:
ఆంధ్ర ఇన్సూరెన్సు భవనములు, లింగిచెట్టివీథి, మద్రాసు.
" " " ధనతోలీ, నాగపురం.
" " 8, చౌరంగి స్క్వేర్, కలకత్తా.
" " తిరుమల దేవస్వమ్ రోడ్డ్, ఎర్నాకులం.
భారతదేశమునందంతటా సబ్ ఆఫీసులు, ఏజన్సీలు గలవు.

మహాకవి తిక్కన

శ్రీ దరిమడుగు రామయ్య

నట్టడవి డించి నన్నయ
భట్టారకుఁ డరుగఁ దెనుఁగుఁబలుకుఁబడంతిం
జిట్టితనంబున సాకిన
దిట్టవుగద పురుడుదీర్చి తిక్కకవీంద్రా!

వందలమంది తెన్గునఁ బ్రబంధములన్ వెలయించి సాహితీ
సుందరికిన్ గిరం బలరు సొమ్ములు పెట్టిరి కాని, రూపుఁ గ
న్విందుగఁ దీర్చి నెన్నడలు నేర్ప వలంతులె? ఆంధ్రవాఙ్మయం
బందు భవద్విభాగ మరయంగ మొగంబున ముక్కువంటిదా.

తెలుఁగుఁబలుకుల చెలువరా తెలమిఁ గూర్చి
తనరఁజేసితి భారతతాజమహాలు
సుకవిమాత్రుండవే నీవు సోమయాజి!
అతులుఁడోఁపని యాశిల్ప మద్భుతంబు.

కవితారసాంభోధి నవగాహన మొనర్చి లలితరత్నాలు వెల్వఱచినావు
సకలాంధ్రజాతియశ్శబ్దముత్యాల సర్మలి సరమ్ముగ వినిర్మించినావు
మూలంపుఁబటమున ముద్దురంగుల నద్ది తెనుఁగుఁజీరకు వన్నె దెచ్చినావు
అఱగొఱగా నున్న యనుఁగుఁదెనుఁగుఁదోఁట నందనవనము గ నొనర్చినావు
మనుమసిద్ధివిభుండు 'మామా' యనంగ
సుకవు లెంతయు మార్గదర్శకుఁ డనంగ
అఖిలధీజనతతి సోమయాజి యనఁగ
గణనకెక్కితి తిక్కనకవివతంస!

తనయొడిఁ దాల్చి నోఁచినకతమ్మున సింహపురీలలామ పా
వనమగు నీ యశోలతకు పాదుగ ధన్యచరిత్ర యయ్యెఁ ది
క్కనకవిచంద్ర! మిక్కిలి పొగడ్త లిఁకేటికి ధాత్రి నాంధ్రస
జ్జనుఁ డొకఁ డుండినన్ మఱవఁజాలఁడు నిన్ను యుగాంతవేళలన్.

ఆంధ్రనాటకముల యారంభదశ

ప్రాచీనాంధ్రకవులు నాటకవాఙ్మయమును ఉపేక్షాభావముతో చూచుటకు హేతువులు

● శ్రీ దివాకర్ల వేంకటావధాని ●

నన్నయ తిక్కనలు మొదలైన ప్రాచీనాంధ్ర మహాకవులు అనువాదరూపమున నైన నేమి, స్వతంత్ర రూపమున నైన నేమి తెలుఁగున ఉత్తమ కావ్యములను పెక్కింటిని వెలయించి ఆంధ్రవాఙ్మయమును మహోన్నతస్థానమున నిలిపినారు. కాని వారు ఆనాఁటికే సంస్కృతాదిభాషలయందు విస్తారవ్యాప్తి గాంచిన నాటక వాఙ్మయమును ఆంధ్రీకరించుటగాని, తదనుసారముగ స్వతంత్రనాటకములను రచించుటగాని చేయలేదు. ఇదివరకు సంస్కృతలక్షణగ్రంథములను ఆంధ్రీకరించిన ఒకరిద్దరు ఆంధ్రలాక్షణికులుకూడ తదితర లక్షణములతోపాటు రూపక లక్షణములనుగూడ అనువదింపవలసి యుండియు అట్లు చేయరైరి. వారి ఈ ఔదాసీన్యమునకు హేతువు లేవో, ఇట్టి సందర్భములో ఆంధ్రనాటకముల పుట్టుక యెప్పుడు, ఎట్లు కలిగినదో, ఆంధ్రప్రజానీకము వానినెట్లు ఆదరించినదో మొదలైన అంశములు ఈ వ్యాసములో రసవంతముగా రచియింపఁబడినవి.

నన్నయకుఁ బూర్వ మాంధ్రభాషకు స్థిరమైన రూపము కాని, కావ్యరచనావశ్యకము లైన ఛందోవిస్తృతులుకాని లేకుండె ననుట సర్వపండితసమ్మతమైన విషయము. అప్పటి యాంధ్రవాఙ్మయము ప్రాయికముగా శాసనాది రూపమునే తాల్చి యుండెనుగాని యింకను గావ్యాకృతిని వహింపలేదు. తొలుఁదొలుత నీ భాషాపాదపమునఁ గావ్యరూపస్వాదుఫలమును బండించినవాఁడు నన్నయ. ఈతఁడు రాజరాజనరేంద్రుని ప్రేరణచే సర్వధర్మసమన్వయసంధానదక్షమయి పంచమవేదము నాఁ బరఁగు భారతము నాంధ్రీకరింప నారంభించెను. ఈతఁడు స్వతంత్రకావ్యరచనానుకూలములైన ప్రతిభావ్యుత్పత్తులు కలవాఁడే యయ్యు నొకవంకఁ దననాఁటికి నసంస్కృతమై యవ్యవహితమై యున్న భాషకు సుస్థిరాకారము నొసఁగుభార మటుండ స్వతంత్ర కావ్యరచనభారమునుగూడ వహించుట కష్టతర మని కాఁబోలు నట్టిపనికిఁ బూనుకొనఁడాయెను. అదిగాక తత్కాల పరిస్థితులును, బ్రభుశాసనమును భారతమువంటి బ్రాహ్మణమతప్రచారక గ్రంథము యొక్క యావిష్కరణమునకు మిక్కిలి యనుకూలములై యుండెను. నన్నయ తరువాతఁ దిక్కనయు, నెఱ్ఱనయు నాతనిచే నారంభింపఁబడిన యా యుత్తమ కావ్యము నాంధ్రీకరణము పూర్తిచేసిరి. ప్రతిభాశాలులైన యీ మూగురుకవులును దమ తమ యుగములందలి కవుల కెల్లరకును నాదర్శప్రాయులగుటచే నప్పటి యాంధ్రకవులు పెక్కురు వీరి మార్గమునే యనుసరించి ప్రసిద్ధములైన యితరపురాణములఁ గొన్నిటి నాంధ్రీకరించిరి. నన్నెచోడుని కుమారసంభవమువంటి స్వతంత్ర కావ్యములుకూడ నొండురెండు వెలువడినను ఆంధ్రీకృతములైనవానిలో నివి నూటికిఁ దొమ్మిదికూడ నుండవు. మొత్తముమీఁద నెఱ్ఱన యుగాంతమువఱకు వెల్వడిన యాంధ్ర వాఙ్మయమునఁ బురాణపరివర్తనమే ప్రధానలక్షణ మని భావింపవచ్చును.

భారతకవుల యాంధ్రీకరణపద్ధతి యసామాన్యమైనది. వ్యాసరచిత భారతమునుండి కథాంశములను మాత్రము గైకొని వారు తక్కిన మెఱుఁగుల నన్నిటిని దామే తీర్చి దిద్దిరి. వలయునెడలఁ బూర్వోత్తర కథాభాగములను సైతము తారుమారు చేయుటకు వారు వెనుదీయలేదు. కథాగమనమున కడ్డుగలిగించునట్టియు, నప్రసక్తములయినట్టియు, గాఢవేదాంతగర్భితము లగుటచే దుర్గ్రాహ్యములైనట్టియుఁ గథాభాగములను గేవలము సూచించి విడిచివైచిరి. సనత్సుజాతీయము, భగవద్గీత మొదలగున విట్టివానికిఁ దార్కాణ

ములు. వీరు వర్ణనభాగములను రచియించుటలో మిక్కిలిస్వాతంత్ర్యము వహించి మూలగతమైన వర్ణనలతో పాటు స్వకపోలకల్పితములైన వర్ణనలఁ గూడఁ గొన్నిటి నందుఁ బ్రవేశపెట్టిరి; పాత్రముల శీలస్వభావములను వర్ణించుపట్లఁ గూడఁ గొన్ని యెడల మూలవిరుద్ధమైన పద్ధతి నవలంబించిరి. తిక్కన ద్రౌపదీపాత్రకును, వ్యాసుని ద్రౌపదీపాత్రకును స్వభావవిషయమునఁ గల తారతమ్యమే దీనికిఁ బ్రబలదృష్టాంతము. కాన వ్యాసునిభారతము చెంత నుంచుకొని యందలి శ్లోకములన్నియు నియ్యెడ నాంధ్రీకృతములైనవని చూచుటకాని, యందలివర్ణన లన్నియు నిందు మక్కికి మక్కిగా ననువదింపఁబడినవని చూచుటకాని మిక్కిలి నిష్ఫలము. మొత్తముమీఁద నాంధ్రీకరణ మన్న పే రున్నను ఆంధ్రమహాభారత మొక స్వతంత్ర రచనమువలెనే చూపట్టునుగాని మూలగ్రంథము నతిసన్నిహితముగా ననుసరించిన కేవల పరివర్తనమువలెఁ గానిపించదు. కవిత్రయమువారి యీ పరివర్తనపద్ధతి నంత సమగ్రముగా ననుకరింపలేకపోయినను పురాణపరివర్తకులు పెక్కు రామార్గము వెంటనే పోయి రని చెప్పవచ్చును.

స్థూలముగాఁ జూచినచో సంస్కృత వాఙ్మయము నంతను పురాణములు, కావ్యములు, నాటకములు అని మూఁడు ముఖ్య విభాగములు గావింపవచ్చును. అందుఁ బురాణములు వివిధవిషయసంకలితములును, అతి విస్తృతములును. కావ్యములు వర్ణన ప్రధానములు; వస్త్వైక్యముతోడి ప్రౌఢరచన కునికిపట్టులు. నాటకములు ప్రధానముగా రసాశ్రయములు. సంవాదపూర్వకము లగు యవి యనతివిస్తృతములుగ నుండును. ప్రథమాంధ్రకవు లాకాలప్రభావమునుబట్టి ధర్మోపదేశబాహుళ్యముగల పురాణముల నాంధ్రీకరించి భాషాసేవఁ గావించిరి. ఎఱ్ఱన యుగానంతరము వెలసిన యాంధ్రకవులు పురాణపరివర్తనమును విడిచి సంస్కృతమున విశేష ప్రసిద్ధినందిన కావ్యముల నాంధ్రీకరింప మొదలిడిరి. నన్నెచోడుఁడు తన కుమారసంభవమున నుద్భటుఁడను సంస్కృతకవి రచించిన కుమారసంభవమును పేర్కొనెను గాని యాతఁ డా కావ్యమునందలి వర్ణనలను గుమారసంభవమునందలి వానినివలె నెచ్చటనైన గ్రహించి యుండెనేమోకాని దాని ననుపదముగ ననువదించినవాఁడుమాత్రము కాఁడు. కాఁగా సంస్కృతకావ్య పరివర్తనకుఁ బ్రప్రథమమున నారంభించినవాఁడు శ్రీనాథుఁడు. ఇతఁడు శ్రీహర్షుని నైషధము నాంధ్రీకరించుటయే కాక హారవిలాసమునందుఁ గుమారసంభవమునందలి శ్లోకములఁ బెక్కింటి నాంధ్రీకరించెను. ఈతని యాంధ్రీకరణమునకును కవిత్రయము వారి యాంధ్రీకరణమునకును విశేష తారతమ్యము కలదు. ఇతని పద్ధతి కవిత్రయమువారిదివలె నతి స్వతంత్రము కాదు. ఔచిత్యంబు పాటించి యనౌచిత్యంబు పరిహరించి యతి మనోహరముగ నాంధ్రీకరించుచు వచ్చినను, ఇతఁడు మూలగ్రంథమునందలి శ్లోకములను సన్నిహితముగా ననుసరింపకమానినవాఁడు కాఁడు. సీసపద్యములం దితఁడు స్వకల్పితపాదములఁ బ్రవేశపెట్టిన చోట్లను, గ్రంథకర్త యభిప్రాయము గూఢముగా నున్నప్పుడు దానిని స్వేచ్ఛగా వివరించినపట్లును అచ్చటచ్చటఁ గలవు. మొత్తముమీఁద నితని పరివర్తనము కవిత్రయమువారి దానివలె నతిస్వతంత్రమును, అధునాతనుల నాటకపరివర్తనములవలె మక్కికి మక్కియును గాక మూలభిన్నముకాని స్వతంత్రపరివర్తనమై విలసిల్లుచున్నది.

పురాణకావ్యపరివర్తనము సాగిన తరువాత నాటకములు పరివర్తింపఁబడుట సహజపరిణామక్రమము. శ్రీనాథయుగమునందలి కవులు నైసర్గికమైన యీ క్రమమును బరిశీలింపకపోయినవారు కారు. శ్రీనాథుని పరివర్తనపద్ధతినే యవలంబించి వీరు ప్రసిద్ధములైన సంస్కృత నాటకములఁ గొన్నిటి నాంధ్రీకరించిరి. పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి తన శృంగారశాకుంతలమునఁ గాళిదాసుని శాకుంతలమునందలి శ్లోకములఁ గొన్నిటిఁ దెనిఁగించి యచ్చటచ్చటఁ జొప్పించెను. నందిమల్లయ, ఘంటసింగనలు వేదాంతపరమైన ప్రబోధచంద్రోదయమును సంపూర్ణముగ ననువదించిరి. రాజశేఖరుని విద్ధసాలభంజిక యేకదేశముగనో, పూర్ణముగనో మంచన కేయూరబాహుచరిత్రమున ననూదితమని యనుకొనుటకుఁ గొన్ని కారణములు గలవు.

కాని యీపరివర్తనమునం దొక విశేషము కానవచ్చుచున్నది.

పురాణ పరివర్తకులు గాని, కావ్య పరివర్తకులుగాని మూలగ్రంథముల నాంధ్రీకరించునో వాని యాకృతులం దెట్టి మార్పును గావించియుండ లేదు; వర్ణనభావముల విషయమున వారు కొంత స్వాతంత్ర్యము వహించినను ఆకృతి జోలికిమాత్రము పోయిన వారు కారు. ఈ నాటకపరివర్తకు లట్లు కాదు. వీ రా నాటకములను యథారూపముగా నాంధ్రీకరింపక ప్రబంధములుగా నాంధ్రీకరించి యుండిరి. దీనితో సాదృశ్యముగల విషయ మాంధ్రవాఙ్మయమునందు మఱి యొకటి కలదు. కేతన సంస్కృతమున దండి విరచితమైన దశకుమార చరిత్రము నాంధ్రీకరించుచు దాని రూపము నిట్లే మార్చియుండెను. సంస్కృతమున గద్యరచితమైన యా గ్రంథము నాతఁడు పద్యమయ కావ్యముగాఁ జేసెను. గద్యమయమైనను, పద్యమయమైనను రసాత్మకమైన వాక్యప్రపంచము కావ్యమే యగు నను విషయము నెఱింగియును కేతన యాగ్రంథము నట్లు మార్చుటకప్పటి వాఙ్మయపరిస్థితులే కారణము లై యుండెను. కేతనకుఁ బూర్వులైన కవుల రచనలలో నడ నడుఁ బద్యము లతో పాటు గద్యముకూడ వ్రాయఁ బడియుండినను అంతము గద్య మయమైన కావ్య మొక్కటియు లేదు. వాఙ్మయమునం దపూర్వమైన క్రొత్తమార్గము నొకదానిని త్రొక్కుటకుఁగాని, పద్యమయ కావ్యమునం దభిమానము నూచ ముట్టుగా విడుచుటకుఁగాని కేతనకు మన సొగ్గియుండదు. అట్లే యీ నాటకపరివర్తకులు గావించిన



శ్రీకృష్ణగానామృత సరస్వతీసంగీతపాఠశాల,
రాజమహేంద్రవరము

[అధ్యాపకురాలు, కొందరు విద్యార్థినులును]

అధ్యాపకురాలి పేరు శ్రీమతి పద్మలక్ష్మి అమ్మాళు. ఈమె వైణికవిద్వాన్ శ్రీమాన్ నల్లాని చక్రవర్తుల శ్రీరామాచార్యులవారి కూతురు. ఫిడేలు, వీణ, గాత్రములు అమోఘముగా సాధనచేసినది. ఈమె 'సమ్మర్ స్కూల్ అఫ్ ఇండియన్ మ్యూజిక్' వారి ఆనర్సుపరీక్షలో డిస్టింక్షనుతో సర్టిఫికెట్టు సంపాదించినది. అనేక గానసభలలో తన గానకౌశలమును ప్రదర్శించి సువర్ణపతకములను బహుమానముగా బడసినది. ఈవిడ నడపుచున్న ఈ విద్యాలయము పరంపరగా జరుగుచున్నది.

మార్పునకును ప్రబలమైన హేతువు లుండితీరవలయును. వీరి పరివర్తనము-ఉన్నంతవఱకు- శ్రీనాథుని పద్ధతినే యనుసరించియుంట నాతిమూలమును, నాతి స్వతంత్రమును నై మిక్కిలి మనోహరముగా నున్నది. ఆంధ్ర వాఙ్మయమున కాభాగ్యము లేకపోయెను గాని వారే యీపద్ధతిని సంస్కృత నాటకముల నాంధ్ర నాటకములుగా ననువదించియుండినచో సంస్కృతనాటకముల యందదనుకించ లేక యాంధ్రులు తద్రసమును మనసారఁ గ్రోలి యానందించి యుండెడివారే!

నాటకముల మాట యిట్లుండఁ గవిసార్వభౌముఁ డగు శ్రీనాథుని రచనముగాఁ బ్రసిద్ధిగాంచిన వీథీనాటక మొండు కానవచ్చుచున్నది. దశరూపకములలో నొకటియైన వీథికి లాక్షణికు లొసఁగిన లక్షణము దీనఁ గానిపించ దనుట నిర్వివాదము. ఇందు శృంగారరసాలంబనములును, అసభ్యములును నగు చాటుపద్యములు

కొన్ని గలవు. మహాకవియైన శ్రీనాథుఁడు వీథీలక్షణము నెఱుంగక యుండఁడు; ఎఱిఁగియెఱింగి యీ రీతిగాఁ గొన్ని పద్యములు రచించి వీథి యనునామము పెట్టియుండఁడు. వీథి యను నామ మాపద్య సముదాయమున కవాంతరముగాఁ గలిగియుండవోవు. లేదా పలువురు పండితులు సందేహించున ట్లిది శ్రీనాథరచితమే కాక మఱియెవ్వరిదో యయ్యు శ్రీనాథునిపేరఁ బరఁగుచుండవచ్చును.

ఇట్లు పదునేడవశతాబ్ది యారంభమువఱకును దెనుఁగున స్వతంత్ర నాటకములుగాని, సంస్కృత నాటకముల యథారూప పరివర్తనములుగాని వెలువడియుండలేదు. ఈ కారణముచే నంతకుఁ బూర్వమున నున్న యాంధ్రకవులు రసదోహలములగు సంస్కృత నాటకముల యాత్కృష్ట్యమును గమనించియుండలేదని కాని, తామై స్వతంత్రనాటక సృష్టి చేయఁ గడంగుటకుఁ దగిన సామర్థ్యము లేనివా రనికాని మనము తలంచుట పొరపాటు. పూర్వకవులలోఁ బెక్కురీ యుత్తమసృష్టికిఁ గావలసిన ప్రతిభా సామర్థ్యములు కలవారయ్యు ననివార్యములగు కొన్ని కారణములచేఁ దద్రచనవిషయమున నౌదాసీన్యము వహించియుందు రనుటకుఁ బెక్కునిదర్శనములు కలవు. కథోపాఖ్యాన రచనకౌశలమే ప్రధానముగఁ గావలసిన భారతమువంటి యితిహాసమునందుఁ గూడఁ బ్రతిఘట్టమునందును నాటకసరణు లచ్చొత్తించిన తిక్కన స్వతంత్రనాటకము నొకదానిని రచింపఁబూనకుండుట కాతని శక్తిలోపమే ప్రధానహేతు వనుకొనుట మిక్కిలి పరిహాసపాత్ర మగును. రూపమునఁ గాకపోయినను గుణపరంపరచే నాటకమే యనిపించుకొనుచున్న ప్రభావతీప్రద్యుమ్నము నంత నిపుణముగ నిర్మించిన పింగళిసూరన నాటకమొండు వ్రాయఁ గడంగమికి నుపజ్ఞాలోపమనుటకంటె భిన్నమైన హేత్వంతరమునుసూచించుట లెస్స. ఇట్లే శ్రీనాథాద్యన్యకవీశ్వరులు సైత ముత్తమనాటక రచనోత్సాహమును గానిపించకుండుటకుఁ బ్రజ్ఞాభావము కాక వేఱునిమిత్తములు బలవత్తరములై యుండితీరవలెను. ప్రతిభాశాలులగు కవులు క్రొంగ్రొత్త పోకడలఁ బోయి తమ బుద్ధివైశిష్ట్యముచే నవనవ కావ్యభూజముల మొలపించి తద్రసపరిమళములచే వాఙ్మయమహావనములఁ బరితోవాసితములఁ గావింతు రనుట సుప్రసిద్ధమే. పై మూఁగురు కవుల ప్రతిభయుఁ బ్రధానముగా నాటకోచితము. సంస్కృతనాటకముల సారమును బర్యాప్తముగ నాస్వాదించిన యీ మహాకవులు స్వతంత్రనాటకములను బరిమితముగనైన సృష్టించియుండవలసినది. వీరే కాదు, మన పూర్వకవు లందఱును సంస్కృత వాఙ్మయపయోధిపారమును ముట్టిన వారే. దీనికి వీ రాంధ్రమునకుఁ బరివర్తించిన సంస్కృత గ్రంథజాలమే తార్కాణము. కొంచె మించుమించుగా వీరు సంస్కృతమునఁ గల ప్రసిద్ధకావ్యముల నన్నింటిని దెనిఁగించిరని చెప్పవచ్చును. అట్టి వీరు స్వతంత్రముగా నాటకముల వ్రాయకుండినను రసనిధానములై, కావ్యముల నుత్తమములని యెన్నఁబడుచున్న సంస్కృతనాటకములలో నొకదానిని గూడఁ దెనుఁగున నావిష్కరింపమి మిక్కిలి విస్మయావహము. కొందఱు సంస్కృతనాటకములపరివర్తనమును బ్రారంభించియు వాని రూపమును మార్చి ప్రబంధములుగా ననువదించుట చూడ నాటకరూపరచనమున కాకాలమున నేవియో యనివార్యములైన యాటంకము లుండవలయు ననుట నిర్వివాదము.

సంస్కృతనాటకములలో నొండు రెండు తక్క తక్కిన వన్నియు శృంగార రసప్రధానములు. మతప్రచారమే ప్రయోజనముగాఁ గల ప్రబోధ చంద్రోదయమువంటి నాటకము లంతకుముందు లేవు. తెనుఁగువాఙ్మయముయొక్క పుట్టుక యానాఁటి పరిస్థితులనుబట్టి చాలవఱకు బ్రాహ్మణ మతోద్ధరణముతోఁ సంబంధించియుండుట సంభవించెను. అప్పటి యాంధ్రసమ్రాట్టులుకూడ దానికొఱకే విశ్వప్రయత్నములు చేయుచుండిరి. అట్టియెడ పంచమవేద మనఁబరఁగి సర్వధర్మసమన్వయసంధానక్షమము లగు భారతమువంటి యుత్తమ గ్రంథములయొక్క పరివర్తనమే మిక్కిలి యావశ్యకమై కనుపట్టెను. అందుచేతనే శ్రీనాథుని యుగమువఱకును గల తెనుఁగువాఙ్మయము మతప్రచారమున కనువగు పురాణముల పరివర్తనముతోడనే భాసిల్లుచుండెను. పైఁగా శ్రీనాథునికిఁ బూర్వులైన యాంధ్రకవులలో నన్నెచోడునివంటి స్వతంత్రకావ్యకర్తలు తక్కువ. వాఙ్మయారంభమైన యా

క్రొత్తదినములలో నాద్యులైన నన్నయాదుల మార్గమును వీడి నాటకపరివర్తన మారంభించి భిన్నమార్గమును ద్రొక్కుట కప్పటి కవులకు ధైర్యము చాలినది కాదు.

సంస్కృతనాటకములలో సంస్కృతప్రాకృతములకు రెంటికిని విశిష్టమైన యుపయోగము కలదు. సంస్కృతమువలెనే ప్రాకృతము కూడఁ బూర్వవైయాకరణులచే నిబద్ధమై, నియమితమైయుండుటచే నది సంస్కృతముతో పాటు స్వతంత్రమై కావ్యములయందు నిరాక్షేపముగ నుపయోగింపఁబడుచు నొక ప్రత్యేక భాషగఁ బరిగణింపఁబడుచున్నది. అంతియగాక సంస్కృతలాక్షణికులు నాటకనిర్మాణమునఁ బాత్ర లుపయోగించు భాష విషయమునఁ గొన్ని నియమము లేర్పఱిచిరి. బ్రాహ్మణులును, నాయకులును, రాజులును శుద్ధ సంస్కృతము నుపయోగింతురు. స్త్రీలును, నీచజనులును బ్రాకృతము నుపయోగింతురు. మఱల నీప్రాకృత ప్రయోగవిషయమునఁ గొంత వేఱుపాటు కలదు. కులీనలగు స్త్రీలు గీతములలో మహారాష్ట్రీ ప్రాకృతము నుపయోగింతురు. సాధారణ సంభాషణమున వీరును, బాలాదులును, సేవకులును శౌరసేని నుపయోగింతురు. అంతఃపురపరిచారకులు మాగధిని, నీచసేవకులు పైశాచిని వాడుదురు. ఇట్లా పాత్రల యంతరములను బట్టి సంస్కృత నాటకములలో భాషాప్రయోగము నియమితమై యున్నది. సర్వసాహిత్య మార్గములందును సంస్కృత ఫక్కినే యనుకరించు నలవాటు కల తెలుఁగువారి కీనిబంధనము కొంత యాటంకము కలిగించినది. ఏల యన సంస్కృతప్రాకృతములవలెఁ దెలుఁగున గ్రాంథిక గ్రామ్య భాషలు రెండును వ్యాకరణ పరిసంస్కృతములై యుండలేదు. తెలుఁగున గ్రామ్యమునకు స్థిరమైన యాకృతి లేదు. కాఁగా సంస్కృతనాటకకర్తలు ప్రాకృతమును, దద్భేదములను నుపయోగించిన చోటులలోఁ దెలుఁగువా రెట్టి భాషావిశేషము నుపయోగింపవలెనో స్పష్టపడియుండదు. పోనీ, లాక్షణికులు చెప్పిన యా యొక్క నిబంధనము నుల్లంఘించి సర్వపాత్రలకు నొకటే భాష నుపయోగించి నాటకరచనకుఁ గడంగుటకుఁ బూర్వాంధ్రకవుల కంత నిరంకుశత్వమును, స్వాతంత్ర్యమును లేకపోయెను. దీనికి ఫలమే తెలుఁగున నాటకములు తరుణములో వెలువడకుండుట.

సంస్కృత నాటకము లైనను బ్రసిద్ధములైనవి సంఖ్యేయములే. అవి పదియవ శతాబ్దికిఁ బూర్వ మేమేమి వ్రాయఁబడెనో కాని తరువాత వాని నంతవిరివిగా వ్రాయఁగడంగినవారు చాల తక్కువ. వ్రాయఁబడిన నాటకములలోఁ గూడఁ బ్రబోధచంద్రోదయమువంటి నాటకము లేయొకటి రెండో తక్క తక్కినవి ప్రసిద్ధికి రాలేదు. ప్రాచీన సంస్కృతనాటకములు కాళిదాసాదుల కాలములో నప్పుడప్పుడు ప్రదర్శింపఁబడుచుండిన నుండవచ్చును కాని తరువాత వానిని బ్రదర్శింపఁబూనినవారెవరును లేరు. ఏల యన సంస్కృత నాటకములు బహుభాషాభూయిష్ఠములగుటచే విద్వత్సామాజిక పరిషత్తులకొఱకే యూహింపఁబడినవి కాని నిరక్షరులైన సామాన్యజనుల కొఱకుఁ గాదు. అదిగాక పదియవ శతాబ్దికిఁ దరువాత — అంతకుఁ బూర్వమునుండి సైతము — దేశభాష లధికమించుచు వచ్చిన యధిక ప్రాధాన్యము కతమున సంస్కృతమునకుఁ బ్రాముఖ్యము తగ్గుచుండెను. ఈ కారణములచే సంస్కృత నాటకముల ప్రదర్శనము లేకుండె ననియే చెప్పవచ్చును. అట్టి ప్రదర్శనము లుండినచో వానిని జూచినప్పుడైన నాంధ్రకవులకు నాటకరచనాభిలాష కలిగియుండెడిదేమో.

నాటకము గద్యపద్యమయమై సారస్వత ప్రయోజనమునే కాక (literary purpose) రంగప్రయోజనమును గూడ (theatrical purpose) కూడ నిర్వహించు కావ్యవిశేషము. ఈ ప్రయోజనద్వితయమునం దేది కొఱవడినను అది సమగ్రమైన, శ్రేష్ఠమైన నాటకము కాఁజాలదు. శ్రవ్యకావ్యములుగా మాత్రము చదివి యానందింపఁదగిన ప్రబోధచంద్రోదయాది నాటకములలో నిట్టిలోపము కొంతవట్టు కానవగును. శ్రవ్యకావ్యములయందు మనోనయన గోచరములు మాత్రమే కాఁదగు కథాజగత్పాత్రలు దృశ్యకావ్యములందుఁ జర్మచక్షుర్గోచరము లగుచుండుటచే నిష్పాదితమగు ప్రత్యక్షతయే 'కావ్యేషు నాటకం రమ్య' మ్మను నానుడికి ముఖ్యకారణము.

శ్రీనాథుఁడు హర్షునైషధము నాంధ్రీకరించి యాతని తరువాతఁ దండోపతండములుగ వెలువడిన ప్రబంధములను నొకజాతి వాఙ్మయమున కాదర్శభూతుఁ డయ్యెను. ఈ ప్రబంధములుకూడ గద్యపద్యమయములై దండిచే నిర్వచింపఁబడిన చంపూకావ్యజాతిలోఁ జేరును. వర్ణనాప్రధానములే యయ్యు నివి శృంగారాదిరస పరిపోషకములై హృద్యముగ నుండును. కాని నాటకములలోఁ గానఁగు సంవాదక్రమము గాని, యవి నిర్వహింపఁగల రంగప్రయోజనముగాని వీనియందుఁ జూపట్టవు. పూర్వాంధ్రకవులు రంగపరికరసాహాయ్యముచేఁ బ్రయోజితములైన సంస్కృతనాటకములను గాని, యాంధ్రనాటకములనుగాని చూచి యానందించి యెఱుఁగరు. అందుచేఁ గించిదూనముగా నాటకాకృతినే వహించిన ప్రబంధములఁ జదివి తదాస్వాదితానందానుభవముచేతనే సంతుష్టులైరి. ఈ కారణముచేతనే పినవీరభద్రాదికవులు సంస్కృతనాటకములను ప్రబంధములుగా ననువదించిరి. దీనినిబట్టి వీరునాటకములను శ్రవ్యకావ్యములుగానే చూచి వాని సారస్వతప్రయోజనముతో మాత్రమే తుష్టి నొందిరని స్పష్టపడుచున్నది.

విజయనగర వినాశానంతరము తంజాపూరు మధురసంస్థానములు ప్రసిద్ధికి వచ్చెను. ఈ సంస్థానముల నాయకులు వాఙ్మయాభిరుచి కలవారై యనేకకావ్యములను దాము వ్రాసియుఁ, దమ యాశ్రితులచేత వ్రాయించియు నాంధ్రభాషను సర్వవిధముల నభివృద్ధిచేసిరి. వీరి పోషణమున యక్షగానములు విరివిగా రచింపఁబడి ప్రదర్శింపఁబడుచుండెను. ఈ యక్షగానములు జక్కులపాటలు అను తెనుఁగుపదమునకు సంస్కృతరూప మని పండితు లూహించుచున్నారు. వీని ప్రాచీనతను నిర్ణయించుటకుఁ దగిన సాధనసామగ్రి యిపుడందుబాటులో లేదు. తొలుఁదొలుత నివి సత్కవి రచితములు కాక నటులచేతనో, మఱి యే స్వల్పపాండిత్యము కలవారిచేతనో వ్రాయఁబడినవచనరూపసంబంధము కల పురాణపద్యములతో విలసిల్లుచుండెను. తరువాత తరువాత వీనిని జను లాదరించుటచే విద్వత్కవులు కూడ స్వతంత్రముగా నిట్టివానిని వ్రాయ నారంభించిరి. వీనిలోఁ గూడఁ బలు తెఱఁగులు కలవు. అందుఁ గూచిపూడివారు ప్రఖ్యాతిలోనికిఁ దీసికొని వచ్చిన యభినయప్రధానము లైన కలాపము లొకవిధము. ఈయక్షగానము లన్నియుఁ బద్య గద్యమయములై సూత్రధారునిచే నుచ్చరింపఁదగిన యుపోద్ఘాతపూర్వకము లై నట్టియు, పాత్రప్రవేశసూచకము లై నట్టియు వచనములతో నిండియుండును. కాని వీనిలో నేదియు రసవస్తు నాయక రూపములయందు స్థిరత్వమును గాంచినది కాదు. ఇవి శుద్ధ దేశిమార్గమునకుఁ జెందినవి. రూపమునందుఁగాని, లక్షణమునందుఁగాని సంస్కృతనాటకములకును వీనికిని సన్నిహితసంబంధ మేదియుఁ గానరాదు.

✓ ఇప్పు డిప్పుడు మనభాషలో వెలయుచున్న నాటకములకు సంస్కృత రూపకములే యాదర్శకములు. యక్షగానములే యిట్లు పరిణమించిన వనుకొనుట పొరపాటు. ✓ఇంకను ఈ యక్షగానములు కాలక్రమమున మాఱి రూపమునందుఁ గించిద్భిన్నములే యయ్యును హరికథలుగాఁ బరిణమించిన వనుకొనవచ్చును. ఇట్టివి శ్రీనాథుని యుగము నుండియు వ్రాయఁబడి యప్పుడప్పుడు ప్రదర్శింపఁబడుచుండుటచే నప్పటివారు వీని ప్రదర్శనముల నవలోకించుటతోడనే సంతుష్టులై సంస్కృత నాటకములను బోలిన నాటకములను మనభాషలో వ్రాయుటకుఁ బూనుకొనరైరి.

పైఁగా నాటకము లాడుటకుఁ గావలసిన నాటకశాలలు కాని, రంగపరికరములు కాని యప్పు డాంధ్రదేశమున నెచ్చటను లేకుండెను. కృష్ణదేవరాయలవంటి రసికులైన సార్వభౌములుకూడ శ్రవ్య కావ్యపఠనమాత్రముచేతనే తృప్తిఁ గాంచిరి కాని దృశ్యకావ్యములఁ గన్నారఁ జూచి యానందింపఁదగిన యేర్పాటులు కావించియుండలేదు. కృష్ణదేవరాయల సభలో నృత్యములు జరుగుచుండెనని స్వారోచిషపురప్రవేశసందర్భమున మనుచరిత్రలోఁ బెద్దనార్యుఁడు రచించిన 'చిలుకలకొల్కి కల్కి యొకచేడియ నాటకశాల మేడపై, నిలువున నిల్చి' అను పద్యమువలనఁ దెలియుచున్నది. కాని యది నాటక సంబంధి యగునో కాదో, యయినను ఆంధ్ర

నాటకములకును, వానికిని గల సంబంధ మెట్టిదో తెలిసికొనుట కాధారములు లేవు. ఇట్లే తంజాపూరు రాజుల కాలమునఁగూడ నృత్యగీతాది వినోదము లకై యొకశాల నిర్మింపఁబడెను. అది 'సరస్వతీమహాలు' అను పేరితో నిప్పటికిని నిల్చి యారాజుల కళాభిరుచిని వేనోళ్ల నుద్ఘోషించుచున్నది. ఇందుఁగూడ నాటకసంబంధులు కాని నృత్యములును, ఆ కాలమున విరివిగా నుండిన యక్షగానములు భాగవతములు మున్నగువాని ప్రయోగములును జరుగుచుండె ననుట కవకాశము కలదు కాని నాటకములు ప్రయోగింపఁబడె ననుటకుఁ దగిన నిదర్శనములు లేవు.

ఇట్లు నాటక ప్రయోగమునకు ముఖ్యావశ్యకములైన రంగ పరికరాదులు లేకపోవుటచేతను, నాటకపాత్రధారు లార్యధర్మము ననుసరించి సంఘమున నీచముగఁ జూడఁబడుచుండుటచేతను, ప్రభువులు సైతము నాటకకళ నభివృద్ధి చేయ నంతశ్రద్ధ వహింపకపోవుటచేతను ఆనాటి కవు లీవాఙ్మయశాఖయం దభిరుచి వహించి కావ్యరచనముచే దానిఁబరిపోషింపఁ బూనుకొనరైరి. ఈ కారణముచేతఁ బ్రజాసామాన్యమునకు నాటకప్రయోగ మెంత నీతిప్రదాయకమో, యెంత ప్రశాంతి ప్రదమో యనునంశము పూర్తిగా విస్మృతమై పోయెను. సంస్కృత నాటక ప్రయోగములు క్షీణించినతరువాత వీధినర్తకులయొక్కయు (Street dancers), వీధిగాయకులయొక్కయు (Opera singers) సంఖ్య యధికమగుటయు, విద్యావిహీనులగు ప్రాకృతజనులు వాని నాదరించుటయుఁ దటస్థించెను. కాన నాగరులును, విద్యావంతులును వీరియెడ నసహ్యాభావమును ప్రకటించుచుండిరి. ఈ పరిస్థితివలనఁగూడ నాటకవాఙ్మయ మన్నను, దద్రచన మన్నను ఆనాటి కవులకు నీరస భావమేకాని గౌరవము లేకపోయెను.

నాటకకళ సంస్కృతమున సమగ్రత్వమును బ్రాపించినది. తల్లక్షణముల సమగ్రముగా వివరించు లక్షణగ్రంథము లందుఁ బెక్కు వెలువడినవి. ఆంధ్రకవులు సంస్కృత కావ్యముల నాంధ్రీకరించినట్లు కొన్ని నాటకముల నాంధ్రీకరింపకపోవుట యటుండ నీ లక్షణగ్రంథములనైనఁ దెలుఁగున వెలయింపరైరి. తెలుఁగుభాషకుఁ, దత్కావ్యములకు స్వల్పముగ లక్షణములను వివరించినవారుకూడ ఈ రూపకలక్షణమును బరిత్యజించిరి. పదుమూఁడవ శతాబ్దియందలి విన్నకోట పెద్దన తన కావ్యాలంకారచూడామణిలో నీరూపకప్రశంస కొలఁదిగనైన నొనర్చియుండలేదు. పదునారవ శతాబ్దియందలి భట్టుమూర్తి నరసభూపాలీయ మను పేర విద్యానాథుని ప్రతాపరుద్రీయమును గొంచెమించుమించుగఁ బరివర్తనము చేయుచు నందలి రూపకప్రకరణమును విడిచివైచెను. ఆంధ్రనాటకరచనము కాని తత్ప్రయోగము కాని లేదు కదా- దానిలక్షణము నిక్కడ వివరింప నేల యని యతఁ డద్దానియెడ నౌదాసీన్యము వహించియుండును. నిజము పరికింపఁగా నీలాక్షణికులయెడఁ గొంచెమైనను దోషము లేదు. లాక్షణికుఁ డున్న కావ్యములను, దదంతర్భాగములను బరికించి వానికి లక్షణము వ్రాయువారేకాని లేనివానికి తామై యొకలక్షణము సృష్టించి భావికవు లీమార్గము ననుసరింపవలెనని శాసించునట్టివాఁడు కాఁడు. అందుచే రూపకనామవాచ్యములగు కావ్యముల యభావముచే లాక్షణికు లాశాఖ వాఙ్మయమునకు లక్షణము వివరింపరైరి. లక్షణాభావముచే కవులు రసాశ్రయములైన రూపకములను రచించి యాంధ్రభాషారామ నలంకరింపరైరి. ఫలితార్థ మేమనఁగా- నాటి దేశభాషలలోఁ బెక్కు ఆనాఁడే కళాసర్వస్వములైన రూపకములచే విరాజిల్లుచుండఁగా నాంధ్రమునకు నిన్న మొన్నటిదాఁక నాభాగ్యము లేకపోయినది.

ఇఁక పదునేడవశతాబ్దిలోనివాఁడగు నెలకూచి బాలసరస్వతి తాను రచించిన రాఘవ యాదవ పాండవీయములో 'కవి సమీహిత రంగకౌముదీనామ నాటకవిధాన ప్రతిష్ఠాఘనుండ' నని వ్రాసికొనెను. ఈరంగకౌముది నాటకవిధాన మని చెప్పఁబడుటచే నాటకలక్షణమును నిరూపించు నొక లక్షణగ్రంథమై యుండవచ్చును. ఆ గ్రంథము నామమాత్రావశిష్టమగుటచే నం దెట్టినాటకములకు లక్షణము విధింపఁబడెనో, యేలక్ష్యమును బట్టి యది వ్రాయఁబడెనో, లేక యది యే దేని సంస్కృతలక్షణమునకుఁ బరివర్తనమో తెలిసికొనుట కవకాశము చిక్కకున్నది. ఆ కాలమున యక్షగానములనియెడి ప్రదర్శనోచితమైన వాఙ్మ

యభాగము కొంచెముకొంచెముగాఁ దలచూపుచుండె నని యిదివఱకే చెప్పఁబడినది. ఈరంగకౌముది యట్టి వానిలక్షణమును నిరూపించు గ్రంథమేమో యని సందేహించుటకు వీలు కలదు. లేదా యిదికూడ నట్టి యక్షగానములలో నొకదాని పేరనుకొన్నను అంత బాధలేదు. అది లక్షణగ్రంథమైనను యక్షగానమైనను దానినామమును బట్టి పదునేడవ శతాబ్దిలో రంగోద్ధరణమునకై కొంత ప్రయత్నము జరుగుచుండె నని మాత్రము విశ్వసింపవచ్చును.

పదునెనిమిదవశతాబ్ది మొదటివాఁడగు కుందుర్తి వెంకటాచలపతి తన రచించిన కార్తికమాహాత్మ్యములో 'చాటుకృతులును బహువిధనాటకములు ... రచనగావించి పాండ్యవిభుచేఁ బ్రభుత్వసంపదలఁ గనితి' నని వ్రాసికొనెను. ఈతఁడు రచించిన యీ బహువిధ నాటకము లెట్టివో నిర్ణయించుట కవి యుపలభ్యమానములు కావు. పైఁగా నితని ప్రభువులును, రసికులు, కవులు, కవి పోషకులు నైన విజయరంగ చొక్కభూపాలాది పాండ్య భూపతులుకూడ నట్టి నాటకముల నభినయింపఁ జేసినట్లు కానఁబడదు. ఈతఁడు వ్రాసిన యీ నాటకములుకూడ నప్పుడు బహుళ ప్రచారమున నుండిన యక్షగానభేదములే యయి యుండును. కాఁగా మన మిప్పుడు కాంచుచున్న యాంధ్రనాటకములకుఁ బదునెనిమిదవ శతాబ్దిలో నగమువలకు బీజారోపణము కావింపఁబడలే దని యూహింపవచ్చును.

పందొమ్మిదవ శతాబ్ది యుత్తర భాగమున విజయనగర పురాధీశ్వరు లగు శ్రీమదానందగజపతిమహారాజులుంగారు సంస్కృత నాటకముల సారము చూఱలు గొన్నవార లగుటచేఁ దత్ప్రయోగ దిదృక్షువులై నాటకసంఘము నొకదానిని స్థాపించి శాకుంతలాద్యుత్తమనాటకములఁ గొన్నిటి నభినయింపఁ జేసిరి. తెలుఁగు దేశమున నాటక ప్రదర్శనము లారంభించుట కదియే ప్రథమమని స్థూలముగాఁ జెప్పవచ్చును. కాని యీ యుద్యమము చాలకాల మవిచ్ఛిన్నముగా సాగినదికాదు. మహారాజుగారి మరణముతో నాయనచే స్థాపింపఁబడిన నాటక సంఘముకూడఁ దూష్ణీంభావమును వహింపవలసి వచ్చెను. ఈ కాలమునఁ దెలుఁగు ప్రజలలో నాటకాభిరుచి విస్తరింపఁ జేసిన కొన్ని విశేషపరిస్థితు లంకురించెను. మహారాష్ట్రమునను, దదితర స్థలములందును ఆ కాలమున పార్శీ నాటక సంఘములు బయలుదేరి యా భాషయందలి నాటకములను విరివిగాఁ బ్రదర్శింప మొదలుపెట్టెను. ఈ నాటక సంఘములు తమతమ దేశములయందే నాటకములను బ్రదర్శించుటతోఁ దృప్తి నొందక తెలుఁగు కన్నడ దేశములకుఁ బోయి కొన్ని నాటకముల నభినయింప నారంభించెను. క్రొత్తగావచ్చిన యీ నాటక ప్రదర్శనము లపారమగు జనసంఖ్య నాకర్షించుచుండెను. ఇట్టి ప్రదర్శనములు తాత్కాలికముగాజరుగుచుండుటచేఁ దెలుఁగువారిలో స్వభాషయందుఁగూడ నట్టినాటకములుకొన్ని యుండి ప్రదర్శింపఁబడునో నుత్సాహముతోఁ జూచుట కభిరుచి జనించెను. ఈ పరిస్థితుల నన్నిటిని బరికించుచుండిన పండితు లప్పుడప్పుడే సంస్కృత నాటకముల నాంధ్రమునకుఁ బరివర్తింపఁ బూనుకొనిరి. తొలిదినములలో నాంధ్ర వాఙ్మయమునవలెనే నాటకవాఙ్మయముగూడ మునుముందు బరివర్తనములతోనే ప్రారంభమగుట యిటఁ బరిశీలింపఁదగినది.

ఈనాటకముల పరివర్తనపద్ధతికిని, పూర్వకవుల పరివర్తనపద్ధతికిని విశేష తారతమ్య మున్నది. పూర్వకవులు తగినస్వాతంత్ర్యము వహించి పరివర్తనములు సైతము స్వతంత్రములుగాఁ గానిపించున ట్లొనర్చిరి. వీ రట్లుగాక నాటకములందలి పద్యములకు ప్రతిపదపరివర్తనముచేయుట కారంభించుటచే వీపద్యముల నడక సామాన్యముగాఁ గుంటువడి శ్రుతికటువుగా నుండును. వీ రాశ్లోకముల నాంధ్రీకరించునప్పుడు నందలిపదము లెల్లఁ బరివర్తితము లైనవో లేదో పరిశీలింతురుకాని యందలిభావములు మూలమునందువలె సులభద్యోతకమై సమగ్రముగా వ్యక్తములైనవో లేదో చూడరు. అందుచే వీ పద్యములు కొన్నిచోట్లఁ గేవల నీరసపదముల సముదాయమువలెఁ దోఁచును. పైఁగా వీరు భావవ్యక్తి కంత ప్రాధాన్యము నీయకపోవుట చేతను,మూలముకంటె పరివర్తనము సులభముగ నున్నచో తమ పాండిత్యమునకు భంగము వాటిల్లు నను భ్రాంతిచేతను మూలములోని పదముల

కంటెఁ గ్లిష్టతరములైన పదముల నీ పరివర్తనములయందు వాడఁజాలరు. అందుచే మూలసాహాయ్యము లేనిదే వీరిపరివర్తనముల సంపూర్ణభావము చదువరులకుఁ దెలియనే తెలియదు. అనువాదకుఁ డెంత యసామాన్య ప్రజ్ఞకలవాఁడైనను ననువాదము గుణమునందును, అర్థసౌలభ్యమునందును, రసస్ఫురణయందును మూలమునంత పటువుగా నుండుట దుర్లభము. అందును పైని చెప్పఁబడినయట్టి దోషములుకూడఁ గొన్ని యుండినచోఁ బరివర్తనములు మూలములతోఁ బోల్చి చూచిన మిక్కిలి నీరసములై కానవచ్చును. ఈ కారణముచేతనే సంస్కృతనాటకములు పూర్వకవులచే నాంధ్రీకరింపఁబడలేదని తెలుఁగువారికి విచారము.

ఎట్లైనను సంస్కృతనాటకముల పరివర్తనము ప్రారంభ మగుటతోడనే యాంధ్రవాఙ్మయమున నొక నూతనోత్తేజము పొడసూపినది. ఆ కాలమున మచిలీపట్టణమున నుపాధ్యాయులుగా నున్న శ్రీ కోరాడ రామచంద్రశాస్త్రిగారు నాటకాభావముచే మన వాఙ్మయమునకుఁ గల్గిన తీరని కొఱంతను వారింప భట్టనారాయణుని వేణీసంహారనాటకము నాంధ్రీకరించిరి. కాని యేకారణముచేతనో యా పరివర్తనము ముద్రితము కాలేదు. (వీరు 'మధుకరీమంజరీయ' మనుస్వతంత్రనాటకమునుగూడ రచించిరి. తరువాతఁ జెన్ననగర నివాసులగు శ్రీ కొక్కొండ వెంకటరత్నముపంతులుగారు ధర్మభట్టకృతమైన నరకాసురవిజయవ్యాయోగమున ననువదించి ప్రకటించిరి. ఈ కాలముననే విశాఖపట్టణస్థులగు శ్రీ పరవస్తు వెంకటరంగాచార్యులుగారు కాళిదాసుని యభిజ్ఞానశాకుంతలము నాంధ్రీకరింప నారంభించి యందలి కొంతభాగమును దాము ప్రకటించుచుండిన మాసపత్రిక ముఖమున వెలువరించిరి. కాని యా గ్రంథ మసంపూర్ణముగ నుండఁగనే యాచార్యులుగారు దివంగతులగుటచే నది యట్లే యుండిపోవలసి వచ్చెను. తరువాత శ్రీ కందుకూరి వీరేశలింగముపంతులుగా రా నాటకమునే తమ నిసర్గమధురమైన శైలిలో రచించి తొలుత వివేకవర్ధని పత్రికామూలమునను, దరువాతఁ బుస్తకరూపమునను వెలయించిరి. వీ రిట్లు సంస్కృతనాటకములను మఱికొన్నింటిని దెలిఁగించుటయే కాక యాంగ్లేయ మహాకవి యగు షేక్స్పియరు రచించిన మర్చెంటు ఆఫ్ వెనిస్ (Merchant of Venice), కామెడీ ఆఫ్ ఎర్రర్సు (Comedy of Errors) అను నాటకములనుగూడఁ దెలుఁగునకుఁ దర్జుమా చేసిరి. ఈ కాలముననే శ్రీ గురుజాడ రామమూర్తిపంతులుగారు, వావిలాల వాసుదేవశాస్త్రిగారు మొదలగు మఱికొందఱు పండితులు సంస్కృతాంగ్లములనుండి మఱికొన్ని నాటకముల ననువదించి ప్రకటించిరి. వీరేశలింగముపంతులుగా రిట్లు నాటకములను రచించుటయే కాక యొక నాటకసంఘమును గూడ స్థాపించి తమ రత్నావళిని, Comedy of Errors ను అప్పుడప్పుడభినయింపఁజేయుచుండిరి. ఇట్టి సంఘములు మఱికొన్ని విశాఖ
ణము, విజయనగరము మొద
పెద్దపెద్ద పట్టణములలో స్థాపింప
యచ్చటి ప్రజలను బరివర్తితనా
ముల ప్రదర్శనములచే నానంది
జేయుచుండెను. గుంటూరిలో
కొండుభొట్ల సుబ్రహ్మణ్యముగా
సంస్థనే యొకదానిని నెలకొల్పి తా
గావించిన పరివర్తనములను, పా
ణిక కథావస్తువిలసితము లగు స్వ
త్రనాటకములను బ్రదర్శింపఁజే
చుండిరి.

ఈ కాలముననే (1880 మొ
లు) బళ్లారినగరమున సరసవినో
సభయనియును, సుమనోరమా స
యనియును రెండు నాటకసంఘ
లేర్పడి మిక్కిలి సమర్థులును, నాట
రచనాప్రదర్శనములయం దసమా
ప్రతిభాశాలులును నగు నిరువు
న్యాయవాదులచే జయప్రదముగ
గొనసాగింపఁబడుచుండెను. వీ రి
వురును సంస్కృతనాటకములఁ
వర్తించుజోలికిఁ బోక చరిత్రమ
నుండియుఁ, బురాణప్రబంధము
నుండియు వస్తువులను గ్రహించి
కృతనాటకములను రచించిరి. ఆం
గీర్వాణాంధ్రభాషలయ
దసమానవైదుష్యము కలవా రగు
టచే వీరి నాటకములయం దాంగ్ల
సంస్కృతసరణులు రెండును గా
వగును. ఆంగ్లభాషా సంప్రదాయమ
ననుసరించి యిరువురును విషాదాం
నాటకములు (Tragedies) రచించిరి
వానిలో రామకృష్ణమాచార్యుల
విషాద సారంగధరమును, శ్రీనివాస
రాయలవిజయనగర రాజ్యపతనమును

నాంధ్రు లందఱు నెఱిఁగినవే. ఈకవు లిరువురును గొంచె మించుమించుగా సమకాలికులును, సహపాఠులును నగుట వీరినిగూర్చి యొక విషయము చెప్పవలసియున్నది. అది వీరినాటక వస్తువుల సమానభావము. పరస్పరస్పర్ధచేతనుబలె వీరిలో నొకరు నాటకీకరించిన వస్తువునే రెండవవారును మరల గ్రహించి నాటకముగా వ్రాయుట కానవగును. వీరిరువురును మంచి నటకులుకూడ నగుటచేఁ దమ రచించిన నాటకములను దాము స్థాపించిన నాటక సమాజములచే బళ్లారి, మదరాసు మున్నగు పట్టణములలోఁ బ్రదర్శించుచుండిరి. వీరు రచించిన నాటకములు పెక్కు అముద్రితములైననుఅప్రదర్శితములైనవి తక్కువ. ఆంధ్రనాటక వాఙ్మయమున కింత రూప మొసంగి ప్రాణముపోసిన యీ మహనీయమూర్తు లిరువురు నాంధ్రులకుఁ జిరస్మరణీయులు. అచ్చటచ్చట నాంగ్ల నాటక పద్ధతుల ననుసరించిన వీరి నాటకములలో సంస్కృతనాటక ప్రాతికూల్యము కొంత కానవచ్చుటచేఁ బండితులకు వీరి నాటకములపై నంత యభిమానము లేకున్నను ప్రదర్శనకాలమున నివి యాకర్షించు ప్రేక్షకసమూహమే వీరి నాటకముల యభిరంజకత్వమునకుఁ దార్కాణము. ఏ కారణముచేతనో శ్రీనివాసరాయల నాటకములకుఁ గృష్ణమాచార్యులవారి నాటకముల కున్నంతవ్యాప్తి కానరాదు. వారు రచించిన నాటకము లన్నిటిలో విజయనగర రాజ్యపతనముమాత్రమే మొదటదటప ప్రదర్శింపఁబడుట కానసగును. ఆచార్యులుగారి నాటకములలోఁ బ్రదర్శనానుకూల్యము మెండగుటచేఁగాఁబోలును జనాదరముబడయని నాటకమే లేదు. ఇట్లు నాటకము లనినఁ దెలుఁగుప్రజలకును, గవులకును విశేషాభిరుచిని గలిగించిన యీ పార్సీ నాటక సంఘములు ప్రశంసనీయములు. తరువాత బయులుదేరిన కవులు కేవల పరివర్తనములతోఁ దృప్తిపడక సంస్కృత మార్గానుసారముగనే కొన్ని స్వతంత్రనాటకములను వ్రాయఁబూనిరి. ఆధునికులు వ్రాయుచున్న నాటకములలో నాంగ్లవంగభాషాప్రభావము కూడ సుంత గోచరించుచున్నది.



రాసలీల - గోపికలు

రాసక్రీడలోని అంతరార్థము
గోపికల ప్రేమయందలి గూఢతత్త్వము

శ్రీ సముద్రాల రాఘవాచార్యులు

సర్వాంగీణముగా కృష్ణదాసులై, సర్వమును కృష్ణమయముగా భావించి, ఇహమునందును పరమునందును ప్రాప్యప్రాపకము లన్నియు శ్రీకృష్ణుడుగానే యెంచి నిరుపాధికమైన భక్తిసామ్రాజ్యమునకు అధికారిణులై వెలయుచున్న గోపికల సౌశీల్యమునకు వంకపెట్టుట సంప్రదాయజ్ఞాన అపరిజ్ఞతకు గుర్తు.

రాసక్రీడ యన్న శబ్దము విన్నపుడు క్రీడావిశేష మగు రాసలీల స్ఫురించును. కాని - గోపీకృష్ణచరిత్రాత్మక మగు రాసలీల లేనిచో ఆ వాఙ్మయము జీవరహితము కాగలదు. అందులకే ఈవ్యాసమునకు "రాసలీల - గోపికలు" అని పేరుపెట్టవలసి వచ్చినది. రాస మనగా స్త్రీపురుషులు చేతులు పెనవైచికొని మండలాకారముగా చేర్పడి చేయు నృత్యమని నాట్యశాస్త్రము వలన ద్యోతక మగుచున్నది. సగటున కృష్ణ చరిత్రలో రాస మని వ్యవహరింపబడుచున్నను భిన్నగ్రంథములలో ఈసందర్భమున హల్లీసక మను శబ్దముకూడ ప్రయోగింపబడి యున్నది. ఈ శబ్దమునకుగూడ నాట్యాచార్యులు పైయర్థమునే వ్రాసియున్నారు. ఏపేరుతో వ్యవహరించినను అందలి తత్త్వములో మాత్రము భేదము కానరాదు.

రాసలీల రామణీయకత

కృష్ణచరిత్ర ప్రతిపాదకములైన పురాణములలో పెక్కింట రాసలీల వర్ణింపబడి యున్నది. రాసలీల తెలుగుదేశము నందే కాక భారతదేశమునందలి అనేక ప్రాంతములలో జానపద నృత్యములలో, వినోదములలో ప్రముఖస్థానము నంది యున్నది. అది రమణీయదృశ్య మనుట కెట్టి సందియమును లేదు. ఆనాడు శ్రీకృష్ణుడు గోపికలతో రాసలీల సలిపినప్పుడు సకల దేవతలును సకుటుంబముగా వచ్చి దర్శించి ధన్యులైనట్లు భావించి రన్నచో దాని వైభవము, దానిలో గల ఆనందము ఇట్టి దని వేరుగా చెప్ప నక్కరయుండదు. ఆ కారణముచేతనే ఈవ్యాసమున విశేషించి పరామృశింపబడుచున్నది.

వాఙ్మయములో దానిస్థానము

రాసలీల వైష్ణవతత్త్వమునందే గాక వాఙ్మయమునందుగూడ మనోహరమైనది. అది కృష్ణోపాసకులచేత విశ్వసాహిత్యమున సర్వోన్నతస్థానమున నుంపబడియున్నది. దానియం దనిర్వచనీయమును, నతిమానుషమును నగు పరమార్థ మిమిడియున్నదని వారి వివరణము. సత్యమున కది శ్రీకృష్ణపరమున లీలామాత్రముగా నున్నను గోపీపక్షమునం దీశ్వరోపాసనావిలసితమే కాగలదని పరిశీలనము వలన తెలిసికొనబడుచున్నది. విదేశీయులును, విమతస్థులును నగువారు కొందరీ విలాసము దోషజుష్టమనియు, నీపరమార్థమునందు క్షుద్రమైన కామాంకము ఉన్నదనియు నిందించుచున్నారు. సగుణోపాసకులు దానిని పరిరక్షించుకొన లేకపోలేదు. ఎందరో తత్త్వార్థవివరణమును, తర్కమును నుపయోగించిరి. రసమూర్తుల కౌశల్యము మనోగోచరమైనది.

బ్రహ్మవైవర్త పురాణమునందలి రాసక్రీడావర్ణనము

"నందరాజపుత్రమగు శ్రీకృష్ణపరబ్రహ్మము కమ్మగిట వనముకొని రాధాదేవి పరమానందముతో నాకాళిందీతీరభూములలో పర్యటింపసాగినది. పరమాత్మ భౌతికసృష్టి యందలి సౌందర్యసారమును నిగ్గులుతీర్చి యాచిన్నికాలునకు వర్ణించి చూపుచుండెను. తత్పరోక్షమున వారినిగూర్చి తా నెన్నియుకుమపాటులు నుడివినదియు, తా నెంత విలపించినదియు చెప్పినట్లు చెప్పక, చేసినట్లు చేయక, ప్రియుని గాఢపరిరంభణము ననుభవించు రీతి, ఉపాసితమును దైవము తన చేతులలో పడినయట్లు ఒకరకమైన యానందమును, తన్మయతను, పారవశ్యమును నభినయించుచు, ఆనందనికేతనమను నికుంజ భవనమునకు గొంపోయెను. రాధ అపుడు రాసమండలమును స్మరించెను. తోడనే వన మండలము మనోహరవిహారభూమిగా మారి పోయెను. వెంటనే కపురీటలోనున్న శ్రీ కృష్ణుడు కిశోరమూర్తియై గోలోకమునం దలి తనను స్మృతికి గొనివచ్చి దానిని చెర

చేర్చెద నని పరసాలాపము లాడుచుండగా బ్రహ్మ యా ప్రదేశమునకు వచ్చి రాధాకృష్ణుల ననేకవిధముల స్తుతించి, స్వయముగా దాను గన్యాప్రదాతయై వారి కిరువురకును యథాశాస్త్రముగా వివాహము గావించెను. బ్రహ్మ యంతర్హితుడైన పిదప వారు రాసమండలవిహారము గావించిరి."

ఇతర గ్రంథములందలి వర్ణన

బ్రహ్మవైవర్తమునందలి పై రాసక్రీడకును ఇతర గ్రంథములయందలి రాసక్రీడకును పోలిక లేదు. విష్ణుపురాణ, భాగవత, హరివంశములందుగూడ రాసవిహారము వర్ణింపబడియున్నను వానియందు రాధాప్రస్తావము గానరాదు. అయినను రాసక్రీడనుగురించిన ప్రస్తావము రాధాచరిత్రమునందు ప్రాముఖ్యము వహించియున్నది. రాధాతత్వనిష్పత్తియందు రాసమండలమునకును, రాధకునుగల సంబంధము వ్రాయబడియున్నది. రాధాకృష్ణు లధిష్ఠానములుగా కల్పింపబడియున్న నూతన వైష్ణవదర్శనమునందు రాసము విశిష్ట స్వరూపము గాంచియున్నది. కనుక రాసమండలమునందలి రాధాకృష్ణ(గోపికాకృష్ణ) సంబంధమును సమన్వయించి చూడనిచో విషయము మనకు సుబోధము గాజాలదు.

రాసక్రీడావిమర్శన మన్న నాధునిక కృష్ణోపాసకులకు ఆరాధనాంతిమావస్థగా నున్న గోపికాకృష్ణసంబంధపరామర్శన మని తలంపవలయును.

ప్రాచీన సంస్కృత వాఙ్మయమునందు శ్రీ కృష్ణచరిత్రప్రతిపాదక మైన మొదటి గ్రంథము మహాభారత మని చరిత్రకారులు నిర్ణయించియున్నారు. దానియందు గోపికాకృష్ణ సంబంధము బహిరంగముగా కన్పించకపోవుటచేత నిది కల్పితము కావచ్చునని చరిత్రకారులలో కొందరి యూహ. ఏమైనను కృష్ణుని 'గోపీజనప్రియత్వము'ను భారత మంగీకరించుచున్నది. మహాభారతముతరువాత నీ విషయమున ప్రమాణగ్రంథము విష్ణుపురాణము. దానిలో పంచమాంశమున బదమూడవ యధ్యాయమునందు గోపీకృష్ణచరిత్ర మభివర్ణింపబడియున్నది. మహాభారతఖిలగ్రంథమగు హరివంశములో ఇరువదియవ అధ్యాయమున పై యితివృత్తము వర్ణింపబడియుండుట గాననగును. ఈ రెండును వేర్వేరు గ్రంథములలో నొకడే మహాకవి—కాదు, మహర్షి—నిర్వచించిన సిద్ధాంతములు. వీని పరస్పరైక్యమును విచారించినపిమ్మట శ్రీ భాగవతములోని రాస పంచాధ్యాయిని గూర్చి విమర్శించుట సమంజసము. ఆ రెండుగ్రంథములలోని రాసలీలావర్ణనము క్రింద పొందు పరుపబడుచున్నవి:

"కృష్ణస్తు విమలం వ్యోమ
శరచ్చంద్రస్య చంద్రికాం,
తథా కుముదినీం ఫుల్లా
మామోదితదిగంతరాం.

వనరాజీం యథాకూజ
ద్భృంగమాలాం మనోరమాం,
విలోక్య సహ గోపీభి
ర్మనశ్చక్రే రతింప్రతి.

సహ రామేణ మధుర
మతీవ వనితాప్రియం
జగౌ కలపదం శౌరి
ర్నానాతంత్రీకృతస్వనం.

రమ్యం గీతధ్వనిం శ్రుత్వా
సంత్యజ్యావసథాంస్తదా,
ఆజగ్ము స్త్వరితా గోప్యో
యత్రాస్తే మధుసూదనః.

శనైశ్శనై ర్జగౌ గోపీ
కాచిత్ తస్య లయానుగం
దత్తావధానా కాచిత్తు
తమేవ మనసా స్మరన్.

కాచిత్కృష్ణేతికృష్ణేతి
ప్రోక్త్వా లజ్జాముపాగతా
యయౌచ కాచిత్ ప్రేమాంధా
తత్పార్శ్వ మవిలజ్జితా.

కాచిదావసథస్యాంతః
స్థిత్వా దృష్ట్వా బహి ర్గురూన్,
తన్మయత్వేన గోవిందం
దధ్యౌ మీలితలోచనా.

తచ్చింతావిపులాహ్లాద
క్షీణపుణ్యచయా తథా
తదప్రాప్తిమహాదుఃఖ
విలీనా శేషపాతకా.

చింతయంతీ జగత్సూతిం
పరబ్రహ్మస్వరూపిణం,
నిరుచ్ఛ్వాసతయా ముక్తిం
గతాన్యా గోపకన్యకా.

గోపీపరివృతో రాత్రిం
శరచ్చంద్రమనోరమాం,
మానయామాస గోవిందో
రాసారంభరసోత్సుకః,

గోప్యశ్చ బృందశః కృష్ణ
చేష్టా స్వాయత్తమూర్తయః,
అన్యదేశం గతే కృష్ణే
చేరుర్బృందావనాంతరం.

* * *

తతో దదృశు రాయాంతం
వికాసిముఖపంకజం,
గోప్య స్త్రైలోక్యగోప్తారం
కృష్ణ మక్లిష్టచేష్టితం,
కాచిదాలోక్య గోవింద
మాయాంత మతిహర్షితా,
కృష్ణకృష్ణేతికృష్ణేతి
ప్రాహ నాన్య ముదైరయత్,
కాచిత్ భ్రూభంగురం కృత్వా
లలాటఫలకం హరిం
విలోక్య నేత్ర భృంగాభ్యాం
పపౌ తన్ముఖపంకజం.
కాచిదాలోక్య గోవిందం
నిమీలితవిలోచనా,
తస్యైవరూపం ధ్యాయంతీ
యోగారూఢేవ చాబభౌ.
తతః కాచి త్ప్రియాలాపైః
కాశ్చిత్ భ్రూభంగవీక్షితైః,

నిన్యేఽనునయమన్యాశ్చ
కరస్పర్శేన మాధవః.

తాభిః ప్రసన్నచిత్తాభి
ర్గోపీభిస్సహ సాదరం
రరామ రాసగోష్ఠీభి
రుదారచరితో హరిః.

రాసమండలబంధోఽపి
కృష్ణపార్శ్వ మనుజ్ఝతా,
గోపీజనేన నైవాభూ
దేకస్థానస్థిరాత్మనా,
హస్తే ప్రగృహ్య చైకైకాం
గోపికాం రాసమండలీం,
చకార తత్కరస్పర్శ
నిమీలితదృశాం హరిః.

తతః ప్రవవృతే రాస
శ్చలద్వలయనిస్వనః,
అనుయాతశరత్కావ్య
గేయగీతి రనుక్రమాత్.

కృష్ణశ్శరచ్చంద్రమసం
కౌముదీం కుముదాకరం
జగౌ గోపీజనస్త్వేకం
కృష్ణనామ పునఃపునః.
పరివర్తశ్రమేణైకా
చలద్వలయలాపినీం,
దదౌ బాహులతాం స్కంధే
గోపీ మధునిఘాతినః.

కాచిత్ప్రవిలసద్బాహుః
పరిరభ్య చుచుంబ తం
గోపీగీతస్తుతివ్యాజ
నిపుణా మధుసూదనం.

గోపీకపోలసంశ్లేష
మభిపత్య హరేర్భుజౌ
పులకోద్గమసస్యాయ
స్వేదాంబు ఘనతాం గతౌ.

రాసగేయం జగౌ కృష్ణో
యావత్ తారతరధ్వనిః,
సాధు కృష్ణేతి కృష్ణేతి
తావద్వా ద్విగుణం జగుః.
గతేఽనుగమనం చక్రుః
బలనే సమ్ముఖం యయుః,
ప్రతిలోమానులోమాభ్యాం భేజు
ర్గోపాంగనా హరిం.

స తథా సహ గోపీభి
రరామ మధుసూదనః,
యథాబ్దకోటిప్రమితః
క్షణస్తేన వినాభవత్.

తా వార్యమాణాః పతిభిః
పితృభిర్భ్రాతృభిస్తథా,
కృష్ణం గోపాంగనా రాత్రౌ
రమయంతి రతిప్రియాః.

సోఽపి కైశోరకవయో
మానయన్మధుసూదనః,
రేమే తాభి రమేయాత్మా
క్షపాసు క్షపితాహితః."

—విష్ణు. పంచమాంశ. ౧౩ అధ్యా.

ఈ క్రిందిశ్లోకములు హరివంశము లోనివి:

"కృష్ణస్తు యౌవనం దృష్ట్వా
నిశి చంద్రమసో వనం
శారదీంచ నిశాం రమ్యాం
మనశ్చక్రే రతిం ప్రతి.

స కరీషాంగరాగాసు
వ్రజరథ్యాసు వీర్యవాన్,
వృషాణాం జాత దర్పాణాం
యుద్ధాని సమయోజయత్.

గోపాలాంశ్చ బలోదగ్రాన్
యోధయామాస వీర్యవాన్
వనే స వీరో గాశ్చైవ
జగ్రాహ గ్రాహవద్విభుః.

యువతీర్గోపకన్యాశ్చ
రాత్రౌ సంకాల్యకాలవిత్
కైశోరకం మానయన్వై
సహ తాభిర్ముమోద హ.

తాస్తస్య వదనం కాంతం
కాంతా గోపస్త్రియో నిశి,
పిబంతి నయనాక్షేపై
ర్గాం గతం శశినం యథా.
హరితాళార్ద్రపీతేన
స కౌశేయేన వాససా,
వసానో భద్రవసనం
కృష్ణః కాంతతరోఽభవత్.

స బద్ధాంగదనిర్వ్యూహ
శ్చిత్రయా వనమాలయా,
శోభమానోఽపి గోవిందః
శోభయామాస తద్వ్రజం.

నామ దామోదరేత్యేవం
గోపకన్యాస్తదాబ్రువన్,
విచిత్రం చరితం ఘోషే
దృష్ట్వా తత్తస్య భాస్వతః.

తాస్తం పయోధరోత్తుంగై
రురోభిః సమపీడయన్,
భ్రామితాక్షైశ్చ వదనై
ర్నిరీక్షంతే వరాంగనాః.

తా వార్యమాణాః పితృభి
ర్భ్రాతృభి ర్మాతృభి స్తథా
కృష్ణం గోపాంగనా రాత్రౌ
మృగయంతే రతిప్రియాః.

తాస్తు పంక్తీకృతాస్సర్వా
రమయంతి మనోరమం,
గాయంత్యః కృష్ణచరితం
ద్వంద్వశో గోపకన్యకాః.
కృష్ణలీలానుకారిణ్యః
కృష్ణప్రణిహితేక్షణాః,
కృష్ణస్య గతిగామిన్య
స్తరుణ్యస్తా వరాంగనాః.
వనేషు తాళహస్తాగ్రైః
కుట్టయంత్య స్తథాపరాః,
చేరుర్వై చరితం తస్య
కృష్ణస్య వ్రజయోషితః.
తాస్తస్య నృత్యం గీతంచ
విలాసస్మితవీక్షితమ్,
ముదితాశ్చానుకుర్వంత్యః
క్రీడంతో వ్రజయోషితః.

భావనిష్యందమధురం
గాయంత్యస్తా వరాంగనాః,
వ్రజంగతా స్సుఖం చేరు
ర్దామోదర పరాయణాః.
కరీష పాంసుదిగ్ధాంగా
స్తాః కృష్ణ మనువవ్రిరే,
రమయంత్యో యథా నాగం
సంప్రమత్తం కరేణవః.
తమన్యా భావవికచై
ర్నేత్రైః ప్రహసితాననాః,
పిబం త్యతృప్తా వనితాః
కృష్ణం కృష్ణమృగేక్షణాః.
ముఖం యస్యాబ్జసంకాశం
తృషితా గోపకన్యకాః,
రత్యంతరగతా రాత్రౌ
పిబంతి రతిలాలసాః.
హాహేతి కుర్వత స్తస్య
ప్రహృష్టాస్తా వరాంగనాః,
జగృహుర్నిస్సృతాం వాణీం
సామ్నా దామోదరేరితాం.
తాసాం గ్రథితసీమంతా
రతి శ్రాంత్యాకులీకృతాః
చారు విస్రంసిరే కేశాః
కుచాగ్రే గోపయోషితాం.
ఏవం స కృష్ణో గోపీనాం
చక్రవాళైరలంకృతః,
శారదీషు సచంద్రాసు
నిశాసు ముముదే సుఖీ.”

—హరివంశము, 20 అధ్యాయము.

ఆవర్ణనలలోని సామ్య, వైషమ్యములు

పై రెంటియందును సామ్యమెంతయున్నదో విభిన్నతకూడ నంతేగానున్నది. విష్ణుపురాణమునందలి వర్ణనములో నుపయోగింపబడిన 'రమ్' ధాతువుయొక్క అన్ని రూపములకును క్రీడార్థము చెప్పినయెడల నెందు లేశమైనను నింద్యకామము స్ఫురింపకపోవుటటుండ పరిపూర్ణమగు భక్తియోగము ప్రకాశిత మగుచున్నది. రెండు గ్రంథభాగములను జాగ్రత్తగా పోల్చిచూచినచో కవితాగాంభీర్యౌదార్యములందు విష్ణుపురాణకారునికంటె హరివంశకారుడు కొంచెము లొజ్జగా గాన్పించుచున్నాడు. విష్ణుపురాణమునందు పరమభక్తిప్రదర్శనమునం దుపయుక్తములైన భావములను అనువదించుటలోను, విరళించుటలోను హరివంశకారుడు ఒడుదొడుకులలో బడి మొత్తముమీద వలపుపోలను త్రొక్కి చూడకుండజాలక పోయెను. పై రెండు గ్రంథములలోని భేదమును సంగ్రహముగా చెప్పుచు విష్ణుపురాణమున చపలబాలిక లానందచంచల లనియు, హరివంశమున విలాసప్రియ లనియు బంకించంద్రుడు నుడివియున్నాడు. రాసక్రీడా సంబంధమగు నితివృత్తము రెంటియందును సమానముగానే చూపట్టుచున్నది.

భాగవతకారుని ధోరణి

ఇట్లు భగవద్భక్తి విలాసముగా పై రెండు గ్రంథములందును వర్ణింపబడియున్న గోపికాకృష్ణసంబంధప్రకాశకమగు నీరాలి లీలను భాగవతకారు డెట్లు రచించెనో మనము గమనింపగల్గియున్నచో నిందలి నిగూఢతత్త్వము సుబోధము కాగలుగుచున్నది. భాగవతదశమస్కంధములోని 29-వ అధ్యాయము మొదలు 33-వ అధ్యాయము వరకుగల గ్రంథమునకు రాసపంచాధ్యాయి యని పేరు. అందు మొదటి అధ్యాయమున శ్రీకృష్ణుడు శరచ్చంద్రికామధుర మగు యామినిలో వేణువును పూరించుటయు, ఆ వేణువాదమును విని గోపికలు కృష్ణదర్శనలాలసలై పరుగెత్తికొనిపోవుటయు, అటు లరుదెంచిన గోపికలనుగాంచి లోకవిరుద్ధముగా నిట్లిలు వెడలి వచ్చుట ధర్మసమ్మతము గాదని కృష్ణుడు ధర్మోపన్యాసము గావించుటయు, వారు (గోపికలు) తమరాకయందలి యౌచిత్యమును భక్తిమూలమున రక్షించికొనగా నాతడు సంతృప్తుడై వారలతో నాత్మారాముడై క్రీడించుటయు వర్ణింపబడియున్నది.

అందులోనే రెండవ యధ్యాయమున కృష్ణాన్వేషణమును, మూడవదానిలో గోపికాగీతలును, నాల్గవదానిలో శ్రీకృష్ణుని పునర్దర్శనమును వర్ణింపబడియున్నవి. ఈ మూడధ్యాయములలోను సూక్ష్మముగా పరిశీలించి చూచినచో వైషయికవ్యవహారము కన్పింపదని చెప్పుటకు వలనుపడదు. ఇక కడపటిదగు ముప్పదిమూడవయధ్యాయమున రాసక్రీడ వర్ణింపబడియున్నది. వర్ణనాంశములందు పైరెండు పురాణములకును దీనికిని సామ్యమున్నను ఆదర్శమునందు కొంచెము భేదము కన్పించుచున్నది. గోపికలు శ్రీకృష్ణుని పతిగా వరించుటచేత గాబోలు నా సందర్భములలో నింద్రియ సంబంధమైన కామము పరిలక్షితము గాక తప్పలేదు. బ్రహ్మవైవర్తమునందుగూడ భక్తిపారమ్యముకంటె శృంగారమే విపులముగా వర్ణింపబడియున్నది. గ్రంథవైరస్యభయముచే నది యంతయూ నిచట నుల్లేఖింపబడలేదు.

విమర్శకుల ప్రతికూలవిమర్శ

పై మూడు గ్రంథములందును కనుపించుచున్న యింద్రియలాలసత్వ మాధారముగా పౌరస్త్యపాశ్చాత్య విమర్శకులు కొందరు శ్రీకృష్ణగోపికాసంబంధము కామజుష్టమనియు, భక్తిదూరమనియు చెప్పుచున్నారు. ఆవాదములోని గుణాగుణవిచారము మన కప్రకృతము గాజాలదు.

గోకులలీలల సింహావలోకనము

గోపికాచరిత్రలోని పరమాదర్శమగు నీ భాగమును సమన్వయింపవలసివచ్చినపుడు శ్రీకృష్ణుని గోకులలీల నంతయు నొక్కసారి సింహావలోకనము చేయకతప్పదు. బృందావనమున నవతరించిన గోగోపగోపికలందరును శ్రీరామావతారమునాటి మహర్షులును, స్త్రీలును, వేదములును నని గర్గసంహితలో గలదు. గోలోకమునుండి రాధికాగోపీయూథములును, గోగోపాలురును శ్రీకృష్ణకైంకర్యమునకై యవతరించియుండినట్లు బ్రహ్మవైవర్తమునందు వ్రాయబడియున్నది. దాని

యందలి సత్యాసత్యములతో మనకేమి ప్రసక్తి లేదు. కాని ఈ సందర్భమున మనము తెలిసికొనదగినది బృందావనములోని సమస్త పదార్థములును సాధారణప్రకృతిభిన్నమైన పవిత్రమూర్తులవిమాత్రమై యున్నది. శ్రీకృష్ణుడుకూడ మధురయందు దవతరించిన కొన్ని గడియలకే అట విడిచి బృందావనము చేరుటకు కారణము భగవద్వియోగ విహ్వలులగు బృందావన భక్తులను ఆనంద పరచుటకే యని భక్తియోగుల విశ్వాసము. "మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద" యను భగవద్వాక్యము దానిని ధ్రువపరచుచున్నది. అట్లు బృందావనప్రవేశ మొనర్చిన కృష్ణభగవానుడు బృందావనములోని సకలజీవకోటిని తన యప్రాకృతసౌందర్యముచే తన్మయులను గావించెను. ఆ మహానుభావుడు బృందలో కాలు పెట్టినదాది అనేకోత్సవములు, మహత్తరానందములు గోపికల హృదయము నాకర్షించెను. శ్రీకృష్ణరచితములగు దనుజసంహార కార్యములు వారి హృదయమునందు భగవద్బుద్ధిని కలిగించెను. నవనీతాపహరణాది వృత్తాంతములలో తమకును, మృద్భక్షణాదికములలో యశోదకును గల్గిన యనుభవము పైయూహను బలపరుపజాలియుండెను. ఇట్టి అప్రాకృత సౌందర్యశక్తులచేత గోకులమును ఆనందింపజేయుచున్న కృష్ణునియం దందరును బద్ధానురాగులైరి. ఆప్రేమము నిరంతర సన్నివేశముచేత అతివేలమై నిష్కామముగా పరిణమించుచుండెను. ఇచట నొక్కింత చెప్పవలసియున్నది. ప్రేమము భక్తియొక్క అపరిణతస్వరూపమని భక్తియోగులు. భక్తిని అయిదుతెరగులుగా వారు విభజించియున్నారు. శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావములని వానికి పేరు. ఈ పంచభావములను శ్రీకృష్ణుడు గోకులమునందు ప్రయోగించెను. తన ప్రాకృతలీలారంగస్థలమగు గోకులమునందు శాంతభావమును, సవయస్కులగు గోపబాలురయందును, గోవత్సములయందును దాస్యసఖ్యభావములను, తనకంటె వయోవృద్ధులగు గోపగోపికాజనమునందును, మాతృగోగణమునందును దాస్యవాత్సల్య భావములను, దుర్లభమును, పరమమును నగు మధురభావమును గోపకన్యాగణమునందును ప్రయోగించినట్లు పురాణములవల్ల నవగతమగుచున్నది. ఈ మధురభావమే కాంతాసక్తి యని కొందరు చెప్పుదురు. పూర్వోక్తములైన చతుర్విధభావలక్షణములును పంచమభావమునందు పరిణమించునని వారి సిద్ధాంతము. గోపికలు ఈ పంచభావములలోను చక్కగా నుత్తీర్ణలైరి. శ్రీకృష్ణుని నిరంతర దర్శన శ్రవణ మననాదులవల్ల వారియందుత్పన్నమైన భక్తిబీజములు క్రమక్రమముగా విస్ఫారితమైనట్లు బృందావనలీలలు తెలియజేయుచున్నవి. గోపికలెల్లరును యమునాతీరమున కార్తికమునందు కాత్యాయనీ పూజ సలుపునాటికే వారిహృదయములందు సోపాధికమైన సగుణభక్తి విజృంభించియుండెను. వ్రతాంతదినమున శ్రీకృష్ణపూజా వివశలైన గోపికలు వివస్త్రలై యమునలో స్నానము చేయుచుండగా గోపికాచేలము లపహరించిన చెన్నదొంగ ధర్మోపన్యాసము గోపికల హృదయవికాసమును వర్ణింపజాలియున్నది. ఇట్టి యుపన్యాసమే యించుక మార్పుతో మునిపత్నులకు గూడ చెప్పబడియున్నది. ఈ యుపన్యాససారము తాను గోపకాంతలయందు ప్రవర్తింపజేయదలచుకొన్న మధురభావము, లేక కాంతాసక్తియొక్క రూపమును సూచించుచున్నది. గోపికా వస్త్రాపహరణమునకు దరువాత కొన్ని మాసములు గడచినపిదప రాసక్రీడ జరిగెనది. రాసక్రీడాసమయమునకు వారు మధురభావమునుగూడ జీర్ణము గావించికొనిరి. ఐహికసాంసారికములైన యేఅభిమానములు కూడ వారి హృదయోద్వేగము నరికట్టలేకపోయినవి. అందువల్లనే వారు చేయుచున్న గృహకార్యముల నన్నిటిని అంతటంతటనే వదలి కృష్ణమయులై పరువెత్తికొనిపోయిరి. వారిని వారి భర్తలుగాని, బాధ్యస్థులగు మరెవ్వరుగాని యరికట్టలేరు. అపరిణతస్థితిలో నున్నవారలు గృహాంగణములకైన ద్రొక్కక యిండ్లయందే కృష్ణధ్యాననిమీలితలోచనలై యున్నారు. ఇట్లు "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ, అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః" అను గీతావాక్యతాత్పర్య మీ వరకే వారి హృదయనాళములలో కవోష్ణముగా సంచలించుచుండెను. వారు ఈ ప్రపత్తిసిద్ధాంతమును పూర్ణముగా గ్రహించుకొన్నట్లు శ్రీకృష్ణునితో రాసరంగమున గావించిన వారి ప్రత్యాఖ్యానము తెలుపుచున్నది. ఇట్లు సర్వాంగీణముగా కృష్ణదాసులై, సర్వమును కృష్ణమయముగా భావించి, ఇహమునందును పరమునందును ప్రాప్యప్రాపకము లన్నియు శ్రీకృష్ణుడుగానే యెంచి, నిరుపాధికమైన భక్తిసామ్రాజ్యమున కధికారిణులై వెలయుచున్న గోపికల పాతివ్రత్యమునకు వంకపెట్టుట సంప్రదాయజ్ఞానమునకు దూరము. అట్లు గోపికలు ఆత్మనివేదనాసక్తలై శ్రీకృష్ణుని పొందినపిదప వారి కభిమానము మరల రేకెత్తెను. తద్గర్వనిర్యాపణమైనగాని వారు పొందవలసిన పరమావస్థను పొందజాలరని శ్రీకృష్ణు డంతర్హితుడయ్యెను. గోపికలు శ్రీకృష్ణ వియోగము నోర్వజాలక ప్రపంచమంతయు శ్రీకృష్ణమయముగా భావించి యన్వేషించుచు, కొందొకపట్ల తమ్మే శ్రీకృష్ణునిగా భావించికొని తన్మయలగుచు పరమవిరహాసక్తిని, పునర్విశ్లేషభీరుత్వమును ప్రకటించుచు వాపోవసాగిరి. అప్పుడు శ్రీకృష్ణుడు వారలకు సాక్షాత్కరించి రాసక్రీడ గావించెను.

రాసక్రీడయందలి అంతరార్థము

ఈ యంశములను రమారమి అన్ని పురాణములును ఏకగ్రీవముగా నంగీకరించుచున్నవి. వీని అంతరార్థమును ప్రకటించుటలో పురాణకారుల వర్ణనాంశములలోను, ప్రదర్శనపద్ధతులలోను భిన్నమార్గము గనుపించుచున్నను రాసక్రీడయందలి నిగూఢతత్త్వము దానినిగానే యంగీకరించి యున్నారని చెప్పకతప్పదు. ఈ రాసక్రీడ కృష్ణుని పక్ష

మున లీలామాత్రమైనను గోపికల పక్షమున ఈశ్వరోపాసనముగా నున్నదని ప్రారంభమునందు నేను వ్రాయుట కిదియే కారణము. ఈ యంశములను హృదయస్థము గావించుకొని సమన్వయించినచో రాసమునందు కామాంకములు కన్పింపవు. శ్రీశుకునివలన రాసపంచాధ్యాయిని విన్న పరీక్షిత్తునకుగూడ పై యంశమునందు సందేహ ముదయింపకపోలేదు. ఆ సందేహమును శ్రీశుకుడు భాగవతమునందే పరిష్కరించియున్నాడు.

సంశయములు-అపోహాలు

"తమేవ పరమాత్మానం జారబుద్ధ్యాపి సంగతాః" అనుపట్టున శ్రీశుకుడు, లేనిచో వ్యాసుడు ప్రయోగించిన జారబుద్ధి యను శబ్దము అపార్థమును విరళించుచున్నదని కొందరి సంశయము. ఈ శ్లోకమును తెలిగించుటలో పోతన మహాకవిగూడ మూలభావమును గమనించినట్లు తోచదు. గోపికలు శ్రీకృష్ణుని జారునిగా భావించి యభిసరించి రని ఆయన చెప్పియున్నాడు. అట్టి తెనిగింపు ప్రకరణమునకు ఇక్కలి విరుద్ధముగా నున్నట్లు తోచుచున్నది. 'తనుభృతాం కిల బంధురాత్మా' యని శ్రీకృష్ణునితో గల తమ సంబంధమును నిరుపాధికమును ఆత్మసంబంధముగా నిర్ణయించిన గోపికలు శ్రీకృష్ణుని జారునిగా భావించి పొందిరని చెప్పుట సంగతమని యెవరును పలుక సాహసింపరు. సాక్షాత్పరబ్రహ్మమగు శ్రీకృష్ణుడు గూడ అట్టి యవకాశమును గోపికల కొసగి యుండడు.

జారబుద్ధి యను సమాసమును రెండు విధములుగా చెప్పవచ్చును: జార ఏవ బుద్ధిః = జారబుద్ధి యనియు, జారే ఇవ బుద్ధిః = జారబుద్ధి యనియు చెప్పవచ్చును. అనగా జారుడను బుద్ధి జారబుద్ధియగును. రెండవపక్షమున జారునియందు గల బుద్ధి జార బుద్ధి కాగలదు. శ్రీకృష్ణునియందు గోపికలకుండు విశ్వాసము, ప్రేమను పరాత్పరుడనిగాని జారుడని కాదని యిది వరకే చెప్పబడియున్నది. అందువలన మొదటి పద్ధతిని విడిచి రెండవ అర్థమునే తీసికొనుట మంచిది. ఇపుడు శ్రీకృష్ణుని యందు గోపికలకు గల బుద్ధి జారునియందు జారిణికిగల బుద్ధివంటి బుద్ధియని చెప్పినట్లయినది.

అర్థ నిష్కర్ష

ఈ విషయమునే స్ఫుటపరచుచు శ్రుతి 'మోహా జారమివ ప్రియ'మ్మని భక్తివిషయమున పల్కుచున్నది. నారదమహర్షి గూడ స్వీకరించుచు భక్తి ప్రకరణలో 'యథా వ్రజగోపీనాం' అని చెప్పియున్నాడు. కావున గోపికలు కామమోహితలై శ్రీకృష్ణుని సంగమమును గోరియుండ లేదని చెప్పవచ్చును.

శ్రీకృష్ణుని పరమార్థ సంకల్పము

ఇందు శ్రీకృష్ణునిగురించికూడ కొన్ని వాక్యములు వ్రాయవలసి యున్నది. శ్రీ కృష్ణుడు భగవంతుడైనను మనుష్యుడుగా నవతరించిన పిదప తద్ధర్మమును లనుష్ఠింపకతప్పదు. దీనిని గురించి బంకించంద్రుడిట్లు వ్రాసియున్నాడు: "మనుష్యత్వమే మనుష్యధర్మము. మనుష్య వృత్తులయనుశీలనమును, ప్రస్ఫురణమును, చరితార్థతయే మనుష్యత్వము. ఆవృత్తులు శారీరకమనియు, జ్ఞానార్జనమనియు, కార్యకారిణియనియు, చిత్తరంజనియనియు నాలుగు విధములుగా విభజింపబడి యున్నవి. సకల వృత్తులచేతను సౌందర్యాదుల బర్యాలోచన చేసి యనుపమమైన నిర్మలానందము ననుభవించుట చిత్తరంజన మనబడును. ఆవృత్తుల పరిపూర్ణానుశీలనముచే సచ్చిదానందమయమైన జగత్తు లభించుచున్నది. అందువలన జగన్మయమై సచ్చిదానందసంపూర్ణస్వరూప మనుభవమునకు రాగలదు. చిత్తరంజకమైన వృత్తుల ననుసరింపకుండుటవలన ధర్మహాని యగును. ఆదర్శపురుషునకు చిత్తవృత్తులలో నెవ్వియు ననుశీలనవిరహితములుగను, స్ఫూర్తిహీనములుగను నుండజాలవు. శ్రీకృష్ణుని రాసలీల యీ చిత్తరంజనవృత్తుల యనుశీలనమున కుదాహరణముగ నున్నది. ఒకప్రక్క వసంతసౌందర్యానికొకసము; మరియొకప్రక్క వసంతసౌందర్యోపాసనము. ఈవృత్తుల నన్నిటిని నీశ్వరముఖముగా ప్రేరేపించుటయే చిత్తరంజనవృత్తుల పరిపూర్ణానుశీలనము."

ఈ ప్రేమమార్గమే తరువాతి యనేక భక్తులకు ఆశ్రయణీయమైనది

ఇట్లు శ్రీకృష్ణుడు మనుష్యత్వమునకు భంగము రాకుండ భగవత్త్వబుద్ధిని సంసారపాశబద్ధులను జీవులను గల్గించి తమ్ములనుమ వారి సమస్థానయోగ్యమను భక్తి మార్గమున తరింప జేయుటకు సంకల్పించుకొనెను. ఈ అభిప్రాయమే శ్రీకృష్ణుడు బృందావన లీలలో పెక్కుమారులు గోపికల కుపదేశించినట్లు మనము భాగవతమువలన తెలిసికొనుచున్నాము. ప్రకృతిమయులగు సమస్త మానవులకును ఈ గోపిక లవలంబించిన ప్రేమమార్గమే (భక్తియోగమే) యుత్తమసాధన మని నారద శాండిల్యమహర్షులుగూడ స్వీకరించియున్నారు. శ్రీకృష్ణ దూతగా మధుర నుండి బృందావనమున కరుదెంచిన యుద్ధవుడు గోపికల పాదరజోలేశలాలసుడై ప్రార్థించెను. శ్రీ ద్రావిడ వాఙ్మయ నిర్మాతయు, విశిష్టాద్వైతప్రతిష్ఠాపకుడును, మహాభక్తాగ్రేసరుడును నగు నమ్మాళ్వారు తాను నాయికయై భగవాను నుపాసించెను. ఈ మార్గము ననుసరించియే రామానుజాదులు భగవదుపాసనామార్గములు తొమ్మిదింటిలోను నాయికానాయకభావము నొకదానినిగా బరిగ్రహించియుండిరి. జయదేవమహాకవియు దీనిని హృదయమునం దుంచికొనియే గీతగోవిందము కీర్తించెను. అభినవ కృష్ణావతారుడగు చైతన్యుడుగూడ నీ మార్గమునే లోకమున వెలయించెను. ఈసిద్ధాంతమును మనస్సునం దుంచికొని నవీనవైష్ణవధర్మములు కొన్ని ప్రచారములోనికి తీసికొనిరాబడినవి. మొత్తముమీద నీ మనోహరప్రేమసంబంధము చేతనే గోపీకృష్ణచరిత్ర విషయకమగు వాఙ్మ

లను విశ్వసాహిత్యమున నుచ్చస్థానము నొందజాలియున్నది.

జీవబ్రహ్మల అభేదలీల ప్రదర్శనమే రాసము

ఈవివరణమువలన రాసమండలమున శ్రీకృష్ణుడు గోపికలకు చూపినది జీవబ్రహ్మల అభేదలీల యని ధ్రువపడుచున్నది. కాని కొందరు పురాణకర్తలు ఈఘట్టమును నృత్యవిశేషముగానే అర్థముచేసికొని, తమ సంగీత నాట్యశాస్త్ర పాండితిని కుప్పవిడిచిరి. వాని నుండి మరికొన్ని విచిత్రములు బయలు దేరినవి. భాగవతవ్యాఖ్యాత విశ్వనాథచక్రవర్తి రాసములోనుండి కృష్ణబీజమగు "క్లీం" ను సృష్టించెను. మరియొకరు – ఈ లీలకు ముందు గోపికలు విన్న వేణునాదము శంఖ సుషిరనాదము కాదనియు, హృదయవేణు సంజనితనాద మనియు యోగశాస్త్రము నాశ్రయించి వివరించిరి. ఇంకొకరు రతి రసశబ్దవాచ్యుడైన పరబ్రహ్మవికాసమని యు, రసానందానుభవ మనియు తెలిపిరి.

రాసమునకును, రాధకును గల అవిచ్ఛిన్న సంబంధము

ఈ సందర్భమున శ్రీకృష్ణునకు నిత్య సహాయిని యైన రాధమాట తెలుపకుండుటకు వీలులేదు. రాసమునకును రాధకును అవిచ్ఛిన్న సంబంధమున్నది. రాసమండలము లోనుండియే రాధ జనించినట్లు పలువైష్ణవ మతగ్రంథములు తెలుపుచున్నవి. కాని రాస లీల వర్ణించు పెక్కుగ్రంథములలో ఆ యితివృత్తమున రాధప్రస్తావమే కనిపించుట లేదు. అయినను కొందరు ఈ మహాలీలలో రాధ కలదని నమ్ముచున్నారు. వారివాదము లో హేతువాదము కనిపింపదు. ఆవివరణ మున కిది యవసరముకాదు.

మొత్తముమీద రాసము వైజ్ఞానికావలంబనముతో మహారాసమై, స్థూల చిదచిద్వి శిష్టమునుండి సూక్ష్మచిదచిద్విశిష్టము వరకు ప్రాకి, అనాదిత్వము, శాశ్వతత్వము నెల కొల్పుకొన్నది. ఈమనోహర లీలావివేచనకు పొగడ హరిదాసుని శ్రీమూర్తితో మంగళ వాక్యము చెప్పెదను:

"...Whatever is visible is Prakriti and nothing else. With the base Prakriti (Passive Principle) Krishna, the only Purusha manifested as Consciousness is eternally at grand play. This play is without beginning or end and is eternal. This is called the sublimest sport (Maha-Rasa). The only active or male agent Krishna is incessantly at play with Prakriti in someway or other. This play knows no stop and is unending. Even Brahma and Siva have foundered in the Ocean of Thoughts in order to solve the secret of this play; save and except Krishna no one is capable of penetrating into it. The real object of this bewildering game is known only to Sri Krishna and to Sri Radhika (Moola-Prakriti). To anyother it is a sealed book.'



ప్ర త్య క్ష శ య్య

[నిజంగా జరిగిన కథ]

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

శ్రీ శ్రీ శ్రీ వత్సవాయి చతుర్భుజతిమ్మజగపతి మహారాజు పెద్దాపురరాజ్యం పరిపాలిస్తూ వున్న రోజులు—

రాజ్యం అంతా సర్వవిధాలా సుభిక్షంగా వుంది.

కళాకుశలు లందరూ రాజపూజ్యత అనుభవిస్తున్నారు.

కాని, వారంటే దివాన్జీకి వల్లమాలిన కోపం.

ఏవో నాలుగు కథుర్లు చెప్పి, ఇంద్రుడ వనీ, చంద్రుడ వనీ పొగిడి, వేలకొద్దీ డబ్బు కాజేస్తారనీ, అగ్రహారాలు కూడా కొట్టేస్తా రనీ ఆకోపం.

కానయితే, అతగాడు బ్రాహ్మడే; వైదికుడున్నా. కొంచెమో గొప్పో చదువుకున్నవాడు కూడాను.

కాని అతను పొట్టి అంకెలపోగు.

అతనికి డబ్బే పావనం.

ప్రజలవల్ల అణాపైసలు నిక్కచ్చిగా వసూలు చెయ్యడం—అలా చెల్లించగలగడానికి, ఆ ప్రజలకు తగిన వసతులు కల్పించడం—ఇంతే అతని లోకం.

పది డబ్బులు వస్తా యంటేనే వొక డబ్బు ఖర్చు పెట్టడం అతని పద్ధతి.

అంచేత, పండితులకు అతని దర్శనం సాధారణంగా అందరాని ఫలంగా వుంటూ వుంటుంది.

మహారాజు దర్శనం అతని ద్వారానే కావాలి కనక అది మరీ దుర్లభం అవుతూ వుంటుంది.

కాని మహారాజు విద్యాప్రియుడు.

కళ అంటే అతనికి నిద్రాహారా లక్కర్లే దన్నంత ప్రీతి.

ఇంతేకాక,—

ఆ రాజ్యంలో, ఆ ప్రధానాధికారి యెంత విద్యావిముఖుడో, అతనికింది ఆ అప్రధానాధికారులు అంత విద్యాసుముఖులు.

వారిలో కొందరు కళాకుశలులున్నా వున్నారు.

ఈసన్ని వేశమే లేకపోతే, పండితులకు, రాజసభలోనే కాదు, పెద్దాపురప్పట్నంలోనే ప్రవేశం లేకపోవును.

ఏతావతా:

ఈసౌకర్యం వినియోగించుకుని వొకనాడు, వొక బ్రాహ్మణయువకుడు, కోటలోనే — కచేరీగదిలోనే దివాన్జీయెదటికి వెళ్లగలిగాడు.

అదృష్టవశంవల్ల, ఆవేళ, మహారాజు పక్కగదిలోనే మిత్రులతో దశావతారీ ఆడుతూ వుండడం తటస్థపడింది.

ఆ కింది అధికారులు ఆయువకుడికి యీ సంగతి కూడా చెప్పి, దివాన్జీతో దొమ్ములాడి అయినా మహారాజు దృష్టి ఆకర్షించుకో మని హెచ్చరించారు.

౨

అధికారదర్పానికి దీర్ఘానుభవం సాయపడి దివాన్జీ బిర్రుగా చూడగా, పాండిత్యగర్వానికి కింది అధికారుల ప్రోత్సాహం జతపడి యువకుడు అలవోకగా చూశాడు.

ఇది దివాన్జీ కళ్లల్లో కారపుగుండ కొట్టింది.

యువకుడది గుర్తించి, మొదట నమ్రుడై "నమో మహద్భ్యః. మాది పలివెలతాణాకి చెందిన ఒక కుగ్రామం. నాపేరు బులుసు రామగోవిందశాస్త్రి" అని అంజలిబంధంగా విన్నవించి, తరవాత "నీ సంగతంతా తెలుసుకునే వచ్చానయ్యోయ్" అన్నట్టు సుతారంగా తల పంకిస్తూ నిటాగ్గా నుంచున్నాడు.

దీంతో గాయం రేగినట్టయి, పురపుర చూస్తూ, "యిక్కడికెలా వచ్చారండీ?" అని తల యెగరవేసుకుంటూ అడిగాడు దివాన్జీ.

"చెప్పలేను. ఎంచేతనంటే? ఇక్కడికి రావడంలో నా ప్రజ్ఞ, నా ప్రయత్నమూ కూడా లేవు. కేవలమూ తమ దివ్యతేజస్సే నన్నిక్కడికాకర్షించింది. తమ అధికారమే నన్నిక్కడ నుంచోబెట్టింది" అంటూ బెల్లిస్తూ చూశాడు శాస్త్రి.

ఇది విని, పక్క గదిలో మహారాజు చకితుడై ద్వారంకేసి చూశాడు.

కాని దివాన్జీమాత్రం యిది వినయమో అవినయమో, పొగడ్తో తెగడ్తో కూడా గుర్తించుకోలేక నీరవుడయిపోయాడు.

అది గ్రహించి "ఎక్కడికక్కడే పద్మవ్యూహం. అడుగడుగునా విచ్చుకత్తులతో పహారాలు. నిజంగా మానవమాత్రులకిది సంభవమేనా? కాని కళ్లు మూసి తెరిచాటప్పటికి నేనిక్కడున్నాను. ఇక చెప్పడానికేం వుందీ?" అని తల యెగరవేసుకుంటూ మళ్లీ అడిగాడు శాస్త్రి.

ఇది విని దివాన్జీ మరీ నీరవుడయిపోయాడు.

దీంతో మహారాజు కళాప్రీతి ఉద్బుద్ధమయింది.

కొంతసేపు అధికారీ, ఆగంతుకుడూ అభావదృష్టులు పరుపుకున్నారు.

తరవాత ప్రయత్నపూర్వకంగా కంఠం స్వాధీనపరుచుకుని "అయితే యేమిటండీ? ఎందుకోసమండీ మీరాకా?" అని చిమచిమలాడుతూ అడిగాడు దివాన్జీ.

"చిత్తం చిత్తం. ఒక్కమాటు పురాణకాలక్షేపం చేసి ప్రభువుని మెప్పించాలనీ—"

"మెప్పించీ?"

"ఎంతో కొంత సత్కారం—"

"అదీ అసలు సంగతి" అని చెయ్యి విదిలించుకుంటూ అందుకున్నాడు దివాన్జీ.

"నేనెరగనూ? ఎవరు వేంచేసినా అందుకే. ఆ ద్రవ్యాశ శ్రవ్యంగా వుండడానికే యీ చిలవలూ పలవలూనూ"

ఆటగాళ్లు చకితులై ప్రభువుని చూడగా, ప్రభువు ఒక చెవి యిటు వొగ్గాడు.

"తమరు సరిగా సెలవిప్పించారు. ఏమంటే? మనుష్యుడు చేసే ప్రతీ పనిలోనూ యీ పూత తప్పదు. పైగా, నావృత్తిలక్షణం కూడా అదే"

"సంతోషించాం"

"ఎంత దురుసుతనమూ" అనుకుని ఆటగాళ్లు స్తబ్ధులయినారు.

మహారాజు చెవిలో అపశ్రుతి దెబ్బ కొట్టింది.

శాస్త్రి కొంచెం వుద్రిక్తుడయినాడు.

అరసికత తొందరపెట్టగా యిలా అనేశాడు; గాని మహారాజు వినేశాడేమో అని అంతలో స్వగతంగా పిసుక్కుని, వెంటనే ధోరణి మార్చి "నుంచునే వున్నారు, కూచోండి. అయితే, యేం చదివారూ మీరూ?" అంటూ గుర్రం దిగి అడిగాడు దివాన్జీ.

"తమ సన్నిధిని కూచున్నా నుంచున్నట్టే, నుంచున్నా కూచున్నట్టే. పై పెచ్చు, తమరు ముందే సంతోషించారు గాని పరిశీలన అంతా మిగిలే వుంది. కనక నుంచుని మాట్లాడ్డానికే నాకు సెలవిప్పించండి. మరి ప్రకృతం. నేను ఉభయభాషల్లోనూ పంచకావ్యాలూ చదివానండి" అని గంభీరంగా చూస్తూ చెప్పాడు శాస్త్రి.

ఇది దివాన్జీని కొంచెం వుద్రిక్తుణ్ణి చేసింది; కాని పైకి చల్లబడ్డట్టు కనపడుతూ "తరవాత?" అని అడిగాడతను.

దానికి "పురాణకాలక్షేపాలు ప్రారంభించడమే. మరేం వుందీ? మరేం కావాలీ?" అని ప్రశ్నార్థకంగా జవాబు చెప్పాడు శాస్త్రి.

ఇది విని మొదట పెదవి విరిచాడు దివాన్జీ. తర వాత నిరసనభావం కనపరుస్తూ "అయితే, మీ పురాణ కాలక్షేపం వినవలసిందే. మరి దయచెయ్యండి" అనే శాడు.

"అంటే?"

"వెళ్లవచ్చు నన్నమాట"

"అదేమిటీ?"

"కాకేమిటీ?"

"ఏమయిందీ?"

"కావడాని కేం వుందీ? ఏవో నాలుగు శబ్దాలు నేర్చుకుని అష్టాదశపురాణాలూ విడగొట్టేస్తా నంటే యెలాగయ్యా?"

దీనిమీద "అదా?" అంటూ నిర్లక్ష్యంగా నవ్వేసి అందుకున్నాడు శాస్త్రి.

"గొప్ప సందేహమే. ఉచితంగానే వుంది. అయి తే, నేను, అయిదూ అయిదూ పది కావ్యాలూ పాఠం కూడా చెప్పగలనండీ"

"చదువుకున్నప్పుడు సంతలు చెప్పుకుని వల్లె వేశారా?"

"తమ ఝుడితిస్ఫురణ ప్రలోభజనకంగా వుంది. ప్రశ్నకూడా బాగా పైస్థాయిలోనే వుంది. ఇక వున్న దల్లా యేమిటంటే: 'సంత' 'వల్లె' అనే పరిభాషా పదాలు వేదానికీ, శ్రౌతానికీ సంబంధించినవి; సాహి త్యానికి సంబంధించింది బోధ మాత్రమే నండీ"

దీనిమీద "బోధ......పై పైని వుంది బోధ" అంటూ మూతి బిడాయించుకుని, మొగం అయి మూలగా వంచుకుని, తల యెగరవేసుకుంటూ ప్రారం భించాడు దివాన్జీ.

"మల్లినాథాదులు బతికి వున్నంతకాలమూ గింజుకున్నారు. అయినా కవిభావం బయటపడలేదు. సరి, తెనుగు కావ్యాలకు వ్యాఖ్యానాలే లేకపోయె"

"గురువు లున్నారు కాదూ?"

"వారు చెప్పగలిగితే మాత్రం యివతలి వాళ్లకి అంటవద్దా?"

"అంటకమే తటస్థపడితే?"

దివాన్జీ గతుక్కు మన్నాడు.

ప్రభువు రెండో చెవి కూడా యిటు వొగ్గేశాడు.

3

ఒక్క విఘడియ అధోముఖుడై వుండి "ఇంతకీ, మీ పురాణకాలక్షేపంలో వుండుకున్న విశేషం యేమి టండీ?" అని తల యెగరవేసుకుంటూ అడిగాడు దివాన్జీ.

"దొరికావు" అనుకుని పూటుపడ్డాడు శాస్త్రి.

"అదీ దారి. తమవంటి పెద్దలు నావంటి కుర్ర వాళ్ల నడగవలసిన ప్రశ్న అదీ. మరి మనవి చేసుకుం టున్నాను."

"ఆహా"

"ప్రత్యక్ష బాహాటపాంచాలశయ్యలఁ జదివింప నేర్తు నేఁ జదువ నేర్తు నని నాబిరుదు."

గుండెలమీద చెయ్యి వేసుకుని శాస్త్రి యిలా చెప్పగా "అంటే?" అని బొమముడితో అడిగాడు దివాన్జీ.

ప్రభువు మెరుపుకొట్టిన ట్టయి ఆటగాళ్ల కేసి చూశాడు.

"ఇందులో చూడవలసిందే కాని చెప్పవలసిం దేం వుందీ?" అంటూ నిలవతీశాడు శాస్త్రి.

"అది కాదయ్యా, ఏశయ్యలో అయినా కిందా మీదా పడి—"

అర్ధోక్తిలో శాస్త్రి పెదవులమీద చిరునవ్వు చిందు లాడింది. మహారాజు మొగంమీద అసంతుష్టి అంకితం అయింది. అపవారించి ఆటగాళ్లు కళ్లు గీటు కున్నారు.

ఇదేమీ యెరగని దివాన్జీ "సొంతంగా చదవడం సాధ్యపడవచ్చు గాని యితర్లచేత చదివించడం కూడా

చేత నవ్వుసంటే నమ్మొయ్యవలసిం దేనా?" అని మాట పూర్తి చేశాడు.

"ఏం నమ్మితే?"

చురుగ్గా చూసి "ఏమా? ఎవర్ని కూచోబెట్టినా చదివించగలరా?" అని టోకాయించి అడిగాడు దివాన్జీ.

"ఆ"

"ఏమాత్రం చదువు వచ్చివున్నా నా?"

"ఆ"

"వాచకం ధారాళంగా లేకపోయినా నా?"

ఎదరొమ్ము విరుచుకుంటూ మళ్లీ "ఆ" అన్నాడు శాస్త్రి.

ఇది విని చేతిలో వున్న ముక్కలు కిందపడేశాడు ప్రభువు.

ఆటగాళ్లు ముగ్గురూ యెవరిచేతిలో వున్న ముక్కలు వారు కలిపేసుకుని, చూపులు మహారాజు మొగంమీదా, చెవులు యీ సంభాషణమీదా నిలుపుకున్నారు.

కాని, విశాఖపట్నం సీటికొళాయీలు పుటుకూ పుటుకూ రెండేసి చుక్కలు రాల్చి యిగుర్చుకు పోయేట్టు "అసాధ్యం" అనీ, "నమ్మడానికి వీల్లేదు" అనీ మాత్రం గొణిగి, మొగం వంచుకుని దివాన్జీ యేదో కాగితం చూసుకోసాగాడు.

అది నిర్లక్ష్యంగానూ, తనయెడల తిరస్కార భావంగానూ గ్రహించి, చాలా బాధపడి "సాధ్యమా అసాధ్యమా అంటే అది మనిషిని పట్టి వుంటుంది. ఈ విషయం గ్రహించడంకూడా మనిషిని పట్టే వుంటుంది. కాగా, యిలాంటి సందర్భాలు తటస్థపడ్డప్పుడు సహృదయులు చెయ్యదగినది పరీక్ష" అన్నాడు శాస్త్రి.

కాని దివాన్జీ మాట్లాడలేదు. మొగమయినా యెత్తలేదు.

"అందుకు పూనుకోకపోతే ఆ సహృదయతకు వినియోగం యేదీ? అసలు దాని అస్తిత్వానికి నిదర్శనం యేమిటీ?" అని మళ్లీ అడిగాడు శాస్త్రి.

దివాన్జీ హృదయం దడదడ లాడింది. అయినా అతను మాట్లాడలేదు.

"నిజానికి తమ రిప్పుడు చేస్తూ వున్నది కూడా పరీక్షే; అయితే, రకం మట్టుకు మారిస్తే గాని అది యిక్కడ సమన్వయించదు" అని కొంటె చూపులు చూశాడు శాస్త్రి.

అప్పుడున్నూ దివాన్జీ చలించలేదు.

"పోనీ, తమ రున్న స్థితిలో నన్ను పరీక్షించడం సాధ్యపడకపోవచ్చు. ఇందుకోసం తమ రెలాంటి హేమాహేమీలను తెచ్చినా నాకు సమ్మతమే. ఇందులో వోడిపోతే తమరు న్యాయంగా నాకెలాంటి శిక్ష విధించినా నేను సిద్ధమే"

ఇది విని అక్కడ ఆటగాళ్లు మహారాజుకేసి మిడుతూ మిడుతూ చూశారు.

మహారాజు ద్వారంకేసి వులుకూ వులుకూ చూశాడు.

ఇక్కడ దివాన్జీ "మా కిదే పనా? సంభవాలు చూడ్డానికే వీలుపడదే, అసంభవాల కోసం మేము పనులు మాను కూచోవలసిం దేనా?" అంటూ కరుగ్గా అడిగాడు.

ఇది శాస్త్రికి మనస్సు నొప్పించింది.

"ఇది పని కాకపోతే కాదూ?" అంటూ అందుకున్నా డతను.

"ఈస్థలం సర్వవిధాలా ప్రజలను ఆజ్ఞపెట్టడానికి సమర్థ మయినది. ఆ కారణంవల్ల యిది అందరికీ అందుబాటులో వుండతగ్గది కావడం లేదూ? ఇదిన్నీ కాక: సంభవాల కోసం తమదాకా రా నక్కర్లేదు. తమ వంటి పదస్థులు చిత్తగించవలసినవి అసంభవాలే"

దీనిమీద దివాన్జీకి కోపమే వచ్చింది; కాని కాదనడం యెలాగా? అతనికి దారి తోచలేదు.

పైపెచ్చు "ఇంతదూరం ముదరనివ్వడం పొరబాటు" అని తప్పే తోచింది. మాట్లాడలేక కళ్లప్పగించి వూరుకున్నాడు.

"పూర్వుల తపఃప్రభావంవల్ల తమ రీ మహోన్నతపదవి పొందగలిగారు. ఆ తపఃప్రభావం తమకి కళాభిరుచి కలిగించకపోవడం అసంభవం కాదూ? కనక తమవంటివారే పెదవి విరిస్తే యిక విద్యలకు గతి యేదీ?"

దీనిమీద "మాట్లాడితే ప్రతివాడికీ యిదో కవేలంబం. విద్యలట విద్యలు" అని గొణుక్కుంటూ దివాన్జీ మొగం వంచుకున్నాడు.

ఈ గొణుగుడు మహారాజుకి వుద్రేకం కలిగించింది.

వెంటనే అతను ద్వారపాలికకేసి చూసి "సభకి సెల వయిందని చెప్పు" అన్నాడు.

ఇది శాస్త్రికి కోకిలకూజితంలా వినపడింది.

దాంతో "యేం, అయిందా?" అన్నట్టు ముదలకింపు చూపు చూశా డతను.

మహారాజు మాటకీ, ద్వారపాలిక రాకకీ కూలిపోయిన దివాన్జీ దీంతో చితికిపోయాడు.

౪

సరిగా జాముపొద్దువేళ సభ కూడింది.

తెల్లని మసలందుమీద మహారాజు సలక్షణంగా కొలువుతీరాడు.

రాజబంధువులూ, సామంతులూ, అధికారులూ, పండితులూ, పౌరప్రముఖులూ "యెవ్వ డెప్పు" డని ఆత్రపడుతూ, ప్రభువుని పరివేష్టించి వున్నారు.

క్షణాలు గడియలుగానూ, గడియలు క్షణాలుగానూ మారిపోతున్నాయి.

మహారాజు కళ్లల్లోనూ, శాస్త్రి చూపుల్లోనూ అంకితమై, గాంభీర్యం, కొలువు అంతా ఆకట్టి వుంది.

కొంతసేపటికి, ప్రభువు ఇంగితం కనిపెట్టి, ఆస్థాన పౌరాణికుడు ఆంధ్రమహాభారతం తెచ్చి శాస్త్రి కందించి తప్పుకున్నాడు.

అతని వెనకనే పదహారేళ్ల చామరగ్రాహిణి వచ్చి, ముందు పాదాభివందనం చేసి, తరవాత శాస్త్రి యెడమదిక్కున కూచుంది.

అది చూసి సభ్యులందరూ "కత్తులమీద పరీక్ష" అనుకుంటూ వుండగా, సుతారంగా సూత్రం విప్పి, శాస్త్రి, పౌరాణికుడికేసి చూశాడు.

ప్రభువు మేనమామ—తొంభైయేళ్ల వృద్ధు—దంతులూరి వేంకటపతిరాజు వెండిమీసాలు సవరించుకుంటూ "ఊరుభంగం ఘట్టం తీయించండి" అని బోసినోరు చప్పరించుకున్నాడు.

అందుకు సభ్యు లందరూ వుత్సుకులు కాగా, శాస్త్రికూడా పరమోత్సాహం పొంది "మహాప్రసాదం" అంటూ మొదట ఆ ఆజ్ఞ అంజలిబంధంతో అందుకుని, తరవాత "సంస్థానానికి తగిన ఘట్టం. శయ్యకి తగిన ఘట్టం. నా బిరుదుకిన్నీ తగిన ఘట్టం. నే నేది నిరీక్షిస్తున్నానో అదే మమ్మేలినవారు సెల విప్పించారు. అయితే వొక్క మనవి" అని మళ్లీ దోసిలి వొగ్గాడు.

"సెల విప్పించండి" అన్నాడు ప్రభువుపక్షంగా వేంకటపతిరాజు.

"ముందొక పెట్టె తెప్పించి నా కుడివేపున వుంచాలి"

"తరవాతా?"

"ఇక్కడ వున్నవా రందరూ తమ దగ్గిర వున్న ఆయుధాలు అందులో వుంచెయ్యాలి"

ఇది విని సభ్యు లందరూ మొగ మొగాలు చూసుకున్నారు. మొగమాటం విడిచిపెట్టి ఆసందట్లో "ప్రభువవారికీ,పసిపిల్లలకూ, భటులకూ కూడా మినహాయింపు లేదు" అని కచ్చితంగా చెప్పేశాడు శాస్త్రి.

ఉలిక్కిపడి మేనమామ ప్రభువుకేసి చూశాడు. ప్రభువు వింతపడ్డాడు; కాని "యిప్పించెయ్యండి" అన్నాడు.

కళ్లు మూశాటప్పటికి పెట్టె రావడమూ, మళ్లీ తెరిచాటప్పటికి చిన్న చాకులు కూడా అందులో నిక్షిప్తాలు కావడమూ జరిగిపోయింది.

౫

"ఏదీ, చదువు పిల్లా" అంటూ చామరగ్రాహిణికి పుస్తకం అందించాడు శాస్త్రి.

పుస్తకంలో రాత చూస్తే ముత్యాలకోవ.

పిల్ల కళ్లు చూస్తే ఆకర్ణాంతాలు.

కాని నాలుక మాత్రం కొంచెం ప్రయత్నించగా వర్ణక్రమమే నడవలేదు.

అది చూసి సభ్యు లందరూ "లాభం లే"దనుకున్నారు; గాని శాస్త్రి దోసిలి వొగ్గి, నమ్రుడై "సెలవా?" అని అడిగాడు.

"ఒక్క టే సెలవు" అనుకున్నారు సభ్యులు; కాని వేంకటపతిరాజు "కానివ్వండి" అన్నట్టు తలా చెయ్యీ వూపాడు.

వెంటనే "యిలా చూడు పిల్లా" అన్నాడు శాస్త్రి.

పిల్ల చూసింది.

"పాడగలవా ?"

"చేతకా దండి"

"ఏం ?"

"సంగీతం నేర్చుకో లే దండి"

"సాహిత్యమో ?"

"లేదండి"

"పోనీ, ఆడగలవా ?"

"ఆ" అన్నట్టు పిల్ల తల వూపింది.

"బాగుండి. అయితే మొగం పైకెత్తు"

పిల్ల చెప్పినట్టు చేసింది.

"ఉలిక్కి పడకేం"

"అలాగే" అన్నట్టు మళ్లీ తల వూపింది.

అప్పుడు శాస్త్రి పిల్ల తలమీద ఎడమచెయ్యి వుంచి, కళ్లు మూసుకున్నాడు. ఒక్క క్షణం నిటాగ్గా కూచుని పైకి చూస్తూ యేదో మంత్రం పునశ్చరణ చేశాడు. మరొక్క క్షణం కుడిచేతి వేళ్లు సవరించుకున్నాడు.

తరవాత కళ్లల్లోకి గంభీరంగా చూస్తూ పిల్ల కంఠం నిమిరాడు.

ఇదంతా అయ్యేటప్పటికి పిల్ల కళ్లు మూసుదికుం.

"అదేం ?" అని అడిగాడు శాస్త్రి.

"కళ్లు మూసుకుపోతున్నాయండి"

"ఒక్కమాటు చూడు"

"చూడాలని లేదండి. చూడలేనండి"

"బాధగా వుందా ?"

"లేదండి"

"మరెలా వుందీ ?"

"కంఠంలో వొణుకు పుడుతోందండి"

"ఏమనిపిస్తోందీ ?"

"పాడా లనిపిస్తోం దండి"

"అయితే యింకేం ? ఏదీ వొక్క రాగం—"

"దారి దొరకడం లేదండి"

శాస్త్రి ప్రభువుకేసి చూశాడు. ప్రభువు మేనమామకేసి చూశాడు. మేనమామ యిటు తిరిగి శాస్త్రికేసి చూశాడు.

సభ్యులు గుబగుబలాడిపోయారు.

అప్పుడు శాస్త్రి, వొక్కమాటు మందహాసం చేసి, కుడిచెవిమీద చెయ్యి పెట్టుకుని, తన నోరు పిల్ల కుడిచెవిలో వుంచి "రేం రేం" అంటూ రేగుప్తి రాగం అందుకుని వొక్క విసురు విసిరాడు.

వెంటనే పిల్ల, శాస్త్రి విడిచినచోటు అందుకుని వొక్క గడియ ఆలాపన చేసి సభ అంతా గలగల్లాడించేసింది.

దాంతో ప్రభువు మొగం వికసించింది.

మేనమామ బోసినోరు వివృతం అయింది.

దివాన్జీ మొగం వాలిపోయింది.

౬

అటు సభ్యుల మొగాలమీద ఆశ్చర్యజ్యోత్స్న ఇంకా అంతరించకుండానే యిటు శాస్త్రి మళ్లీ నిటాగ్గా కూచున్నాడు.

ఎడమ చెయ్యి పిల్లతలమీద వుంచి మళ్లీ కళ్లు మూసుకుని వొక్కక్షణం పునశ్చరణ చేశాడు.

ఉత్తరక్షణంలో కుడిచేత్తో పిల్ల కళ్లు తుడిచి, ఆమె చెవి దగ్గరగా తన నోరుంచుకుని

"పలపలని మూఁకలోఁ గాల్
నిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా
కలితభుజుండై యొక్కఁడుఁ
దొలఁగి చనియె నేమి చెప్పుదుం గురునాథా?"

అని చదివి, తర్జనితో నిర్దేశిస్తూ పుస్తకంలో పిల్లకి ఆపద్యం చూపించాడు.

తన కళ్లు ప్రఫుల్లపద్మపత్రాలు కాగా, వెంటనే ఆమె శాస్త్రి యేస్థాయిలో అందుకున్నాడో ఆస్థాయిలోనే అందుకుని యథాశ్రుతంగా పద్యం చదివేసింది.

అది మొదలు,

గోదావరీప్రవాహం లాగ ఆమె పద్యం చదవడమూ, గుఱ్ఱం కదను తొక్కినట్టు అతను అర్థం చెప్పడమూనూ.

అతని ఆవేశం ఆమెకి సంక్రమించింది. ఆమె వుత్సాహం అతన్ని రెచ్చగొట్టింది.

దానిమీద సభ్యు లందరూ జంత్రపు బొమ్మ లయి పోయారు.

సుయోధనోపాలంభం ప్రారంభం అయింది.

మొదట సభ్యులు చకితులై వొకరికేసి వొకరు చూసుకున్నారు. తరవాత వారిలో కొంద రుత్సుకులు కాగా, తక్కినవా రసంతృప్తు లయినారు.

క్రమంగా, వొక పక్షాన కనుబొమ్మ లెగిరాయి. వెంటనే రెండో పక్షాన కళ్లు నిప్పులు కురిశాయి.

ఇది పూర్తి కాకుండా సుయోధనుడు ధర్మజుణ్ణి నిరసిస్తూ గదాయుద్ధానికి భీముణ్ణి యేరుకున్నాడు.

దాంతో, వుద్రిక్తు లయి వున్న సభ్యులు కొంద రటూ, కొంద రిటూ కేటాయింపయిపోయారు.

స్థితప్రజ్ఞుడైన ప్రభువు అందుకే ఆశ్చర్యపడుతూ వుండగా, ఆ ద్వైపాయనహ్రదప్రాంతంలో గదాగదిగానూ, యీ సభలో బాహాబాహిగానూ యుద్ధం ప్రారంభం అయింది.

పెద్ద గందరగోళం అయిపోయింది.

అది చూసి, "ఆ, ఆ" అని కళవళపడుతూ లేచి ప్రభువు వారించగా సమయజ్ఞుడైన శాస్త్రి పిల్లతలమీది తన చెయ్యి తీసేసుకుని, లేచి నుంచుని, ప్రభువుకేసి తిరిగి "అపరాధిని, క్షమధ్వం" అంటూ నమ్రుడై దోసిలి వొగ్గాడు.

ఈ సందట్లో కంగారుపడుతూ లేచి పిల్ల తన స్థానంలోకి వెళ్లిపోయింది.

అప్పటి కప్పుడే సభ్యు లందరూ మొదట చల్లపడి, తరవాత సిగ్గుపడి, చివరికి ఆశ్చర్యపడిపోయారు.

ఉత్తరక్షణంలో ప్రభువు ప్రకృతిలో పడి "మహానుభావా! తమరు మానవమాత్రులు కారు. ఆ సమయంలో తమ రక్కడే వుండివుంటే సుయోధనుడు భీముణ్ణే కాదు; శ్రీకృష్ణుణ్ణి కూడా చితకబాదిచేసి వుండు"నని ప్రశంసిస్తూ అమాంతంగా శాస్త్రిని కౌగిలించుకున్నాడు.

(ఇది జరిగిందీ, విన్నదీని. రచనమట్టుకే నాది)

వింశోత్తరీ దశానిర్ణయము

యుగానుసారముగా గ్రహముల మహాదశలను తెలిసికొను జ్యోతిశ్శాస్త్ర సూక్ష్మము

శ్రీ కప్పగంతుల విశ్వనాథం

శ్రీ సచ్చిదానందరూపమై గుణాతీతంబగు బ్రహ్మంబు ప్రకృతిసంవలితమై అహోరాత్రాత్మక కాల మూర్తిగా వెలసె. అతని మధ్యతత్వమే హోరాత్మకం బనబడును. అట్టి బ్రహ్మంబు త్రిపాదమృతవిభూతియు, ఏకపాదవిశ్వభూత విభూతియు నగుచు చతుష్పాదం బని శ్రుతిశిరోశేగీయమానంబయ్యె. అట్టి అహోరాత్రైక కపాలంబు త్రింశదంశాత్మకం బయ్యె (30 భాగలు). అట్లే భచక్రాత్మకుండగు కాలమూర్తికి నవయవంబగు కపాల స్థానీయమైన రాశియును త్రింశద్భాగాత్మకం బన నొప్పె. అట్టి త్రింశత్సంఖ్యయందు, బిందు మయాత్మకం బనియు, దాని వామభాగమున ప్రకృతిగుణంబులగు సత్వరజస్త మంబులు మూడును జెరిగె. అట్టి చరాచర విశ్వభాగ మునకు గల 30 అంశములలో నవగ్రహములు భోక్తృత్వాధికారమును చెందె. కర్మ పరిపాక ఫలకాల సూచకులై దశాధిపతు లనంబడిరి.

ముప్పది అంశములలో సూర్యునకు $1\frac{1}{2}$, చంద్రునకు $2\frac{1}{2}$, కుజునకు $1\frac{3}{4}$, రాహువునకు $4\frac{1}{2}$, గురువునకు 4, శనికి $4\frac{3}{4}$, బుధునకు $4\frac{1}{4}$, కేతువునకు $1\frac{3}{4}$, శుక్రునకు 5— ఇట్లు అంశములు భోగ్యములయ్యెను.

అందు భూపుత్రుని (కుజుని) వెంబడి భూచ్ఛాయయగు రాహువునకును, తదనంతరము రాహుదోష పరిహారకుండగు గురునికిని, తరువాత గురుదశా సుఖ భోగ ప్రయోజకాయుష్కారకుం డగు శనికిని, ఆయు స్సాఫల్య సంపాదకంబగు ప్రజ్ఞకు కారకుడైన బుధునికిని, ప్రజ్ఞకు పరమ ఫలంబగు మోక్షమునిచ్చు కేతువునకును, పిదప సర్వభోగ్య సూచకుండగు రుద్రాంశముగల శుక్రునకును, ఆదియం దాదిభూతుండగు సూర్యునకును, అనంతరము మాతృభూతుండగు చంద్రునకును, పిమ్మట జ్యేష్ఠ భ్రాతయగు కుజునకును దశలక్రమము ఏర్పడెను. $1\frac{1}{2}+2\frac{1}{2}+1\frac{3}{4}+4\frac{1}{2}+4+4\frac{3}{4}+4\frac{1}{4}+1\frac{3}{4}+5=26\frac{16}{4}$ లేక 30 అంశలు—సమష్టికపాలము. $30\times4=120$ కపాలాంశలు. కావున ఇవియే కలియుగంబున పరమాయు స్సంవత్సరములు. గ్రహముల కపాలాంశలను ద్విగుణించిన సమష్టిషష్టి ఘటికాత్మకాహోరాత్రం బయ్యె. $30\times2=60$ గడియలు.

దీనిని దశగుణ మొనరింప తత్సమష్టి ద్వాపర యుగమున మర్త్యశాబ్ద పరిమితాయుః పరిమాణం బయ్యె : $60\times10=600$ ద్వాపరాయుస్సు. దీనిని షడ్గుణ మొనర్చిన సమష్టిసంవత్సరములు త్రేతాయు గంబున పరమాయుఃపరిమాణం బయ్యెను. 600 × $=3600$ త్రేతాయుగ పరమాయుస్సంవత్సరములు. దీనిని చతుర్గుణ మొనరించగా వచ్చిన మొత్తము కృత యుగంబున పరమాయుస్సంవత్సరములు. $3600\times4=14400$ కృతాయుః ప్రమాణము. అట్టి కృతయుగ పరమాయుస్సంవత్సరములను కలి తన పరమాయుస్సంవత్సరములతో భాగించగా, లబ్ధములు వరుసగా సూర్యాది గ్రహములకు మహాదశా సంవత్సరము లగుచున్నవి.

ర 6, చం 10, కు 7, రా 18, గు 16, శ 19, బు 17, కే 7, శు $20=120$ సం.లు వెరశి.

...రవి 180 × 4 = 720	30 × 6 = 180	3 × 10 = 30	1½ × 2 = 3			
గ్రహములు	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	నక్షత్ర దశాబ్దాః
వి *	720	180	30	3	1½	6
ంద్ర	1200	300	50	5	2½	10
జ	840	210	35	3½	1¾	7
హు	2160	540	90	9	4½	18
రు	1920	480	80	8	4	16
ని	2280	570	95	9½	4¾	19
బుధ	2040	510	85	8½	4¼	17
కేతు	840	210	35	3½	1¾	7
శుక్ర	2400	600	100	10	5	20
గ్రహ ములు	14400 సం॥లు కృతాయుస్సు	3600 సం॥లు త్రేతాయుస్సు	600 సం॥లు ద్వాపరాయుస్సు	60	30	120 సం॥లు కల్యాయుః వింశోత్తరీయః

$$30 \times 2 \times 10 \times 6 \times 4 = 480 \times 30 = 14400$$

కృతయుగ పరమాయుర్వత్సరములు.

(1) ఉదాహరణ:—రవిమహాదశ.

కృతయుగములో 14400 పరమాయువు అయినప్పుడు రవిమహాదశ 720 సం॥ములు. కలియుగములో 120 సం॥లు పరమాయువు అయిన రవిమహాదశ ఎంత?

14400 సం॥లకు—720 సం॥లు.

$$1 \text{——} \frac{720}{14400}$$

120—— ?

$$\therefore \frac{720 \times 120}{14400} = 6$$ సం॥లు కలియుగ రవిమహాదశ.

(2) ఉదాహరణ: త్రేతాయుగములో బుధమహాదశ 510 సం॥లు అయిన ద్వాపరయుగములో బుధమహాదశా ప్రమాణము ఎంత?

త్రేతాయుగములో పరమాయుః ప్రమాణము 3600 అయిన బుధమహాదశా ప్రమాణము 510 సం॥లు వచ్చినవి. ద్వాపరయుగములో పరమాయుః ప్రమాణము 600 సం॥ము లయిన బుధమహాదశ ఎంత?

3600 సం॥లకు 510

$$1 \;,, \; \frac{510}{3600}$$

600 ,, ?

$$\therefore \frac{510 \times 600}{3600} = 85$$ సంవత్సరములు.

(3) ఉదాహరణ: ద్వాపరయుగములో బుధమహాదశ 85 సం॥లు అయిన శుక్రమహాదశ ఎంత?

బుధమహాదశ : శుక్రమహాదశ :: 4¼ 5

$$85 : x :: 4\tfrac{1}{4} : 5$$

$$\therefore x = \frac{85 \times 5 \times 4}{17} = 100$$ సంవత్సరములు శుక్రమహాదశ.

(4) ఉదాహరణ: ద్వాపరయుగములో శుక్రమహాదశా సంవత్సరములు 100 అయిన కలియుగములో శుక్రమహాదశా సంవత్సరములు ఎన్ని?


ద్వాపరయుగములో పరమాయుః ప్రమాణము 600 సంవత్సరములు అయిన శుక్రుని మహాదశా సంవత్సరములు 100 అగును. కలియుగములో 120 సంవత్సరములు అయిన శుక్రునికి ఎన్ని సంవత్సరములు వచ్చును?

ద్వాపరములో 600 సంవత్సరములు అయినప్పుడు 100 శుక్రునిమహాదశాసంవత్సరములు. కలిలో 120 సంవత్సరములు అయిన శుక్రునికి ఎన్ని?

$$\frac{100 \times 120}{600} = 20$$ సం॥లు శుక్రునికి వచ్చును.

కనుక కలియుగములో శుక్రమహాదశ 20 సంవత్సరములు.

ఇట్లే ప్రతిగ్రహముయొక్క మహాదశ తెలిసికొనవచ్చును.



ఆనువంశికము - వాహకులు

(Heredity and the Carriers of Inheritance)

వంశానుక్రమంగా మానవసంతానంలో కొన్ని కొన్ని ఛాయలు, కొన్నికొన్ని లక్షణాలు, కొన్నికొన్ని గుణాలు మొదలైన పోలికలు అనుగతంగా అబ్బుతూవుంటాయని మనలో చాలా మందికి తెలుసు. అందులోనూ,ముఖ్యంగా తల్లిదండ్రులచాలు పిల్లలలో కొద్దిగానో హెచ్చుగానో రూఢంగా సంక్రమిస్తూవుండడం నిత్యజీవితంలో చూస్తూనేవున్నాము. ఇలాగ తల్లి,తండ్రి,తాత, ముత్తాత మొదలైన ప్రాణులలోని సహజమైన గుణశీలాదులు వారి సంతానానికి ఏవిధంగా సంక్రమిస్తాయి, అవి వేటిగుండా వస్తాయి, ఇలాగా వంశపారంపర్యంగా ఈగుణశీలాదులు రావడంలో ఏదైనా గొలుసుకట్టు ఉన్నదా ఇత్యాది ప్రశ్నలకు ఈవైజ్ఞానికవ్యాసం అతి వివరంగా, అతి సులభంగా, అతి రుచికరంగా సమాధానమిస్తున్నది.


ప్రాణికోటిలో ఉన్న ప్రాణులు రెండు తరగతులు. అవి అందరకును తెలిసినవే. 1. జంతువులు. 2. వృక్షములు. మనుష్యులుకూడా జంతువులే అని వేరే చెప్పనక్కరలేదు. అటు పిపీలిక మొదలు బ్రహ్మవరకు, ఇటు గడ్డిపరక మొదలు కల్పవృక్షందాకా చక్కగా పరిశీలించినట్లయితే ప్రతిప్రాణియొక్క జీవితోద్దేశమూ ఒక్కటే అని తెలుస్తుంది. ప్రాణమున్న ప్రతి అణువుకూడా తన జీవితం చాలించేలోపల తనపోలిక గల ప్రాణుల్ని కొన్నిటిని భూమిమీద పడవేసి, అంటే—తనలాంటి ప్రాణుల్ని ఉత్పత్తిచేసి భూమిమీద తనజాతి అంతరించకుండా ఆచంద్రార్కంగా ఉండాలని ప్రయత్నిస్తుంది. ప్రయత్నించడమేగాక కేవలం అలాగ జరుగుతూ ఉన్నట్టు మనం చూస్తూనే ఉన్నాం. అదే ప్రతిప్రాణికీ జీవితాశయం. ఇది పుట్టుకతోటే ఉన్న స్వభావంగాని మధ్యలో బయలుదేరిందిగాదు. మనుష్యులలో మనం స్పష్టంగా చూస్తాం యీ విషయం. "మేము ఔరంగజేబునుంచి తిన్నగా బయలుదేరిన సంతతి"అనీ,"మేము సూర్యవంశపు రాజులం. శ్రీ రామచంద్రుడు మావంశంలోవాడే" అనీ, "మాది భారద్వాజసగోత్రం. భరద్వాజుడే మావంశకర్త"అనీ చెప్పుకుంటూఉంటే వింటూనేఉన్నాం. రెండు సంవత్సరాల క్రితందాకా మాఅవిడ అమ్మమ్మ తల్లి బ్రతికింది. అందుచేత ఆవిషయం నమ్మకతప్పదు. పరే: పిల్లికి పుట్టిన సంతానం పిల్లులే అవటమేమి? కుక్కలు ఎందుకు కాకూడదు? వేపాకు ఏవూళ్లో చూసినా చేదువిషమేంగాని, తియ్యగా పంచదారలాగుంటే కాఫీలోకీ, టీలోకీ వేరే పంచదార కొనుక్కో అక్కరలేదే? పుట్టినప్పటినుంచీ కాకుల్ని చూస్తున్నాం. ఒక్కటీ తెల్లనిది కనబడదేమి? పోతన పరమభాగవతోత్తముడై భాగవతంపలకడమేమి, పేరావధాన్లు పంచాంగం పట్టుకొని పౌరోహిత్యం చేయడమేమి? ఈమాదిరిసందేహాలు తెలుసుకోవాలనే యిచ్ఛగల ప్రతిమానవుడికీ కలుగుతాయి. వీటికి సమాధానం కుక్క 'భౌంయి' మనటానికీ, పిల్లి 'మ్యావు' అనటానికీ కారణం ఏమిచెపుతామో అదే చెప్పవలసి ఉంటుంది. ప్రస్తుతం 'అవి అలాగ ఉండాలికాబట్టి'అని సమాధానం చేసుకుంటే, తర్వాత సరియైనకారణం మీకే బోధపడుతుంది. అంటే తల్లిప్రాణిలో ఉన్న సహజమైనగుణాలు పిల్లకు ఏవిధంగా వస్తాయి, అవి వేటిగుండా వస్తాయి, యీలాగ పారంపర్యాన్ని రావటానికి ఏదైనా గొలుసుకట్టు ఉందా?—ఇదే ఆనువంశికం.

మనకంటికి కనబడే ప్రతిజీవిశరీరమూ లెక్కపెట్టలేనన్ని చిన్న చిన్నగదులు (Calls)కలిసి ఒకటిగా ఏర్పడింది. శరీరం ఎంతపెద్దదైతే అంత అసంఖ్యాకంగా ఉంటాయి యీగదులు. ఈగదులనే జీవకణములని అంటారు. ఇవి మనకంటికి కనబడవు. శరీరంలో ఏభాగమైనాసరే అతిసన్నని పొరగా తీసి, దానిని సూక్ష్మదర్శక యంత్రం

క్రింద పరీక్షిస్తే అప్పుడు యీగదులను మనం స్పష్టంగా చూడగలం. కొన్ని జీవుల శరీరం కేవలం ఒక్క జీవకణంతోటే ఏర్పడిఉంటుంది. వాటినే మనం సూక్ష్మజీవు లంటాం. అవి ఎక్కడపడితే అక్కడ ఉంటాయి; గాలిలో ఎగురుతూ ఉంటాయి; నీళ్లలో ఉంటాయి; క్రుళ్లిపోయిన వస్తువులలో అధికంగా ఉంటాయి; మనం తినే ఆహార పదార్థాలలో కొన్నిటిలో ఉంటాయి; పెరుగులో ఉంటాయి: మన నాలుకమీదఉండే పాచిని కొద్దిగా తీసి సూక్ష్మదర్శకయంత్రంక్రింద పరీక్షిస్తే లక్షలకొలది కనబడతాయి; మన శరీరంలో కూడా ఉంటాయి. ఈసూక్ష్మ జీవులలో కొన్నిరకములైనవి ప్లేగు, కలరా, క్షయ మొదలైన అనేక అంటువ్యాధులకు కారణం. కొన్ని మనకు సహాయకారిగా ఉంటాయి. ముఖ్యమైన విషయం ఏమిటంటే—ఒక్క జీవకణమే శరీరంగా గల యీసూక్ష్మజీవులుకూడా పెద్దప్రాణులు తమ జీవితంలో కనబరచే అవస్థల నన్నిటినీ పొందుతాయి. వాటికికూడా ఆహారంకోసం చలనం, ఆహారం తీసుకోవటం, ఎదగటం, ప్రాణవాయువును తీసుకొని బొగ్గుపులుసుగాలి విడవటం, సంతానోత్పత్తి, చావు మొదలైనవన్నీ ఉంటాయి. అందుచేత, శరీరంలోఉండే ప్రతి జీవకణమూ ఒక్కొక్క సూక్ష్మజీవి అన్నమాట.

ఈ జీవకణా న్నిప్పుడు కొద్దిగా పరిశీలిద్దాం. ఇవి—కొన్ని గుండ్రంగా, కొన్ని నలుపలకలుగా, అయిదుపలకలుగా, ఆరుపలకలుగా—యిల్లా ఉంటాయి. ఈ జీవకణంచుట్టూ ఒక సన్ననిపొర ఆవరణగా ఉండి, ఒకదానినుంచి మరొకదానిని వేరుపరుస్తూ ఉంటుంది. ఈ పొరను **Cell-wall** అని అంటారు. దీనిలోపల చిక్కటి జావలాంటి పదార్థం నిండిఉంటుంది. దీనిమీదే ప్రాణం ఆధారపడిఉంది. ఈపదార్థంలేని వస్తువుకు ప్రాణం ఉండనేఉండదు. దీనిని జీవరసము (**Protoplasm**) అని అంటారు. ఈ జీవరస తత్త్వాన్నిగురించి చెప్పటానికి ప్రస్తుతం వ్యవధి చాల దనుకుంటాను. ఈ జీవరసంలో మధ్య ఒక గుండ్రటి వస్తువు ఉంటుంది. దీనికి 'న్యూక్లియసు' అని పేరు. దీనిలోకూడా జావలాంటి ద్రవం ఉంటుంది. ముఖ్యంగా దీనిలో 'క్రొమాటిన్' అనే పదార్థం సన్నని ఒక వలమాదిరిగా అల్లుకొని ఉంటుంది. దీనిలో మరియొక చిన్న గుండ్రటిముద్ద కనబడుతుంది. ఇది కూడా క్రొమాటిన్‌తో చేయబడినదే. దీనిని 'న్యూక్లియోలసు' అంటారు. ఈ న్యూక్లియసుకు తక్కినభాగంతో వేరుచేస్తూ ఒకపొర ఉంటుంది.

ఇదీ జీవకణంలోఉండే సామగ్రి అంతాను. ఈచిన్న సామగ్రితోటేఒక్క జీవకణం యీబ్రహ్మాండమైన సృష్టినంతా సృష్టిస్తూవుంది. మీరు ఈ ప్రపంచంలో మీకంటికి కనబడే ఎంత పెద్దజంతువునైనా, ఎంత పెద్దవృక్షమునైనా తీసుకోండి. అంత పెద్దశరీరంకూడా ఒక్క జీవకణంలోనుంచి వచ్చిందే. ఇంకొకసంగతి: నాబుద్ధికి తోచేది ఏమిటంటే—ఈ ప్రపంచంలో ఎన్ని వృక్షములున్నాయో, ఎన్ని జంతువులున్నాయో, ఎంతమంది మనుష్యు లున్నారో—ఇదివరలో పోయినవి, ముందు రానున్నవి—అందరూ యీ జీవసృష్టి కంతటికీ కారణమైన ఒక జీవకణాన్నుంచి వచ్చినవారే. అంటే, యివిఅన్నీ ఏకోదరు



జీవకణం

[1. Cell-wall, 2. జీవరసం, 3. న్యూక్లియసు,
4. క్రొమాటిన్ వల, 5. న్యూక్లియోలసు.]


లన్నమాట. అందుచేత ఈ విధంగాకూడ మనం విశ్వమానవ సోదరత్వంతోబాటు విశ్వజంతు సోదరత్వం, విశ్వవృక్ష సోదరత్వం, ప్రేమ చూపవలసి ఉంటుందనే నా ఉద్దేశం. ఈ జీవకణం అడ్డంగా కొలిచినట్లయితే సుమారు ఒక మిల్లిమీటరులో 1/10,000 వ భాగం ఉంటుంది. అది ఎంతతీక్ష్ణమైన సూక్ష్మదర్శకయంత్రంతో పరీక్షించినా స్పష్టంగా కనబడదు. అసలు మొట్టమొదట ఈజీవంగాని, జీవకణంగాని ఏలాగున వచ్చిందయ్యా అంటే పాశ్చాత్య వైజ్ఞానికులు పంచభూతములనుండి ఏర్పడిం దన్నారు. ఈమాట మనవేదాలు సృష్ట్యాదినే ఘోషించినట్టు వినికిడి. పైన చెప్పిన యీజీవపరంపర కంతకూ కారణమే మనం గ్రహించవలసిన ముఖ్యమైన విషయం. అది జీవకణంలో సంతానోత్పత్తిని కలిగించే పదార్థ ముండే, అది అవిచ్ఛిన్నంగా అనాదినుంచి ఒక తీగవలె స్తరుగా వచ్చే స్వభావమే. దానినే వైజ్‌మాన్ అనే పాశ్చాత్య వైజ్ఞానికుడు **Continuity of Germplasm** అని అన్నాడు. ఆపదార్థమే 'జెరమ్‌ప్లాసం'. ప్రతిజీవకణానికీ ఆన్యూక్లియసు అనే పదార్థం ముఖ్యావసరం. అదిలేనిదే జీవకణం ఒకటి రెండూ, రెండు నాలుగూగా వృద్ధిపొందటానికి అవకాశమే లేదు. మనం తెలుసుకోబోయే విషయమంతా దానిమీదే ఆధారపడిఉంది. అది లేకపోతే అనువంశికమే లేదు. వాహాకు లంతకన్నా లేవు. ఈజీవకణాన్ని పరిశోధనాలయంలో స్వశక్తిచేత సృష్టించడానికి పాశ్చాత్య జీవశాస్త్రజ్ఞులు విశ్వప్రయత్నం చేస్తున్నారు. వారి కది సిద్ధించదని గట్టిగా చెప్పేటందుకు వీలులేదు. కాని మనం చూస్తామో చూడమో.

ప్రతిస్థూలశరీరంలోనూ రెండు రకములైన జీవకణా లుంటాయి: 1. శరీరపోషణకు అవసరమైనవి, 2. సంతానోత్పత్తికి అవసరమైనవి. శరీరంలో ఏభాగమైనా పెరగటానికిగాని, ఏక్రొత్త అవయవమైనా బయలుదేరటానికిగాని మొదటి రకపు జీవకణములే ఆధారం. అవి ఒకటి రెండు, రెండునాల్గు, నాల్గు ఎనిమిది—యీమాదిరిగా

ఏర్పడతాయని పైన చెప్పేవున్నాను. ఇవి శరీరమంతటా కనబడ తాయి. రెండవరకపు జీవకణాలు ప్రత్యేకమైన యిటువంటి జీవకణాల నుంచి వచ్చినవేకాని అవి వాటి నియామకస్థలంలోనే ఏర్పడ తాయి. మన ప్రస్తుతవిషయానికి ఈ రెండురకాల జీవకణాలూ ఏవిధంగా ఏర్పడుతున్నాయో తెలుసుకోవటం కొంత అవసరం. అది తెలుసుకోనేందుకు మీరు కొద్దిగా శ్రమపడాలి. మనకంటికి కనబడే వస్తువులన్నీ ఏదో మనకు తెలియని ఒక శక్తిచేత కొన్నిలక్షలరెట్లు పెద్దవిగా చేయబడి, ప్రతిజీవకణం ఒక ఏనుగంత పెద్దదైనట్లుగాగాని, ఒక జీవకణంలో మారి దానిపొరలోనుంచి మరొకదానిలోకి పోగలిగి నంత సూక్ష్మశరీరం మీరు పొందినట్లుగాగాని భావించుకోవాలి. ఇది భావకవులకు చాలా సులభం. ఎందుచేతంటే—ఆకులో ఆకునై, పూవులో పూవునై, నునులేతరెమ్మలుకూడా అయిన వాళ్లు వాటిలో ఉండే జీవకణాలలోకూడా దూరిపోవటాని కింక ఆట్టే అంత శ్రమ పడవక్కరలేదు. అప్పుడు మీకు ఈజీవకణంలోపల జరిగే తమాషా, ఆ అతిసున్నితమైన పనిముట్లు, ఈ అనంతకోటిజీవులలోనేగాక ఒకే జాతిలోకూడా ఉన్న వ్యత్యాసము లెల్లా వస్తున్నాయో, ఈ అనువం శికం వేటిచేతుల్లో ఉందో ఈరహస్యం అంతా చక్కగా దృగ్గోచర మవుతుంది.

మొదట శరీరపోషణ కవసరమైన జీవకణాలసంఖ్య ఎట్లా వృద్ధిపొందుతూవుందో చూద్దాం. జీవకణంలో ఉండే న్యూక్లియసు మొదట క్రమంగా పెద్దదై, దానిలో నున్న క్రొమాటిన్ వలయొక్క దారము లన్నీ యీ క్రొమాటిన్ పదార్థంతో చిక్కబడి, త్రాళ్ల మాదిరిగా అయి, ఆవల అంతా ఒకటే త్రాడుగా అయి అల్లిబిల్లిగా ఏర్పడుతుంది. చివరికి ఆ త్రాడు 'U' లేక 'V' ఆకారంగల కొన్ని ముక్కలుగా తెగిపోతుంది. ఈ ముక్కలయొక్క సంఖ్య వాటి యిష్టంవచ్చినట్లుగా ఏర్పడదు. ప్రతిరకపు ప్రాణికీ ఒక్కొక్క సంఖ్య నియామకంగా ఉంటుంది. మనుష్యునిలో (స్త్రీపురుష బిడ్డలలోను) ప్రతిజీవకణంలోనూ 48 ముక్క లుంటాయి. ఏజాతి మనుష్యుడైనా సరే అన్నే ఏర్పడతాయిగాని ఒకటి ఎక్కువగాని, ఒకటి తక్కువగాని ఎప్పటికీ కనిపించవు. మనయింట్లో తిరిగే యీగజీవకణంలో 12 ఉంటాయి. 'డ్రాసోఫైలా' అనే ఒకవిధమైన యీగ ఉంది. దానిలో 8. ఒకవిధమైన చేపలలో యివి 200 ఉన్నాయి. అలాగే గుర్రాలలో, కోతులలో, పిల్లులలో, కుక్క లలో, కౌజులలో, పురుగులలో—ఒకటేమిటి ప్రతిరకపు ప్రాణికీ ఆయాసంఖ్య ఉంటుంది. చెట్టుచేమలలోకూడా అంతే. వేపచెట్టు యొక్క జీవకణంలో ఉండే సంఖ్య వేరు; వెలగచెట్టులో ఉండే సంఖ్య వేరు. మామిడిచెట్టులో ఒకసంఖ్య ఉంటే, మారేడుచెట్టులో మరొకసంఖ్య. ఒకవేళ ఒకేసంఖ్య రెండురకములైన ప్రాణులలో ఉంటే, యీ క్రొమాటిన్ ముక్కల ఆకారంలోనో, సైజులోనో తేడా ఉంటుంది. ఈ క్రొమాటిన్ ముక్కలకే 'క్రోమోసోములు' అని పేరు. ఇవే అనువంశికవాహకులు. వీటి స్వభావములే, వీటిలో ఉండే గుణములే తరతరాలకూ అంతర్వాహినిగా ప్రవహిస్తూ ఉం టాయి. పిల్లిసంతానం పిల్లులే అవటానికీ, కుక్కసంతానం కుక్కలే అవటానికీ, వేపాకు ఏవూళ్లో చూసినా చేదుగానే ఉండటానికీ యివే కారణం. ఈ అనువంశికరహస్యం అంతా వీటిచేతుల్లోనే ఉంది. ఈ మార్పులు కలుగుతూఉంటే, న్యూక్లియసుయొక్క పొర మాయమై పోతుంది. తర్వాత జీవకణంలోఉండే మిగిలిన పదార్థం అతి సన్నని దారపుపోచలుగా తయారై, అవి రెండుధ్రువములుగల ఒక కండెగా ఏర్పడతాయి. అప్పుడు ఈ క్రోమోసోము లన్నీ ఎడమొహం పెడ మొహంగా యీకండెయొక్క మధ్యభాగానికి వచ్చి చేరుకుంటాయి. అక్కడ ఒక్కొక్క క్రోమోసోమూ నిలువుగా రెండుక్రింద చీలి, 'U' లేక 'V' ఆకారంగల క్రోమోసోములు రెట్టింపు అవుతాయి. జీవకణంలో మొదట 4 క్రోమోసోము లున్నా యనుకుంటే, అవి యిప్పుడు 8 అవుతా యన్నమాట. వాటిలో నాలుగు క్రోమోసోములు యీ కండెయొక్క దారములను పట్టుకొని మెల్లిగా ఉత్తర ధ్రువా నికీ, మిగిలిన నాలుగూ దక్షిణధ్రువానికీ చేరతాయి. అక్కడ వీటితో ఒక చిన్న న్యూక్లియసు న్యూక్లియోలసుతో సహా ఏర్పడుతుంది. అంటే, మొదటిన్యూక్లియసుయొక్క పదార్థం చెరిసగం అయి, రెండు చిన్న న్యూక్లియసులు ఏర్పడతాయి. ఈలోపుగా యీ కండెయొక్క దారాలసంఖ్య ఎక్కువై, జీవకణంలో మధ్యకొన్ని రేణువులకూడికతో అడ్డంగా ఒక పల్చటిపొర ఏర్పడుతుంది. ఇది రెండుపొరలుగా ఉం టుంది. ఒకపొర క్రిందిజీవకణానిది. రెండవది పైదానిది. తరువాత యీకండె మెల్లిగా జీర్ణించిపోతుంది. ఈ విధంగా ఒక జీవకణం రెండు, రెండు నాలుగు, నాలుగు ఎనిమిదిగా శరీర మంతటా అవు తాయి. ప్రతిజీవకణంలోనూ ఏర్పడే యీ క్రోమోసోముల సంఖ్య 4 మాత్రమే.

ఇంక సంతానోత్పత్తి కవసరమగు జీవకణాలు ఏవిధంగా ఏర్పడతాయో చూద్దాం. ఇక్కడకూడా న్యూక్లియసులో ఆ క్రొమాటిన్ తో ఏర్పడిన త్రాడు తయారవుతుంది. బాగా పరిశీలిస్తే అది త్రాడంతా ఒకటే అయినప్పటికీ రెండేసిత్రాళ్లు ఒకదాని ప్రక్క నొకటి చేరినట్లు కనిపిస్తుంది. చివరకు బాగా చిక్కపడిన తర్వాత ముక్కలుముక్కలుగా అయి, రెండేసి క్రోమోసోములు ఒకజతగా చేరతాయి. ఇక్కడకూడా మొట్టమొదట జీవకణంలో నాలుగు క్రోమోసోము లున్నా యనుకుంటే, రెండేసికల జతలు రెండు ఏర్పడతాయి. అంటే, క్రోమోసోములయొక్కసంఖ్య యిక్కడ సగం అయిందన్నమాట. ఇదే పైదానికిని దీనికిని ఉన్న భేదం. ఈ సగం అవటం చాలా అవసరం. ఎందుచేతో యిప్పుడే తెలుస్తుంది. ఈలోపుగా ప్రతిజతా వాటివాటి సహజమైన ఆకారం కలిగి ఉంటాయి. ఉండి, యించుమించుగా ప్రతిజతలోనూ ఒకదాని నొకటి అంటుకొని ఉంటాయి. అప్పుడు ఒకదానిలోనున్న క్రొమాటిన్




2. శరీరపోషణ కవసరమగు జీవకణము రెండుగాఅగుట.

[1. జీవకణం, 2. క్రొమాటిన్ త్రాడు, 3. కండె-దాని మధ్య చేరిన క్రోమోసోములు, 4. ధ్రువములకు ప్రయాణమగుచున్న క్రోమోసోములు, 5. ధ్రువములకు చేరుచున్న క్రోమోసోములు, 6. ధ్రువములకు చేరినవి, 7. జీవకణంలో మధ్య రేణువులకూడిక, 8. రెండు చిన్న జీవకణములు.]

పదార్థం మరొకదానిలోనికి పోవచ్చు. ఈ రెండుజతలూ న్యూక్లియసు మధ్యకు వచ్చి చేరుకుంటాయి. ఇక్కడకూడా రెండు ధ్రువములు కల దారపుకండెమాదిరిది ఏర్పడుతుంది. ఇప్పుడు పైదానికివలె యీ క్రోమోసోములు రెండుగా చీలవు. చీలక, యీ రెండు జతలలోనూ, ఒక్కొక్కజతకు ఒక్కొక్కటిచొప్పున రెండు ఉత్తరధ్రువానికీ, రెండు దక్షిణధ్రువానికీ పోయి చేరుకుంటాయి. ఇప్పుడు ఒక్కొక్క ధ్రువంలో రెండు క్రోమోసోములు మాత్రమే ఉన్నాయి. ఈ రెంటితోటే అక్కడ ఒక న్యూక్లియసు ఏర్పడుతుంది. ఇప్పుడే యీ రెండు న్యూక్లియసులమధ్య ఒకపొర ఏర్పడితే ఏర్పడవచ్చు. వెంటనే పైభాగంలోవున్న యీ చిన్న న్యూక్లియసులో యీ రెండు క్రోమోసోములూ మళ్లీ ఒకత్రాడుగా మారి, రెండుముక్కలై, మధ్యకు చేరి, అక్కడ యిప్పుడు ఒక్కొక్కటి నిలువుగా రెండుక్రింద చీలి, మొత్తం నాలుగు క్రోమోసోములు ఏర్పడి, మళ్లీ ఏర్పడిన యీ దారపుకండె సాహాయ్యంతో రెండు ఒకమూలకూ, రెండు ఇంకొకమూలకూ చేరి, అక్కడ యింతకంటె చిన్న న్యూక్లియసును తయారుచేస్తాయి. క్రిందిభాగంలోనూ యీ విధంగానే రెండు చిన్న న్యూక్లియసులు ఏర్పడతాయి. అంటే, మొత్తం నాలుగు న్యూక్లియసులు జీవకణంలో ఏర్పడ్డాయి. తర్వాత యీ నాల్గింటిని వేరుచేస్తూ పొరలు ఏర్పడతాయి. ఈ విధంగా 4 క్రోమోసోములు కల ఒక తల్లిజీవకణాన్నుంచి రెండేసి క్రోమోసోములు కల చిన్న జీవకణాలు 4 ఏర్పడ్డాయి. ఇవే సంతానోత్పత్తికి అవసరమైన జీవకణాలు. వీటిని Germ-cells అంటారు.

ఈ మాదిరిగా ఒక్కొక్క తల్లి జీవకణాన్నుంచి పురుషశరీరంలో 4 పురుషబీజములు, అదేవిధంగా స్త్రీ శరీరంలో 4 అండములు ఏర్పడతాయి. కాని అండము పెరుగుటకు ఆహారం ఎక్కువ కావాలి కాబట్టి, సాధారణంగా ఆ నాల్గు అండములలోను మూడుశీర్ణించిపోయి ఒక్క అండంమాత్రం బాగా పెరుగుతుంది. వృక్షములలో కూడా అంతే. ఇందులో మనం ముఖ్యంగా గమనించవలసిన విషయం తక్కిన శరీరంలో ఉన్న క్రోమోసోములలో సగంమాత్రమే యీ బీజములలో ఉండటం. ఇది చాలా ముఖ్యం. అదేకనక లేకపోతే పిండం సరిదుగా తయారవటానికి బదులు ఏ వానరుడుగానో, పిల్లిగా తయారవటానికి బదులు ఏభూతపిల్లిగానో తయారవవచ్చు. ఈ ఏర్పాటు అతిసూక్ష్మమైనదిన్నీ, అత్యవసరమైనదిన్నీ. ఎందుచేతంటే, పురుషశరీరంలో ఉన్న బీజమున్నూ, స్త్రీ శరీరంలో ఉన్న అండమున్నూ కలిస్తేగాని పిండం ఏర్పాటవదన్న సంగతి అందరకూ తెలిసిన విషయమే. పై ఉదాహరణప్రకారం శరీరంలో ఉన్న ప్రతి జీవకణంలోనూ 4 క్రోమోసోము లుంటే, సంతానోత్పత్తికి అవసరమైన జీవకణాలు ఏర్పడినప్పుడు పురుషబీజంలో 2, అండంలో 2 మాత్రమే ఉన్నాయి. పురుషబీజమూ, అండమూ కలిసినప్పుడు యిందులో రెండూ, అందులో రెండూ కలిసి 4 అయి, శరీరంలో ప్రతిజీవకణంలోనూ మామూలుగా ఉండవలసిన క్రోమోసోములసంఖ్య ఏర్పడి ఆ పిండం తయారౌతుంది. లేకపోతే, వీటిలోకూడ నాలుగేసి క్రోమోసోము లుంటే, రెండు నాల్గులు ఎనిమిది క్రోమోసోములయి, సింహం అవటానికి బదులు ఏ నరసింహావతారమో అవతరిస్తుం దని పైన చెప్పినవిషయమే. చూశారండీ! ఇది ఎంత చక్కని ఏర్పాటో! ఈ చిత్రాన్ని ఏ శిల్పి సృష్టించగలడు? ఎవడు చిత్రించగలడు? ఈ మార్పు లన్నీ మనం సూక్ష్మదర్శకయంత్రం క్రిందచూడగలం. 'హీమోటాక్సిలిన్' అనే రంగు వేస్తే జీవకణంలో యీ క్రోమోసోములు, న్యూక్లియసు నల్లగా కనబడతాయి.

అవసరమైన విషయం ఇంకొక్కటిమాత్రం ఉంది. ఎక్కడి నుంచో గింజపడి మన దొడ్డిలో బొప్పాయిమొక్క మొలిచింది. అది పోతుచెట్టు అవుతుందా, ఆడచెట్టు అవుతుందా? కోడి గ్రుడ్డు పొదుగుతూవుంది. అది పుంజు అవుతుందా, పెట్టా? మన ఆవు ఈనబోతూ వుంది. కోడెదూడను పెడుతుందా, పెయ్యదూడను పెడుతుందా? పెయ్యదూడైతే మళ్లీ పాలపూచీ గడుస్తుంది. అవధాన్లు గారికి అందరూ ఆడపిల్లలే. పాపం! మచ్చుకోసం మగవలు సొకడు పుడితే వంశమైనా ఉద్ధరిస్తాడు. శిశువుకు యీ స్త్రీపురుషనిర్ధారణ ఏలా కలుగుతూవుంది? ఇది కూడా యీ క్రోమోసోముల చేతిలోనే ఉందిగాని ఆయాప్రాణుల ప్రమేయకత్వం




3. తల్లి జీవకణమునుండి సంతానోత్పత్తికవసరమగు జీవకణము లేర్పడుట.

[1. క్రొమాటిన్ త్రాడు, 2. క్రోమోసోములు, 3. సమానమైన రెండు క్రోమోసోముజతలు, 4. ధ్రువములకు ప్రయాణ మగుచున్న రెండేసి క్రోమోసోములు, 5. రెండు భాగములలోను రెండుగా చీలిన క్రోమోసోములు, 6. రెండేసి క్రోమోసోములు కల నాలుగు జీవకణములు, 7. తల్లిజీవకణమునుండి ఏర్పడిన సంతానోత్పత్తి కవసరమగు నాలుగు జీవకణములు.]


ఇందులో ఏమీ లేదు. ఏలాగంటే—స్త్రీ పురుష భాగములు వేర్వేరే వ్యక్తులలోగల ప్రతిరకపు ప్రాణికీ స్త్రీ శరీరంలోనూ, పురుషశరీరంలోనూ ఉన్న జీవకణాలలో యీ క్రోమోసోముల సంఖ్య ఒకటే అయినప్పటికీ కొద్దిగా తేడా ఉంది. ఇవి రెండేసి కలిసి ఒక జతగా ఏర్పడతాయని పైన మీరు చూసిందే. ప్రతి జతలో ఉండే రెండు క్రోమోసోములూ ఆకారంలో ఒకే మాదిరిగా ఉంటాయి. కాని స్త్రీ శరీరంలో ఉన్న జీవకణంలో ఒక జతలోమాత్రం రెండు క్రోమోసోములుగూడా తక్కినవాటికంటె పొడుగుగానో, పొట్టిగానో, లావుగానో, సన్నంగానో ఉండి ఏర్పాటుగా కనబడతాయి. వీటిని X క్రోమోసోములు అని అన్నారు. అండము తయారవ్వేటప్పుడు ఈరెండు క్రోమోసోములలోనూ పైన మీరు చూసిన ప్రకారం ఒక X క్రోమోసోము మాత్రమే దానిలో ఉంటుంది. పురుషశరీరంలో ఉన్న జీవకణంలో అన్ని క్రోమోసోముల జతలూ ఒకేమాదిరిగా ఉండక, వాటిలో ఒకజతలో నున్నవి ఒకటి పెద్దది, ఒకటి చిన్నదిగా ఉంటాయి; ఒకటి ఒక మాదిరిగాను, యింకొకటి మరొకమాదిరిగాను ఉంటాయి. ఈపెద్ద క్రోమోసోము స్త్రీశరీరంలో ఉండే X క్రోమోసోము మాదిరిగానే ఉంటుంది. అందుచేత దీనినికూడా X క్రోమోసోము అన్నారు. చిన్నక్రోమోసోమును Y క్రోమోసోము అన్నారు. అంటే, పురుషశరీరంలో ఉండే జీవకణంలో ఒక X క్రోమోసోము, ఒక Y క్రోమోసోము ఉన్నాయి. దీనినుండి నాలుగు పురుషబీజములు ఏర్పడినప్పుడు రెండిటిలోకి X క్రోమోసోం వస్తుంది; రెండిటిలోకి Y క్రోమోసోం వస్తుంది. అందుచేత రెండు రకాలుగా పురుషబీజములు ఏర్పడతాయి. X క్రోమోసోం ఉన్న పురుషబీజం అండంతో కలిస్తే, అందులో ఉన్న X క్రోమోసోం, యిందులోనున్న X క్రోమోసోం కలిసి రెండు X క్రోమోసోములయి, ఆపిండం స్త్రీశరీరం అవుతుంది. ఒకవేళ Y క్రోమోసోం ఉన్న పురుషబీజం ఆ అండంతో కలిస్తే అందులో ఉన్న X క్రోమోసోం, యీ Y క్రోమోసోం కలిసి, XY కల ఒకజత ఏర్పడి ఆ పిండం పురుషశరీరమవుతుంది. ఆ మాదిరిగానే ఒక జీవకణంలోనుంచి తయారైన నాలుగు పురుషబీజములు కూడా నాలుగు అండములతో కలిసినట్లయితే (ఒక్కొక్క అండం పిండరూపం దాల్చటానికి పురుషబీజం ఒక్కటే కావాలి) ఆ శిశువులలో యిద్దఱు పురుషులు, యిద్దఱు స్త్రీలు ఉంటారు. కొన్ని ప్రాణులలో పురుషశరీరంలో నున్న జీవకణంయొక్క క్రోమోసోములసంఖ్య స్త్రీ శరీరంలోనున్న సంఖ్యకంటె ఒకటి ఎక్కువగాని, ఒకటి తక్కువగాని ఉంటుంది. స్త్రీ జీవకణంలో 10 క్రోమోసోము లుంటే పురుష జీవకణంలో 11 గాని, 9 గాని ఉంటాయి. 11 ఉన్నా యనుకుందాం. ఇవి 5 జతలు, పైన ఒకటిగా ఏర్పడతాయి. దీనినుండి వచ్చిన నాలుగు పురుషబీజములలో రెంటికి 5 క్రోమోసోములు, రెంటికి 6 క్రోమోసోములు ఉంటాయి. అండంలో 5 క్రోమోసోము లుంటాయి. 5 ఉన్న బీజం అండంతో కలిస్తే 5+5=10 అయి స్త్రీ శరీరమున్నూ, 6 ఉన్న బీజం కలిస్తే 6+5=11 అయి పురుష శరీరమున్నూ ఆ శిశువులు కలుగుతాయి. శిశువుల స్త్రీ పురుషనిర్ధారణ యీ విధంగా కలుగుతూవుందిగాని రత్నరేకులు, రావిచెట్టు ప్రదక్షిణాలు, సింహాద్రి అప్పన్న మ్రొక్కులు, సింగరాచార్లగారి సిద్ధౌషధాలు వీటివల్ల అయ్యేది ఏమీ లేదు. సింగివాడం జీలకఱ్ఱ తప్ప!!

కొన్నాళ్ల క్రిందట నాకు ఒకసందర్భంలో ఒకమాదిరి పిచ్చి పట్టింది. అది ఉండటం ఒకరోజే ఉందిలెండి. ఏమిటంటే — ఈ జీవపరిణామం ఏమిటీ ఇంత అధ్వాన్నంగా వెళ్లింది? సృష్టిలో కొన్ని ప్రాణుల కున్నట్టు స్త్రీపురుష భాగములు రెండూకలిసి మనుష్యులలో కూడా ఒకేవ్యక్తిశరీరంలో ఉంటే (కొబ్బరిచెట్టు, వానపాము మొదలైనవాటిమాదిరిగా) యీ స్త్రీలు, పురుషులు అనే భేదం పోయి, ఈ సంయోగ వియోగాలు అసలే పోయి, ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న అశాంతిలో ముప్పాతికమూడువాళ్లు తగ్గి, మానవజీవితంలో కొంత శాంతి ఏర్పడుతుందేమో అని. యుక్తకాలంలో వైప్రాణులమాదిరిగానే సంతానంకూడా కలుగుతుంది. దీనివల్ల అవస్థాలూ లేకపోలేదు.



4. మనుష్యునిలో పురుషుని శరీరమందు జీవకణంలో ఉన్న క్రోమోసోములు.

ఉన్నప్పటికీ, అది సాధ్యమవుతుందా? స్త్రీలకూ పురుషులకూ సమాన హక్కులు రావచ్చు. వివాహము, భార్య, భర్త అనే శబ్దాలు అన్నీ నిఘంటువులలోనుంచి పోవలసిన స్థితి రావచ్చు. కాని, మానవశరీర



5. శిశువుకు స్త్రీ పురుషనిర్ధారణ.

నిర్మాణంలో యీ మార్పు వచ్చే దెల్లాగ? అన్ని దేశాలలోనూ మానవ జీవితంలో రష్యాలో ఉన్న బోల్షివిజం రావచ్చుగాని, మానవశరీరంలో యీమాదిరి బోల్షివిజం రావటం సూర్యచంద్రులు రెండూ ఒకే గ్రహంలో ఉండటం ఎంత సాధ్యమో అంత సాధ్యం. అదిగాక, సముద్రంపాకా వచ్చిన గంగానదిని మళ్ళీ వెనక్కి పట్టించి శివుడి నెత్తి మీద కూర్చో పెట్టడానికి ఆ భగీరథుడికికూడా సాధ్యం కాదు. ఈ ప్రవాహానికి ఏ విశ్వేశ్వరయ్య ఆనకట్ట కట్టగలడు? కాని ఒక్క సంగతి. ఇంతటితోమాత్రం యీ జీవపరిణామం ఆగిపోలేదు. ఈ ప్రాక్ప్రతీచీ సంగ్రామాలలో ప్రపంచం పూర్తిగా నిర్మూలమవ్వడం కాకపోతే, యీ భూకంపాలు, అగ్నిపర్వతాలు విజృంభించకుండా ఉంటే, కొన్నాళ్లకు ఉత్తుంగభుజుడు పోయి ఏ నందుడో రాకైవచ్చు మానవశరీరం హెచ్. జి. వెల్సు మహాశయుడు సూచించినట్లుగా ఏ విధంగా మారుతుందో మనం చెప్పలేం. విషయాంతరంలోకి వెళ్లానేమో, క్షమించండి.

ఈ సందర్భంలోనే కొజ్జాలను గురించికూడా చెప్పటం అప్రస్తుతం కాదుగాని వ్యవధి లేకపోవటంచేత మరోకమాటు మనవి చేస్తాను. కవలపిల్లలు పుట్టడాన్ని గురించి కొద్దిగా చెప్పతాను. గర్భాశయంలో ఉన్న అండం పురుషబీజంతో కలిసిన తర్వాత పిండంగా మారి కొన్నిపట్ల వెంటనే రెండు సమానభాగములుగా చీలుతుంది. తర్వాత ఈ రెండు భాగములూ వేరువేరుగా వృద్ధిపొంది ఇద్దరు శిశువులు అవుతారు. ఈ విధంగా పుట్టిన కవలపిల్లలు X క్రోమోసోము ఉన్న పురుషబీజం అండంతో కలిసిఉంటే యిద్దరూ స్త్రీలు, Y క్రోమోసోము ఉన్నబీజం కలిసిఉంటే యిద్దరూ పురుషులూ అవుతారు. పిల్లిద్దరూ పోలిక 16 అణాలుకూడా ఉంటుంది. కొన్నిచోట్ల, రెండు వేరువేరు అండములు పిండములుగా అయి కూడా కవలపిల్లలు కలుగుతారు. ఈ రెండు అండములతో రెండూ Y క్రోమోసోము ఉన్న పురుషబీజములే కలిసి ఉంటే యిద్దరూ పురుషులు, X క్రోమోసోము ఉన్న బీజములు కలిస్తే యిద్దరూ స్త్రీలు, లేకపోతే ఒక స్త్రీ, ఒక పురుషుడూ అవుతారు. వీటిరెండిటికీ పోలిక ఏ ఎనిమిది అణాలో, పది అణాలో ఉంటుంది. నలుగురైదుగురు శిశువులు ఒకేసారి ఒక్కొక్కప్పుడు కలుగుతారు. అవికూడా యీ మాదిరిగానే ఏర్పడతాయి.

ఈ క్రోమోసోముల దగ్గరకు మరొక్కమారు వెళ్లి వాటిని లోతుగా పరిశీలిస్తే యీ ఆనువంశికరహస్యం యింకా స్పష్టం అవుతుంది. ఆ ప్రాణికి ఉన్న సహజమైన లక్షణాలు, గుణాలు అన్నీ యీ క్రోమోసోములలోనే యిమిడి, అంతర్భూతంగా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రతి క్రోమోసోమూ దాని పొడుగు ననుసరించి ఒకటో, రెండో, నాలుగో, యింకా ఎక్కువో గుణాలకుగాని, లక్షణాలకుగాని జవాబుదారీగా ఉండి వాటిని ఆ ప్రాణిలో సమయానుకూలంగా ఉత్తేజింపజేస్తుంది. ప్రతి క్రోమోసోములోనూ కొంతభాగం ఒకగుణానికి, కొంతభాగం మరొకగుణానికి, మరికొంతభాగం యింకొకగుణానికి యీవిధంగా బాధ్యత వహిస్తుంది. ఈ ఒక్కొక్క భాగానికీ 'జెనీ' అని పేరు పెట్టారు. ఒక్కొక్క క్రోమోసోములోనూ కొన్ని జెనీలు ఉంటాయి. కొన్ని విధములైన గుణాలకు ఒకటికంటె ఎక్కువ జెనీలుకూడా

కారణంగా ఉంటాయి. ఈ అనువంశికము, ఈపోలికలు అన్నీ యీ జెనీలవల్లనే కలుగుతున్నాయి. ఈ జెనీలు క్రోమోసోముకంటె కొన్ని రెట్లు చిన్నవవటంచేత వీటిని వేరువేరుగా ఎంత తీక్ష్ణమైన సూక్ష్మదర్శక యంత్రమైనా యింతవరకు చూపించలేకపోయింది.

ఇప్పుడు, తల్లిదండ్రులకూ సంతానానికీ పోలికలు ఏవిధంగా ఉంటాయో, ఎంతవరకు ఉంటాయో, అనువంశికంగా యివి రావటంలో ఎక్కడ ఎప్పుడు ఏవిధంగా మార్పులు చెందుతాయో, అసలు తల్లిదండ్రులలో నున్న ఏయేగుణాలు బిడ్డకు వస్తాయో, ఏవి రావో అనే విషయాలు తెలుసుకుందాం.

బాహ్య పరిస్థితులవలన ప్రాణికి కలిగిన గుణాలు శిశువుకు వస్తాయా, రావా అనే విషయాన్ని గురించి అభిప్రాయభేదం వైజ్ఞానికులలో చాలాకాలం ఉంది. మొదట కొంతకాలంవరకూ అవికూడా శిశువుకు కలుగుతాయనే వారు అభిప్రాయపడ్డారు. తరువాత కొన్ని పరిశోధనాఫలితములనుబట్టి కొంతమంది అవి రావేరవని నిశ్చయించారు. ఆప్రాణిజెరంప్లాసంలో ఉన్న గుణాలే వస్తాయికాని, బాహ్య పరిస్థితులకు జెరంప్లాసం సర్వసాధారణంగా మారదు కాబట్టి అవి శిశువుకు రావన్నారు. ఈ విషయంలో ఒక ఉదాహరణచెప్తాను. ఒకడు తాను నివసించు పరిస్థితులు సరిగా లేకపోవటంచేత ఏ క్షయ వ్యాధినో గ్రహించి దీర్ఘరోగిగా ఉన్నాడనుకోండి. అతనికి ఒకశిశువు కలిగింది. ఆ శిశువుశరీరంలో యీవ్యాధిచిహ్నములు ఏమీ కన్పించవు. కాని ఒక్కటిమాత్రం ఉంటుంది. ఈశిశువు పెరిగి పెద్దదైనా బాహ్య పరిస్థితులు అనుకూలంగా ఉండి, యీ వ్యాధికి కారణమైన సూక్ష్మ జీవులు తన శరీరంలో ప్రవేశించటానికి అవకాశం ఉంటే, అవి చక్కగా ఆహ్వానింపబడి, వాటికి ఆశరీరంలో స్థిరమైన ఆశ్రయం ఏర్పడి, వెంటనే ఆవ్యాధి ఆశరీరంలో బయలుదేరుతుంది. తండ్రిలో ఉన్న వ్యాధి యీ శిశువుకు రాకపోయినా, ఏమాత్రమైనా అవకాశమిస్తే గ్రహించడానికి సిద్ధంగా ఉంటుంది. దీనినే **Predisposition to the disease** అని అన్నారు. ఇది అనువంశికంగా వస్తుంది. ఇది కొన్నివ్యాధుల విషయంలోనేగాని, బాహ్యపరిస్థితులవలన వచ్చే కొన్నిగుణాలకు యీమాత్రంకూడా ఉండదు. అందుచేత, బాహ్యపరిస్థితులవలన కలిగే ఏగుణంకూడా జెరంప్లాసంను మార్చలేదని మాత్రం కాదు. ఏమైనా, యీవిషయం యింకా అటో యిటో పూర్తిగా నిర్ధారణ కానట్లే కనిపిస్తుంది. వృక్షములలో కొన్ని విషయాల కిది సరిపడటం లేదు.

ఏ శిశువైనా సరే తల్లిదండ్రులను మాటికి నూరుపాళ్లు పోలి ఉండటం చాలా దుర్లభం. అలాగ ఉండరు కూడాను. కారణం యిప్పుడే బోధపడుతుంది. అదిగాక, ప్రతిప్రాణిలోనూ ప్రతిలక్షణమూ బలీయంగానో, సాధువుగానో ఉంటుంది. అది ఏమాదిరిదో తెలియనిదే సంతానం ఫలానామాదిరిగా ఉంటుందని చెప్పటం కష్టం. ఏ గుణం బలీయమైతే ఆ గుణం శిశువులో కనబడుతుంది. తండ్రి నల్లగా ఉంటాడు, తల్లి ఎఱ్ఱగా ఉంటుంది. వీటిలో ఏ గుణం బలీయంగా ఉంటే అది శిశువుకు వస్తుంది. ఇంకొకవిషయం. ఆ ప్రాణిలోఉండే ఆ గుణం పూర్తిగా స్వచ్ఛమైనదో, లేక కల్తీ ఉందో కూడా తెలియాలి. తెలియందే, ఆ గుణమే తప్పకుండా వస్తుందని చెప్పటానికి వీలులేదు. తల్లి, తండ్రి యిద్దరూ నల్లగానే ఉంటారు. శిశువు ఎఱ్ఱగా ఉండొచ్చు—కుమ్మరావంలో యిత్తడి ముంతలాగ. ఎందుచేతంటే, మాతామహియో మాతామహుడో, పితామహియో పితామహుడో ఎఱ్ఱగా ఉండి, తల్లియొక్కగాని, తండ్రియొక్కగాని జెరంప్లాసంలో ఉన్న 'నలుపు' అనే గుణం కల జెనీలో 'ఎఱుపు'గుణం కల జెనీకూడా కలిసి కల్తీగా ఉండొచ్చు. ఈ జెనీలు ఏలాగ మారతాయో, ఏది పైకి వస్తుందో, ఏది రాదో చెప్పటం కొద్దిగా కష్టం. ఒకసారి జార్జి బెర్నార్డుషాను ఒక అందమైన ఫ్రెంచిదేశపుస్త్రీ అడిగిందట: "నీవు చాలా తెలివితేటలైనవాడవుగదా. నీవూ నేనూ వివాహం చేసుకుంటే మనకు పుట్టిన బిడ్డ ఎంతో తెలివితేటలైనదిగాను, ఎంతో అందమైనదిగాను ఉంటుంది. ప్రపంచంలో యింతకంటె కావలసిందేముంది? కనుక నన్ను పెళ్లి చేసుకో" మని. దానికి షా నవ్వి, "ఆపుట్టిన శిశువుకు నీతెలివితేటలూ, నా అందం వస్తే ఏంచేస్తావు?" అన్నాడట. పండితపుత్రుడు పండితపుత్రుడుగానే ఉండటానికి కారణం యిదే అనుకుంటాను.

కాబట్టి సంతానమునకు తల్లిదండ్రులనుంచి గుణాలు ఎన్నివిధములుగా రావచ్చునో చూద్దాం:

1. తండ్రిలోని గుణం, తల్లిలోని గుణం రెండూ కలిసి చక్కగా మిశ్రమమై శిశువులో కనబడుతుంది. తండ్రి నల్లగా, తల్లి ఎఱ్ఱగా ఉంటే, శిశువు చామనచాయగా, దోరగా ఉండొచ్చు. ఉంటే ఒకవేళ ఒకచూపువాసి ఎఱుపుగాని, నలుపుగాని ఎక్కువగా ఉండొచ్చు.

2. తండ్రిలోగాని, తల్లిలోగాని ఉన్న గుణం బలీయమైనదైతే ఆగుణం ఒక్కటే శిశువులో కనబడుతుంది. ఇక్కడ తండ్రిమాదిరిగా కేవలం నల్లగా గాని, తల్లిమాదిరిగా కేవలం ఎఱ్ఱగా గాని శిశువు ఉంటుంది.

3. తండ్రిలో ఉన్న గుణం కొంత, తల్లిలో ఉన్న గుణం కొంత వేరువేరుగా 'తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం'లాగ శిశువులో కలుగుతాయి. తల్లిశరీరం నున్నగా ఉండి, తండ్రికి ఒంటినిండా రోమకళ ఎక్కువగా ఉందనుకోండి. శిశువుకు కొన్ని భాగములలో రోమకళ ఉండి, కొన్ని భాగములు నున్నగా ఉంటాయి.

4. తండ్రిలో ఉన్న గుణం ఒకశిశువుకు, తల్లిలో ఉన్న గుణం రెండోశిశువుకు, మళ్లీ మూడోశిశువుకు తండ్రిగుణం యీలాగ ఒకటి విడిచి ఒకటి రావచ్చు. తండ్రి ఆజానుబాహువు; తల్లి మరుగుజ్జు. ఒకశిశువు తండ్రిలాగ పొడుగుగా, రెండవశిశువు తల్లిలాగ పొట్టిగా, మూడవది మళ్లీ తండ్రిలాగ పొడుగుగా ఉంటుంది.

5. కొన్నిచోట్ల చేను పైనచెప్పినట్లు శిశువులో ఉన్న గుణం తండ్రిలోగాని, తల్లిలోగాని ఎక్కడా కనబడదు. అప్పుడు ఆ శిశువు ఈ అనువంశికంలో వెనక్కి పోయి ఏతాతనో, ముత్తాతనో ఆగుణంలో పోలిఉండొచ్చు. తల్లీ, తండ్రీ దిద్దమ్మలై శిశువు మిరియపుగింజ లాంటివాడు పుట్టి పెద్దయినతర్వాత మంచి మేధావి అవవచ్చు. తాతో, ముత్తాతో మేధావంతుడై ఉండాలి. ఈమాదిరి పోలిక ఒకొక్కప్పుడు వంశవృక్షంలో యింకా వెనక్కి పోతేకూడా పోవచ్చు.


ఈ మాదిరిగా పోలికలు శిశువులకు వస్తాయి. వీటికోసం మనం ఎక్కడికో వెతకక్కర్లేదు. మన సంసారాలలో చూస్తూ ఉన్నదే.

1857 మొదలు 1865-వ సం.రం వరకు గ్రిగార్ మెండెల్ అనే ఒక ఆస్ట్రియా దేశపు మఠాధికారి తీరుబాటునికని మొదలుపెట్టి అక్కడే కొన్ని బటానీమొక్కలతో పరిశోధనలు చేశాడు. స్వచ్ఛమైన గుణములు కల మొక్కలనే తీసుకుని గుణాలను వేరువేరుగా పరీక్షిస్తూ మూడుతరాలదాకా ఆ గుణాలు ఏలాగవస్తాయో చూశాడు. తర్వాత ఈ అనువంశికాన్ని గురించి కొన్నిసూత్రాలు వ్రాసిపెట్టాడు. ఆతడు 1884-వ సం.రంలో చనిపోయాడు. ఈ సూత్రాలు సుమారు 40 సం.ల దాకా సూర్యరశ్మిని చూడక బూజుపట్టిపోయాయి. 1900-వ సం. రంలో కొందరు ప్రముఖులు యీ విషయాన్నే తీసుకొని పరిశోధనచేస్తే వారిఫలితాలు యిదివరకే మెండెల్ చేత సూచింపబడ్డా యని తెలిసికొని, అప్పుడు వాటిని వెల్తురులోకి తెచ్చి, ఆయన పేరు విజ్ఞానప్రపంచంలో చిరస్థాయిగా ఉండాలని దానికి 'మెండలిజం' అని పేరుపెట్టారు. ఆ మెండెల్ వేసిన బీజమే వీరి వీరి సాహాయ్యంతో మొక్కై, మ్రానై, శాఖోపశాఖలతో యిప్పుడు మహావృక్షమైంది. దీనిమీద ఆధారపడి జీవశాస్త్రపు శాఖ లన్నిటిలోనూ అనేకమైన అంచనాలు వేస్తూ మానవ సౌకర్యంకోసం పరిశోధనలు చేస్తున్నారు. ఫలితములు పొందుతున్నారు. వ్యవసాయశాఖలో అనేకమైన లాభాలు కలుగుతున్నాయి. జంతువులలో ఎక్కువ బలమైనవి, ఎక్కువ పాలిచ్చేవి యితర దేశములవాటితో సంపర్కం కలిగించి తయారుచేస్తున్నారు. పక్షులలో, పుష్పములలో రకరకములైనవి ఏర్పడుతున్నాయి. వైద్యశాఖలోకూడా కొంతవరకు ఉపయోగిస్తున్నారు. మెండెల్ యొక్క ముఖ్యసూత్రము లేమంటే, "ప్రతి ప్రాణిలోనూ ప్రతిగుణానికీ ఒకటి బలీయమై పైకి కనబడేభాగం, మరొకటి సాధువై దాగి ఉండే భాగం ఉంటాయి. ఈ రెండూ కలిసినప్పుడు బలీయమైన లక్షణమే బయటకు కనబడుతుంది. మొదటితరంలో ఒక లక్షణం మాత్రమే కనబడుతుంది; రెండవది దాగిఉంటుంది. కాని రెండు మూడు తరాలలో యీ బలీయ సాధులక్షణాలు వేరువేరుగా సంతతిలో కనబడతాయి. ప్రతిలక్షణం కైరంప్లాసంలోనికి వచ్చి దానికి ఒక జెన్ కారణంగా ఉండి, యీ జెనీలు కలవటం కలవక పోవటంలో ఆ లక్షణములు కనబడటమో, కనబడకపోవటమో అవుతుంది."

చెట్లలోనూ, జంతువులలోనూ ఈ మెండలిజంప్రకారం జరిగిన పరిశోధనలు చాలా ఉన్నాయి. అవి, యిప్పటికే మీరు వినుగత్తి ఉండటంచేత గ్రహించడానికి కొద్దిగా కష్టపడాలి. అందుచేత వాటిని వదలివేసి, మొదట మన విషయం తెలుసుకోవటం ముఖ్యం కాబట్టి మనుష్యులలో ఈ అనువంశికం ఏలా ఉండవచ్చునో చెబుతాను. కాని జరిగిన పరిశోధనలు చాలా తక్కువ. ఎందుచేతంటే, ఎవరైనా పరిశోధకుడు ఒక యూరోపియను స్త్రీదగ్గరకు వెళ్లి "నీవు ఆ నీగ్రోవాడిని పెళ్లిచేసుకో, మీ సంతతిలో ఎంతమంది శ్వేతముఖు లుంటారో, ఎంతమంది నల్లగా ఉంటారో, ఎంతమందికి జాంజారువెంట్రుకలుంటాయో చూస్తా"ననిగాని, పిల్లికళ్లున్న ఒక స్త్రీతో "నీ వారాగిమీసాలున్న యువకుణ్ణి పెళ్లిచేసుకో. మీ మగ సంతానంలో రాగిమీసాలు, పిల్లికళ్లు ఒకళ్లకే వస్తాయో రావో చూస్తా"ననిగాని అడిగితే వాళ్లు ఒప్పుకుంటారా — వాళ్లకూ వాళ్లకూ యిష్టమైతేనే తప్పు? అందుచేత. అప్పటికి కొన్ని గుణాలు మొక్కలలోను, జంతువులతోను చేసిన పరిశోధనాఫలితములమీద ఆధారపడి మనుష్యులలో కూడా ఫలానామాదిరిగా వస్తాయని అనుకున్నారు. వాటిలో రెండో, మూడో రకాలు ఏ మాదిరిగా ఉండవచ్చునో ఉదాహరిస్తాను.

శరీరచ్ఛాయ

(Albinism)



* ఈ మొదటితరంలోని సంతానాన్ని మెండెల్ వాటిలో వాటినే సంపర్కించాడు. వాటి సంతానమే రెండోతరంలో 1 : 2 : 1 వంతులుగా పైమాదిరి గుణాలతో ఉంటాయి. రెండోతరంలోని సంతానాన్నికూడా వేరువేరుగా అలాగే సంపర్కించాడు.

ఈవిధంగా మనుష్యులలో వీలు లేనందున కూడా పరిశోధనలు చాలా తక్కువ. నీగ్రోలలో నలుపు గుణాన్ని, యూరోపియనులలో తెలుపు గుణాన్ని సంపర్కిస్తే రెండవతరంలో 64 గురు శిశువులు కలిగితే అందులో ఒకశిశువుమాత్రం స్వచ్ఛమైన తెలుపురంగు కలిగిఉంటుంది. కాని 64 గురుబిడ్డలు ఏస్త్రీకిని లేకపోవటంచేత ఆ స్వచ్ఛమైన తెలుపు కనబడనే కనబడదు.

శరీరచ్ఛాయ, తలవెండ్రుకలు

తెలుపు × నలుపు...తల్లిదండ్రులు
మెత్తని జుట్టు | జాంజారు జుట్టు
(సా) (బ)
నలుపు (తెలుపు, మెత్తని
జాంజారు జుట్టు జుట్టు...మొదటి తరం.
(వీటిలో వీటిని సంపర్కిస్తే)


9 నలుపు	3 తెలుపు	3 నలుపు	1 తెలుపు...
జాంజారుజుట్టు.	జాంజారుజుట్టు.	మెత్తని జుట్టు.	మెత్తని జుట్టు.

...రెండో తరం.

రెండు లక్షణములు తీసికొన్నప్పుడు 16 గురు శిశువులకు రెండోతరంలో 9 : 3 : 3 : 1 వంతులుగా పైమాదిరిగా ఉండవచ్చు.

కొన్ని గుణాలు స్త్రీ, పురుష భేదంతో లంకెపడి వుంటాయి. అవి యీ క్రింది ఉదాహరణమాదిరిగా సంతతిలో వస్తాయి:


ఆకుపచ్చ, ఎఱుపు రంగులు తెలియని గ్రుడ్డితనం



○ = గ్రుడ్డి కాదు.
◐ = గ్రుడ్డి కాకపోయినా, తన సంతతికి గ్రుడ్డితనాన్ని యిచ్చేగుణం లోపల ఉంది.
● = గ్రుడ్డి.

మనలో కొంతమందికి కాలివ్రేళ్లలో ఒకటో, రెండో బాగా పొట్టిగా ఉంటాయి. ఆ లక్షణంకూడా ఆనువంశికంగా ఈమాదిరిగానే వస్తుంది. నేను మొదట చెప్పిన పోలికల నన్నిటినీ మెండలిజమ్ వ్యాఖ్యానం చేస్తుంది.

ఒక్కొక్కప్పుడు ఫలానా గుణం ఫలానాఅప్పుడు వస్తుందని అంచనావేస్తే ఈ క్రోమోసోములు క్రిందిమాదిరిగా దగా చేస్తాయి. క్రోమోసోములు జతలుగా కూడినప్పుడు × క్రోమోసోం జతలో ఉన్నవి ఒకదాని నొకటి మెలికవేసుకుని వాటిలో ఉన్న జెనీలను మార్చుకుంటాయి. అప్పుడు అండంలోకి వచ్చిన × క్రోమోసోములో మొదట దానిలో ఉన్న జెనీలు ఉండవు. దీనినే **crossing over** అని అన్నారు.



6. × క్రోమోసోములు మెలివేసుకుని జెనీలను మార్చుకొనుట.

ఈవిధంగా ఆప్రాణిలో ఉన్న గుణాలు ఆనువంశికంగా యీ వాహకులద్వారా వస్తాయి. ఇదేవిధంగా ఒక కులానికి చెందినవాడు మరొకకులంలోని స్త్రీని పెళ్లిచేసుకుంటే వాని సంతతిలో వాని గుణాలు ఎన్నితరాలలో పూర్తిగా నశిస్తాయో, మళ్లీ తిరిగి ఆగుణాలు రావాలంటే ఏపద్ధతులమీద ఎన్నితరాలలో వస్తాయో మన ధర్మశాస్త్రాలలోకూడా కనపడుతుంది. చూడండి! మన ధర్మశాస్త్రాలెన్నాటివి? మెండెల్ ఏనాటివాడు? ఈ ఒక్కవిషయమే గాక పాశ్చాత్యలోకంలో బయలుదేరిన వైజ్ఞానికపరిశోధనాఫలితాలు చాలావరకు మనప్రాచీనులకు తెలిసినవే అని నా నమ్మకం. పరిశోధనాపరికరాలు మోటుగా ఉండి విధానం వేరైతే అవవచ్చు. వాళ్లు కేవలం ఆముష్మికాన్నే దృష్టిపథంలో ఉంచుకొన్నందువలన వీటికి ప్రాముఖ్యం యిచ్చి వృద్ధిచేయకపోవటం, ఈ రహస్యాల నన్నిటినీ విపులంగా బహిరంగపరచకపోవటం, ఎక్కడైనా ఒకటీ అరా ఉంటే ప్రస్తుతం 'మృతభాష' అనబడుతూ ఉన్న సంస్కృతంలో ఉండటం, దానిని మనం కారణాంతరాలచే ఉపేక్షించటం, నెమ్మదిగా ఒక్కొక్క సంస్కృతగ్రంథమే పాశ్చాత్యదేశాలకు నడుస్తూ ఉండటం, "తండ్రికి పెండ్లి అవుతూవుందన్న సంబరమే కాని, తనకు సవతితల్లి వస్తూవుందని గుర్తులే" దన్నట్టు యీకారణాలన్నిటిచేత ఐహికమే పరమావధిగా ఉన్న యీరోజుల్లో మనం ప్రాభవభ్రష్టులమై "ఎన్నడు ఇంద్రప్రస్థము నేలితిమో, ఎన్నడు రాజసూయ మొనర్చితిమో" అని అనుకుంటూ పాశ్చాత్య వైజ్ఞానికులు చేసే పరిశోధనలకూ, వాటి ఫలితాలకూ గ్రుడ్లప్పచెప్పి చూస్తూఉండవలసిన పరిస్థితులు వచ్చాయి. అది యుగధర్మం. దాని కెవ్వ డెంత విచారించినా కలిసిరాదు.

ఇప్పుడు మీరు చూసిన విషయం అంతా కలిసి యీ సృష్టి అనే మహేంద్రజాలంలో పేకతమాషాలలో ఒక తమాషాలాంటిది. ఇది ఇంకా పూర్తిగా తెలియలేదేమో కూడాను. తెలియని విషయా లెన్ని ఉన్నాయో ఊహ కందవు. ఈమాదిరిగా వివిధ శాఖలలో వైజ్ఞానికులు అనేకమైన రహస్యాలను క్రమక్రమంగా తెలుసుకుంటున్నారు; మానవసేవ చేస్తున్నారు. మానవుడంటూ ప్రపంచంలో ఉన్నంతకాలం ఏదో ఒక పరిశోధన చేస్తూనే ఉంటాడు కాని ఊరుకోడు. ఇటీవల మద్రాసులో జరిగిన అఖిల భారత శాస్త్రపరిశోధక మహాసభకు అధ్యక్షత వహిస్తూ, ప్రొఫెసర్ బిర్బాల్ సాహనీ మహాశయుడు ఈ విధంగా చెప్పాడు: "నిజమైన చిత్రకారుడు ఈ సృష్టికర్త తన శిల్పధోరణి నంతటిని ఒక్కమారుగా ఎప్పటికిని తెలియజేయడు. కాని పరిశోధకుడుమాత్రం విసుగు, నిరాశ చెందకూడదు." అని. స్వర్గీయ పానుగంటి లక్ష్మీనరసింహారావుపంతులుగారు ఇంచుమించుగా యీభావమునే యీ మాదిరిగా వ్రాశారు:

"ఎన్నికోటుల జీవు లీ యిలను గలవో!
ఇట్టి గోళమువంటి విం కెన్ని యద్భు
తంబు లున్నవో! అందు జీవంబు లిట్టి
వెన్ని పుంఖానుపుంఖంబు లున్నవొక్కొ!
ఏతదపిసంఖ్య జీవసంఘాతములను
లీల సృజియించి రక్షించి గోళకోటు
లిష్టగతి త్రిప్పునతడు, అబ్బ! ఎంతవాడు!"

"పాదోఽస్య విశ్వాభూతాని, త్రిపాదస్యామృతం దివి" అని పురుషసూక్తం.

ఇది కేవలం భావనామాత్రమే గాక నిజంకూడా నేమో అని తోస్తుంది. నిజమైన వైజ్ఞానికుడు తన పరిశోధనలవలన క్రొత్త రహస్యములను తెలిసికొనినకొలది సృష్టికర్తకు చేరువ యగుచున్నాననే ఆనందంలో తన్మయత్వం చెందుతూ ఉంటాడు. మానవుడు ఈవిధంగానూడ ఈ ఇంద్రజాలంలోని రహస్యముల నన్నిటినీ తెలిసికొని క్రమంగా ఆ ఇంద్రజాలికునంతవాడై "అహంబ్రహ్మాస్మి" అనుకునేస్థితి ఎప్పటికైనా వస్తుందా?...రాకపోతుందా?



కతిపయ శబ్దార్థ స్వరూప పరిశీలన

కొన్ని తెలుగుశబ్దముల అర్థవివరణలో ప్రమాదములు

శబ్దరత్నాకరము ఒజ్జబంతి ::: పండితప్రకాండుల అనుసరణ

శ్రీ
దీపాల పిచ్చయ్యశాస్త్రి

ఈనాటి తెనుగు నిఘంటువులలో ఆకారముచేతనేకాక సుగుణసంపత్తిచేత నైతను గౌరవమును గాంచినది ఒక్క శబ్దరత్నాకరమే. దాని సహాయమున ఆంధ్రభాషోపాసకులు పొందుచున్న ఉపకార మపారము. భాషాపరిచయమును నలవరించుకొన యత్నించు విద్యార్థులే కాక, ఆరితేరిన పండితులుకూడా రత్నాకరము నాశ్రయించియే సారస్వత ప్రపంచయాత్ర సాగించుచున్నారు. శ. ర. కర్తయైన బ. సీతారామాచార్యులవారు ఓర్పుతోను, నేర్పుతోను చిరకాలము పరిశ్రమించి గ్రంథస్థ పదజాలమును చాలవరకు సంకలించినారు. అంతేకాక లోకవ్యవహారమున రూఢికెక్కిన జాతీయములను కూడా సంగ్రహించి తమ కోశమున రాశిపోసి భద్రముగా ముద్రచేసి ఆంధ్రభాషాభివృద్ధికి మంచిమార్గము ఏర్పరిచినారు.

అయితే, కొన్నితావులలో పదస్వరూపనిరూపణమునను, అర్థనిర్ణయమునను కూడా యించుక పొరపడినారు. భ్రాంతి పురుషధర్మముగదా! కాకపోయినను లోకమున సర్వజ్ఞు డెవడు? అపారపాటు లాచార్యులవారి కపకర్షాధాయకములు కాకపోయినను భాషారాధకులకుమాత్ర మపకారకములుగా నున్నవి. ఎట్లనగా?

స్వయంకృషిచేత సాహిత్యసంపదను సంపాదింపగోరు విద్యార్థులును, నిఘంటువుల సాయమునకే పెద్దపెద్ద కావ్యములకు టీకలు వ్రాయువ్యాఖ్యాతలును, వ్యాపారదృష్టితో చిన్నచిన్న నిఘంటువులు వెలయించు కోశకర్తలును శ. ర. లోని తప్పుల నట్లే గ్రహించి, వినియోగించి దోషభాజనము లగుచున్నారు. ఇక వారి వ్రాతలను చదువువా రెల్లరును తత్తుల్యులే కదా అగుదురు? ఈరీతిగా, పరంపరగా, ఆంధ్రభాష కపకృతి యధికముగా జరుగుచున్నది.

'ఆంధ్రమల్లినాథు' లనియు, 'సర్వతంత్రస్వతంత్రు' లనియు, తుదకు 'సర్వజ్ఞు' లనియున్నూ కొనియాడబడిన వెంకట్రాయశాస్త్రిగారి టీకలలోనే ఆ తెరగుతప్పులు తప్పులుగా నున్నవనగా, ఇక తక్కిన చుక్కటీకల గొడవ చెరుగా తడవ నక్కరలేదుగదా?

'లక్ష్మీనారాయణీయ' మను నామాంతరముగల 'శుద్ధాంధ్రనిఘంటువు' శ. ర. ప్రమాదముల నన్నిటిని అట్లే శుకానువాదము చేయుచున్నదే—అందువల్ల భాషకు లగ్గో, యొగ్గో చూడండి.

బహుపండితసర్వతేజమున ప్రకటితమైన సూర్యారాయాంధ్రనిఘంటువువంటి బృహత్కోశమునందును శ.ర. దోషములు సందు కొన్నవని వ్రాయవలసివచ్చినందుకు చింతించుచున్నాను.

కావ్యపఠనమునకూ, టీకాకరణమునకూ, నిఘంటునిర్మాణమునకున్నూ పూనుకొను పిన్నలూ - పెద్దలూకూడా పెద్దపెద్ద విద్వాంసుల వ్రాతలనైనను మరాళములవలె తలస్పర్శముగా పరీక్షించి పరిగ్రహింపవలెనుగాని, వారివారి పెద్దరికములమీది విశ్వాసమున ఆయావ్రాతల నట్లే యెత్తి వ్రాసికొనుట సముచితము కాదని సవినయముగా హెచ్చరించుటయే నా యీ వ్యాసము యొక్క ఉద్దేశము.

నా యలతిపరిశోధనమున కందినవానిలో ఒక్క నాలైదు పదములనుగూర్చి మాత్రమే యిచ్చట ముచ్చటింతును.

౧. 'ఉలుక్కు'

"ఉలుక్కు. దే. వి. అశ్వగతి విశేషము. సీ. "చను నులుక్కనగ నీచగతి పేరు."—ఆం. భా. న్వ. కు."

—శబ్దరత్నాకరము

"ఉలుక్కు. శ. (అశ్వముయొక్క నీచగతి)లుక్క."

—శుద్ధాంధ్రనిఘంటువు

"ఉలుక్కు. వి. అశ్వగతిభేదము. (అశ్వముయొక్క) మందగతి. సీ. చను నులుక్కనగ నీచగతి పేరు...ఆం. భా. ౩. ౧౯౫."

—సూర్యారాయనిఘంటువు

'ఉలుక్కు' అను రూపమునకు శ. ర. కర్త యిచ్చిన యుదాహరణ మసమగ్రము. 'చను నులుక్కనగ' అను పదములను 'చనును లుక్కనగ' అనియును విభాగింపవచ్చును. "అట్లు విభాగించుటకు వీలులేదు. అది 'ఉలుక్కు'గాని 'లుక్కు' కాదు" అని నిర్ధారించుట కా ఆంధ్రభాషార్ణవపద్యము పనికిరాదు. శ. ర. కర్త 'ఉలుక్కు' అన్నారు గనుక తక్కినవారును 'ఉలుక్కు' అన్నారు. అంతేగాని, ఒక్కరైనా ఒక్కప్రయోగము నిచ్చినారు కారు. నిఘంటునిర్మాతలిట్టితావులలో గట్టిగా పనిచేయక సన్నగా దాటుకొనుట సరిగాదు.

ఇటీవల వేదం వేంకటరాయశాస్త్రిగారు దిద్ది ముద్రించిన (చేమకూరవారి) సారంగధర చరిత్రలోని

ఉ॥ "ఉక్కళమైన మంచిమను వొప్పెడు వాహయరత్నమెక్కనౌ
గక్కున మేమి లేక రవగాలును లోడన యద్దవేకము

డుక్కు దువాళి జంగనమలం గనిపించుచుఁ బోయిపోయి రా
జక్కడ వచ్చి పోకనటు పోయనివక గదలెక జరీలునక"
(౧-౭౩)

అను పద్యమునందలి 'డుక్కు దువాళి' అనుపదముయొక్క స్వమునుగూర్చి చర్చవచ్చి కొంతపరిశీలనము చేయవలసిన పనిబడెను. ప్పుడు, అర్థవిచారమునకు ప్రాముఖ్యానుటకుముందు పాఠమును స్థిరపరచుకొనుట మంచిదని యెంచి ఒకటికి రెండు మూడు ప్రతుల పరిశీలించితిని. పాఠములు బహువిధములుగా బయలుదేరినవి. వి వెల్ల నీక్రింద నుదాహరించుచున్నాను.

"చేడెముల్ గొక్కు దువాళి" —(౧౯౫౭నం) ముద్రితప్రతి.పా.
" " దొక్కు దువాళి" — శ. ర. పా.
" " డుక్కు దువాళి" — మదరాసు. తాళ. పా.
" " " — సూర్యారాయనిఘంటు. పా.
" " డుక్కు దువాళి" — తంజావూరు. తాళ. పా.
" " " — వే. వేం. శాస్త్రి, పా.
" " " — వావిళ్లవారి పాఠము.

ఇక అర్థవిచారము—

(౧) చేడెము = లేచితము; దువాళి = ప్లుతము.

కావున 'కొక్కు దువాళి' యనగా, కొక్కు (= పంది కొక్కు) యొక్క దూకుడు అని యేర్పడుచున్నది. అట్లు పక్షి అప్పురుషము చేయుట సరిగాదు కాబట్టి 'పంది కొక్కు దూకుడు వంటిదూకుడు' అని చెప్పుకోవలెను. ఆయర్థ మెంతవర కుచితమో పాఠకులే యూహింపగలరు.

(౨) 'చేడెములు', 'దువాళి' ప్రత్యేకగతులు కాబట్టి 'చేడెములు దొక్కునట్టి దువాళి' అని చెప్పగూడదు. 'దొక్కు దువాళి' అని విడదీసినచో అర్థమే యేర్పడదు. అందువల్ల శ. ర. పాఠమున్ను సరియైనది కాదు.

(౩-౪) 'డుక్కు దువాళి', 'డుక్కు దువాళి' అను రూఢి పదములుగాని, 'డుక్కు' అను విశేషణముగాని భాషలో లేవు. 'డుక్కు' అను విశేషణ మున్నదిగాని అది గుఱ్ఱపునడకకు ఏవిధమునను సుణమును కూర్చునది కాదు. కావున 'డుక్కు' పాఠము డుక్కు ...కమేగాని సరియైనది కాదు.

(౫) ఇక, వేదంవారు 'డుక్కు' అను పదమునకు 'మఱుఁగు డు' అను నర్థమును శ. ర. నుండి సంగ్రహించి 'డుక్కు దువాళి = మఱుఁగుపడినట్టి దవుడు' అని టీకించినారు. 'మఱుఁగు పడునట్టి' అని గూడా కాదు) పడినట్టిదవుడట! అంటే అర్థ మేమో నాకు తెలియలేదు. అసలు 'డుక్కు', 'మఱుఁగుపడు' ను క్రియలకు 'భయపడి చాటున దాగుకొను' అని సరియైన అర్థము. (చూ: శ. ర.)

"అక్కట దిక్కులేమి రజతాచల మొక్కెడు వెల్లగించె, వే
ఱొక్కెడు వంచె మేరు, నటియొక్కెడు వింధ్యము చేలజాచె, నిం
కొక్కెడు తూర్పునన్ గడపె నుక్కున క్రౌంచము నంచు నప్పరిన్
'డుక్కి' నొగట్లమోజ నెగడున్ నవరత్న విమాన్య సౌధముల్"
—చంద్రాంగదచరిత్ర

కావున "రాజనరేంద్రుని వేటకుక్కలు 'భయపడి చాటున దాగిన దవుడు'తో పోయె"నని యర్థ మేర్పడుచున్నది. అది హాస్య హేతువు. ఎందుకు గ్రంథవిస్తరము? శాస్త్రిగారి పాఠమున్ను తప్పే, అర్థము అంతకంటెను తప్పు.

"తప్పేమి? 'స్థితస్య గతి శ్చింతనీయా' అన్నట్లు వారు తమ కుపలబ్ధమయిన పాఠమునుబట్టి అర్థమును సమర్థించినారు" అని యొక వాదము. ఏదో యొకయర్థమును చెప్పుట కాదు—టీక వ్రాయుట అనగా; ఆ చెప్పినయర్థము సముచితముగా నుండవలె. లేనిచో ప్రాజ్ఞులు మన్నింపరు. ఇనుకటి కొక పండితుడు "...వేంకటేశాయ శేశనాశాయ మంగళమ్" అను అచ్చుతప్పుపాఠము నట్లే పఠించి "శేశనాశాయ = శేశములను నాశము చేయువాడైన, వేంకటేశునకు, మంగళము" అనియర్థము చెప్పెనట. తత్త్వజ్ఞుడైన యింకొక పండితుడు విని "అయ్యో! అదియేమి అర్థమయ్యా? 'క్లేశనాశాయ' అని సరియైన పాఠము. దానిని గమనించక — భగవంతుడైన శ్రీ వేంకటేశ్వరుని శేశనాశకు డని చెప్పితి వేనాటివిద్యాంసుడవయ్యా?" అని పరిహసించెనట. అందుల కా తొలిపండితుడు "నా తప్పేమి? ఉపలబ్ధమయిన పాఠమునకు ఉన్నయర్థమును చెప్పితిని. నిజానికి వేంకటేశ్వరుడు 'తలనీలాలు' తీసికొనుట లేదా? అది శేశములను నాశము చేయుట కాదా?" అని సమర్థింప నెనసులాడెనట. అట్టి సమర్థనమైనను శాస్త్రిగారి 'డుక్కు'న కున్నట్లు లేదు. ఉన్ననూ—అట్టియర్థములును, సమర్థనములును ప్రాజ్ఞజనుల యాదరమునకు పాత్రములు కావు.

ఇక ప్రకృతము — దొరకిన పాఠము లన్నియు నిరర్థకము లగుటచేతను, 'చనుచులుక్కునఁగ' అనువాక్యము 'చను— లుక్కునఁగ' అని విభజించుట కనువై యుండుటచేతను, 'చేడెముల్ లుక్కు' అని సవరించుట మిక్కిలి సుకరమై యుండుటచేతను, 'ఉలుక్కు' అనుపదమును 'చేడెముల్' అను పదముతో చేర్చుటకు ('చేడెములులుక్కు' అన్నచో గణభంగ మగును కావున) వలను పడకుండుటచేతను, (చెప్ప మరచితిని. ఆంధ్రపదపారిజాతమున అశ్వగతిభేదమును తెల్పు 'లుక్' అనుపద మొకటి పఠితమై యున్నది) ఆ 'లుక్' 'లుక్కు'నే బలపరుచుచుండుటచేతనున్ను వేంకటకవి 'చేడెముల్ లుక్కు దువాళి' అనియే రచించియుండు ననియు, వ్రాయసకాండ్ర అజ్ఞతయో వ్రాతపొరపడియో కారణములుగా గొక్కు, దొక్కు, డుక్కు, డుక్కులు అవతరించియుండు ననియు, శ. ర. కర్త 'చనున్ + ఉలుక్కు' అని యన్వయించుకొనుట పొరపా టనియు, ఆ పొరపాటువల్లనే 'చేడెముల్

లుక్క' అనుపాఠము సాహింపలేకపోయెను పనియును నే సాహించితిని. (వావిళ్లవారి (ప్రతి) ఆం. భా. లో 'చనుమ లుక్కనఁగ' అని చక్కగా ఎడపరిచి ముద్రించి యున్నది. ఆ ముద్రణముకూడా నా యూహనే బలపరచుచున్నది.

ఇన్ని కారణములచేత నాయూహ బలవత్తరమైనను "ఒక్క ప్రతిలోనైనను 'లుక్క' అని యుండకపోవుటకు హేతువేమి" అన్న శంకమాత్రము నన్నొకవంక బాధించుచునే యుండెను. ఇట్లుండఁగా, ఒకనాడుబుసుపోకకు గ్రంథము తిరుగవేయుటలో 'రసగాలు' అనుపదముక్రింద ఈపద్యము దృగ్గోచర మయినది. అందులో పాఠము 'పేడెమునఁ జుక్కలువాళి' అనియే యున్నది. అంతటితో 'బ్రతుకు జీవుఁడా' అని 'లుక్క' పాఠమే సాధువని నిశ్చయించుకొన్నాను.

ఇంతకును చెప్పవచ్చిన దేమనగా—శ. ర. కర్త 'ఉలుక్క' అనుట పొరపాటు. సు. ని. మాటకేమిగాని, సూ. ని. వంటి గొప్ప నిఘంటువుకూడా ఆ పొరపాటు నట్లే యనువదించుట విచారకర మయిన విషయము. శ. ర. కర్త గొప్ప పండితుఁడే. అయినను, ఆయనగారి వ్రాతనుగూడా బాగాపరకాయించి పరిగ్రహించుటయే మంచిది.

౨. పులపాడుచు

"పులపాడుచు = రెప్పవేయక చూచు.

క. "చప్పుడు సేయక సంజ్ఞలఁ
జప్పట్లిడుకొంచుఁ గొండసరియలవెంటన్
జప్పుళ్లకుఁ బులపాడుచుఁ
దొప్పరయుచు నీలవెట్టుచును శబరభటుల్." భల్లా. ౩. ఆ."
—శబ్దరత్నాకరము.

కంటి నొకమారు మూసి వెంటనే తెరచుటకు (తెరిచి వెంటనే మూయుటకు కూడా) 'పులపాడుచుట' అంటారు తెనుగుజనులు.

పై పద్యమున "శబరభటులు చప్పుళ్లకు 'పులపాడుచుచు, అడవిలో సంచరించిరి" - అనగా "చప్పుడైనప్పుడెల్లా కన్ను మూయుచూ, మరల వెంటనే తెరచిచూచుచూ, ఆచప్పుడుకు కారణమేమా యని పరిశీలించుచూ పోయి" రని యర్థము. ఎక్కడ చప్పుడైనను (కంటి కెక్కడ దెబ్బతగులునో అన్నభయమున) రెప్ప కటాలున కంటిని కప్పివేయుట సహజము. కంటిని కాపాడుటలో రెప్పకుగల జాగ్రత్త అట్టిది. కావుననే,

'కంటికి రెప్పయు గాచినభంగి'
—పల్నాటిచరిత్ర (చూ: బ్రౌ.)

"కంటికిన్, ఱెప్పయుఁబోలె మాటయి నెలం బనులారసి యొజ్జచాడ్పునన్, జెప్పుచు" —భార. ఉద్యో. ౪. ౧౧౪.

అను వాడుకలు లోకమున వెలసినవి. చప్పుడైనప్పుడు వెంటనే రెప్ప కొట్టుట ప్రాణిసహజము. అంతేగాని 'రెప్పవేయక చూచుట' స్వభావము కాదు. కావున శ. ర. కర్తవ్రాత తప్పు.

కన్ను తెరచి మూసికొనుట కొక ప్రయోగము—

"తడిసి, తలడిగ్గి ముంప, జడతం దుదఱెప్పలఁ గన్ను వీడి, పుల్పొడుచుచు, ...చేష్టడిగి పశుమృగపక్షులు జానువుల్ చాఁచెన్"
ఆముక్త. ౪-౧౧౨.

వర్షములో పక్షులస్థితి వర్ణనము.

వానచినుకులు తలమీఁదిగా దిగి కన్నులలోనికి జారి వ్యాకులించుటచేత పక్షులకన్నులు మూతపడిపోయినవి. కంటిలోని నీటిని వెలువరించినగాని ఆవ్యథ తీరదు. వ్యథ కంటిని తెరువనియ్యదు. అందువల్ల కంటిరెప్పతుదల చిట్లో మెల్లగానొత్తి వెంటనే మూసికొనుచూ, అనగా రెప్పలచేత నొత్తి కంటిలోని నీటిని వెలువరించుకొనుచూ ఉన్నవని వర్ణన.

ఈ యర్థము నెఱుగక 'ఆంధ్రమల్లినాథులు' శ. ర. లో అపార్థము నట్టే ఒప్పచెప్పినారు.

"పుల్పొడుచుచున్ = రెప్పవేయక చూచుచు" అని టీక.

"ఆనీరే ... కన్నులం జొరఁగా ... వార్చివైచుటకు కన తెఱవలేకుండినవి. లోని నీటిపోటుచే రెప్పలు కొంచెము తుదల పీడఁగా, పక్షులును ఆనీరు వడియుటకుఁగాను రవంతసేపు క[illegible] పొడిచికొనియే యుండఁగా" అని తాత్పర్యము.

"పుల్పొడుచుట నీరు వడియుటకు" అని వివరణము.

కంటిలోని (నీటి) పోటుచేత రెప్పలు తుదలయందు తమంత తామే పీడిన వనుటయూ, అది సందుచేసికొని ఆపక్షులు అట్లే రెప్పవేయక చూచుచుండె ననుటయూ ప్రాణిస్వభావమునకు విరుద్ధము. కంటిలో పోటు కలిగినప్పుడు రెప్పలు గట్టిగా మూతపడుటయూ, మనము బలవంతముగా తెరచుటయూ, తెరచినను వెంటనే మరల మూతపడుటయూ అనుభవములో నున్న సంగతి. ఒకవంక కన్ను మండుచుండగా రెప్పవేయక చూచుట యెట్లు? ఈయర్థమును తెలిసికొనుటకు పాండిత్యముతో పనిలేదు; ప్రాణిస్వభావము నెరిగియుండిన చాలును. శ్రీ శాస్త్రిగారికి 'పులపాడుచు' ధాతువున కర్థము తెలియకపోవుటలో వింతలేదుగాని కంటిలో కుంకుడు నురుసు, సబ్బునీరు వంటివి పడినప్పుడు కలుగు అవస్థయొక్క అనుభవము తెలియకపోవుటమాత్రము గొప్ప వింత.

వావిళ్లవారి వ్యాఖ్యలో "పుల్పొడుచుచు = కన్నులు †పులకరించుచు (అనఁగాఁ దెబ్బఁగూడని కన్నుల నతిప్రయత్నమునఁ దెఱచి లోనినీళ్లు వెలువరించుచు)" అని యెంత చక్కగా వివరింపబడియున్నదో చూడండి. ఆయర్థము తప్పుకొని శాస్త్రిగారు శ. ర. మీది విశ్వాసముచేత 'రెప్పవేయక చూచుట'తోనే ముగించినారు.

'రెప్పవేయకచూచు' అనునర్థమున 'పులపాడుచు' అనుధాతువును వాడుట లోకవ్యవహారమునగాని, కావ్యలోకమునగాని నాకు కనపడలేదు. 'వాఁడాపిల్లవంక రెప్పవేయక చూచెను' అనవలసిన చోట 'వాఁడాపిల్లవంక పులపాడిచెను' అని తెనుగువాఁ డన డనియే నా నమ్మకము.

† 'పులకరించుచు' అనుట తప్పులేండి. దాని కేమి? అక్కడమనము గమనింపవలసినది భావము.

ఈ 'పులపాడుచుట' కొన్ని ప్రాంతములలో 'పులకొార్చుట'గా వ్యవహరింపబడుచున్నది. ఏమయినను, 'పులపాడుచుట = రెప్ప వేయక చూచుట' అనుట తప్పు. ఈతప్పునే శుద్ధాంధ్రనిఘంటుకర్త శ. ర. మీఁది నమ్మకముచేత తన నిఘంటువున ముద్రించుకొన్నాడు. దానినే చిన్నలూ పెద్దలూ నిత్యమును పఠించుచున్నారు. ఇంతకునూ మూలము శ. ర. కర్తప్రమాదమే కదా?

3. కుళ్లగించు

"కుళ్లు — క్రుళ్లుయొక్క రూపాంతరము.

క్రుళ్లగించు = అ. క్రి. (మనసులో) దుఃఖించు.

క్రుళ్లు = క్రుళ్లగించు. "సీ. శోకశోకంబులఁ గ్రుళ్లుచుఁ దన లోన, మండుచు దివి చాల మఱుఁగఁదొడఁగె" —భా. ౬ స్కం.

క్రుళ్లుపోతు = క్రుళ్లగించు స్వభావము గలవాఁడు."

—శబ్దరత్నాకరము.

ఈవ్రాత మిక్కిలి విస్మయావహముగా నున్నది. శ. ర. కర్త తెనుఁగువాఁడేనా అను శంక కవకాశమును కల్పించుచున్నది. 'మనసులో దుఃఖించుట' అను నర్థమున 'కుళ్లగించు' ధాతువు తెనుఁగుసంఘమున వాడుకలో లేదు. 'దితి శోకశోకములచేత మనసులో కుళ్లగించినది' అని భాగవత కర్త అనలేదు; అనడు. అట్టి ప్రయోగము తెనుఁగు కావ్యములలో ఉండదనియే నా దృఢ విశ్వాసము. 'కుళ్లగించుట' యనఁగా గట్టిపారిన భూమినిగాని, మఱియొక వస్తువునుగాని త్రవ్వి సడలించుట. జాతీయముల తత్త్వ మెఱిగిన బ్రౌనుదొరగారు రెట్లు వివరించినారో చూడండి:

"కుళ్లగించుట—**To loosdn or dibble (the earth) to stir (the fire).**" —బ్రౌణ్యము.

ద్విపద—"తనయింటి యావస్తు ధనమును మున్న
సంచితం బగు వస్తుసమితియుఁ జెల్ల
పెంచాదిగా మట్టగించి తెప్పించి"—బసవపు. ౪౪.

'మట్టగించు=క్రుళ్లగించు. (చూ: బసవ. టీక. పుట ౧౧౯.)

'మనంబున దుఃఖించు' అను నర్థము నిచ్చు క్రియ 'కుళ్లు' (-కుళ్లుకొను)"

మనంబున గ్రుళ్లుచు - **grieving, sorrowing.**"

—బ్రౌణ్యము.

శ. ర. కర్తకు తెలియలేదు గాని 'కుళ్లు' విశేష్యముగా కూడ నున్నది. 'వాడికి మనసులో కుళ్లేర్పడ్డది', 'మనసులో వున్న కుళ్లు బయటపడ్డది' అను వ్యవహారము సర్వాంధ్రజనవిదితము.

'కుళ్లు'నకు 'ఇంచుక్కు'ను, 'సగాగమంబు'ను కలుగుటచేత ఏర్పడ్డ రూపము 'కుళ్లగించు'; నామధాతువు. శ. ర. లో 'కుళ్లు' విశేష్యముగా చెప్పబడలేదు. 'కుళ్లు'అను విశేష్యరూపము లేకయే 'కుళ్లగించు' అనురూప మెట్లు పుట్టినదనుకొన్నాఁడో కదా ఆప్రౌఢవ్యాకరణకర్త? దాని కేమి గాని, విదేశీయుడైన బ్రౌనుగూడా తెలిసికొన్న 'కుళ్లగించు' ధాతువును ఆయనగారు తెలిసికొనకుండుట ఆశ్చర్యకర మయిన విషయము. అంతేకాక, లోకవ్యవహారము నైనను ఎరుఁగక "క్రుళ్లు = క్రుళ్లగించు; క్రుళ్లుపోతు = క్రుళ్లగించు స్వభావము గలవాఁడు" అని వ్రాయుట అపహాస్యముగా నున్నది. ఆయనగారి మాట అట్లుండఁగా, శుద్ధాంధ్రమయిన శుద్ధాంధ్రనిఘంటు కర్త 'కుళ్లుపోతు (క్రుళ్లగించు స్వభావము గలవాఁడు) క్రుళ్లుపోతు' అని శ. ర. లోని ముక్కలనట్లే ముద్రించుకొనుట లజ్జాకరమయిన తప్పు.

౪. గామిడి

"గామిడి=శ్రేష్ఠుఁడు. "మ. ఊరి గామిడిబోఁపల్ దను దెంచి కట్టు?పదభూమిధర్త్రయిల్ చేరఁగ" — పాంచా. ౪. ఆ.

అగ్రణి=ముఖ్యము, గామిడి" —శబ్దరత్నాకరము.

శుద్ధాంధ్రనిఘంటుకర్త 'గామిడి=శ్రేష్ఠుఁడు' అని శ. ర. లోని ముక్కలనే నడిపి, పైపెచ్చు 'గామిడి' గ్రామణీ శబ్దభవమనియు, 'కన్నాడు', 'తలకట్టు', 'జెట్టి' మొదలగు పదములు 'గామిడి'కి పర్యాయము లనియు విశేషించి వివరించినాడు. గొప్ప పొరపాటు.

'గామిడి' 'గ్రామీణ' శబ్దభవముగాని 'గ్రామణీ' శబ్దభవము కాదు. 'గ్రామీణు' డనగా పల్లెటూరుమనిషి = అనాగరకుడు. ఈశబ్దము శ. ర. లో లేదు. కాని ఆప్టేనిఘంటువులో నున్నది.

"గ్రామీణః — **Vulgar, rude, a villager.**" —ఆప్టే.

'గామిడి'కి గల యర్థములను ఇట్టివే. బ్రౌను 'గామిడి' శబ్దార్థమును బహూదాహరణములతో వివరించియున్నాడు, చూడండి:

"గామిడి—**A fiend, an ogre. Adj. cruel, hard.** కఠినమైన, క్రూరమైన, కట్టడి.

'గామిడిచన్నదోయి యసికొను' —బిల్హ. ౧-౬౫.

'వ్రిరి యనరాదు పైబడి చెక్కరించు
గామి డనరాదు మొంగమున గంటువెట్టు'—శుక. ౩-౫౧.

'† గామిడిగొల్ల యీ కానవంబునను
మాకు నీకైయున్న యీ కొమ్మకొని
చేకొని నరకంగ జెట్టులు లేవు' — బసవ. పుట ౯౪.

'గామిడము' అను రూపముగూడా కనబడుచున్నది.

"ఈమాటు చని యిచటి కేతెంచు మనుఁడు
'కామిడంబున' రాక కారు లాడినను"

—నవచోళచరిత్ర. పుట ౧౬.

† 'గామిడి=గడుసరి' - అని బస. టీక. పుట ౧౧౯.

ఈ 'పులపాడుచుట' కొన్ని ప్రాంతములలో 'పులకొర్చుట'గా వ్యవహరింపబడుచున్నది. ఏమయినను, 'పులపాడుచుట = రెప్ప వేయక చూచుట' అనుట తప్పు. ఈతప్పునే శుద్ధాంధ్రనిఘంటు ర్త శ. ర. మీఁది నమ్మకముచేత తన నిఘంటువున ముద్రించు న్నాడు. దానినే చిన్నలూ పెద్దలూ నిత్యమును పఠించుచున్నారు. ంతకునూ మూలము శ. ర. కర్తప్రమాదమే కదా?

3. కుళ్లగించు

"కుళ్లు — క్రుళ్లుయొక్క రూపాంతరము.

క్రుళ్లగించు = అ. క్రి. (మనసులో) దుఃఖించు.

క్రుళ్లు = క్రుళ్లగించు. "సీ. శోకశోకంబులఁ గ్రుళ్లుచుఁ దన లోన, మండుచు దితి చాల మఱుఁగఁ దొడఁగె" —భా. ౬ స్కం.

క్రుళ్లుపోతు = క్రుళ్లగించు స్వభావము గలవాఁడు."

—శబ్దరత్నాకరము.

ఈవ్రాత మిక్కిలి విస్మయావహముగా నున్నది. శ. ర. కర్త నుగువాఁడేనా అను శంక కవకాశమును కల్పించుచున్నది. 'మన లో దుఃఖించుట' అను నర్థమున 'కుళ్లగించు' ధాతువు తెనుఁగుసంఘమున వాడుకలో లేదు. 'దితి శోకశోకములచేత మనసులో కుళ్లగించినది' అని భాగవతకర్త అనలేదు; అనఁడు. అట్టి ప్రయోగము తెనుఁగు కావ్యములలో ఉండదనియే నా దృఢ విశ్వాసము. 'కుళ్లగించుట' యనఁగా గట్టిపారిన భూమినిగాని, మఱియొక వస్తువునుగాని త్రవ్వి సడలించుట. జాతీయముల తత్త్వ మెఱిఁగిన బ్రౌనుదొరగారు ఎట్లు వివరించినారో చూడండి:

"కుళ్లగించుట—To loosdn or dibble (the earth) to stir (the fire)." —బ్రౌణ్యము.

ద్విపద — "తనయింటి యావస్తు ధనమును మున్న
సంచితం బగు వస్తుసమితియుఁ జెల్ల
పెంచాదిగా మట్టగించి తెప్పించి" —బసవపు. ౪౪.

'మట్టగించు=క్రుళ్లగించు. (చూ: బసవ. టీక. పుట ౧౧౯.)

'మనంబున దుఃఖించు' అను నర్థము నిచ్చు క్రియ 'కుళ్లు' (-కుళ్లుకొను) "

మనంబున గ్రుళ్లుచు - grieving, sorrowing."

—బ్రౌణ్యము.

శ. ర. కర్తకు తెలియలేదు గాని 'కుళ్లు' విశేష్యముగా కూడ నున్నది. 'వాడికి మనసులో కుళ్లేర్పడ్డది', 'మనసులో వున్న కుళ్లు బయటపడ్డది' అను వ్యవహారము సర్వాంధ్రజనవిదితము.

'కుళ్లు'నకు 'ఇంచుక్కు'ను, 'సగాగమంబు'ను కలుగుటచేత ఏర్పడ్డ రూపము 'కుళ్లగించు'; నామధాతువు. శ. ర. లో 'కుళ్లు' విశేష్యముగా చెప్పబడలేదు. 'కుళ్లు'అను విశేష్యరూపము లేకయే 'కుళ్లగించు' అనురూప మెట్లు పుట్టిన దనుకొన్నాడో కదా ఆప్రౌఢవ్యాకరణకర్త? దాని కేమి గాని, విదేశీయుఁడైన బ్రౌనుగూడా తెలిసికొన్న 'కుళ్లగించు' ధాతువును ఆయనగారు తెలిసికొనకుండుట ఆశ్చర్యకర మయిన విషయము. అంతేకాక, లోకవ్యవహారము నైనను ఎరుగక "క్రుళ్లు = క్రుళ్లగించు; క్రుళ్లుపోతు = క్రుళ్లగించు స్వభావము గలవాఁడు" అని వ్రాయుట అపహాస్యముగా నున్నది. ఆయనగారి మాట అట్లుండగా, శుద్ధాంధ్రమయిన శుద్ధాంధ్రనిఘంటు కర్త 'కుళ్లుపోతు (క్రుళ్లగించు స్వభావము గలవాఁడు) క్రుళ్లుపోతు' అని శ. ర. లోని ముక్కలనట్లే ముద్రించుకొనుట లజ్జాకరమయిన తప్పు.

౪. గామిడి

"గామిడి=శ్రేష్ఠుఁడు. "మ. ఊరి గామిడిబోఁపల్ వను దించి రద్దుపదభూమీభర్తృయిల్ చేరఁగా" — పాంచా. ౪. ఆ.

అగ్రణి=ముఖ్యము, గామిడి" —శబ్దరత్నాకరము.

శుద్ధాంధ్రనిఘంటుకర్త 'గామిడి=శ్రేష్ఠుఁడు' అని శ. ర. లోని ముక్కలనే నడిపి, పైపెచ్చు 'గామిడి' గ్రామణీ శబ్దభవ మనియు, 'కన్నాకు', 'తలకట్టు', 'శెట్టి' మొదలగు పదములు 'గామిడి'కి పర్యాయము లనియు విశేషించి వివరించినాడు. గొప్ప పొరపాటు.

'గామిడి' 'గ్రామీణ' శబ్దభవముగాని 'గ్రామణీ' శబ్దభవము కాదు. 'గ్రామీణు' డనగా పల్లెటూరుమనిషి = అనాగరకుఁడు. ఈశబ్దము శ. ర. లో లేదు. కాని ఆప్టేనిఘంటువులో నున్నది.

"గ్రామీణః – Vulgar, rude, a villager." —ఆప్టే.

'గామిడి'కి గల యర్థములను ఇట్టివే. బ్రౌను 'గామిడి' శబ్దార్థమును బహూదాహరణములతో వివరించి యున్నాడు, చూడండి:

"గామిడి—A fiend, an ogre. Adj. cruel, hard. కఠినమైన, క్రూరమైన, కట్టడి.

'గామిడిచన్నదోయి యసికొను' —బిల్హ. ౧-౬౫.

'వ్రిరి యనరాదు పైబడి వెక్కిరించు
గామి డనరాదు మొగమున గంటువెట్టు' —సుక. ౩-౭౧.

'† గామికిగొల్ల యీ కొనవంబునను
మాకు నీకైయున్న యీ గొ మెన్కొని
చేకొని నరకంగ కెట్టులు లేవు' — బసవ. పుట ౫౪.

'గామిడము' అను రూపముగూడా కనబడుచున్నది.

"ఈమాటు చని యిచటి కేతెంచు మనుఁడు
'కామిడంబున' రాక కారు లాడినను"

—నవచోళచరిత్ర. పుట ౧౬.

† 'గామిడి=గడుసరి' - అని బస. టీక. పుట ౧౧౯.

ముద్రితప్రతిలో 'కామిడంబున' అని యున్నది. 'గా' కు 'కా' అచ్చుపొరపాటై యుండవచ్చును. లేదా, వ్రాయసకాని తప్పైన నై యుండవచ్చును. కా-గాల మాట కేమి, 'గామిడము' అను పద మొకటి గర్వము - పొగరు అనే యర్థమున గలదని తేలినది. 'గామి డమునరాక' అనుమాటకు 'శ్రేష్ఠత్వమునరాక' అని యర్థముచేయుట హాస్యాస్పదముగదా ? కావున, గామిడమునన్=గర్వమున అనునదే సరియైన అర్థము.

'గామిడి' అనుపదమునకు 'అనాగరకుడు' అనునదే సరియైన యర్థము. శ. ర. కర్త ఉదాహరించిన పద్యములోని 'గామిడి పోఁపలు'న్నూ అనాగరకులే గాని శ్రేష్ఠులు కారు. పూర్వోత్తరము లను పరికింపక శ. ర. కర్త అపార్థము చేసినారు, చూడండి:

"ఎంతటివన్నఁ దెచ్చె నుతి యేసి యితండు ద్విజన్మజాతికిన్
వింత యటంచు రాజుల గణింపక తిట్టుచు కేలిగొట్టుచున్
గంతులువైచుచున్ దలఁపఁ గట్టిన చెంగు కగట్టిబట్టుచున్
గొంతులురాయఁ గోయనుచుఁ గూఁతలుబెట్టిరి గ్రామ్యభూసురుల్."
—పాంచాలీపరిణయము. పుట ౧౭

చేష్టలనుబట్టియే కాక 'గ్రామ్యభూసురుల్' అనుపదము చేతనే ఆపోపలనాగరకులని స్పష్టముగా తెలియుచుండగా శ. ర. కర్త వారిని 'శ్రేష్ఠులైన పోఁప'లని అర్థముచేసికొనుట యెంత పొరపాటో చూడండి. ఆయనపొరపాటు నట్లే అందుకొని, సూ. ని. కర్త 'గామిడి', కన్నాకు, తలకట్టు మున్నగుపదములు సమానార్థకము లని సిద్ధాంతముచేయుట ఎంత ప్రమాదహాహో ఆలోచించండి. శబ్దస్వరూపముపైనను గమనింపక 'గామిడి' గ్రామణీ శబ్దభవ మనుట ఎంతసాహసమో చూడండి. ఇట్టివ్రాతలు లోకమున కపకారకము లంటే తప్పా?

౫. చాఱపప్పు

"చాఱ = జీడిమామిడి. "గీ. ఒక్కరొఱుకు ఓఁడు నక్క కొమ్ముఁను నిజ్జ, గోఅజంబు జున్ను చాఱపప్పు" —మను. ౪

చాఱపప్పు = జీడిమామిడిగింజలోనిపప్పు.
జీడిమామిడిచెట్టు (దీనికాయలయందలిదే చాఱపప్పు)"
—శబ్దరత్నాకరము.

ఇట్లు శ. ర. కర్త 'చాఱ'ను 'జీడిమామిడి' యని చెప్పి, 'ముంతమామిడి'ని వేరుగా పఠించినారు. కాని, లోకవ్యవహారమున 'జీడిమామిడి' యన్నను, 'ముంతమామిడి' యన్నను ఒక్కటే. 'చాఱపప్పు' మాత్రము వేరు. 'వస్తుగుణదీపిక' అను వైద్యనిఘంటువులో ఇట్లు వ్రాయబడియున్నది:

"సారపప్పు. ఇది మొరలిచెట్టు పండులోని పప్పు. దీనిని చారప ప్పనియు, చిరంజిప ప్పనియు నందురు.

జీడిమామిడిపండు. దీనిని ముంతమామిడిపం డని, మొ జీడిపం డని యందురు.

జీడిమామిడిపప్పు. దీనిని జీడిప ప్పనియు నందురు" —వ.

బ్రౌనుదొర యిట్లు వివరించినాడు:

"మొరలిచెట్టు. The tree called Cettis Orient or ప్రియాళువృక్షము (Heyne) or చారపప్పుచెట్టు.

చారపప్పు. The pulp or inside of a sort small filberts.

జీడిమామిడిచెట్టు. The cushoo (cashew, cack nut tree Anacardium Occidentale.

ముంతమామిడి పప్పు. Cashoonuts."

—బ్రౌ

సంస్కృతమున 'చారచెట్టు'కు 'ప్రియాల'మనియు, 'బ వల్క'మనియు, 'రాజాదన'మనియు పేర్లు. ముంత(జీడి) మా 'స్థూలమాతము', 'అగ్రబీజము' అని పేర్లు.

౧౭౩౧సం.లో మనుచరిత్రకు టీకవ్రాసిన జూలూరి అ పండితుడు

"ఒక్క-రొఱుకుపరేడు నక్క-కొమ్ముఁను నిజ్జ
గోరజంబు జున్ను 'చారపప్పు' "—౪.౧౩.

అన్నచోట 'చారపప్పు = బహువల్క-సూపము'† సరియైన యర్థమే వ్రాసియున్నారు. (బహువల్కము= ప్రియాల: చూ: శబ్దకల్పద్రుమము.) శ. ర. కర్త చూచినట్లు లేదు. శ.ర. 'చాఱపప్పు' = 'జీడిమామిడిపప్పు' అని యుండుటను చూచి, (మామిడి యన్నను ముంతమామిడియన్నను ఒక్కటేగదా అన్న త పున)కాకోలు వావిళ్ల రామస్వామిశాస్త్రిగారు తమ మనుచ టీకలో 'చాఱపప్పున్ = ముంతమామిడిపప్పును' అన్నారు.

'మను' టీకాకారులలో నొకరైన శ్రీ. అనంతాచార్యులవా శ.ర. కర్తమాటను మీరుటకు జంకి 'చారపప్పున్ = జీడిమామి పప్పును' అనియే అన్నారు.

చల్లా లక్ష్మీనరసింహశాస్త్రి (అనువారే కాకోలు) ఇటీ తాము తాత్పర్యమాత్ర సహితముగా ప్రకటించిన మనుచరిత్రల చాఱపప్పును ముంతమామిడి పప్పుగానే పేర్కొన్నారు. వా వావిళ్లవారి వ్రాతను చూచి వ్రాసియుంటారు.

'చాఱపప్పు', 'జీడి(ముంత) మామిడిపప్పు' భిన్నపదార్థ లని బిడ్డలకుగూడా విదితమైన విషయమై యుండగా ఇందరు పండి లిట్లు తారుమారుటీకలు వ్రాయుటకు కారణము శ. ర. మీ విశ్వాసముతప్ప మరియేమి? మొత్తముమీద శ.ర.కర్త 'చాఱపప్పు' 'జీడిమామిడిపప్పు' అనుట చిత్రమే. కాని,

† చారపప్పు - ముంతమామిడిపప్పు మొదలగు పప్పుగింజలను 'సూప'మనుట పొరపాటు. పక్వపదార్థమునకే 'సూపము' అని పేరు.

అపరమల్లినాథుల టీకలలో ఇంతకంటెను విచిత్రము లున్నవి. ... 'భల్లాతకి' అంటే 'ముంతమామిడిచెట్టు = జీడిచెట్టు' ... టారు. ఆ వ్రాత నిక్కమైన సంగ్రహముగా చూపుతాను:

సీ. "పల్లవీమల వక్రభల్లాతకియుం బోలె
నెఱ్ఱ దుప్పటి నొప్పు కట్టినవాని"

— ఆము క్త. ౬. ౧౯.

"ప్రాంపవచీమలచేత వంకర జీడిచెట్టువలె, రక్తవర్ణముగల ...టిచేతను ఒప్పుచున్న పల్లని మేనుగలవానిని" అని వారివ్రాత...

'వక్రభల్లాతకి' శబ్దమునకు 'వంకరజీడిచెట్టు' అను టీక తప్పను ... శ్రీవారు 'వక్రభల్లాతకియుం బోలెక † = వంపుగింజల జీడిచెట్టు (*ముంతమామిడిచెట్టు = జీడిచెట్టువలె.)' అని వివరించి ... 'వక్ర' పదమునకు 'వంపుగింజలుగల' అని యర్థమును కల్పించు ... 'వంపుగింజలు కలది జీడిమామిడిగదా' అని యర్థమును చెప్పి ... సరిపెట్టుకొన్నారు. బాగానే ఉన్నదిగాని, నిజముగా 'వక్ర' ... అంతమాత్రమున 'వంపు గింజలుగల' అనునర్థము సిద్ధించునా?

'వక్రనింబము', 'వక్రతాళము' అనుపదములకు 'వంపుగింజల ...చెట్టు, వంపుగింజల తాటిచెట్టు' అని యర్థము చెప్పవలసి ...న్నారో? పోనియ్యండి. ఆసంగతి మన కంత ముఖ్యముకాదు.

'భల్లాతకి' యనగా ముంతమామిడిచెట్టా? నిఘంటుకర్తలే ...న్నారు, చూడండి:

'వీరవృక్షో ఽరుష్కరో ఽగ్నిముఖీ భల్లాతకీ త్రిషు' — ... అరుష్కరః (=వ్రణములు చేయునది), అగ్నిముఖీ(=అగ్ని ...టి ముఖముకలది), భల్లాతకి — జీడిమామిడి పేర్లు.

— గురుబాలప్రబోధిక.

"అరుష్కరు భల్లాతకియు జీడి యన మహోశ".

— ఆం. భా. ౨—౪౬

"భల్లాతకి = జీడి. (శ. ర.)

"భల్లాతము — భల్లాతకి—The marking nut called జీడిగింజ" బ్రౌణ్యము.

వెంకటరాయశాస్త్రిగారి టీకలలో 'జీడిగింజలు' 'ముంత ...మామిడిపప్పు' ఒకటే అయినవి. ఎంతప్రమాదమో, చూచారా? జీడిగింజను అంటుకొంటే ఒళ్లు పెట్లి తెగవాచిపోతుంది. 'ముంత ...మామిడిపప్పు' కమ్మని ఆహారపదార్థము. 'జీడిగింజ' వైద్యవస్తువు. ...నితో చేసెడిమందు (భల్లాతక లేహ్యము) చెలిదిరోగములకు ...ప్రాయౌషధము.

క. "ఒళ్లు చెడఁ దిరిగి మున్నవ
భల్లాతకసేవ బాగుపడఁ గోరుట తా



నిల్లు దరిఁగొనుచునుండఁగఁ
జల్లారుప బావి త్రవ్వుచందము సుమతీ"

—అభినవ సుమతిశతకము.

ఉత్తరసర్కారులలో 'ముంతమామిడిపప్పు'ను 'జీడిపప్పు' అంటారు. కాని 'జీడిగింజల'(Marking nuts)ను 'జీడిపప్పు' అనరు. 'గింజ' కు 'పప్పు' కు భేద మున్నది. 'గింజ' లోనుండు పదార్థము 'పప్పు'. 'జీడిగింజ' వింటా చదురేగాని పప్పుండదు. జీడిమామిడిగింజల నుండి తీయబడునదే జీడిపప్పు. 'జీడిగింజలు', 'జీడిపప్పు' అనుపదములలో గల సూక్ష్మభేదము నెరుగక శాస్త్రిగారు 'జీడి' శబ్దసామ్యముంబట్టి రెండును ఒకటేయనుకొన్నారు. గొప్పభ్రాంతి.

శాస్త్రిగారికి లోకములోని వస్తువులు, చెట్లు, జంతువులు, వాని స్వరూపస్వభావాదులు అట్టే తెలిసినట్లుకానరాదు. అందు వల్లనే వసుచరిత్రాను ఆముక్తమాల్యదలో 'పనసపండు దిగిన పరిగె' (౪-౨౭౪) అన్నచోట పనసపంట తీరెరుగక, అర్థము, తన్మూలమున అలంకారము తప్పుగా వ్రాసినారు. 'పండు'కి, 'ఏరుపండు'కి గల ఆకారభేదము నెరుగక శృంగారనైషధవ్యాఖ్యలో (౮-౧౨౨) 'ఆది వరాహము'ను ఏరుపందిగా తేల్చినారు. వారి టీకలలో ఇట్టి యపార్థములు, అపపాఠములు అనేకముగా నున్నవి.

శ. ర. కర్తసిద్ధాంతములును, శాస్త్రిరాద్ధాంతములును మన కుపాదేయములే గాని వానిని కైకొనుటలో మాత్రము మనము జాగరూకులమై యుండవలెను. ధరవసా పనికిరాదు. వారు పూజ్యులైనను వారిప్రమాదములు పూజ్యములు కావు; త్యాజ్యములే.

"తాతస్య కూపోఽయ మితి బ్రువాణాః
క్షారం జలం కే పురుషాః పిబంతి?"

సత్యనిర్ణయమునకై కావించిన వాయీచర్చలో నేమేని పొరపాటులు పొరలియున్నచో సవరించుకొనుటకు సంసిద్ధుడను.

---

†'వక్రభల్లాతకి' యనియు, 'ఋజుభల్లాతకి' యనియు భల్లాతకి రెండువిధములా? ఔరా!

* శాస్త్రిగారిమతమునను 'ముంతమామిడి' 'జీడి' ఒక్కటే యనునది పాఠకులు గమనింతురుగాక.

EDITED PRINTED & PUBLISHED BY S. SAMBHU PRASAD,
at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., Madras.